# తెలుగు

## బి.ఏ. స్పెషల్ తెలుగు - మొదటి సంవత్సరం

## సెమిస్టర్ – 1 పేపరు – 1

# సంప్రదాయ సాహిత్యం

**నిర్ణయించిన పాఠ్యాంశాలు**


**రచయితలు :**

**డా॥ డి. ధాత్రికుమారి**
సహాయాచార్యులు
వై.ఎ. ప్రభుత్వ మహిళా కళాశాల,
చీరాల, ప్రకాశం జిల్లా

**డా॥ శ్రిష్టి చంద్రమౌళిశర్మ**
రిటైర్డ్ ప్రిన్సిపాల్
శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ డిగ్రీ కళాశాల
పొదిలి, ప్రకాశం జిల్లా.

**డా॥ నూనె అంకమ్మరావు**
తెలుగు లెక్చరర్
శ్రీ నాగార్జున డిగ్రీ కళాశాల
ఒంగోలు, ప్రకాశం జిల్లా

**డా॥ నూకతోటి రవికుమార్**
తెలుగు లెక్చరర్
ఎస్.ఆర్.కె.డిగ్రీ కళాశాల
ఒంగోలు, ప్రకాశం జిల్లా

**డా॥ నాగభైరవ ఆదినారాయణ**
రీడర్ & ప్రిన్సిపాల్ (రిటైర్డ్)
బి.ఎస్.ఎస్.బి. డిగ్రీ కళాశాల
తాడికొండ, గుంటూరు జిల్లా

**సంపాదకులు :**
**డా॥ నాగభైరవ ఆదినారాయణ**
రీడర్ & ప్రిన్సిపాల్ (రిటైర్డ్)
బి.ఎస్.ఎస్.బి. డిగ్రీ కళాశాల
తాడికొండ, గుంటూరు జిల్లా

**సమన్వయకర్త :**
**డా॥ ఇరపని మాధవి,** యం.ఏ., యం.ఫిల్., పిహెచ్.డి.
తెలుగు మరియు ప్రాచ్య భాషా విభాగము
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయము

**డైరెక్టర్ :**
**డా॥ బి. నాగరాజు**
దూరవిద్యా కేంద్రము
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయము
నాగార్జున నగర్ - 522 510.

Ph : 0863 - 2293299, 2293356 (08645) 211023, 2110204 (Study Material)
Cell : 9848285518
e_mail : info.anucde.ac.in Website : www.anucde.ac.in (or) www.anucde.info

M.A. Political Science : Administrative Theory

First Edition: 2021

No. of Copies

(C) Acharya Nagarjuna University

This book is exclusively prepared for the use of students of M.A. Political Science Centre for Distance Education, Acharya Nagarjuna University and this book is mean for limited circulation only

Published by

**Dr.Nagaraju Battu**

Director

Centre for Distance Education

Acharya Nagarjuna University

Nagarjuna Nagar-522510

Printed at

## ముందుమాట

ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం 1976లో స్థాపించినది మొదలు నేటి వరకు ప్రగతి పథంలో పయణిస్తూ వివిధ కోర్సులు, పరిశోధనలు అందిస్తూ, 2016 నాటికి NAAC చే A గ్రేడును సంపాదించుకొని, దేశంలోనే ఒక ప్రముఖ విశ్వ విద్యాలయంగా గుర్తింపు సాధించుకొన్నదని తెలియజేయటానికి సంతోషిస్తున్నాను. ప్రస్తుతం గుంటూరు, ప్రకాశం జిల్లాలలోని 447 అనుబంధ కళాశాలల విద్యార్థులకు డిప్లమో, డిగ్రీ, పి.జి. స్థాయి విద్యాబోధనను ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం అందిస్తోంది.

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉన్నత విద్యను అందరికి అందించాలన్న లక్ష్యంతో 2003-04లో దూరవిద్యా కేంద్రాన్ని స్థాపించింది. పూర్తి స్థాయిలో కళాశాలకు వెళ్ళి విద్యనభ్యసించలేని వారికి, వ్యయభరితమైన ఫీజులు చెల్లించలేని వారికి, ఉన్నత విద్య చదవాలన్న కోరిక ఉన్న గృహిణులకు, ఈ దూర విద్యా కేంద్రం ఎంతో ఉపయోగపడుతుంది. ఇప్పటికే డిగ్రీ స్థాయిలో బి.ఏ., బి.కాం., బి.ఎస్.సి. మరియు పి.జి. స్థాయిలో ఎం.ఏ., ఎం.కాం., ఎం.ఎస్.సి., ఎం.బి.ఏ., కోర్సులను ప్రారంభించిన విశ్వవిద్యాలయం గత సంవత్సరం కొత్తగా 'జీవన నైపుణ్యాలు' అనే సర్టిఫికేట్ కోర్సును కూడా ప్రారంభించింది.

ఈ దూరవిద్యా విధానం ద్వారా విద్యనభ్యసించే విద్యార్థుల కొరకు రూపొందించే పాఠ్యాంశాలు, సులభంగాను, సరళంగాను, విద్యార్థి తనంతట తానుగా అర్థం చేసుకొనేలా ఉండాలనే ఉద్దేశ్యంతో విశేష బోధనానుభవం కలిగి, రచనా వ్యాసంగంలో అనుభవం గల అధ్యాపకులతో పాఠ్యాంశాలను వ్రాయించడం జరిగింది. వీరు ఎంతో నేర్పుతో, నైపుణ్యంతో, నిర్ణీత సమయంలో పాఠ్యాంశాలను తయారు చేశారు. ఈ పాఠ్యాంశాల పై విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు నిష్ణాతులైన వారు ఇచ్చే సలహాలు, సూచనలు సహృదయంతో స్వీకరించబడతాయి. నిర్మాణాత్మకమైన సూచనలను గ్రహించి, ముమ్ముందు మరింత నిర్దిష్టంగా, అర్థమయ్యే రీతిలో ప్రచురణ చేయగలం. ఈ పాఠ్యాంశాల అవగాహన కోసం, సంశయాల నివృత్తి కోసం వారాంతపు తరగతులు, కాంటాక్టు క్లాసులు ఏర్పాటు చేయటం జరిగింది.

దూరవిద్యా కేంద్రం ద్వారా విజ్ఞాన సముపార్జన చేస్తున్న విద్యార్థులు, ఉన్నత విద్యార్హతలు సంపాదించి జీవనయాత్ర సుగమం చేసుకోవడమే గాక, చక్కటి ఉద్యోగావకాశాలు పొంది, ఉద్యోగాలలో ఉన్నత స్థాయికి చేరాలని, తద్వారా దేశ పురోగతికి దోహదపడాలని కోరుకుంటున్నాను. రాబోయే సంవత్సరాలలో దూర విద్యా కేంద్రం మరిన్ని కొత్త కోర్సులతో దినదినాభివృద్ధి చెంది, ప్రజలందరికి అందుబాటులో ఉండాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ ఆశయ సాధనకు సహకరిస్తున్న, సహకరించిన దూరవిద్యా కేంద్రం డైరెక్టర్లకు, సంపాదకులకు, రచయితలకు, అకడమిక్ కో-ఆర్డినేటర్లకు మరియు అధ్యాపకేతర సిబ్బందికి నా అభినందనలు.

**ప్రొఫెసర్ పి. రాజశేఖర్,** M.A., M.Phil., Ph.D.
ఉప కులపతి (FAC)
ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం.

## బి.ఏ., తదితర ప్రోగ్రాములు

## అంశం: స్పెషల్ తెలుగు సెమిస్టర్-1

## కోర్సు-1 : ప్రాచీన కవితా పరిచయం

యూనిట్ల సంఖ్య: 5 పీరియడ్ల సంఖ్య: 75

---

❖ **అభ్యసన ఫలితాలు:-**

ఈ కోర్సు విజయవంతంగా ముగించాక, విద్యార్థులు క్రింది అభ్యసన ఫలితాలను పొందగలరు.

1. ప్రాచీన తెలుగు కవితా సౌందర్యాన్ని, విశిష్టతను గుర్తిస్తారు. తెలుగుజాతి సంప్రదాయాలను గ్రహిస్తూ, తెలుగువారి సంస్కృతిలో ఒక భాగమైన తెలుగు పద్యకవిత్వం వికాసం చెందిన విధానాన్ని విశ్లేషణాత్మకంగా అవగాహన చేసుకోగలరు.
2. మార్గకవితకు వ్యతిరేకంగా తలెత్తిన దేశికవిత్వోద్యమాన్ని అవగాహన చేసుకుంటారు. శివకవుల కాలంనాటి మత,ధార్మిక పరిస్థితులను, భాషావిశేషాలను గ్రహించగలరు.
3. తిక్కన మహాభారత రచనా విశిష్టతను గ్రహిస్తూ, అందులోని కావ్యశిల్పం ద్వారా రసానుభూతిని పొందగలరు. ఉపాఖ్యానాలలోని సందేశాన్ని గ్రహిస్తూ, గ్రాంథికభాష రూపుదిద్దుకున్న క్రమాన్ని గుర్తించగలరు.
4. మార్గకవిత ప్రబంధప్రక్రియలోకి పరిణమించిన వైనాన్ని తెలుసుకుంటారు. ప్రబంధయుగ విశిష్టతను, అల్లసాని కవితలోని జిగిబిగిని ఆస్వాదించగలరు. కావ్యవస్తువులో కాలానుగుణంగా వచ్చిన మార్పులు గ్రహించగలరు.
5. పోతన భాగవత విశిష్టతను, భక్తితత్వాన్ని అర్థం చేసుకోగలరు. మొల్ల రామాయణంలోని కవితా చమత్కారాన్ని, కావ్యేతిహాస ప్రక్రియా విశిష్టతను, శబ్దసౌందర్యాన్ని గ్రహించగలరు.

## పాఠ్య ప్రణాళిక

**యూనిట్–I :**

బెజ్జమహాదేవి కథ – పాల్కురికి సోమన

(బసవపురాణం – తృతీయాశ్వాసం – 151 వ పుట నుండి – 160 వ పుట వరకు)

('మఱియును విను బెజ్జమహాదేవియనంగ.... యమ్మవ్వయను నామమయ్యె వెండియును')

**యూనిట్–II :**

నాడీజంఘోపాఖ్యానం– తిక్కన

(ఆంధ్రమహాభారతం – శాంతి పర్వం– తృతీయశ్వాసం)

"మఱునాడు నదీనందనుం గొలిచియుండి ధర్మనందనుడు....(472వ పద్యం) నుండి ....

....భీష్ముడు భీమాగ్రజునకుం జెప్పె.(528 వచనం) వరకు

**యూనిట్–III :**

ప్రహ్లాద చరిత్రము – బమ్మెర పోతన (ఆంధ్రమహాభాగవతం – సప్తమస్కంధం)

(115వ పద్యం "తన యందు..... నుండి

185వ పద్యం...జనకద్రోహిన్ మహింగంటిరే" వరకు)

**యూనిట్–IV:**

వరూధినీ ప్రవరులు – అల్లసాని పెద్దన

(స్వారోచిష మనుసంభవము – ద్వితీయాశ్వాసం)

(3వ పద్యం "అటఁజని కాంచె..... నుండి....77వ వచనం....

నిత్యకృత్య సత్కర్మకలాపంబు నిర్వర్తించె" వరకు)

**యూనిట్–V:**

ఆశోకవనంలో జానకి – మొల్ల (రామాయణము – సుందరకాండము)

"హనుమంతుడు రాముని కుశలవార్తను సీతకు విన్నవించుట"

(90 వ పద్యం–తనకు దిక్కులేమిఁ దలపోసి దుఃఖింప, పవనసుతుడు మనుజ భాష పలికె.... నుండి 123వ పద్యం... నిజంబు నమ్ముమా!" వరకు)

ఆధార గ్రంథాలు:

1. శ్రీమదాంధ్ర మహాభారతము:శాంతిపర్వము .... తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణ
2. స్వారోచిష మనుసంభవము – అల్లసాని పెద్దన (వావిళ్ళవారి ప్రచురణ)
3. బసవపురాణము – పాల్కురికి సోమన (వావిళ్ళవారి ప్రచురణ)
4. ఆంధ్రమహాభాగవతము – తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణ
5. మొల్ల రామాయణము – ఎమెస్కో ప్రచురణ

❖ ఆయా పాఠ్యాంశాల 'అభ్యాసం'లో ప్రతిపదార్థ పద్యాలు, కంఠస్థ పద్యాలు, సందర్భవాక్యాలు, సంగ్రహ సమాధాన ప్రశ్నలు, వ్యాసరూప సమాధాన ప్రశ్నలు, ఛందో విశేషాలు, అలంకారాల ప్రస్తావన తప్పనిసరిగా ఇవ్వాలి.

❖ **సూచించబడిన సహపాఠ్య కార్యకలాపాలు**

1. ప్రాచీన పాఠ్యాంశాల్లోని విషయాలను నేటి సామాజికదృష్టితో పునర్మూల్యాంకనం చేయించడం
2. పాఠ్యప్రణాళికలోని అంశాలపై విద్యార్థులచేత సమీక్షలు/వ్యాసాలు/సెమినార్లు నిర్వహింపచేయడం.
3. ప్రాచీన తెలుగు కవుల నిర్ణీత పద్యకావ్యంపై విద్యార్థులచేత విశ్లేషణ చేయించడం-కేస్ స్టడీ.
4. తరగతి గదిలో శీర్షికలనిచ్చి విద్యార్థులచేత పద్యరచనకు ప్రయత్నింపజేయడం.
5. క్రింది కవుల రచనల్లోని అంశాలను ప్రత్యేకంగా పరిశీలింపజేయడం.
   - అ. నలోపాఖ్యానం – నన్నయ
   - ఆ. కీచకవధ – తిక్కన
   - ఇ. జడివాన (వర్ణన) – ఎఱ్ఱన
   - ఈ. గజేంద్రమోక్షం – పోతన
   - ఉ. పారిజాతాపహరణ ఘట్టం – తిమ్మన
6. చారిత్రిక, సాంస్కృతికాంశాలకు సంబంధించిన పర్యాటక ప్రదేశాలను సందర్శించడం.

**ప్రశ్నాపత్ర నమూనా**

| | | | |
|---|---|---|---|
| అ. ప్రతిపదార్థ పద్యాలు–(అంతర్గత ఛాయిస్) | | (2–1) | 1×8=8 మా |
| ఆ. కంఠస్థ పద్యం–(అంతర్గత ఛాయిస్) | | (2–1) | 1×3=3 మా |
| ఇ. సందర్భ వాక్యాలు– | | (6–4) | 4×3=12 మా |
| ఈ. సంగ్రహ సమాధాన ప్రశ్నలు | | (6–4) | 4×3=12 మా |
| ఉ. వ్యాస ప్రశ్నలు | | (6–3) | 3×8=24 మా |
| ఊ. వ్యాకరణం– | సంధులు | (6–4) | 4×1=4 మా |
| | సమాసాలు | (6–4) | 4×1=4 మా |
| | అలంకారాలు | (2–1) | 1×4=4 మా |
| | ఛందస్సు | (2–1) | 1×4=4 మా |

# CONTENT


| Sl No. | Lesson | Page No. |
|---|---|---|
| 1 | బెజ్జమహాదేవి కథ | 1.1 – 1.13 |
| 2 | బెజ్జమహాదేవి కథ | 2.1 – 2.8 |
| 3 | నాడీజంఘోపాఖ్యానం | 3.1 – 3.6 |
| 4 | నాడీజంఘోపాఖ్యానం | 4.1 – 4.18 |
| 5 | నాడీజంఘోపాఖ్యానం | 5.1 – 5.8 |
| 6 | నాడీజంఘోపాఖ్యానం | 6.1 – 6.10 |
| 7 | గజేంద్ర మోక్షము | 7.1 – 7.11 |
| 8 | గజేంద్ర మోక్షము | 8.1 – 8.27 |
| 9 | గజేంద్ర మోక్షము | 9.1 – 9.32 |
| 10 | గజేంద్ర మోక్షము | 10.1 – 10.9 |
| 11 | గజేంద్ర మోక్షము | 11.1 – 11.16 |
| 12 | నత్కీరుడు | 12.1 – 12.4 |
| 13 | నత్కీరుడు | 13.1 – 13.8 |
| 14 | నత్కీరుడు | 14.1 – 14.15 |
| 15 | నత్కీరుడు | 15.1 – 15.10 |
| 16 | నత్కీరుడు | 16.1 - 16.7 |
| 17 | అశోకవనంలో జానకి | 17.1 – 17.14 |
| 18 | అశోకవనంలో జానకి | 18.1 – 18.11 |

పాఠం - 1

# బెజ్జమహాదేవి కథ

**- పాల్కురికి సోమనాథుడు**

**(బసవ పురాణం - తృతీయాశ్వాసం - 551 నుండి 730 వరకు)**

**విషయసూచిక :**

**1.1** ఉద్దేశ్యం
**1.2** కవి పరిచయం
**1.3** కావ్య పరిచయం
**1.4** కథా సంగ్రహం
**1.5** కఠిన పదాలకు అర్థాలు

## 1.1 ఉద్దేశ్యం :

బెజ్జమహాదేవి ముగ్ధభక్తురాలు. శివుడినే బిడ్డగా భావించి అతడికొరకు ప్రాణాలే త్యజించబోయింది. భక్తులు ఏ రూపంలో భగవంతుడిని ఆరాధిస్తే అదేరూపంలో వారికి దర్శనమిస్తాడని నిరూపించడం, భక్తులపట్ల శివుడి వాత్సల్యాన్ని నిరూపించటం ఈ పాఠం ఉద్దేశ్యం.

## 1.2 కవి పరిచయం :

తెలుగు సాహిత్య చరిత్రలో నన్నయ తిక్కనల మధ్యకాలం క్రీ.శ. 12వ శతాబ్దిని "శివకవుల యుగం"గా వ్యవహరిస్తారు. శైవ కవిత్రయంగా పేర్కొనే నన్నెచోడుడు, మల్లికార్జున పండితారాధ్యుడు, పాల్కురికి సోమనాథుడు అనే ముగ్గురు కవులు ఈ కాలంలో శైవమతాన్ని అవలంబించి శివుని మహాత్మ్యాన్ని తెలిపే రచనలు చేశారు. వీరిలో ఒకడైన పాల్కురికి సోమనాథుడు (క్రీ.శ. 1160 - 1240) సంస్కృతాంధ్ర కర్ణాటక భాషలలో పాండిత్యం గడించి ఆయా భాషలలో శైవమత ప్రచారం కోసం అనేక కృతులను రచించిన సాహితీమూర్తి. ఇతడు పరమశివుడి ప్రమథగణాలలో ఒకడైన భృంగిరిటి అవతారమని వీరశైవుల విశ్వాసం. పాల్కురికి సోమన గురించి తెలుసుకోవటానికి ఇతని రచనైన బసవపురాణం, పిడపర్తి సోమన రచించిన పద్యబసవ పురాణం, తోంటద సిద్ధలింగకవి కన్నడ రచనైన పాల్కురికి సోమేశ్వర పురాణం, ఏకామ్రనాథుని ప్రతాప చరిత్ర ఆధారగ్రంథాలుగా ఉపకరిస్తాయి.

ఈ కవి ఇంటి పేరునుబట్టి పాలకురికి గ్రామవాస్తవ్యుడై ఉండవచ్చని పండితుల అభిప్రాయం. తోంటదసిద్ధకవి తన సోమేశ్వర పురాణంలో శ్రీశైలానికి ఈశాన్యభాగాన కొలనుపాక గ్రామంలోని సోమేశ్వరస్వామి వరప్రసాదంగా పాలుకురికి గ్రామంలో సోమన జన్మించాడని తెలిపాడు. ప్రస్తుతం వరంగల్‌కు 30 కి.మీ.ల దూరంలో పాల్కురికి గ్రామం వుంది.

పాల్కురికి సోమన బసవపురాణావతారికలో

"భ్రాజిష్ణుడగు విష్ణు రామిదేవుండు
తేజిష్ఠువగు శ్రీయాదేవి యమ్మయును
గారవింపగ నొప్పు గాదిలి సుతుఁడ
వీరమహేశ్వరాచార వ్రతుడ" అని చెప్పుకున్నాడు.

సోమనాథుడి కవితా విద్యాగురువు కరస్థలి విశ్వనాథుడు. సోమన తల్లిదండ్రులు శ్రియాదేవి, విష్ణురామిదేవుడు.

**పాల్కురికి సోమన రచనలు :**

పాల్కురికి సోమన కృతులను గురించి పిడపర్తి సోమన తన పద్యపురాణావతారిలో ఇలా పేర్కొన్నాడు.

> **"బసవపురాణంబు, పండితారాధ్యుల చరితంబు, ననుభవసారమును, జ**
> **తుర్వేద సార సూక్తులు, సోమనాథ భాష్యంబును, రుద్రభాష్యంబు, బసవ**
> **రగడ, గంగోత్పత్తి రగడ, శ్రీబసవాద్య రగడయు, సద్గురు రగడ, చెన్న**
> **మల్లు సీసములు, నమస్కారగద్య, వృషాధిపశతకంబు, నక్షరాంక**
> **గద్యపద్యముల్, పంచప్రకారగద్య, అష్టకము, పంచకము, నుదాహరణ యుగము**
> **నాదియగుకృతుల్ భక్తిహితార్థబుద్ధిఁజెప్పెనని భక్తిసభలలోఁజెల్లుచుండు"**

పాల్కురికి సోమనాథుని కృతుల భాషననుసరించి తెలుగు కృతులు, సంస్కృత కృతులు, కన్నడ కృతులు అని మూడు రకాలుగా విభజించవచ్చు. మొత్తం ఈ మూడుభాషలలో రచించిన కృతులు 30వరకు ఉంటే వాటిలో తెలుగు రచనలే ఎక్కువ. సోమనాథుడి తెలుగు కృతులను పద్యకృతులు, లఘుకృతులు, ద్విపదకావ్యాలు అని విభజించవచ్చు.

**1) తెలుగు కృతులు :**

**పద్యకృతులు :**

అనుభవసారము, వృషాధిప శతకము, చతుర్వేదసారము, చెన్నమల్లు సీసములు అనేవి సోమనాథుని పద్యకృతులు.

**లఘుకృతులు :**

సోమనాథుడు బసవేశ్వర భక్తి తన్మయత్వంలో స్తుతిపరమైన కొన్ని లఘుకృతులు రచించాడు. వాటిలో 5 గద్యలు, 1 రగడ, 2 ఉదాహరణములు, 1 పంచకము, 2 అష్టకములు, 2 స్తవములు లభించాయి.

**ద్విపద కావ్యాలు :**

ద్విపద రచనా స్థాపకుడైన పాల్కురికి సోమనాథుడు ద్విపదలో రాసిన అతి ప్రసిద్ధ గ్రంథాలు రెండు. అవి బసవ పురాణము, పండితారాధ్య చరిత్ర. ఈ ద్విపద కావ్యాలు అనువాదాలుకాక స్వతంత్ర రచనలు. సోమనాథుడి ద్విపద గ్రంథంగా చెప్పబడు మల్లమదేవి పురాణము అలభ్యము.

**(2) సంస్కృత భాషాకృతులు :**

సోమనాథభాష్యం, రుద్రభాష్యం, సంస్కృత బసవోదాహరణం, వృషభాష్టకం, త్రివిధ లింగాష్టకం అనేవి సోమనాథుడు సంస్కృతంలో రచించిన కృతులు.

**(3) కన్నడ భాషలోని లఘుకృతులు :**

సద్గురు రగడ, చెన్నబసవరగడ, అష్టరాంక పద్యములు, శరణు బసవరగడ, బసవలింగ నామావళి, శీలసంపాద, శివగణ సహస్రమాల అనేవి సోమనాథుడు కన్నడభాషలో రచించిన లఘుకృతులు.

**పాల్కురికి సోమన బిరుదులు :**

"వర సర్వజ్ఞ శిఖామణి" "ప్రత్యక్ష భృంగీశావతార" "తత్వ విద్యాకలాప" "అన్యవాద కోలాహ" "కవితాసార" మొదలైనవి సోమన బిరుదులు.

**సోమన కవితా వైశిష్ట్యం :**

"అల్పాక్షరముల ననల్పార్థ రచన" పాల్కురికి సోమన కల్పించిన రచనాశిల్పం. కానీ భక్త్యావేశంతో సోమన దీనిని పాటించిక తనివితీరే వరకు శివుని వర్ణించిన సందర్భాలు ఎక్కువ. ఇతని కవితావేశం భక్త్యుద్రేకం గలదై, గాన ప్రేరకం కావటమే దీనికి కారణం.

సోమనకు మతంలో శైవం పరమలక్ష్యమైనట్లే కవిత్వంలో దేశీరచన పరమలక్ష్యమైంది. సోమన ఆంధ్ర సాహిత్యంలో మొదటి విప్లవకారుడు. దేశికవితోద్యమకారుడు. శివకవుల యుగంలో ప్రాచుర్యంలోనికి వచ్చిన స్వతంత్రదేశిసాహిత్య ప్రక్రియలైన ద్విపద, ఉదాహరణము, రగడ, శతకము, గద్యలు మొదలైన వాటికి పాల్కురికి సోమనాథుడే మూలపురుషుడు. సోమనాథుడికి పూర్వం దేశిచ్ఛందస్సులకంతగా ఆదరణ లేదు. సంస్కృతంలో అనుష్టుప్ వృత్తంవలే తెలుగులో ద్విపద ప్రాథమిక ఛందస్సులకు మూలమైంది. అచ్చమైన తెలుగు ఛందస్సు ద్విపదలో మొట్టమొదటిసారిగా కావ్యరచనకు పూనుకోవటమే కాక గేయరూపమైన తెలుగు ద్విపదకు ప్రాసయతిని కూర్చి, ద్విపదతో ద్విపద సంధింపజేసి కొంత పద్యత్వము కల్పించాడు.

**"ద్విపదాంబు రుహముల ధృతిబసవేశు, ద్విపదాంబురుహములతి ప్రీతిఁబూంతు**
**సన్నుతిసేయుదు సత్కవులలరఁ దిన్నని సూక్తుల ద్విపద రచింతు"** అంటూ పండితారాధ్య చరిత్రలో చెప్పాడు.

ద్విపద తర్వాత సోమనాథుడు ఎక్కువగా అభిమానించిన దేశిచ్ఛందస్సు రగడ. సీసపద్యాలలో తొలిసారిగా "చెన్నమల్లు సీసము"లను శతకము సోమనాథుడు రచించాడు. సోమనాథుడి ప్రథమాకృతి అయిన "అనుభవసారము"లో అతడి వృత్త రచనా వైశిష్ట్యం తెలుస్తుంది. అందులో త్రిభంగి, క్రౌంచపదము, తరువోజ, వనమయూరము మొదలైన విశేష వృత్తములు ప్రయోగించబడ్డాయి.

ఈవిధంగా ద్విపద, తరువోజ, రగడ, సీసము, కందము అనే దేశిచ్ఛందోభేదాలతో కవిత్వం చెప్పి సోమనాథుడు దేశిచ్ఛందముపై తనకు గల అభిమానం ప్రదర్శించాడు. భాషను కూడా దేశిభాషనే ఉపయోగించాడు.

కావ్యరచనకు స్వీకరించిన వస్తువులోనూ ప్రత్యేకత చాటుకున్నవాడు సోమనాథుడు. తన కావ్యాలకు వస్తువును సంస్కృత పురాణాల నుండి స్వీకరించక దేశీయ చరిత్రల నుండి స్వీకరించాడు. బసవన, పండితారాధ్యులు చారిత్రక పురుషులు కాగా బెజ్జమహాదేవి, గొడగూచి, సంగయ్య, దుగ్గవ్వ, కన్నప్ప, సకలేశమాది రాజయ్య, మడివాలు మాచయ్య, కుమ్మర గుండయ్య, కక్కరయ్య మొదలైనవారు సామాన్యులు.

విషయ విన్యాసంలో, భావప్రపంచంలో జానుతెనుగునుపయోగించుటలో దేశీయతను ప్రదర్శించుటలో పాల్కురికి సోమనాథుడి పద్ధతి స్వతంత్రమైనది.

### 1.3 బసవ పురాణము - పరిచయం :

బసవ పురాణం తెలుగు సాహిత్యంలో శుద్ధదేశీ పద్ధతిలో తొలిసారి రచించబడిన స్వతంత్రమైన వీరశైవపురాణం. ఇది ఏడు ఆశ్వాసాల ద్విపదకావ్యం. నందీశ్వరుడి అవతారంగా భావించబడే మహాపురుషుడైన బసవన చరిత్రే ఇందులోని ప్రధానేతివృత్తం. బసవన చరిత్రతోపాటు సందర్భానుసారంగా 75 మంది భక్తుల కథలు అనుసంధించబడ్డాయి. బసవన పురాణపురుషుడు కాడు. చరిత్రలో క్రీ.శ. 1162 ప్రాంతంలో చాళుక్య సామ్రాజ్యం పాలించిన బిజ్జలుడి మంత్రి దండనాయకుడు. బసవన చరిత్రకు పవిత్రతకు, ప్రాచీనతను ఆపాదించుటకు సోమనాథుడు దీనిని పురాణమని పేర్కొని ఉంటాడు. పాల్కురికి

సోమన బసవపురాణంలో కథాసామాగ్రిని కథాకోవిదులైన వృద్ధుల నుండి, బసవన కన్నడంలో చెప్పిన పాటలు, పదముల నుండి ఇతర శైవగ్రంథాల నుండి గ్రహించినట్లు తానే తెల్పాడు.

బసవపురాణంలోని భక్తుల కథలను విషయాన్నిబట్టి మహిమాన్వితుల కథలు, ముగ్ధభక్తుల కథలు, వీరశైవ మత సిద్ధాంత ప్రతిపాదకములైన కథలుగా విభజించవచ్చు. ఈ కథలలో ముగ్ధసంగయ్య, గొడగూచి, ఉడుమూరి కన్నప్ప, సకలేశమాది రాజయ్య, మడివాలు మాచయ్య వంటి కథలు మనోజ్ఞమైనవి. భక్తిరస ప్రధానమైనవి. సోమనాథుడి రచనావిధానం, భావాలు, శ్రీనాథుడు, పోతన వంటి కవులకు అనుసరణీయములయ్యాయి. బసవపురాణం ప్రథమాంధ్ర దేశీపురాణం, ప్రప్రథమ వీరశైవ పురాణం, తెలుగులో రచించబడిన మొదటి స్వతంత్ర పురాణం. ఇది పేరుకి పురాణమే కానీ నాటి సమాజాన్ని చిత్రించిన సాంఘిక కావ్యం.

**పాఠ్యభాగ వివరణ :**

బెజ్జమహాదేవి శివుడి మంగళప్రదమైన పాదపద్మాలను తన అంతరంగంలో నిలుపుకున్న శివభక్తురాలు. ఆమె ఒకరోజు ఇలా ఆలోచించింది. "భర్గునకు సేవకులు, బంధువులు అందరూ ఉన్నారు కానీ తల్లిమాత్రం లేదు. ఇది చాలా చిత్రంగా ఉంది. కానీ తల్లి లేకుండా శివుడెలా జన్మించాడు ? త్రిలోకాధిపతి అయిన ఈశ్వరుడికి తల్లి మరణించి ఉంటుంది. ఇప్పుడేం చెయ్యాలి ? తల్లి మరణించిన కారణంగానే కదా తను అంత దుఃఖపడింది. ఎటువంటి వారికైనా మాతృవియోగ దుఃఖం ఒకటే గదా. శివుడికి తల్లి కనుక ఉంటే ఎందుకు తపస్సు చేయనిస్తుంది? తల్లి ఉంటే వెంట్రుకలు జడలు కట్టనిచ్చేదా ? హాలాహలాన్ని తాగడానికి అనుమతించేదా ? తోలు చీరలు కట్టుకోనిచ్చేదా ? ఒంటినిండా బూడిద పూసుకోనిచ్చేదా ? భిక్షాటన చేయనిచ్చేదా ? స్మశానంలో నివాసం ఉంటే ఊరుకునేదా ? అమ్మలేని బిడ్డ కాబట్టి ఇన్ని చెయ్యరాని పనులు చేశాడు. ఎన్నో ఇబ్బందులు పడ్డాడు.

శివుడికి తల్లి ఉంటే తన స్తన్యాన్నిచ్చి, వెన్నబెట్టి, ఆకలైతే మళ్ళీ మళ్ళీ చూసి పాలిచ్చి సాకి పెంచి పెద్దవాణ్ణి చేసేది కాదా? తల్లి లేకపోతేనే ఇంతవాడయ్యాడు. చిన్నతనం నుంచి తల్లి ఉన్నట్లైతే ఇంకెంత అభివృద్ధి చెందేవాడోకదా ! ఎంత మగపిల్లలైనా పెళ్ళిళ్ళల్లో, పేరంటాలప్పుడు, పండుగ రోజుల్లోను, జాతరలప్పుడు చక్కగా అలంకరించి ఆదరించే తల్లి లేకపోతే దుఃఖించరా ? ఇంక ఉపేక్షించడం మంచిదికాదు. శివుడికి నేనే తల్లినౌతాను. భేదభావం లేకుండా పెంచే ఏ స్త్రీ అయినా తల్లికాదా'' అని ఆలోచించి బెజ్జమహాదేవి తానే శివుడి తల్లిగా భావించి పరమేశ్వరుడిని తన కుమారుడిలా లాలించసాగింది.

శివుడు పసిపిల్లవాడు కాబట్టి బెజ్జమహాదేవి తొడల మీద పడుకోబెట్టి అభ్యంగనస్నానం చేయించింది. స్నానం చేయించేటప్పుడు ముక్కును, చెక్కిళ్ళను, కడుపును, వీపును చక్కగా పెరగాలని చేతులతో ఒత్తింది. మూడు కళ్ళనూ స్పృశించింది. కాళ్ళు, చేతులు వంకర్లు లేకుండా చక్కగా లాగింది. నలుగు పెట్టింది. కాళ్ళమీద బోర్లా పడుకోబెట్టి, నీటితో వీపుమీద చరిచింది. తలమీద నీరు పోసింది. నీరు నోట్లోకి పోకుండా తన చేతిని ముఖానికి అడ్డుపెట్టింది. పసుపు కలిపిన నీటితో స్నానం చేయించింది. స్నానం తరువాత కళ్ళు, చెవులు గట్టిగా ఊదేది. వ్రేలితో నోటిలో సున్నితంగా నొక్కి కఫాన్ని బయటకు తీసేది. స్నానం చేయించటం పూర్తి కాగానే చేతినీళ్ళు చుట్టూ త్రిప్పి, దిష్టితీసి బొట్టుపెట్టేది.

తరువాత బొటనవ్రేలితో మెత్తని మట్టిని కలిసి బొట్టు పెట్టేది. కడవ క్రింద కాలిన పిడకలు నలిచి, ఆ బూడిదను శివుడి నొసటికి పూసేది. పైకెత్తితే ఎత్తు పెరగడేమో అని భయపడి బెజ్జమహాదేవి ఆ బాలుడిని తన గుండెలకు అదుముకునేది. కాటుకపెడితే కళ్ళు పెద్దవౌతాయని మూడుకళ్ళకు కాటుకపెట్టి పాలిచ్చేది. పక్షుల నీడపారితే పిల్లవాడు పాడయిపోతాడని, జాగ్రత్తపడేది. తినడానికి వెన్నపెట్టేది. బుగ్గగిల్లి ఏడ్వగానే ఉగ్గుపాలు పోసేది. ఏడుపు మానడానికి ముద్దాడి బుజ్జగించేది. తన ఉదరాన్నే పాన్పుగాచేసి "వీరెవ్వరో" అని లాలించేది. "జో" కొట్టేది. ఈవిధంగా శివుడిని తన కుమారుడిగా తలచి ఆమె ఉపచారాలు చేస్తూ ఉండగా ఆమె నిశ్చల ముగ్ధభావానికి మెచ్చుకొని, శివుడు వాటినన్నింటిని స్వీకరించాడు. 'రూపం ఒకటే'

అని వేదాలు, సాధనకు దేవుడిని ఎప్పుడూ స్మరించాలి. అప్పుడే ఆ రూపం, భావం సిద్ధిస్తాయి' అని ధర్మశాస్త్రాలు చెబుతున్నాయి. ఇది హరుడి వాక్యం. దానికి లోకంలో తిరుగులేదు. "భక్తుడు ఏవిధంగా భావిస్తే ఆ రూపంలోనే పరమేశ్వరుడు సాక్షాత్కరిస్తాడు" అని భక్తులు భావిస్తుంటారు.

ఈవిధంగా కొన్నిరోజులు జరుగగా, ఆ దేవదేవుడైన శివుడు బెజ్జమహాదేవికి ప్రసన్నుడు కాదలచి చిన్నపరీక్ష పెట్టాడు. ఆ పిల్లవాడికి తీవ్రమైన వ్యాధి కలిగింది. పాలు త్రాగటం లేదు. వెన్న తినడానికి నోరు తెరువలేదు. పిల్లవాడి పరిస్థితి చూసి తల్లి తల్లడిల్లింది. దుఃఖంతో వివశురాలై ఈవిధంగా అంది "నా ముద్దులపట్టి ! పాలెందుకు తాగవు? నీ చెమట చూసి నేను నెత్తురు ముద్దనౌతాను. ఈ స్థితిలో నిన్నెలా చూడగలను? తల్లిని కదా, ఇంతటి బాధ ఎలా సహించగలను? లేకలేక ఒక్కడివే పుట్టావు. ఈ దుఃఖాన్ని ఎలా దాటగలవు? నాకు నేలమీద కాళ్ళు నిలవటం లేదు. ఏమి మాట్లాడవెందుకు? ఆహారం జీర్ణం కాలేదా? గొంతు నొప్పిగా వుందా ? అంగిట్లో బాధ కలిగిందా ? నాకేమీ మందులుమాకులు తెలియవు" అంటూ ఏడుస్తూ పలవరించింది. పొర్లింది. బిడ్డ ఒళ్ళు వేడిగా ఉందేమో చూచింది. కౌగిట్లో చేర్చింది. శరీరం మీద గుడ్డ కప్పుతుంది, తీస్తుంది. మళ్ళీమళ్ళీ అదేపని చేస్తుంది. తల్లడిల్లింది. పిల్లవాడికి అంగిటిముల్లు అయిందని ఇరుగుపొరుగు అంటే ఎంతో బాధపడుతూ శోకసముద్రంలో మునిగిపోయింది.

బెజ్జమహాదేవి శివుడిని చూస్తూ నిష్ఠూరంగా "కడుపులో కొంచెం వెలితి అని ఒడయనంబి దగ్గరకు వెళ్ళావు. అక్కడ తినడానికి ఏమీ లేకపోతే కుమ్మర గుండయ్య వాద్యం వాయిస్తూ ఉంటే నాట్యం చేశావు. అక్కడ కూడా ఏమీ లేకపోతే చేరమ చక్రవర్తి దగ్గర అందరూ ఆశ్చర్యపడేవిధంగా ఆడావు. ఆకలితో అలసిపోయావు. ఇలాంటి ఆటలు ఎన్ని ఆడినా కడుపు నిండుతుందా? అన్ని తిరిగివచ్చి సిట్టర్వ దగ్గర చివరకు ఇంత పిట్టు తిన్నావు. తర్వాత సామవేదుల వారింట్లో చచ్చిన పెయ్యను వండిపెడితే తిని, కరిళవ్వ ఇంట్లో రహస్యంగా మామిడిపళ్ళు తిన్నావు. అంతటితో ఆగకుండా చెన్నయ్య ఇంట్లో పులిసిన అంబలి జుర్రుకొని, చిరుతొండనంబి కొడుకు మాంసం అడిగి మరీ తిన్నావు. నిమ్మవ్వ దగ్గర భుజించి, చోడవ్వ గిన్నెతో ఇచ్చిన పులగం తిని, సురియ చౌడయ్య చేతి ముద్దలకు ఆశపడ్డావు. నిన్న ఈ విషయాలన్నీ ఒకామె నాకు చెప్పింది. కుమారా ! నన్నెందుకు ఇంతగా బాధపెడతావు ? నీవు ఆకలికి మలమలమాడుతూ అందరి దగ్గర తిరగడమెందుకు? అనవసరమైన తిళ్ళు తినడం ఎందుకు? నేను ఎలా బ్రతకగలను? ఇలా చెడుతిళ్ళు తింటుంటే కడుపు ఉబ్బకుండా ఎలా ఉంటుంది ?" అని అంది.

"నేను నీకెన్నోసార్లు పాలు తాగిస్తున్నాను. వెన్న పెడుతున్నాను. వేళకు లేకపోతే ఎక్కడైనా అడిగి తెస్తున్నాను. నువ్వు ఇతరుల ఇళ్ళకువెళ్ళి అడిగి తినడమెందుకు? ఇన్ని రోజులు ఈవిధంగా సరిపోయింది. నిన్న నీ కడుపెందుకు నిండలేదు? పగలైనా, రాత్రైనా నీవు చంక దిగడంలేదు. నీవంటి మంకు పిల్లలుంటారా? నీలాంటి తల్లులు ముల్లోకాల్లో ఉంటారా? నువ్వు నా ప్రాణానివి. దానికి నువ్వే సాక్షివి. ఎలాగైనా, నేను చెప్పినట్లుండి, పెట్టినంత తిని ఉంటే నీకీ నొప్పి, రోగం ఎందుకొస్తాయి ? నిప్పుకు చెదలంటుతుందా? ఈ రోగం నీకు నువ్వే తెచ్చుకున్నావు. లేకపోతే ఈ ఆపద నీకెలా వస్తుంది? మాటలతో రోగాలు తగ్గుతాయా? నా పిచ్చికానీ, ఇవన్నీ నిన్నడగటమెందుకు? ఈ బాధ నేనింక చూడలేను. నీకోసం నేను ప్రాణాలు విడుస్తాను" అని తన తలను కొట్టుకోబోయింది. అప్పుడు పరమేశ్వరుడు ప్రత్యక్షమై, నీకు కావలసిన వరం కోరుకోమనగా బెజ్జమహాదేవి "కుమారా ! నాకే లోటులేదు. నువ్వు ఏ వ్యాధి లేకుండా శాశ్వతంగా సుఖంగా ఉంటే నాకంతే చాలు. కన్నప్రేమ కంటే పెంచినప్రేమ గొప్పదంటారు. నిన్ను నా కళ్ళారా చూస్తూ ఇక్కడ ఉండటమే నా కోరిక" అంది. అపుడా పరమేశ్వరుడు చిరునవ్వు నవ్వి తల్లిని కౌగిట చేర్చుకొని "నీవు నాకు తల్లివి, కాబట్టి మూడులోకాలకు నువ్వే ముత్తవ్వవు. నీలాంటి తల్లి ఉంటే నాకు వ్యాధులెందుకొస్తాయి?" అని బెజ్జమహాదేవికి శాశ్వతమైన ముక్తిని ప్రసాదించాడు. ఆమె 'అమ్మ' అయి శివుడికి సేవించింది కనుక ఆమెకు 'అమ్మవ్వ' అనే పేరు వచ్చింది.

## 1.5 కఠినపదాలకు అర్థాలు - తాత్పర్యాలు :

### 551 - 560 అర్థాలు :

| | | |
|---|---|---|
| కఱకంఠ | = | పరమేశ్వరుడు |
| శ్రీపాదకమల | = | మంగళకరమైన పాదపద్మాలు |
| అంతరంగ | = | హృదయంలో నిలుపుకొన్న స్త్రీ |
| భర్గునకు | = | శివుడికి |
| ఎల్లని యోగంబులు | = | పరిజనులందరు |
| విచిత్రంబు | = | చిత్రమైన విషయం |
| ఉదయించె | = | జన్మించె |
| త్రైలోక్యపతికి | = | మూడులోకాలకు అధిపతి అయిన శివుడికి |
| డస్సితిని | = | అలసిపోతిని. |

**తాత్పర్యం :**

బెజ్జమహాదేవి కథ వినండి. బెజ్జమహాదేవి నిత్యం హరుడి పాదపద్మాలను హృదయంలో ధ్యానించే శివభక్తురాలు. ఒకరోజు ఈవిధంగా ఆలోచించింది. శివుడికి పరిజనులు, బంధువులు అందరూ ఉన్నారు. తల్లి లేకపోవటమే వింతగా ఉంది. తల్లి లేకుండా తాను ఎలా జన్మించాడు? త్రిలోకాధిపతి అయిన శివుడికి తల్లి మరణించిందా? తల్లి లేని కారణంగా నేను ఎంతగా అలసిపోయాను. తల్లిలేని దుఃఖం అందరికీ ఒకటే కదా.

### 561 - 570 :

| | | |
|---|---|---|
| తల్లిగల్గిన | = | తల్లి ఉంటే |
| తోళ్ళు | = | చర్మాలు |
| తిరియన్ | = | బిచ్చమెత్తుటకు |
| వల్లకాటికిన్ | = | స్మశానానికి |
| ప్రల్లదుడు | = | దురలవాట్లు కలవాడు |

**తాత్పర్యం :**

తల్లి ఉంటే శివుడిని తపసు చేయనిచ్చేదా ? తల్లి ఉంటే వెంట్రుకలను జడలు కట్టనిచ్చేదా ? తల్లి ఉంటే విషం త్రాగనిచ్చేదా ? తల్లి ఉంటే చర్మాలు ధరింపనిచ్చేదా ? తల్లి ఉంటే పాములను ధరింపనిచ్చేదా ? తల్లి బూడిద పూసుకోనిస్తుందా? తల్లి కొడుకుని బిచ్చమెత్తడానికి పంపుతుందా ? తల్లి కుమారుడికి స్మశానానికి పంపుతుందా ? తల్లిలేని కుమారుడు కాబట్టి శివుడు దురలవాట్లకు లోనై ఇన్ని కష్టాలుపడ్డాడు.

### 571 - 580 అర్థాలు :

| | | |
|---|---|---|
| పలుమార్లు | = | అనేకసార్లు |
| చన్ను + ఇచ్చి | = | చనుబాలిచ్చి |
| పన్నుగా | = | చక్కగా |
| ఆ కొనగా | = | ఆకలి వేయగా |

| | | |
|---|---|---|
| కడుపు + అరసి | = | కడుపు చూసి / ఆకలిని గమనించి |
| సాకించి | = | పోషించి |
| పెనుపదే | = | పెంచదా |
| జనని | = | తల్లి |
| నోముల | = | వ్రతాలలో |
| పేరంటములన్ | = | శుభకార్యాలలో |
| పాటి జాతరలన్ | = | పల్లెల్లో జరిగే ఉత్సవాలలో |
| పోడిమి సేయు | = | శ్రద్ధ చూపు |
| వగవరే | = | బాధపడరా |

**తాత్పర్యం :**

శివుడికి తల్లి ఉంటే అతనికి అనేకసార్లు చనుబాలిచ్చి చక్కగా పాలు త్రాగించేది. ఆకలి గమనించి పాలిచ్చి సాకేది కదా ? తల్లి లేకుండానే శివుడు ఇంత గొప్పవాడయ్యాడు. తల్లి ఉంటే ఇంకా ఎంతవాడయ్యేవాడో కదా ? పెళ్ళిళ్ళు, పేరంటాళ్ళు, వ్రతాలు, పండుగలు, జాతరలు వంటి సమయాల్లో చక్కగా చూసే తల్లి లేకుంటే మగపిల్లలకైనా దుఃఖం కలుగుతుంది కదా !

**581 - 592 అర్థాలు :**

| | | |
|---|---|---|
| ఉపేక్షించి | = | నిర్లక్ష్యం చేసి |
| అరసెదను | = | కాపాడదెను |
| ఆరంగా | = | ఆత్మీయంగా |
| అఱలేక | = | అరమరిక లేక |
| తరుణి | = | స్త్రీ (బెజ్జమహాదేవి) |
| అనయంబు | = | ప్రీతితో |
| జనని | = | తల్లి |
| తొంగిళ్ళు | = | రెండు తొడలపై భాగం |
| లింగమూర్తి | = | లింగ రూపములో ఉన్న శివుని / శైశవరూపంలో ఉన్న శివుడిని |
| అంగన | = | స్త్రీ |
| అభ్యంజనము | = | తలంటుస్నానం |
| చెక్కు | = | చెక్కిలి |
| పులుము | = | రుద్దు |
| అక్కు + ఒత్తు | = | వక్షస్థలాన్ని రుద్దు |

**తాత్పర్యం :**

ఇలాంటి సమయాలలో నిర్లక్ష్యం చేయరాదు. తల్లిలేని శివుడికి తానే తల్లి అయి రక్షించాలని నిర్ణయించుకుంది. అరమరిక లేకుండా పెంచే స్త్రీనే తల్లి అని భావించి బెజ్జమహాదేవి తానే తల్లియై శివుడిని కుమారుడిగా చేసుకుంది. శైశవమూర్తిగా ఉన్న శివుడికి తన తొడలపై పరుండబెట్టి తలంటిస్నానం చేయించింది. స్నానం చేయించేటప్పుడు అతడి ముక్కు, చెక్కిళ్ళు, మూడు కళ్ళు, వక్షస్థలం, పొట్ట వంటి శరీరభాగాలను రుద్దేది. వీపును చరిచేది.

**591 - 600 అర్థాలు :**

| | | |
|---|---|---|
| వీడ్వడగ | = | గట్టిగా సాగదీసి |
| చరణములు | = | పాదాలు |
| అర్మిలిన్ | = | ప్రేమతో |
| జలములు | = | నీరు |
| బెగడకుండ | = | భయపడక |
| వెగచి | = | వెక్కిళ్ళుపెట్టి |
| వెన్ను వ్రేయుచున్ | = | వీపు తడుతూ |
| దోయిట | = | దోసిలి |
| వదనంబు | = | ముఖం |
| ఉదకంబు | = | నీరు |
| చెన్నుగా | = | చక్కగా |
| పసుపు + ఆర్చి | = | పసుపుపూసి |
| తుజ్జనము | = | స్నానం |

**తాత్పర్యం :**

బెజ్జమహాదేవి శివుడికి స్నానం చేయించే సమయంలో అతడు బాగా పెరగాలని కాళ్ళుచేతులు బాగా సాగతీసేది. నలుగు పెట్టినతర్వాత అతడి వీపును నీటితో చరిచేది. వెక్కిళ్ళు పెట్టినప్పుడు బిడ్డ భయపడకుండా వీపుపై తట్టేది. అతడి తలపై నీరు పోసి ఆ నీరు నోట్లోకి పోకుండా పొట్ట నదిమి చేయి నోటికి అడ్డుపెట్టేది. బాగా పసుపుపూసి స్నానం చేయించేది, కళ్ళు, చెవులు ఊదేది.

**600 - 610 అర్థాలు :**

| | | |
|---|---|---|
| అంగిటిముల్లు | = | చిరునాలుక వ్యాధి |
| దూపు + ఒడిచి | = | ధూపమద్ది |
| అంగుష్ఠంబు | = | బొటనవ్రేలు |
| మన్ను | = | మట్టి |
| మోదిచి | = | నలిచి |
| వెఱచి | = | భయపడి |

**తాత్పర్యం :**

నోట్లో వేలుపెట్టి అంగిలి వత్తేది. తొడలపై నుండి కారే నీరు చేతబట్టుకొని నెటిక విరిచేది. సాంబ్రాణిధూపంతో బొట్టుపెట్టి బొటనవ్రేలితో మట్టిని నలిచి బొట్టుపెట్టేది. కడవకు అంటుకొని ఉన్న పిడక విభూతి శివుడి నొసటన పూసేది. పూకి ఎత్తితే ఎత్తు తగ్గుతాడేమో అని భయపడి అతడిని తన గుండెలకు హత్తుకునేది. కాటుక పెడితే కళ్ళు పెద్దవవుతాయని మూడుకళ్ళకు కాటుక పెట్టేది.

**611 - 620 అర్థాలు :**

| | | |
|---|---|---|
| చన్నిచ్చు | = | చనుపాలు ఇస్తుంది |
| కొండొక | = | కొంచెం |

| | | |
|---|---|---|
| చెలగి | = | హెచ్చి |
| సంప్రీతిన్ | = | సంతోషంతో |
| నగియించు | = | నవ్వించు |
| నొగియించు | = | ముద్దుగా ఏడ్పించు |
| సన్నుతిన్‌పాడు | = | స్తుతి గీతాలు పాడు |

**తాత్పర్యం :**

బెజ్జమహాదేవి శివుడికి చనుబాలిస్తుంది. పక్షులను పైన పారనీదు. కొంచెం వెన్న పెట్టేది. అతడి చెక్కిలి గిల్లి ఏడ్పించి వేలు నోట్లోపెట్టి పాలుపోసేది. ఉగ్గుపాలు పోసిన తర్వాత శివుడిని ముద్దుగా ఏడ్పిస్తుంది. నవ్విస్తుంది, బుజ్జగిస్తుంది. ముద్దులు పెడుతుంది. ముద్దు పెట్టమని అడుగుతుంది. తన పొట్టనే పాన్పుగా చేసి పడుకోబెట్టుకొని జోకొడుతూ పాటలు పాడేది.

**621 - 630 అర్థాలు :**

| | | |
|---|---|---|
| ఇబ్బంగి | = | ఈవిధంగా |
| ముగ్ధభావంబునకును | = | అమాయకమైన భావానికి |
| చేకొని | = | స్వీకరించి |
| శ్రుతి | = | వేదాలలో |
| రూపేణ | = | రూపంలో |
| స్మృతి | = | ధర్మశాస్త్రం |
| సంస్మరేత్ | = | స్మరించాలి |
| సదా | = | ఎల్లప్పుడూ |
| తస్య | = | అతని |
| తన్మమతాం | = | తన్మయత్వాన్ని |
| యంతి | = | పొందు |
| ఎబ్బంగి | = | ఏవిధంగా |
| తద్రూపుడు | = | ఆ రూపం ధరించినవాడు |

**తాత్పర్యం :**

ఈవిధంగా బెజ్జమహాదేవి శివుడిని పుత్రుడిగా భావించి పరిచర్యలు చేసేది. ఆమె నిశ్చలమైన ముగ్ధభక్తికి మెచ్చి ఆమె చేసే శైశవోపచారాలని శివుడు స్వీకరించేవాడు. వేదాల్లో "ఏక ఏవహి రూపేణ" అని స్మృతిలో "సాధకః సంస్మరేత సదా" అని శివుడి వాక్యం. కాబట్టి హరుడి వాక్యం అసత్యంకాదు. భక్తుడు ఏవిధంగా భావిస్తే శివుడు ఆ రూపంతోనే సాక్షాత్కరించటం వింత కాదు కదా.

**631 - 640 అర్థాలు :**

| | | |
|---|---|---|
| భక్తమండలి | = | భక్తుల సమూహం |
| వినుతింప | = | కీర్తించగా |
| దేవదేవుడు | = | ఆ పరమేశ్వరుడు |

| | | |
|---|---|---|
| వెండి | = | మరియు |
| తఱుచంటి క్రియను | = | చిన్నబిడ్డ చేష్టవల్ల |
| ఒడలు | = | శరీరం |
| ఆపదగిట్టె | = | ఆపదకు తల్లడిల్లుతూ |
| చిన్ని వడుగా | = | చిన్ని విడ్డా |
| కుడుపుట | = | తాగుట |

**తాత్పర్యం :**

భక్తసమూహం శివుడిని స్తుతిస్తుండగా కొన్నిరోజులు గడిచాయి. శివుడు బెజ్జమహాదేవికి ప్రసన్నుడు కాదలచి భయంకర రోగమైన చిన్నబిడ్డచేష్ఠ వచ్చినట్లు నటించాడు. చనుబాలు తాగకుండా, వెన్న తినేందుకు నోరు తెరువకుండా ఉన్నాడు. అది చూసి బెజ్జమహాదేవి భయంతో వణుకుతూ నా తండ్రీ ! ఎందుకు పాలు తాగటంలేదు.

**641 - 650 అర్థాలు :**

| | | |
|---|---|---|
| ఓ చెల్ల | = | అయ్యో |
| ఒరులు | = | ఇతరుల |
| తలరక | = | బాధపడక |
| అఱిమియో | = | అజీర్ణరోగమో |
| కోపయో | = | పసిపిల్లలకు కంఠంలో వచ్చే జబ్బో |
| అంగిటి ముల్లో | = | అంగిటిలో వచ్చే వ్యాధో |

**తాత్పర్యం :**

నీ చెమట చూసి నేను నెత్తుటిముద్దనవుతాను. అయ్యో ! ఇది నేనెలా చూడగలను తల్లిని ఎలా సహించగలను? నాకు ఒక్కడివే కలిగావు. బాధపడకుండా ఎలా ఉండగలను? నేలపై నా కాళ్ళు నిలబడటంలేదు. ఎందుకు మాట్లాడటం లేదు? చెప్పు. నీకు అజీర్ణరోగమో, కంఠసర్పి రోగమా? అంగిటిముల్లు రోగమా? ఏ మందులు నాకు తెలియదే అని బాధపడింది.

**651 - 660 అర్థాలు :**

| | | |
|---|---|---|
| పనవున్ | = | దుఃఖంతో |
| పలవరించు | = | ప్రేలాపించు |
| మై ఉడుకున్ | = | శరీరపు వేడిని |
| వీక్షించు | = | చూచు |
| తల్లడంబందు | = | చలించుపోవు |
| బొప్పడు | = | బిడ్డడు |
| అడలుచు | = | భయపడుతూ |
| శోకలంధి | = | దుఃఖసముద్రం |
| వెలితి | = | ఖాళీ |

**తాత్పర్యం :**

బెజ్జమహాదేవి దుఃఖంతో పలవరిస్తుంది. పొరలుతుంది, బిడ్డను తదేకంగా చూస్తుంది. శరీరపు వేడి చూస్తుంది. కౌగిలిలో చేర్చుకుంటుంది. బిడ్డపై వస్త్రం కప్పుతుంది, తీస్తుంది, చూస్తుంది, చలించిపోతుంది. ఇతరులు బిడ్డకి అంగిటముల్లు అయిందనగా భయపడుతూ దుఃఖసాగరంలో తేలుతూ ఆ తల్లి పుత్రుడున్న భావం చూసి బిడ్డా ! కడుపు ఖాళీకాగానే ఒడియనంబి దగ్గరకుపోయి అక్కడ తినటానికి ఏమీ లేకపోతే

**661 - 670 అర్థాలు :**

| | | |
|---|---|---|
| గునియుచు | = | గొణుగుచూ |
| అచ్చెరువుగ | = | ఆశ్చర్యకరంగా |
| వెడ ఆటలు | = | వ్యర్థమైన ఆటలు |
| గ్రక్కున | = | వెంటనే |
| పిట్టు | = | పిండి |
| పెయ్య | = | దూడ |

**తాత్పర్యం :**

గొణుగుతూ, కుమ్మరి గుండయ్య వాద్యానికి తగినట్లు నాట్యమాడి అక్కడా తినటానికి ఏమీలేక చేరమచక్రవర్తి వాయిస్తుంటే ఆశ్చర్యకరంగాన వర్తించి ఆకలితో అలసి "వ్యర్థమైన ఆటలివన్నీ ఎన్ని ఆడినా కడుపునిండుతుందా" అని పిట్టవ్వ దగ్గరకు వెళ్లి చివరకు ఇంత పిట్టుతిని, సామవేదుల వారి ఇంట్లో చచ్చిన దూడను ప్రేమతో వంటిపెట్టగా తిన్నావు.

**671 - 680 అర్థాలు :**

| | | |
|---|---|---|
| కామింపగాన్ | = | కోరికతో |
| మఱుగున | = | రహస్యంగా |
| బుటి అంబకళము | = | పులి అంబలి |
| చవి | = | రుచి |
| చేకళ్ళ | = | చేతి ముద్దలు |

**తాత్పర్యం :**

కోరికతో కరికాళవ్వ ఇంట్లో రహస్యంగా మామిడిపండ్లు తిని, చెన్నయ్య ఇంట్లో పులి అంబలి జుర్రి, చిఱుతొండనంబి ఇంట్లో అతడి కొడుకు మాంసాన్ని వేడి విందారగించి, నిమ్మవ్వ ఇంట్లో తిని జోడవ్వ ఇంటిలో తిని చౌడయ్య చేతిముద్దలు ఆశించి తిన్నావు.

**681 - 690 అర్థాలు :**

| | | |
|---|---|---|
| నెలతుక | = | స్త్రీ |
| ఆఱడిపుచ్చు | = | బాధపెట్టు |
| కూడునే | = | తగునా ! |
| పైకుడుపులందు | = | పై తిండ్లలో |

**తాత్పర్యం :**

నిన్న ఒక స్త్రీ ఇవన్నీ చెప్పింది, నన్ను బాధపెట్టడం తగునా? మిక్కిలి బాధపడుతూ ఆడటమెందుకు? పై తిండ్లు తింటే కడుపు ఉబ్బరించదా? నీకు అనేకసార్లు చనుబాలిచ్చాను. వెన్న, పాలు దగ్గర లేకపోయినా ఎక్కడైనా తెచ్చి ఇచ్చాను. సరిపోవటంలేదా ? ఇతరుల ఇళ్ళలో తినబోయావు.

**691 - 700 అర్థాలు :**

| | | |
|---|---|---|
| సితగుండు | = | మంకుబిడ్డ |
| వేసరన్ + ఆసరన్ | = | కానక కానక కన్నటువంటి |
| అనురక్తిన | = | ప్రేమతో |
| సాక్షి | = | రుజువు. |

**తాత్పర్యం :**

ఇన్నిరోజులు నేను పెట్టిన ఆహారం నీకు సరిపోయింది కదా ! నిన్న మాత్రం నీ పొట్ట ఎందుకు నిండలేదు? నీకు నేనెప్పుడూ లోటు చేయలేదుకదా ! రాత్రిపగలు చేయి దిగని మంకుబిడ్డ ఎక్కడైనా ఉన్నాడా ? నాలాంటి తల్లులు మూడు కాలంలోనూ ఉన్నారా? నీవే నా ప్రాణానివి, నేను ప్రేమగా నిన్ను పెంచటానికి నీవే సాక్షివి.

**701 - 710 అర్థాలు :**

| | | |
|---|---|---|
| కుడిచి | = | తిని |
| తెవులు | = | రోగం |
| సంకటంబు | = | కష్టం |
| వీఱిడితనం | = | మూర్ఖత్వం |

**తాత్పర్యం :**

ఏవిధంగానైనా నేను ఉంచినట్లుండి, పెట్టినంత తిన్నట్లైతే ఈవిధంగా ఈ మాయరోగం నీకు వచ్చేదా? నిప్పుకి ఎక్కడైనా చెదలంటుతుందా? నీకు నువ్వే ఈ రోగం తెచ్చుకున్నావు కానీ లేకపోతే ఈ కష్టం నీకెందుకు వస్తుంది? మాటలతో పనేంటి? రోగం పోతుందా? నీ మూర్ఖత్వంతో రోగం కలిగింది. అడగటమెందుకు? ఇంక నీ బాధ నేను చూడలేను, నీ మీద ప్రాణం విడుస్తాను అని.

**711 - 720 అర్థాలు :**

| | | |
|---|---|---|
| ప్రత్యక్షమై | = | సాక్షాత్కరించి |
| అభిమతంబు | = | కోరిక |
| కొఱత | = | లోటు |
| నిరోగి | = | రోగం లేనివాడవై |
| నిత్యుడు | = | శాశ్వతంగా ఉండేవాడు |
| సుఖ + ఆవాప్తి | = | సుఖంగా ఉండటం |
| అగ్గలం | = | అధికం |
| ఈప్సితము | = | కోరిక |

**తాత్పర్యం :**

బెజ్జమహాదేవి తన తల బద్దలు కొట్టుకోబోతుండగా శివుడు సాక్షాత్కరించి నీ కోరిక అడుగు ఇస్తాననగా "కుమారా! నాకు ఏ కోరిక లేదు, ఏ లోటులేదు. నీవు ఏ రోగం లేకుండా నిత్యుడవై సుఖంగా ఉంటే నాకంతే చాలు. కన్నప్రేమ కంటే పెంచిన ప్రేమ ఎక్కువంటారు. కాబట్టి నిన్ను కళ్ళారా చూస్తూ ఇక్కడ ఉండటమే నా ఇష్టం.

**721 - 730 అర్థాలు :**

| | | |
|---|---|---|
| మందస్మిత | = | చిరునవ్వు |
| ముఖారవిందం | = | ముఖమనే కమలం |
| అప్పళించు | = | కౌగిలించు |
| కొనియాడుట | = | పొగుడుట |
| అనుపమ | = | సాటిలేని |

**తాత్పర్యం :**

అని బెజ్జమహాదేవి అనగానే చిరునవ్వుతో కూడినవాడై ఆ తల్లిని కౌగిట చేర్చుకుంటూ "మూడు లోకాలకు నువ్వు ముత్తవ్వవు, నాకు తల్లివి. నీలాంటి తల్లి ఉంటే నాకు రోగమెలా వస్తుంది?" అంటూ ఆమెకు నిత్యత్వాన్ని ప్రసాదించాడు. అమ్మ అయి శివుడిని సేవించుట వలన బెజ్జమహాదేవికి "అమ్మవ్వ" అనే పేరు వచ్చింది.

**డా॥ నూనె అంకమ్మరావు**
తెలుగు లెక్చరర్
శ్రీ నాగార్జున డిగ్రీ కళాశాల
ఒంగోలు, ప్రకాశం జిల్లా

పాఠం - 2

# బెజ్జమహాదేవి కథ

- పాల్కురికి సోమనాథుడు

**(బసవ పురాణం - తృతీయాశ్వాసం - 551 నుండి 730 వరకు)**

**విషయసూచిక :**

2.1 ఉద్దేశ్యం
2.2 సందర్భసహిత వ్యాఖ్యలు
2.3 రాదగిన ప్రశ్నావిధానం.

## 2.1 ఉద్దేశ్యం :

బెజ్జమహాదేవి కథలో ముఖ్య వాక్యాల సందర్భాలను తెలపటం ఈ పాఠం యొక్క ఉద్దేశ్యం.

## 2.2 సందర్భసహిత వ్యాఖ్యలు :

### 1) తల్లి లేకుండుట దావిచిత్రంబు !

**పరిచయం :**

ఈ వాక్యం పాల్కురికి సోమన రచించిన బసవపురాణం తృతీయాశ్వాసం నుండి గ్రహించిన "బెజ్జమహాదేవి కథ" అనే పాఠ్యభాగంలోనిది.

**సందర్భం :**

శివభక్తురాలైన బెజ్జమహాదేవి శివుడికి బంధువులు, సేవకులు, అందరూ ఉన్నప్పటికీ తల్లిలేదని బాధపడే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :**

బెజ్జమహాదేవిది ముగ్ధభక్తి. అందుకే ఆమె పరమేశ్వరుడిని సాధారణ మానవమాత్రుడిగా భావిస్తున్నది. "లోకంలో అందరికీ తల్లి ఉంది కదా శివుడికి తల్లిలేకపోవటం చాలా విచిత్రంగా ఉంది" అనుకుంది.

### 2. ఎల్లవారికి దుఃఖమిట్టిద కాదె?

**పరిచయం :**

ఈ వాక్యం పాల్కురికి సోమనాథుడి విరచితమైన బసవపురాణం తృతీయాశ్వాసం నుండి స్వీకరించిన "బెజ్జమహాదేవి కథ" అనే పాఠ్యభాగంలోనిది.

**సందర్భం :**

అన్ని లోకాలకు అధిపతి అయిన ఈశ్వరుడికి తల్లి మరణించి ఉంటుందని బెజ్జమహాదేవి భావించే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :**

ఈశ్వరుడికి బంధువులందరూ ఉన్నారు. అమ్మ మాత్రం లేదు. అయినా తల్లి లేకుండా తానెలా ఉద్భవిస్తాడు. కనుక శివుడికి తల్లి మరణించి ఉంటుంది. తల్లి మరణం తననెంతో కృంగదీసింది. మాతృవియోగ దుఃఖం అందరికీ ఒకటే గదా అని బెజ్జమహాదేవి భావించింది.

**3. తల్లిపుచ్చునె సుతువల్లకాటికిని ?**

**పరిచయం :**

ఈ వాక్యం పాల్కురికి సోమనాథుడు రచించిన బసవపురాణం తృతీయాశ్వాసం నుండి స్వీకరించిన "బెజ్జమహాదేవి కథ" అనే పాఠ్యభాగంలోనిది.

**సందర్భం :**

లోకంలో ఏ తల్లైనా కుమారుడిని వల్లకాటికి పంపిస్తుందా? అని బెజ్జమహాదేవి ఆలోచించే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :**

శివుడికి తల్లి ఉన్నట్లయితే తల జడలు కట్టనిస్తుందా? విషం తాగనిస్తుందా? తోలుచీరలు కట్టనిస్తుందా? పాములు ధరించడానికి, బూడిద పూసుకోవటానికి, భిక్షమెత్తడానికి తల్లి అనుమతిస్తుందా? ఏ తల్లి అయినా తన కుమారుడిని శ్మశానంలో నివాసముండటానికి అంగీకరిస్తుందా? అని తన మనసులోనే బెజ్జమహాదేవి ప్రశ్నించుకుంది.

**4. తానెంత పెరుగునో తల్లిగల్గినను ?**

**పరిచయం :**

ఈ వాక్యం పాల్కురికి సోమనాథుడి విరచితమైన బసవపురాణం తృతీయాశ్వాసం నుండి స్వీకరించిన "బెజ్జమహాదేవి కథ" అనే పాఠ్యభాగంలోనిది.

**సందర్భం :**

తల్లి ఉంటే శివుడు ఇంకెంతగా పెరిగి అభివృద్ధిలోకి వచ్చేవాడో బెజ్జమహాదేవి భావించే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :**

అమ్మ లేక శివుడు అనేక కష్టాలు పడుతున్నాడు. అదే తల్లి ఉన్నట్లయితే తన స్తన్యమిచ్చి, వెన్నపెట్టి, ఆకలైతే పాలుపట్టి చక్కగా పెంచి ఉండేది. తల్లి లేకుండానే ఇంతవాడయ్యాడు శివుడు. అదే తల్లి ఉన్నట్లయితే ఇంకెంతగా పెరిగేవాడో కదా ! అని బెజ్జమహాదేవి భావించింది.

**5. వగవరే మఱి యెట్టి మగబిడ్డలైన ?**

**పరిచయం :**

ఈ వాక్యం పాల్కురికి సోమనాథుడి విరచితమైన బసవపురాణం తృతీయాశ్వాసం నుండి స్వీకరించిన "బెజ్జమహాదేవి" అనే పాఠ్యభాగంలోనిది.

**సందర్భం :**

తల్లిలేని మగపిల్లలు కూడా ఏ అచ్చటాముచ్చటా నోచుకోరు కదా. ఎంత మగపిల్లలైనా బాధపడతారు కదా? అని బెజ్జమహాదేవి భావించే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :**

పిల్లలు ముద్దుమురిపాలు తీర్చి సంతోషించే తల్లి లేకపోతే ఎలాంటి మగబిడ్డలైనా బాధపడతారు. పెళ్ళిళ్ళు, పేరంటాలు, పండుగ రోజులలో బాగా చూసుకునేందుకు శివుడికి తల్లిలేదు. ఈ బాధే శివుడి మనసులో కూడా ఉంటుంది కదా అని బెజ్జమహాదేవి మాతృహృదయం భావించింది.

**6. కాటుకయిడు మూడు(గన్నుల గలయ**

**పరిచయం :**

ఈ వాక్యం పాల్కురికి సోమనాథుడు రచించిన బసవపురాణం తృతీయాశ్వాసం నుండి స్వీకరించిన "బెజ్జమహాదేవి కథ" అనే పాఠ్యభాగం నుండి గ్రహించబడినది.

**సందర్భం :**

తల్లిలేని శివుడికి తననే తల్లిగా భావించుకున్న బెజ్జమహాదేవి బాల్యోపచారాలన్నీ చేసే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :**

బెజ్జమహాదేవి శివుడికి స్నానం చేయించి, విభూతి పెట్టి కాటుక పెడితే కళ్ళు విశాలమవుతాయని శివుడి మూడుకళ్ళకు కాటుక పెట్టింది.

**7. భక్తుడె బ్బంగిగా భావించు శివుడు**
**వ్యక్తిగా( దద్రూపుడై యుండుటరుదె !**

**పరిచయం :**

ఈ వాక్యం పాల్కురికి సోమనాథుడి విరచితమైన బసవపురాణం తృతీయాశ్వాసం నుండి స్వీకరించిన "బెజ్జమహాదేవి కథ" అనే పాఠ్యభాగం నుండి గ్రహించబడింది.

**సందర్భం :**

బెజ్జమహాదేవి నిశ్చల ముగ్ధభక్తిని మెచ్చుకొని శివుడు వాటినన్నింటిని అంగీకరించిన సందర్భంలోనిదీ కవి శ్రుతి, స్మృతి వాక్యాలను ఉదహరించే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :**

భక్తుల భావనను అనుసరించే భగవంతుడి రూపం సాక్షాత్కరిస్తుంది. "ఏక ఏవహి రూపేణ", "సాధకస్సంస్మరేత్ సదా", "తస్యతన్మయతాంయంతి" అనే భగవద్వాక్యాలను ఒకచోట కూర్చి కవి దాని భావాన్ని దేశీయరీతిలో ద్విపదగా రచించటం విశేషం.

**8. చెమటయుఁజూచి నెత్తురునవుదు !**

**పరిచయం :**

ఈ వాక్యం పాల్కురికి సోమనాథుడి విరచితమైన బసవపురాణం తృతీయాశ్వాసం నుండి స్వీకరించిన "బెజ్జమహాదేవి కథ" అనే పాఠ్యభాగం నుండి గ్రహించబడింది.

**సందర్భం :**

శివుడు బెజ్జమహాదేవి చేసిన శైశవోపచారాలను స్వీకరించి కొన్నిరోజులకు ఆమె ముగ్ధభక్తిని పరీక్షించదలచి వ్యాధి వచ్చినవాడిలా ఉన్నప్పుడు బెజ్జమహాదేవి బాధపడిన సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :**

శివుడిని బిడ్డగా భావించిన బెజ్జమహాదేవి మాతృహృదయాన్ని ఆవిష్కరించేవిధంగా కవి ఆమె నోట పలికించిన మాటలివి. వ్యాధితో ఆహారం స్వీకరించకుండా బాధపడుతున్న శివుడిని చూసి బెజ్జమహాదేవి నీ చెమట చూసి నేను నెత్తురౌతాను అంటుంది. అంటే తల్లి బిడ్డ బాధను చూడలేక నెత్తురుముద్దవుతుంది అని కవి చెప్పదలిచాడు.

**9. చేయి దిగండిట్టి సితగుండుగలడె ?**

**పరిచయం :**

పాల్కురికి సోమనాథుడు రచించిన బసవపురాణం తృతీయాశ్వాసంలోని "బెజ్జమహాదేవి కథ" అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం స్వీకరించబడింది.

**సందర్భం :**

శివుడికి అంగిటముల్లు అయిందని ఇరుగుపొరుగువారు చెప్పినప్పుడు బిడ్డ బాధ చూస్తూ అతడు చేసిన చేష్టలను తల్చుకుంటూ నిష్ఠూరాలు పలుకుతూ బెజ్జమహాదేవి బిడ్డ చేయిదిగటం లేదనే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :**

'సితగుండు' అంటే మంకు బిడ్డడు అని అర్థం. రాత్రిపగలు చేయి దిగకుండా ఉండే మంకుపిల్లాడు శివుడని బెజ్జమహాదేవి భావిస్తుంది. పసిపిల్లలకు ఆరోగ్యం బాగలేనపుడు తల్లి చంక దిగకుండా ఉండటం సర్వసాధారణం.

**10. నిప్పునఁ జెదలంటునే ?**

**పరిచయం :**

ఈ వాక్యం పాల్కురికి సోమన విరచిత బసవపురాణం తృతీయాశ్వాసంలోని "బెజ్జమహాదేవి కథ" అనే పాఠ్యభాగం నుండి స్వీకరించబడింది.

**సందర్భం :**

శివుడు తనకు తానై అందరి ఇండ్లలో తిండ్లు తిని వ్యాధి తెచ్చుకున్నాడని బెజ్జమహాదేవి నిష్ఠురాలు పలికే సందర్భములోనిదీ వాక్యం.

**వివరణ :**

నిప్పు పవిత్రంగా ఉంటుంది. అంతేకాకుండా ఏది దానిని తాకినా తాకినదే భస్మమవుతుంది. అటువంటి నిప్పుకు చెదలంటలేదు. బిడ్డడు కూడా పవిత్రంగా ఇంట్లో తాను పెట్టింది తిని ఉంటే వ్యాధి వచ్చేదికాదని, కోరికోరి వ్యాధి తనంతటతానే తెచ్చుకున్నాడని బెజ్జమహాదేవి భావిస్తుంది. దానినే కవి ఈ నానుడిని ఉపయోగించి చెప్పారిక్కడ.

**11. కన్నమోహంబునకంటే నగ్గలము**
**ఎన్న బెంచినమోహ మెందు నటంద్రు**

**పరిచయం :**

పాల్కురికి సోమన రచించిన బసవపురాణం తృతీయాశ్వాసంలోని "బెజ్జమహాదేవి కథ" అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం స్వీకరించబడింది.

**సందర్భం :**

బెజ్జమహాదేవికి శివుడు ప్రత్యక్షమై నీ అభిమతం తీరుస్తాను, కోరుకో అనినపుడు బెజ్జమహాదేవి తన మాతృవాత్సల్యాన్ని చూపించిన సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :**

కొడుకా, నీవు రోగం కాకుండా నిత్యుడవై సుఖంగా ఉంటే నాకంతే చాలు. కన్న ప్రేమ కంటే పెంచినప్రేమ గొప్పదంటారు కాబట్టి నిన్ను కళ్ళారా చూస్తూ ఇక్కడ ఉండటమే నా కోరిక అని బెజ్జమహాదేవి తన మాతృహృదయాన్ని ఆవిష్కరించింది.

**12. అమ్మవ్వ యనునామమయ్యె**

**పరిచయం :**

పాల్కురికి సోమనాథుడు రచించిన బసవపురాణం తృతీయాశ్వాసంలోని "బెజ్జమహాదేవి కథ" అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం గ్రహించబడింది.

**సందర్భం :**

బెజ్జమహాదేవి ముగ్ధభక్తికి మెచ్చి వరం కోరుకోమన్నప్పుడు కూడా బిడ్డగా తన క్షేమాన్ని, తన సాన్నిధ్యాన్నే కోరుకున్న సందర్భంలో ఆమెను అనుగ్రహిస్తూ శివుడు పలికిన మాటలివి.

**వివరణ :**

నీవు నా తల్లివి, ముల్లోకాలకు ముత్తవ్వవు. నీలాంటి తల్లి ఉండగా నాకు రోగమెలా వస్తుంది ? అంటూ శివుడు బెజ్జమహాదేవికి నిత్యత్వమొసగాడు. అమ్మ అయి శివుడిని ఆరాధించిన కారణంగా ఆమెకు అమ్మవ్వ అను పేరు కలిగింది.

**2.3 ప్రశ్నలు - సమాధానాలు :**

**1) బెజ్జమహాదేవి మాతృవాత్సల్యాన్ని ఆవిష్కరించండి**

**లేదా**

**శివుడు బెజ్జమహాదేవి ముగ్ధభక్తిని పరీక్షించిన విధానాన్ని వివరించండి.**

పాల్కురికి సోమన వీరశైవమత ప్రచారం కోసం చేసిన రచనలలో ప్రసిద్ధమైనది బసవపురాణం. శివుడిని భక్తులు తమ ముగ్ధభక్తితో ఏవిధంగా ఆరాధిస్తారో ఈ బసవపురాణంలో నిరూపించాడు సోమన. 70 మంది వీరశైవభక్తుల గాథలను హృద్యంగా ద్విపద ఛందస్సులో రచించిన ఏడు ఆశ్వాస్వాల బసవపురాణంలో తృతీయాశ్వాసంలోనిది బెజ్జమహాదేవి కథ. శివభక్తుల కథలేకాక భక్తురాండ్ర కథలను పాల్కురికి సోమన రచించాడు. శివభక్తికి లింగభేదం లేదని నిరూపించాడు. స్త్రీ మాతృహృదయాన్ని బెజ్జమహాదేవి పాత్ర ద్వారా ఆవిష్కరించాడు. తల్లి బిడ్డను ఎంత అపురూపంగా చూసుకుంటుందో, తన బిడ్డకు ఏమైనా కీడు జరుగుతుందని ఎంతగా తల్లడిల్లిపోతుందో బిడ్డ క్షేమం తప్పించి ఏమి ఆశించని నిస్వార్థప్రేమ తల్లి చూపిస్తుందో బెజ్జమహాదేవి పాత్ర ద్వారా చూపించాడు సోమన. లోకంలో ఉండే తల్లులందరి గుణాలను బెజ్జమహాదేవి పాత్ర ద్వారా ప్రదర్శించి భగవంతుడినైనా బిడ్డగానే భావించగలిగే స్త్రీ ఔన్నత్యాన్ని నిరూపించాడు సోమన. భక్తులు తననే రూపంతో ఆరాధిస్తే పరమేశ్వరుడు అదే రూపంతో వాళ్ళను అనుగ్రహించి ముక్తిని ప్రసాదిస్తాడనే భగవత్‌తత్త్వాన్ని దర్శింపజేశాడు సోమన.

నిరంతరం ఆ పరమేశ్వరుడి పాదాలను అంతరంగంలో నిలుపుకొని ధ్యానించే శివభక్తురాలు బెజ్జమహాదేవి. ఆమె ఒకరోజు ఈవిధంగా ఆలోచించింది. "అన్ని యోగాలు, బంధువులు మిగిలిన అందరూ ఉన్న శివుడికి తల్లి లేకుండా ఉండటం విచిత్రంగా ఉంది. తల్లి లేకుండా తానెలా జన్మించాడు? ఒకవేళ తల్లి మరణించిదేమో? తల్లి మరణించిన కారణంగా తానెంతగానో బాధలుపడింది. ఎవరికైనా తల్లిలేని దుఃఖం ఒకటేకదా ? తల్లి ఉన్నట్లైతే శివుడిని తాపసుడిగా మారనిచ్చేదా? తల్లి ఉంటే వెంట్రుకలు జడలు కట్టనిచ్చేదా? తల్లి ఉంటే విషం త్రాగనిచ్చేదా? తల్లి ఉంటే చర్మాలు ధరింపనిచ్చేదా? పాములను ధరింపనిచ్చేదా? బూడిదను పూసుకోనిచ్చేదా? కుమారుడిని తల్లి స్మశానానికి పోనిచ్చేదా? తల్లి లేని కుమారుడు కనుక శివుడికి ఇన్ని కష్టాలు వచ్చాయి. అదే తల్లి ఉన్నట్లైతే చనుపాలు త్రాపి, వెన్న తినిపించి, అతని ఆకలిని గుర్తించి పాలిచ్చి పెంచేదికదా ! తల్లి లేకుండానే ఇంత గొప్పవాడయ్యాడు. అదే తల్లి ఉన్నట్లయితే తాను ఇంకా ఎంత పెరిగేవాడో కదా. పెళ్ళిళ్ళల్లో, నోములలో, జాతరలలో, పండుగ రోజులలో, పేరంటాళ్ళలో తగినరీతిగా చూసే తల్లి లేకపోతే ఎంతటి మగబిడ్డలైనా సరే బాధపడరా. ఊరకనే ఉపేక్షచేసి ఇంక ఉండకూడదు. ఇకపై శివుడికి నేనే తల్లినై చూసుకుంటాను'' అనుకున్న బెజ్జమహాదేవి తానే పరమేశ్వరుడికి తల్లి అయింది.

తల్లి అయిన బెజ్జమహాదేవి తనయుడైన శివుడిని కాళ్ళపై పరుండబెట్టుకొని స్నానం చేయిస్తుంది. పసిపిల్లలకు స్నానం చేయించేరీతిలోనే ఆమె శివుడి ముక్కొత్తి, చెక్కిళ్ళొత్తి, మూడుకళ్ళని పులిమి, కడుపొత్తి, వీపు నిమిరి, బాగా పెరగాలని కాళ్ళు, చేతులు సాగదీసి, నలుగులుపెట్టి కాళ్ళపై బోర్లా పడుకోబెట్టి నీటితో వీపుమీద చరిచి, తలమీద నీరుపోసి, నీరు నోట్లోకి పోకుండా ముఖానికి చేతిని అడ్డుపెట్టి పసుపు కలిపిన నీటితో స్నానం చేయించింది. స్నానం తరువాత కళ్ళు, చెవులు గట్టిగా ఊది, నోటిలోని కఫాన్ని వ్రేలితో బయటకుతీసి, స్నానం తరువాత చేతినీళ్ళు చుట్టూ త్రిప్పి దిష్టితీసి బొట్టుపెట్టేది.

తరువాత బొటనవ్రేలితో మెత్తని మట్టిని కలిపి బొట్టుపెట్టి, కడవ క్రింద కాలిన పిడకలు నలిచి ఆ బూడిదను శివుడి నొసటికి పూసేది. పైకెత్తితే ఎత్తు పెరగడని భయపడి శివుడిని గుండెలకు అదుముకునేది. కాటుక పెడితే కళ్ళు పెద్దవవుతాయని

మూడుకళ్ళకు కాటుక పెట్టేది. చనుబాలు తాపి, పక్షుల నీడ పడకుండా చూసేది. తినటానికి వెన్నపెట్టేది. బుగ్గగిల్లి ఏడ్వగానే ఉగ్గుపాలు పోసేది. ఏడుస్తున్న బిడ్డని బుజ్జగించేది. ముద్దులు పెడుతుంది, నవ్విస్తుంది. తన పొట్టనే పాన్పుగాచేసి జోల పాడుతుంది.

ఈవిధంగా తల్లిగా కొడుకుకి ఉపచారాలు చేసేది. శివుడు కూడా ఆమె ముగ్ధభావానికి ముగ్ధుడై తానూ ఈ ఉపచారాలనన్నీ స్వీకరించాడు.

శ్రుతి "యేక యేవహి రూపేణ" యనియు
స్మృతి "సాధకస్సంస్మరేత్సదా" యనియు
ధర తస్యతన్మమతాంయంతి యనియు
హరుని వాక్యము గాన యది యేల తప్పు.

రూపం ఒకటే అని వేదాలు, సాధనకు దేవుడిని నిరంతరం స్మరించాలి, అప్పుడు ఆ రూపం, భావం సిద్ధిస్తాయి'' అని ధర్మశాస్త్రాలు చెప్పినమాట హరుని వాక్యమే. దానికి లోకంలో తిరుగులేదు. "భక్తుడు ఏవిధంగా భావిస్తే భగవంతుడు ఆ రూపంలోనే సాక్షాత్కరిస్తాడు అని భక్తులు భావిస్తారు.

ఈవిధంగా కొన్నిరోజులు ఆమె సేవలందుకున్న దేవదేవుడైన పరమేశ్వరుడు బెజ్జమహాదేవికి ప్రసన్నుడు కాదలచి చిన్నపరీక్ష పెట్టాడు. శివుడికి తీవ్రమైన వ్యాధి కలిగింది. పాలు త్రాగడు, వెన్న తినటానికి నోరు తెరవడు. పిల్లవాడి పరిస్థితికి తల్లి తల్లడిల్లింది. దుఃఖంతో వివశురాలై ఈవిధంగా అంది. "నా అన్న! నాపట్టి, నా చిన్న బిడ్డడా ! పాలెందుకు తాగవు? నీ చెమట చూసి నేను నెత్తురవుతాను. ఈస్థితిలో నిన్ను చూడలేను. తల్లిని కదా ఇంతటి బాధ సహించగలనా? లేకలేక ఒక్కబిడ్డనే కలిగావు. ఈ దుఃఖాన్ని ఎలా దాటగలవు? నా కాళ్ళు నేలమీద నిలవటం లేదు. ఎందుకు మాట్లాడవు? నొప్పా? అరగలేదా? గొంతునొప్పా? అంగిటిముల్లా? మందులుమ్రాకులు నాకు తెలీదు'' అంటూ ఏడుస్తూ పలువరించింది. పొర్లింది, చూస్తుంది, కౌగిట్లో చేరుస్తుంది. శరీరం వేడిగా ఉందా అని చూస్తుంది, గుడ్డ కప్పుతుంది, తీస్తుంది. తల్లడిల్లిపోతుంది. బిడ్డకు అంగిటిముల్లు అయిందని ఇతరులంటే ఎంతో దుఃఖిస్తూ శోకసముద్రంలో మునిగిపోతుంది.

బెజ్జమహాదేవి శివుడి స్థితిని చూసి కడుపులో వెలితి అవ్వగానే సిడయనంబి దగ్గరకు వెళ్లావు. అక్కడ తినటానికి ఏమీ లేకపోతే కుమ్మర గుండయ్య వాద్యం వాయిస్తూ ఉంటే నాట్యం చేశావు. అక్కడ కూడా ఏమీ లేకపోతే చేరమ చక్రవర్తి వాయిస్తే ఆశ్చర్యకరంగా ఆడి ఆకలితో అలసిపోయావు. ఇలాంటి ఆటలెన్ని ఆడినా కడుపు నిండుతుందా? అని వెంటనే వచ్చి చిట్టచివరకు పిట్టవ్వ దగ్గర ఇంత పిట్టు తిని, సామవేదుల ఇంట్లో చచ్చిన పెయ్యను ప్రేమతో వండిపెడితే తిని, కరికాళవ్వ ఇంట్లో మామిడిపండ్లు రహస్యంగా తిని, చెన్నయ్య ఇంటిలో పులిసిన అంబలి జుర్రి, చిఱుతొండనంబి కొడుకు మాంసం అడిగి విందారగించి, నిమ్మవ్వ ఇంట్లో భుజించి, చోడవ్వ గిన్నెతో ఇచ్చిన పులగం తిని, సురియ చౌడయ్య చేతిముద్దలు ఆశించావు. నిన్న ఈ విషయాలన్నీ ఒకామె నాకు చెప్పింది. కుమారా ! నన్నెందుకు ఇలా బాధపెడతావు? నీవు ఆకలితో మలమల మాడుతూ అందరి దగ్గర తిరగడమెందుకు ? తినకూడనివి తినడమెందుకు ?

బ్రదుకున్న దే యిట్లు వైకుడ్పులందు
నదియేల కడుపూఁదదయ్యెడుఁ జెపుమ
చన్నిత్తుఁబలమాఱు వెన్నయు ! బాలు
న్నేఁడు దప్పింప నెందైనఁదెత్తుఁ

అలాంటప్పుడు ఇతరుల ఇళ్ళకువెళ్లి అడిగి తినడమెందుకు? ఇన్నిరోజులు ఏవిధంగా సరిపోయింది ? నిన్న నీ కడుపెందుకు నిండలేదు ? చెప్పు. పగలైనా, రాత్రైనా చంక దిగని నీవంటి మంకుపిల్లలు ఉంటారా ? ఈ ముల్లోకాలలో నావంటి తల్లులు ఉంటారా, నీవు నా ప్రాణనివనటానికి నువ్వే సాక్షివి. ఎలాగైనా నేను చెప్పినట్లుండి, నేను పెట్టినంత తినుంటే నీకీ నొప్పి వచ్చేదా? నిప్పుకి చెదలంటుతుందా ? నీకు నువ్వే ఈ రోగం తెచ్చుకున్నావు. లేకపోతే ఈ ఆపద నీకెలా వస్తుంది? మాటలతో రోగాలు తగ్గుతాయా? ఇవన్నీ నిన్నడగటమెందుకు? నీ బాధ నేనింక చూడలేను, నేను ప్రాణాలు విడుస్తాను అని బెజ్జమహాదేవి తల కొట్టుకోబోయింది. అప్పుడు శివుడు ప్రత్యక్షమై నీకు కావలసిన వరం కోరుకోమనగా బెజ్జమహాదేవి

**నీవు నిరోగివై నిత్యుండవై సు**
**ఖావాప్తి నుండు నా కంతియె చాలు**
**కన్నమోహంబునకంటే నగ్గలము**
**ఎన్నఁబెంచిన మోహమందు నటంద్రు**

కాబట్టి నిన్ను కనులారా చూస్తూ ఒక్కడుండుటయే నా కోరిక అని చెప్పింది. అప్పుడు పరమేశ్వరుడు చిరునవ్వుతో తల్లిని కౌగిటిలో చేర్చుకొని ముల్లోకాలకు నీవు ముత్తవ్వవు. నీలాంటి తల్లి ఉండగా నాకు రోగం ఎలా వస్తుంది? అని బెజ్జమహాదేవికి శాశ్వతమైన ముక్తిని ప్రసాదించాడు. ఆమె అమ్మ అయి శివుడిని సేవించింది కాబట్టి ఆమెకు "అమ్మవ్వ" అనే పేరొచ్చింది.

**డా॥ నూనె అంకమ్మరావు**
తెలుగు లెక్చరర్
శ్రీ నాగార్జున డిగ్రీ కళాశాల
ఒంగోలు, ప్రకాశం జిల్లా

పాఠం - 3

# నాడీజంఘోపాఖ్యానం

- తిక్కన

**(మహాభారతం - శాంతి పర్వం - తృతీయాశ్వాసం - 472 నుండి 528 పద్యాల వరకు)**

**విషయసూచిక :**

**3.1** ఉద్దేశ్యం

**3.2** కవి పరిచయం

**3.3** కావ్య పరిచయం

**3.4** పాఠ్యభాగ సందర్భం

**3.5** పాఠ్యభాగ సారాంశం

## 3.1 ఉద్దేశ్యం :

విద్యార్థులకు మంచి స్నేహితుడి ఔన్నత్యాన్ని తెలియజేయడం, మిత్రద్రోహం, కృతఘ్నతలను మించిన పాపాలు లేవని నిరూపించటం ఈ పాఠ్యభాగ ఉద్దేశ్యం.

## 3.2 కవి పరిచయం :

మహాభారతాన్ని ఆంధ్రీకరించిన వారిలో ద్వితీయుడు తిక్కన సోమయాజి. తన మొదటి రచన నిర్వచనోత్తర రామాయణాన్ని మనుమసిద్ధికి అంకితమిచ్చి మనుమసిద్ధిచే మామ అనిపించుకున్న అద్వితీయుడు తిక్కన. తిక్కన అనేకరకాల యాగాలను మహితదక్షిణలతో చేసి సోమయాజి అయ్యాడు. వైదికమార్గ నిష్ఠయైన ప్రవర్తనతో, భేదంలేని భక్తితో, నిరంతర భగవత్పాద పద్మస్మరణతో, కావ్యరసాస్వాద తపస్సు చేత భగవంతుని మెప్పించిన ధన్యుడు తిక్కన. సమాజంలో నెలకొన్న శైవ, వైష్ణవ మతాలలోని వైషమ్యాలను పోగొట్టడం కోసం హరిహరాద్వైతాన్ని బోధించినవాడు. మహాభారతాన్ని ఆంధ్రీకరించి హరహరనాథుడికే అంకితమిచ్చి హరిహరులకు భేదంలేదని నిరూపించాడు. కవిబ్రహ్మగా, ఉభయకవి మిత్రుడిగా కవులచేత కీర్తింపబడినవాడు. తిక్కన గొప్పతనం కేవలం కవిత్వ పాండిత్యాలకే పరిమితంకాదు, అతడి మూర్తిమత్వ ఔన్నత్యాన్ని కేతన తన దశకుమార చరిత్రలో చెప్పిడిలా.

సుకవీంద్ర బృందరక్షకుఁడెవ్వఁడనిన, వీఁడను నాలుకకుఁ దొడవైనవాఁడు
చిత్తనిత్యస్థిత శివుఁడెవ్వఁడనిన, వీఁడను శబ్దమునకర్థమైనవాఁడు
దశదిశా విశ్రాంత యశుఁడెవ్వఁడనినఁ వీఁడని చెప్పుటకుఁబాత్రమైనవాఁడు
సకలవిద్యాకళా చణుఁడెవ్వఁడనిన, వీఁడని చూపటకు గురియైనవాడు
మనుమసిద్ధి మహీశ సమస్తరాజ్య, భాగ్యధౌరేయుఁడభిరూప భావభవుఁడు
కొట్టరువు కొమ్మనామాత్యు కూర్మిసుతుఁడు దీనజనతానిధానంబు తిక్కశౌరి.

అంతటి తిక్కన 13వ శతాబ్దానికి చెందినవాడు. ఇతని తల్లిదండ్రులు అన్నమ్మ, కొమ్మన్నలు. మంత్రి భాస్కరుడు తన తాతగారిని అతడు గుంటూరు విభుడని, సార కవితాభిరాముడని నిర్వచనోత్తర రామాయణంలో తిక్కన పేర్కొన్నాడు. సర్వలోకాలకి మూలం ధర్మం. ధర్మానికి మూలం వేదం. వేదసర్వస్వం విస్తరమైన భారతం పంచమవేదం. అటువంటి పంచమవేదమైన భారతంలోని 15 పర్వాలను తిక్కన తెనిగించాడు.

కావున భారతామృతము కర్ణపుటంబులు నొరగ్రోలి యాం
ధ్రావళిజ మోదముం బొరయునట్లుగ సాత్యవతేయ సంస్మృతి
శ్రీ విభవాస్పందంబయిన చిత్తముతోడ మహాకవిత్వ దీ
క్షావిధి నూని పద్యముల గద్యములన్ రచియించెదన్ గృతుల్.

అని తిక్కన ప్రతిజ్ఞచేసి మహాభారతాంధ్రీకరణ చేశాడా అనే విధంగా తనకున్న రాజనీతిజ్ఞతను, యుద్ధతంత్ర నిపుణతను, బ్రహ్మవిద్యోపదేశమును లోకజ్ఞతను అన్నింటినీ కవితాశక్తితో రంగరించి మహాభారత రచన చేశాడు.

**కావ్య పరిచయం :**

వ్యాసుడు సంస్కృతంలో "జయ" అను పేరుతో లక్ష శ్లోకాల్లో రచించిన మహాభారతం ప్రసిద్ధమైన కావ్యం. భారతంలో 18 భాగాలుంటాయి. భారతభాగాలను పర్వాలు అంటారు. పర్వం అంటే చెఱుకు కణుపు అని అర్థం. ప్రతిపర్వం చెఱుకు కణుపువలె మధురంగా ఉంటుంది.

వ్యాసుడు వేదాలను నాలుగు భాగాలుగా విభజించాడు. నాలుగు వేదాలలోని సారాన్ని కథా రూపంలో పొందుపరచి వ్యాసుడు రచించిందే భారతం. అందుకే దీనిని పంచమవేదమంటారు.

భారతాన్ని తెలుగులోకి నన్నయ, తిక్కన, ఎఱ్ఱనలు అనువదించారు. ఈ ముగ్గురిని కవిత్రయం అంటారు. ఆది, సభా, అరణ్యపర్వంలో కొంతభాగం నన్నయ రచించగా మిగిలినవైన విరాటపర్వం నుంచి స్వర్గారోహణపర్వం వరకు గల పదిహేను పర్వాలను తిక్కన అనువదించాడు. నన్నయ కొంతభాగం రాయగా మిగిలిన ఆరణ్యపర్వశేషాన్ని ఎఱ్ఱన పూర్తి చేశాడు.

ప్రస్తుత పాఠ్యభాగం శాంతిపర్వం తృతీయాశ్వాసంలోనిది.

**పాఠ్యభాగ సందర్భం :**

కురుక్షేత్ర యుద్ధం తర్వాత ధర్మరాజు వికలమనస్కుడై ఎంతో దుఃఖిస్తుంటాడు. రాజ్యపాలనపట్ల విముఖుడై ఉన్న ధర్మరాజుకు ప్రబోధం అవసరమని భావించి కృష్ణుడు అంపశయ్యపైనున్న భీష్ముడి దగ్గరకు ధర్మరాజును తీసుకువెళతాడు. ఇక్కడ అర్జునుడికి గీతోపదేశం చేసిన శ్రీకృష్ణుడు ధర్మరాజుకు కర్తవ్యాన్ని ఉపదేశించవచ్చు కదా అనే సందేహం కలుగుతుంది. ధర్మరాజుకన్నా వయస్సులో కృష్ణుడు చిన్నవాడు. చిన్నవారు పెద్దవారికి ధర్మోపదేశం చేయటం అంత సముచితంగా ఉండదు. అందుకని వయోవృద్ధుడు, జ్ఞాని, ప్రశాంతుడు, మనోవాక్కర్మలతో సంయమనం కలవాడు అయిన భీష్ముడు ఉపదేశించటం సముచితం. ధర్మరాజుకున్న అనేక సందేహాలను నివృత్తిచేసి రాజ్యపాలనా దక్షకుడిని చేయగలవాడు భీష్ముడు.

శాంతి పర్వంలో కథ తక్కువ, బోధ ఎక్కువ. ధర్మరాజు అడిగే సందేహాలను నివృత్తి చేయడం కోసం భీష్ముడు ఇతిహాసాలలోని, పురాణాలలోని అనేక కథలను చెబుతాడు. ఈ కథలలో తిర్యగ్జడముల నుండి దేవర్షుల వరకు సంబంధించిన కథలున్నాయి. పాత్రలు పశుపక్ష్యాదులైనప్పుడు పాఠకుడు రాగద్వేషాలు పొందడు. అంతేకాక కథ ప్రతీకాత్మకంగానూ ఉంటుంది. చదివే పాఠకుడు జంతువులకే ఇన్ని తెలివితేటలుంటే మానవుడు ఇంకెంత ఉన్నతంగా ఉండాలి అని ఆలోచిస్తాడు. అందుకే భీష్ముడు తన ఉపదేశంతో జంతువులను, పక్షులను పాత్రలుగా చేసిచెప్పాడు. అటువంటి ఒక ఉపాఖ్యానమే నాడీజంఘోపాఖ్యానం.

ధర్మరాజు "ఎలాంటి భృత్యులను రాజులు ఆదరించాలి, ఎటువంటి వారిని ఏమాత్రం సందేహించకుండా పరిహరించాలి" అని అడిగిన ప్రశ్నకు భీష్ముడు "క్షమావంతులు, ధర్మవేత్తలు, విధి నిర్వహణాదక్షులు, విజ్ఞులు, నిరర్థక

క్రోధవిహీనులు ఎప్పుడూ రాజ్యానికి శ్రేయస్సు కల్గిస్తారు. క్రూరులు, పరమలోభులు, శఠులు, కృతఘ్నులు, పిరికిపందలు, అసమర్థులు, అసత్యవచనులు అయిన సేవకుల వలన రాజుకు ఎప్పుడూ ఆపదలు కలుగుతాయి. ఎలాంటివారినయినా ఆదరించవచ్చుకానీ కృతఘ్నుడికి మాత్రం ఆశ్రయం ఇవ్వకూడదని నీతిశాస్త్రజ్ఞులు చెబుతున్నారు. అటువంటి కథ చెబుతాను, విను" అని నాడీజంఘోపాఖ్యానం చెప్పాడు.

**పాఠ్యభాగ సారాంశం :**

ప్రాచీనకాలంలో బ్రాహ్మణుడొకడు కులధర్మాన్ని వదిలి బోయదానిని చేపట్టి కిరాతులతో కలిసి వేట తమకంతో మైమరచి విహరించాడు. యథేచ్ఛగా మాంసాహారం భుజించాడు. అయినా అతనికి భోగాలపై విపరీతమైన కోరిక ఉపశమించలేదు. ఒకరోజు అతడు ధనసంపాదన కోసం ప్రముఖ వర్తకులతో స్నేహం చేసి, వారితో కలిసి దేశాంతరయాత్ర ప్రారంభించాడు. ఆ వర్తకుల సంఘం కొంతదూరం ప్రయాణించిన తర్వాత దట్టమైన అడవిమార్గంలో మదించి మైమరచిన ఏనుగొకటి వారి గుంపులో ప్రవేశించింది. అది కనబడిన వ్యాపారస్తులనందరినీ భయంకరమైన తన పాదఘాతాలతో తత్తునియలు అయ్యే విధంగా చంపివేసింది. మిగిలినవారు ఆ బీభత్సాన్ని చూసి భయపడినవారై నాలుగు దిక్కులకు పరుగులు తీశారు.

ఆ సమయంలో ఆ బ్రాహ్మణుడు ఉత్తరదిక్కుగా పారిపోయి అక్కడ వేరొకదారివెంట చాలాదూరం ప్రయాణించాడు. ఆ తర్వాత అతని ఎదురుగా పెద్దవృక్షం కనిపించింది. పూలు, పండ్ల భారంతో అల్లిబిల్లిగా అల్లుకున్న అనేక పూతీగలతో పెద్ద పందిరిలాగా ఉన్న ఆ చెట్టు చూడగానే అతనికి అక్కడ విశ్రాంతి తీసుకోవాలనిపించింది. ఆ బ్రాహ్మణుడు దాని దట్టమైన నీడలో విశ్రమించి మేను వాల్చగానే పరిమిళాలతో కూడిన చల్లనిగాలి అతని హృదయానికి ఆనందాన్ని కలిగిస్తూ పరవశాన్ని కలిగించింది. లోలోపల అతడిని బాధపెడుతున్న దాహం కొంత శాంతించింది.

అంతలోనే ఒక పెద్దకొంగ ఆ బ్రాహ్మణుడి దగ్గరకు వచ్చింది. అది బ్రహ్మదేవుడి అనుగ్రహం పొందిన కొంగ. నాడీజంఘు, రాజధర్మ అనే పేర్లతో ఆ మహారణ్యంలో నాలుగుమూలలు గొప్ప కీర్తి కలిగినది. చాలాకాలం నుంచి ఆ మహావృక్షం కొమ్మపై నివశిస్తుంది. ఆ కొంగ బ్రాహ్మణునిపై దయగల చూపు సారించి "బ్రాహ్మణశ్రేష్ఠుడా ! ఎక్కడి నుంచి ఎక్కడికి ప్రయాణం చేస్తున్నావు ? ఈ ప్రయాణం ఉద్దేశ్యమేమిటి ? నిన్ను చూసినంతనే నాకు చాలా ఆనందం కలిగింది. నాకు నీవిక అతిథివి. నీ కథంతా నాకు చెప్పు" అని వేడుకొంది. ఆ బ్రాహ్మణుడు దాని మాటలు విని తన వృత్తాంతం తెలిపాడు.

"ఓ కొంగరాజా ! నేను మధ్య దేశస్థుడను. గౌతముడు నా పేరు. ఒకానొక పుణ్యాత్ముడి కుమారుడిని. సోమరినై వేదాలు అధ్యయనం చేయటం వంటి కులధర్మాలను విసర్జించి కామమోహంతో కర్తవ్యా కర్తవ్య వివేకశూన్యుడనై బోయదానినొకదానిని భార్యగా స్వీకరించి పేదరికంవల్ల జీవయాత్ర కొనసాగకపోవటంతో వ్యాపారస్థుల సమూహంతో విదేశయాత్ర ప్రారంభించాను. దారి మధ్యలో అడవియేనుగు ఒకటి అకస్మాత్తుగా మాపైబడి కఠినమైన పాదాఘాతాలతో అనేకమందిని ఒకేసారి ముక్కలుముక్కలుగా చేసి సంహరించింది. అది గమనించిన మిగిలినవారు ఇష్టం వచ్చినట్లు అటుఇటు పరుగులు తీశారు. నేను అది గమనించి విపరీతమైన ప్రాణభయంతో నా శక్తికొలది పరుగుపెట్టి అదృష్టవశాత్తు ఈ ప్రదేశానికి చేరుకున్నాను".

అది విన్న ఆ కొంగలరాజు "విప్రవర్యా ! నీకు ఎప్పుడూ శుభం కలుగుగాక. త్వరలోనే నీ దారిద్ర్యపీడ మొత్తం తొలగిస్తాను. నా ఆతిథ్యం స్వీకరించు" అని అన్నది. ఎంతో రుచికరమైన మందాకినీ నదిలోని చేపలను, తీయతీయని

అడవిపండ్లను, శుభ్రమైన నదీజలాన్ని సమర్పించింది. చల్లని మాటలతో అతడికి ఉపశమనం కలిగించింది. సూర్యాస్తమయం అయిన తర్వాత లేతలేత చిగుళ్ళతో, పూలతో మెత్తని శయ్యపరచి విశ్రమింపజేసింది. సరసల్లాపాలతో అతని మనసుకు ఎంతో ఉల్లాసాన్ని కలిగించింది. గౌతముడు ఆ రాత్రి గాఢ నిద్రా పరవశుడై విశ్రమించాడు. ఆ తర్వాతిరోజు ఉదయ సమయంలో నిద్రలేచిన తర్వాత తీయని హితోపదేశం ప్రసాదించిందా కొంగ.

"భూసురాగ్రణీ ! మానవుడి దరిద్ర నివారణకు స్నేహితుడు, వెండి, బంగారం, బుద్ధి ప్రాబవం అనే నాలుగు సాధనాలున్నాయని దేవగురువు ఒకప్పుడు ఉపదేశించాడు. ఈ నాల్గింటిలో మిత్రుడు అత్యధికుడు. కాశ్యపుడి కుమారిడినైన నేను నీకు స్నేహితుడనయ్యాను కనుక నీ పేదరికం త్వరలోనే దూరంగా తొలగిపోతుంది. మధువజ్రమనే పట్టణంలో విరూపాక్షుడనే రాక్షసరాజున్నాడు. అతడు నాకు ఆత్మీయమిత్రుడు. ఆ పురం ఇక్కడికి మూడు యోజనాల దూరంలో వుంది. ఆ దారి వెంటవెళ్ళి అతడి సన్నిధి చేరి నేను పంపించిన విషయం నివేదించి ధనం ప్రసాదించమని అభ్యర్థించు. మణి కనక వస్తు వాహనాలతో అతడు తప్పక నీ కోరిక నెరవేరుస్తాడు".

గౌతముడు అది విని లోలోపల మిక్కిలి సంతోషించి తక్కువ సమయంలోనే మధువజ్రం చేరాడు. విరూపాక్షుడిని దర్శించి తన వృత్తాంతం నాడీజంఘుడు చెప్పిన రీతిగా విన్నవించాడు. ధనం ప్రసాదించమని వేడుకొన్నాడు. రాక్షసరాజు అది విని గౌతముడి ముఖవైఖరిని బాగా పరిశీలించి "ఇతడెవ్వడో పరమనీచుడిలాగా కనిపిస్తున్నాడు. కాబట్టి ఇతడి చరిత్ర బహుజాగరూకతతో పరిశీలించాలి" అని భావించి "కులవృత్తాలతోపాటు పుట్టుపూర్వోత్తరాలు తెలియజేయమన్నాడు. గౌతముడు అతడి ఆనతి విని కొంచెం గూడా ఆందోళన చెందకుండా తన కులవృత్తాలు పూర్తిగా వివరించాడు. రాక్షసరాజు అతడి దుష్టప్రవర్తన బాగా గ్రహించినా కొంచెం కూడా వెనుదీయక ఇతడు ఎలాంటివాడైనా కావచ్చు. బకాధిపతితో పెరిగిన స్నేహసంపద కారణంగా గౌతముడు దానం ఇవ్వదగినవాడే. కాబట్టి కావలసిన ధన, కనక, మణిరాసులు సమర్పిస్తాను" అని నిర్ణయించుకొని బ్రాహ్మణుడికి తగినరీతిలో భోజన వసతి సౌకర్యాలు ఏర్పరచమని తన సేవకులను ఆజ్ఞాపించాడు.

ఆ మరుసటిరోజు కార్తీకపౌర్ణమి. ఆ పుణ్యసమయంలో వేలకొలది బ్రాహ్మణ శ్రేష్ఠులను ఆహ్వానించి బంగారు పళ్ళాలతో పంచభక్ష్య పరమాన్నాలతో, భూరి దక్షిణలతో, నిత్యనైమిత్తిక క్రియలతో వారిని అర్చించాలని విరూపాక్షుడు అంతకుముందే నిశ్చయించుకున్నాడు. కాబట్టి గౌతముడికి వారితోపాటే యథావిధిగా పూజలు చేసి మృష్టాన్నం పెట్టి మోయలేనన్ని మాణిక్య సువర్ణధనరాసులు ఇచ్చాడు. అంతటితో తృప్తిచెందక అతడు భుజించిన బంగారుపాత్ర ఇచ్చి సాదరంగా వీడ్కోలు పలికాడు. అంత ధనభారానికి గౌతముడి మూపులకు ఎక్కువగా బాధ కలిగింది. అయినా చిట్టచివరకు అతడు త్వరలోనే నాడీజంఘుని నివాసప్రదేశం చేరాడు. ఆ ఒకపతి అతడి దురవస్థ చూచి మెల్లగా సమీపించి తన రెక్కలనే విసన కర్రలతో విసిరి ప్రయాణ బడలిక పోగొట్టింది. మధురమైన ఆహారం సమర్పించింది. చీకటిపడిన తర్వాత శయ్యపై విశ్రమించమని చెప్పి అతడిని వదిలి తన నివాసం చేరి నిద్రించింది.

ఆ దుష్ట బ్రాహ్మణుడి మదిలో ఆ తరువాతిరోజు భోజనం గురించి ఆలోచన కలిగింది. "ఈ కొంగ బాగా కొవ్వుపట్టి వుంది. దీని శరీరంలో తియ్యటి మాంసం ఎక్కువ. కాబట్టి ఇది నిద్రపోతున్న సమయంలో దీనిని చంపి గొంతువరకు మంచి మాంసం తింటాను" అని నిశ్చయించుకున్నాడు. ఆ కొంగలరాజు నిద్రపోయిన తర్వాత పంచెకట్టు బిగించి పెద్ద కట్టెనొకటి పట్టుకొని దాని మెడపై చావమోది తన చెడుఆలోచన యథాతథంగా నెరవేర్చాడు. అది చచ్చినదని గమనించి ఈకలు పీకి మాంసం ముద్దచేసి మూటకట్టి ఎముకలతో నిండిన వట్టిడొక్క అక్కడ విసిరేసి తన దారిన తాను వెళ్ళిపోయాడు.

విరూపాక్షుడికి తరువాతి ఉదయం నిద్రలేవగానే తన స్నేహితుడి శరీరమాంసం వాసన గుప్పుమన్నట్లు స్ఫురించింది. అతడు ఆ దుశ్శకునానికి ఎంతగానో బెంగపడి ఏమి కీడు జరుగుతుందో అని భయపడి ఆత్మీయులకు ఈ సంగతి చెప్పాడు. అంతలోనే జాము ప్రొద్దెక్కింది. నాడీజంఘుడు ఆ సమయంలో అతడి సన్నిధికి వచ్చి చిరునవ్వుతో, సరససల్లాపాలతో రాజధర్మాలు ఉపదేశించేవాడు. అయితే ఆ రోజు ఎంతసేపటికి అతడు అక్కడికి రాలేదు. విరూపాక్షుడు కొంచెంసేపు నాడీజంఘుడి కోసం ఎదురుచూసి "అయ్యో ! తెల్లవారగానే నా స్నేహితుడు నాడీజంఘుడు ఇక్కడికి వచ్చేవాడు. మరి ఈరోజు ఇంతవరకు ఎందుకు రాలేదు? ఆ బ్రాహ్మణుడు అత్యంత దురాత్ముడు అతడు నా మిత్రుడికి భయంకరమైన ద్రోహం చెయ్యలేదు కదా! అయ్యో ! ఆ కొంగలరాజుకి ఏ హాని జరిగిందో కదా ! అని బాధపడి నాడీజంఘుని క్షేమసమాచారం కోసం అనుచరులు కొందరిని పిలిచి అడవిలోకి వెళ్ళి రమ్మని ఆజ్ఞాపించాడు.

వారు అక్కడికి వెళ్ళి ఒక దగ్గర కొంగ డొక్క గమనించి తమ రాజుకు ఆ దుర్వార్త నివేదించారు. అతడి అనుమతితో వెంటనే అడవిదారి పట్టి ఆ బ్రాహ్మణుడిని బంధించి పెడరెక్కలు విరిచికట్టి తమ రాజు సమక్షానికి ఈడ్చుకొని వచ్చి నమస్కరించి నిలుచున్నారు. విరూపాక్షుడు అంతదూరంలోనే గౌతముడి ముఖం తీరు గుర్తించి "మీరు ఆ మహాపాపిని నా దగ్గరికి తీసుకురావద్దు. ఆ కృతఘ్నుని వెంటనే బంధించి ఇష్టమైనట్లు భుజించండి" అని ఆజ్ఞాపించాడు. వారు అది విని "మహాప్రభో ! మేమెంత గతిమాలిన వాళ్ళమైనా ఈ పాపాత్ముని శరీరం మాత్రం తినలేము" అని విన్నవించారు.

విరూపాక్షుడు అది విని "మీరు ఇతడిని భక్షించినా సరే, భక్షించకపోయినా సరే, నా సన్నిధికి మాత్రం తీసుకొనిరావద్దు" అని హుంకరించాడు. ఆ రాక్షసులు వెంటనే ఈ గౌతముడిని నగరం బయటకు తీసుకెళ్ళి అతడి శరీరాన్ని కత్తులతో ముక్కలు ముక్కలుగా ఖండించారు. అయినా ఆ పరిసరాలలో ఆకలితో నకనకలాడుతున్న కుక్కలు గుంపులోని ఒక కుక్క అయినా ఆ కృతఘ్నుని శరీరఖండాలను వాసనైనా చూడలేదు. అది సముచితం. కుక్కలైనా కృతఘ్నుడి శరీరం స్పృశించవని ప్రాచీన ధర్మశాస్త్రాలు ఉద్ఘోషిస్తాయి. ఆ సూక్తి ఇక్కడ అక్షరసత్యమైంది.

విరూపాక్షుడు ఆ తర్వాత నాడీజంఘుడి శరీరభాగాలు ఒకచోట చేర్పించి చితిపై ఉంచి అగ్నిజ్వాల రగిల్చి తన పురానికి చేరుకున్నాడు. అంతలోనే దేవేంద్రుడు అక్కడ సాక్షాత్కరించాడు. ఆ రాక్షసరాజు ఇంద్రుడిని చూసి సముచిత పూజలు చేసి నమస్కరించి లోలోపలినుండి ఉప్పొంగుతున్న దుఃఖంతో 'స్వర్గలోకాధిపతి ! నా మిత్రుడు నాడీజంఘుడిని తిరిగి బ్రతికించండి' అని అభ్యర్థించాడు. ఆ ఇంద్రుడు ఆర్ద్రదృష్టితో అతడిని ఓదార్చాడు. "విరూపాక్షా ! నీ ఆప్తబాంధవుడైన నాడీజంఘుడు బ్రహ్మదేవుడికి అత్యంత ఆప్తుడని నీకు తెలియునుకదా ! ఆ నాడీజంఘుడు ఏరోజు తన సన్నిధికి రాకపోయినా బ్రహ్మదేవుడు అతనికోసం అనుక్షణం నిరీక్షిస్తున్నాడు. సరే దీనికేమిగాని నువ్వు ఎంతో ఆదరంతో స్నేహితుడి శరీరభాగాలకు ఉచితమైన ప్రేత సంస్కారం నిర్వర్తించావు. ఇది ఎంతో గొప్పపని. నువ్వు ఆవిధంగా చితాగ్ని ప్రజ్వరింపచేసిన తర్వాత కామధేనువు ఆ పొదకు కొంచెం దూరంలో నిలిచి లేగదూడకు ఎంతో ప్రేమతో పాలిస్తుంటే ఆ సమయంలోనే పెనుగాలి వీచి కొంచెం పాలనురుగు ఆ చితిపై పడింది. ఆ కారణంగా నాడీజంఘుడు మరుక్షణంలోనే తిరిగి బ్రతికినవాడై నీ దగ్గరికి ప్రయాణమయ్యాడు. ఆ మహాద్భుతానికి ఆ బ్రహ్మదేవుడి అనుగ్రహం కాక ఇంకో కారణమేముంటుంది?" అని ఇంద్రుడన్నాడు. అంతలోనే నాడీజంఘుడు ఆ ప్రదేశం చేరి రాక్షసరాజును ఆనంద సముద్రంలో ఓలలాడించాడు. ఇంద్రుడు అంతకుముందే బ్రహ్మదేవుడి ఆజ్ఞానుసారం గౌతముడిని తన దారుణ మృత్యుపాశంతో బంధించాడు.

నాడీజంఘుడు అది విని తన కారణంగానే ఆ బ్రాహ్మణుడికి అలాంటి భరించరాని యమయాతన కలిగిందని గమనించి మిక్కిలి దుఃఖించాడు. అతడిని కరుణించి అతడికి భయంకరమైన ఆ బంధనం గురించి విముక్తి కలిగించి తిరిగి

బ్రతికించమని ఇంద్రుడిని బ్రతిమాలాడు. దేవేంద్రుడు ఆ ప్రార్థనకు సంతోషించి ఆ వరం ప్రసాదించాడు. ఇంద్రుడి అనుమతితో అతడి భటులు అంతకుముందు తమ ఆధీనం చేసుకున్న గౌతముడి ధన కనక రత్నరాశి తిరిగి సగౌరవంగా సమర్పించారు. గౌతముడు అది తన మూపుపై ఉంచుకొని తిరిగితిరిగి వెనుకకు చూస్తూ ఆశ్చర్యంతో కూడిన నడకతో తన నివాసానికి ప్రయాణించాడు. ఆ తర్వాత ఇంద్రుడు నాడీజంఘుడికి ఎంతో అణుకువతో నమస్కరించి వారిని వదిలి తన స్వర్గలోకం చేరాడు. నాడీజంఘుడు ఆనందభరితుడై రాక్షసరాజు ఉచితమైన రీతిలో వీడ్కోలు పలుకగా వృక్షంలోవున్న తన నివాసానికి వెళ్ళాడు అని చెప్పి భీష్ముడు మనుమడైన ధర్మరాజుతో "ధర్మనందనా ! బ్రహ్మహత్యకైనా నివారణోపాయముంది కానీ కృతఘ్నతా పాతకానికి కొంచెం కూడా నిష్కృతి లేదు. మిత్రద్రోహం కృతఘ్నత కన్నా భయంకరమైన పాపమని ధర్మవేత్తలు ఉపదేశిస్తున్నారు. స్నేహితుడు మానవులకు ఐహికాముష్మిక శ్రేయః పరంపరను ప్రసాదిస్తాడు. స్నేహితుడు, ధనరాశి ఈ రెండింటిలో మిత్రుడే అత్యధికుడని ప్రాజ్ఞుల సూక్తి. శుభాలు కోరుకుంటే ఉత్తమ కులస్థుడైన ఆత్మీయ స్నేహితుడికి అత్యాదరంతో ధనం మొదలైన బహుమతులు సమర్పించి ఎప్పుడూ అన్యోన్యతతో మసలుకోవాలి" అని చెప్పాడు. ఆ విధంగా కృతఘ్నతా మిత్రద్రోహాలు అధికపాపం కలుగజేస్తాయని, మంచి స్నేహితులు శుభం కలిగిస్తారని భీష్ముడు ధర్మరాజుకు తెలియజేశాడు. అది విని ధర్మరాజు అత్యుత్తమ పురుషులు ప్రశ్నించటం, సమాధానం ఇవ్వటం ఇంతా బాగా ఉంటాయి" అన్నాడు.

**డా॥ డి. ధాత్రికుమారి**
సహాయాచార్యులు
వై.ఎ. ప్రభుత్వ మహిళా కళాశాల,
చీరాల, ప్రకాశం జిల్లా

పాఠం - 4

# నాడీజంఘోపాఖ్యానం

- తిక్కన

**(మహాభారతం - శాంతి పర్వం - తృతీయాశ్వాసం - 472 నుండి 528 పద్యాల వరకు)**

**విషయసూచిక :**

**4.1** కఠిన పదాలకు అర్థాలు - తాత్పర్యాలు

**ఉద్దేశ్యం :**

విద్యార్థులకు కఠిన పదాలకు అర్థాలు, తాత్పర్యాలను వివరించటం ఈ పాఠ్యభాగ ఉద్దేశ్యం.

**అర్థ తాత్పర్యాలు :**

472 - సమగ్రవ్యాఖ్య చూడండి.

473

| | | |
|---|---|---|
| చెలిమి | = | స్నేహం |
| బేహారంబు | = | వర్తకం |
| దేశాంతరంబు | = | ఇతర దేశానికి |
| గిరిగహన | = | పర్వతారణ్య |
| దుర్గమస్థలంబు | = | పోవుటకు వీలులేని ప్రదేశం |
| వనగజంబు | = | అడవి ఏనుగు |

**తాత్పర్యం :**

బ్రాహ్మణుడు స్నేహంచేసి కొందరు వైశ్యులు వర్తకానికి పరాయి దేశం పోతుంటే తానూ వారితో కలిసి దట్టమైన పర్వతారణ్యంలో పోగా ఒక అడవిఏనుగు

474.

| | | |
|---|---|---|
| సాతు | = | వర్తకుల సమూహం |
| ఉటికి | = | మీదపడి |
| ఉన్మదలీల | = | వెర్రెత్తిన రీతిగా |
| కాలన్ + చమరన్ | = | కాలితో చంపగా |
| భీతి | = | భయం |
| నల్దిక్కులు | = | నాలుగు దిక్కులు |
| పరచి | = | పరుగెత్తి |
| ఎల్లవారు | = | అందరూ |
| రయమున | = | వేగంగా |

**తాత్పర్యం :**

వర్తక సమూహంలోకి దూకి వర్తకులను వెర్రెత్తిన విధంగా నేలపై వేసి కాలితో చంపగా భయపడిన వర్తకులు నాలుగు దిక్కులకు వేగంగా పరుగెత్తారు.

475.

| | | |
|---|---|---|
| ఆయనయు | = | ఆ బ్రాహ్మణుడు కూడా |
| కాందిశీకుండు | = | దారీతెన్ను తెలియక పరుగెత్తువాడు |
| కని | = | చూచి |
| కెలనన్ | = | సమీపంలో |

**తాత్పర్యం :**

ఆ బ్రాహ్మణుడు ప్రాణభయంతో దిక్కుతోచక ఉత్తరం వైపు పరుగెత్తాడు. చాలాదూరం ప్రయాణించి ఒక దారి చూశాడు. ఆ దారితో వెళ్ళగా ప్రక్కనే

| | | |
|---|---|---|
| పొదల తఱచునన్ | = | దట్టమైన తుప్పలతో |
| జొంపమై | = | గుబురై |
| వరపున్ | = | వెడల్పు |
| వట్రువ తనంబునన్ | = | గుండ్రంగా ఉండుటలో |
| చెఱువు మిగిలి | = | ఎక్కువ అందంగావున్న |
| వట భూరుహమున్ | = | మర్రిచెట్టును |
| ఉల్లము | = | మనస్సు |
| మ్రాను | = | చెట్టు |

**తాత్పర్యం :**

దట్టమైన పొదలతో గుబురుగా పొడవుగా, వెడల్పుగా, గుండ్రంగా ఉండి అందంగా ఉన్న ఒక మర్రిచెట్టును చూశాడు. అక్కడ కొంచెంసేపు ఆగాలని మనసులో కోరిక కలుగగా ఆ చెట్టు నీడకు చేరి

477.

| | | |
|---|---|---|
| వనలతల | = | అడవి తీగల |
| కుసుమ గంధము | = | పూల సువాసన |
| సుడివడు | = | చుట్టుకుంటున్న |
| గాడ్పు | = | గాలి |
| డప్పిన్ | = | అలసటను |
| కొండొక | = | కొంచెం |
| తేర్పన్ | = | తీర్పగా |
| తనుపారన్ | = | సంతృప్తిగా |
| లలితగతిన్ | = | నెమ్మదిగా నడుచుకుంటూ |

**తాత్పర్యం :**

అడవిపూల సువాసనతో కూడిన గాలి వలన అతడు కొంత అలసట తీర్చుకొని తనివితీరా ఆ చెట్టునీడలో కూర్చున్నాడు. అతడు అలా ఉండగా అక్కడికి నెమ్మదిగా నడుచుకుంటూ

**478.**

| | | |
|---|---|---|
| మహాబకంబు | = | పెద్దకొంగ |
| పద్మభవుడు | = | బ్రహ్మదేవుడు |
| కొక్కెర | = | కొంగ |
| విప్రుని | = | బ్రాహ్మణుడిని |
| కాంచి | = | చూచి |
| తలకొను చూడ్కిన్ | = | ఇష్టమైన చూపులతో |

**తాత్పర్యం :**

ఆ మర్రిచెట్టు దగ్గరకు ఒక పెద్ద కొంగ వచ్చింది. ఆ కొంగ బ్రహ్మదేవుడి దయకు నోచుకుంది. నాడీజంఘుడు రాజధర్ముడు అనే పేర్లుగల ఆ కొంగకు ఆ చెట్టు నివాసం. ఆ పక్షి అలా వచ్చి ఆ బ్రాహ్మణుడిని చూసి ప్రేమతో ఆదరించింది.

**479.**

| | | |
|---|---|---|
| అరిగెదవు | = | వెళుతున్నావు |
| భూసుర + ఈశ్వర | = | బ్రాహ్మణ శ్రేష్ఠుడా |
| కని | = | చూచి |
| విందవు + అయితి | = | అతిథి వైతివి |

**తాత్పర్యం :**

ఓ బ్రాహ్మణ శ్రేష్ఠుడా ! ఏ పనికోసం ఎక్కడి నుంచి ఎక్కడికి వెళుతున్నావు? నిను చూసి నేను సంతోషించాను. నాకు తగిన అతిథివి అయ్యావు. నీ చరిత్ర చెప్పు.

**480.**

| | | |
|---|---|---|
| ఏను | = | నేను |
| మహనీయ చరిత్రుని | = | గొప్ప చరిత్ర కలిగినవాని |
| ఆలస్యంబున | = | అలసత్వంతో / సోమరితనంతో |
| విప్రకర్మ | = | బ్రహ్మణోచిత కర్మలు |
| విరహితుండనయి | = | వదలివేసిన వాడినై |
| కామలోలలత్వం | = | కాముకత |
| బేహారంబు | = | వ్యాపారులు |
| సాతున్ | = | వర్తకుల గుంపు |
| గిరిగహన | = | కొండలలో అడవులలో |
| దుర్గమ ప్రదేశంబు | = | ప్రవేశించటానికి వీలులేని చోటు |

**తాత్పర్యం :**

అని ఆ కొంగ అడుగగా నేను మధ్యదేశస్థుడని. గౌతముడు నా పేరు. గొప్ప చరిత్ర కలిగిన బ్రాహ్మణుడి కుమారుడిని. సోమరితనంతో బ్రాహ్మణులకు విధించబడిన కర్మలను త్యజించి కాముకతతో ఒక బోయదానిని భార్యగా చేసుకొని బోయతోనే కలిసివుండి, పేదరికంతో అలిసి వర్తకుల వెంట వర్తక సమూహంతో కలిసి పరదేశానికి వెళుతుండగా ఒక భయంకరమైన పర్వతారణ్య ప్రదేశంలో

**481.**

| | | |
|---|---|---|
| వనకరి | = | అడవి ఏనుగు |
| సాతునకున్ | = | వర్తకుల గుంపు పైకి |
| కలిసి | = | ఉరికి |
| జనచయంబు | = | జన సమూహాన్ని |
| త్రుంపన్ | = | చంపటానికి |
| తొడఁగుడున్ | = | ప్రారంభించింది |
| పఱచిరి | = | పారిపోయారు |
| భీతిన్ | = | భయంతో |
| కాననభూమిన్ | = | అడవిప్రదేశంలో |

**తాత్పర్యం :**

ఒక అడవి ఏనుగొకటి ఆ వర్తకుల గుంపులపైబడి వారిని చంపటం ప్రారంభించగా అందరూ భయపడి పారిపోయారు. నేను అడవి ప్రదేశానికి పారిపోయాను.

**482.**

| | | |
|---|---|---|
| పఱచి | = | పరుగెత్తి |
| దిక్కుతప్పి | = | దారి తప్పి |
| భాగ్యంబు కల్మి | = | అదృష్ట సంపదచేత |
| నీదైన | = | నీ యొక్క |
| నిలయమునకు | = | నివాసానికి |
| అరుగుదేర | = | రాగా |
| కంటిన్ | = | చూశాను |
| మేలు | = | మంచిది |
| దారిద్ర్యం | = | పేదరికం |
| అపనయింతున్ | = | పోగొడతాను |
| చింత | = | బాధ |
| అపనయింపు | = | విడుపు |

**తాత్పర్యం :**

పరుగెత్తి దారితప్పి నా అదృష్టవశాత్తు నీ నివాసానికి వచ్చి నిన్ను చూశాను అనగా మంచిది నీ పేదరికం పోగొడతాను. బాధ విడువు అని కొంగ చెప్పింది.

483.

| | | |
|---|---|---|
| ఈ + ఆతిథ్యంబు | = | ఈ అతిధి సత్కార్యాన్ని |
| కయికొను | = | స్వీకరించు |
| మందాకినీ మీనంబులు | = | గంగానదిలోని చేపలను |
| సపక్వంబులు | = | బాగా వండి |
| మధురంబులగు | = | తియ్యని |
| వన్యఫలంబులు | = | అడవి పండ్లను |
| పల్లవ | = | లేత చిగురులు |
| పుష్ప | = | పువ్వులు |
| సాంద్రంబగు | = | దట్టమైన |
| శయనంబు | = | పక్క |
| బకపతి | = | కొంగలరాజు |
| ధరణీసురుని | = | భూమిపై దేవతైన ఆ బ్రాహ్మణుడిని |
| సముచిత సల్లాపంబులు | = | సరసమైన సంభాషణలతో |
| విప్రుడు | = | బ్రాహ్మణుడు |
| ఆలోకించి | = | చూచి |
| వేగుటయు | = | తెల్లవారుట |

**తాత్పర్యం :**

నా ఆతిధ్యం స్వీకరించమని ఆ కొంగల రాజు రుచికరమైన గంగానదిలోని చేపలను వండి, తియ్యనైన అడవిపండ్లను తెచ్చి తృప్తిగా అతనికి ఆహారంపెట్టి, రాత్రి కావటంచేత లేతచిగుర్లు, పువ్వులతో దట్టమైన పక్కను ఏర్పరచి ఆ బ్రాహ్మణుడితో ఉచితమైన రీతిలో సంభాషణలు చేసి సుఖనిద్రతో ఆ రాత్రి గడిపి, తెల్లవారిన తర్వాత ఆ బ్రాహ్మణుడిని చూచి

484.

| | | |
|---|---|---|
| మిత్రుండును | = | స్నేహితుడు |
| రజితము | = | వెండి |
| కనకము | = | బంగారం |
| బుద్ధి | = | తెలివితేటలు / ఆలోచనలు |
| మర్త్యుని | = | మానవుడి |
| దారిద్ర్యము | = | పేదరికం |
| వాయుటకు | = | పోగొట్టుటకు |
| దేవగురుండు | = | దేవతల గురువు అయిన బృహస్పతి |
| అన్నింటిలోనన్ | = | వాటిలన్నింటిలోకి |

**తాత్పర్యం :**

వినుము, స్నేహితుడు, వెండి, బంగారం, ఆలోచన మానవుడి పేదరికం తొలగిపోవటానికి కారణాలని బృహస్పతి చెప్పాడు. అన్నింటిలోకి

485.

| | | |
|---|---|---|
| భూసురవర | = | బ్రాహ్మణులలోనే శ్రేష్ఠుడా ! |
| మిత్రుండు | = | స్నేహితుడు |
| ఎక్కుడు | = | ఎక్కువ |
| కాశ్యపపుత్రుఁడనగు | = | కాశ్యపుడి కుమారుడినైన నేను |
| సన్మైత్రి | = | మంచి స్నేహం |
| అనుష్ఠించెదను | = | ఆచరిస్తున్నాను |
| పాత్రము | = | అర్హం |
| అపార శ్రీకిన్ | = | అనంతమైన సంపదకు |

**తాత్పర్యం :**

బ్రాహ్మణులలో శ్రేష్ఠుడా ! వీటన్నింటిలోకి స్నేహితుడు అధికం. నీవు నాతో స్నేహం చేస్తున్నావు కనుక అంతులేని సంపదకు అర్హుడవు కాకుండా పోతావా?

486.

| | | |
|---|---|---|
| సఖుండు | = | స్నేహితుడు |
| నామధేయుడు | = | పేరుకలవాడు |
| యోజనం | = | ఆమడ |
| తెరవు | = | దారి |
| వేచని | = | వేగంగా వెళ్ళి |
| ఆదైత్యభర్తన్ | = | ఆ రాక్షసరాజును |
| కనుము | = | దర్శించు |

**తాత్పర్యం :**

నా స్నేహితుడు విరూపాక్షుడు. అతని నగరం మధువ్రజం. ఇక్కడి నుండి అది మూడు యోజనాల దూరంలో వుంది. ఆ నగరానికున్న దారినే వెళ్ళి ఆ రాక్షసరాజును దర్శించు.

487.

| | | |
|---|---|---|
| పుత్తెంచితిని | = | పంపించాను |
| అతి ప్రీతుండై | = | ఎంతో సంతోషించేవాడై |
| కాంచనంబు | = | బంగారం |
| రత్నంబులు | = | రత్నాలు |
| సంచితునిగా జేసి | = | గౌరవించి / సత్కరించి |
| ఇచ్చి | = | ఇస్తాడు. |

**తాత్పర్యం :**

అతడిని దర్శించి నేను పంపించానని చెప్పు. అతడు ఎంతో సంతోషించి బంగారం, రత్నాలు ఇచ్చి నిన్ను గౌరవించి సత్కరిస్తాడు.

488.

| | | |
|---|---|---|
| ఆ + పురి | = | ఆ నగరం |
| దెస | = | దిక్కు |
| కాంచి | = | చూచి |
| సముచితభంగిన్ | = | ఉచితమైన రీతిలో |
| రాజధర్మునకున్ | = | నాడీజంఘునికి |
| అనుగలమగు | = | అనుకూలమైన |
| సఖుడను | = | స్నేహితుడిని |
| అతని పనుపునన్ | = | అతడు పంపటం వలన |

**తాత్పర్యం :**

అనగా ఆ నగరం దిక్కుగా వెళ్ళి ఆ రాక్షసరాజును చూచి ఉచితమైన రీతిలో నాడీజంఘుడికి అనుకూలమైన స్నేహితుడనని, అతడు పంపగా వచ్చానని చెప్పాడు.

489.

| | | |
|---|---|---|
| అరుగుదెంచితి | = | వచ్చాను |
| దనార్థిని | = | ధనాన్ని కోరినవాడిని |
| రాక్షసేశ్వరుండు | = | రాక్షసరాజు |
| తేఱకొనన్ + చూచి | = | తేరిపార చూచి |
| ఆత్మన్ | = | మనసులో |
| ఈ + పాఱుడు | = | ఈ బ్రాహ్మణుడు |
| అధముడు | = | నీచుడు |

**తాత్పర్యం :**

ఆ రాక్షసరాజైన నిరూపాక్షుడు ధనం కోరి వచ్చానని చెప్పిన ఆ బ్రాహ్మణుడిని తేరిపార చూచి, మనసులో ఈ బ్రాహ్మణుడు నీచుడిలాగా కనిపిస్తున్నాడు అడిగి తెలుసుకోవాలనుకొన్నాడు.

490.

తలంచి = ఆలోచించి

491

| | | |
|---|---|---|
| విద్యయు | = | చదువు |
| వృత్తము | = | ప్రవర్తన |
| కలరూపు | = | ఉన్నదున్నట్లుగా |
| ఎఱిగింపు | = | తెలియజేయు |
| కలగక | = | కలత చెందకుండా |
| తెలియంగ | = | తెలిసే విధంగా |
| విప్రుండు | = | బ్రాహ్మణుడు |

| | | |
|---|---|---|
| అలఘుండగు | = | తక్కువవాడుకాని / గొప్పవాడైన |
| అసురపతి | = | రాక్షసరాజు |
| అవికృతుడు | = | ఏ వికారం లేనివాడు |

**తాత్పర్యం :**

విరూపాక్షుడు నీ కులం, చదువు, ప్రవర్తన ఉన్నదున్నట్లు చెప్పు అనగా ఏమాత్రం కలతపడకుండా తన గురించి బ్రాహ్మణుడు చెప్పాడు. గొప్పవాడైన ఆ రాక్షసరాజు ఏ వికారం లేనివాడు అగుచూ

**492.**

| | | |
|---|---|---|
| మహత్తర సఖ్యం | = | గొప్పదైన స్నేహం |
| పాత్రం | = | అర్హుడిగా |
| తృప్తి | = | సంతృప్తి చెందేటట్లు |
| ఇత్తు | = | ఇస్తాను |

**తాత్పర్యం :**

ఇతడు ఎలాంటివాడైన ఏమవుతుంది ? నాడీజంఘుడికి స్నేహితుడు. ఒక గొప్పదైన స్నేహం ఇతడిని అర్హుడిగా చేస్తుంది. ఇతనికి సంతృప్తి కలిగేవిధంగా ధనం ఇస్తాను.

**493.**

| | | |
|---|---|---|
| నిశ్చయించి | = | నిర్ణయించి |
| ఆహారం | = | ఆహారం |
| సంఛాదనంబులు | = | వస్త్రాలు |
| సమీచీనంబుగా | = | తగినరీతిగా |
| నిర్వర్తింపన్ | = | చేయటానికి |
| తగువారిని | = | తగిన వారిని |
| నియోగించి | = | వినియోగించి |
| సహస్రంబులు | = | వేలు |
| బహుళ దక్షిణలు | = | అనేక దానాలు |
| ప్రతి గ్రహింపనుంగల | = | స్వీకరించగల |
| నైమిత్తిక క్రియలు | = | చేయవలసిన పనులు |
| అనుష్ఠానంబులు | = | ఆచరించగా |
| మహాజనంబులు | = | గొప్ప బ్రాహ్మణులు |

**తాత్పర్యం :**

అని నిర్ణయించి ఆహారం, వస్త్రాలు తగినవిధంగా నిర్వహించే వారిని నియమించి, తరువాతిరోజు కార్తీక పౌర్ణమి కావటం వలన వేలమంది బ్రాహ్మణులు తన ఇంటిలో బంగారుపళ్ళాలతో భోజనాలు చేయటానికి, అనేక దక్షిణలు ఇవ్వటానికి తగిన ఏర్పాటు చేశాడు. స్వీకరించే బ్రాహ్మణులలో కలిసి ఎంతో ఆదరంగా

**494.**

| | | |
|---|---|---|
| మహనీయ | = | గొప్పదైన |
| అమృహితాత్ముండు | = | గొప్ప మనసుగల విరూపాక్షుడు |
| నడపి | = | జరిపి |
| దుర్వహభారము | = | మోయలేనంత బరువుగల |
| కనకరాశి | = | బంగారు రాశులను |

**తాత్పర్యం :**

గొప్పదైన అనేక పూజలతో భోజనం సంతృప్తిగా ఆ గొప్ప మనసుగల విరూపాక్షుడు జరిపించి మోయలేని అంత బరువుగల బంగారురాశిని, మణులను

**495.** సమగ్రవ్యాఖ్యను చూడండి

**496.**

| | | |
|---|---|---|
| సంతోషమున తేలి | = | ఆనందంలో ఓలలాడి |
| డప్పివోవ | = | అలసట తీరగా |
| బక వల్లభుడు | = | కొంగలరాజు |
| పక్ష పుటయుగము | = | రెండు రెక్కలు |
| అల్లన | = | మెల్లగా |
| నిసి | = | రాత్రి |

**తాత్పర్యం :**

కొంగలరాజైన నాడీజంఘుడు ఆ బ్రాహ్మణుడిని చూసి సంతోషించి అతని అలసట తీరే విధంగా తన రెక్కలతో మెల్లగా వీచింది. అతడి ఆకలిని తీర్చింది. రాత్రికాగా అతడికి సుఖనిద్రకు ఏర్పాటుచేసి, సుఖంగా నిద్రిస్తుండగా

**497.**

| | | |
|---|---|---|
| దుర్బ్రాహ్మణుండు | = | చెడ్డ బ్రాహ్మణుడు |
| పయనంబు | = | ప్రయాణం |
| చింతించి | = | ఆలోచించి |
| మహాబకంబు | = | పెద్దకొంగ |
| ఏమఱి | = | ఏమఱిపాటు |
| చావనడిచి | = | చంపివేసి |
| చెండికొని | = | తీసుకొని |
| పాపనిశ్చయుండై | = | పాపం చేయటానికి సంకల్పించినవాడై |
| చీర | = | వస్త్రం |
| కాష్ఠంబు | = | కట్టె / కఱ్ఱ |
| కరయుగంబు | = | రెండు చేతులు |

**తాత్పర్యం :**

ఆ చెడ్డబ్రాహ్మణుడు తన రేపటి ప్రయాణంలో ఆహారం గురించి ఆలోచించి "ఈ పెద్దకొంగ బాగా కొవ్వుపట్టి ఉంది. దీనిలో మాంసం చాలా ఉంది. ఇది ఆదమరిచి నిద్రపోతుంది. దీనిని చంపి తీసుకొనిపోతాను" అని పాపం చేయటానికి నిశ్చయించుకొని వస్త్రాన్ని చక్కగా కట్టుకొని ఒక కర్రను రెండు చేతుల మధ్యలో అమర్చుకొని

**498.**

| | | |
|---|---|---|
| అందందన్ | = | అప్పటికప్పుడు |
| మందాటోపమున | = | తొందరపాటుతో |
| పెక్కుమాఱులు | = | అనేకసార్లు |
| అడిచి | = | కొట్టి |
| తెలియజూచి | = | నిర్ధారించుకొని |
| అలరెడు | = | ఆనందించే |
| డెందముతో | = | మనసులో |
| వెసన్ + ఊడ్చెన్ | = | వెంటనే పెరికాడు |

**తాత్పర్యం :**

అప్పటికప్పుడే మెడను, తలను తొందరపాటుతో అనేకసార్లు మోది, చచ్చిందని నిర్ధారించుకొని ఆనందించే మనసుతో ఈకలన్నింటికి పెరికాడు.

**499.**

| | | |
|---|---|---|
| ఊడ్చి | = | పీకి |
| బొండువు | = | పీకను |
| వ్రచ్చి | = | చీల్చి |
| పేవురిని | = | ప్రేగులు బయటకు లాగి |
| నంజుడు | = | మాంసం |
| లాగిపుచ్చి | = | వేరుచేసి |
| పొదుకుగా | = | మూటగా |
| వేగు పొకగుట | = | తెల్లవారుట |
| చనియె | = | వెళ్ళాడు |
| మేలుకని | = | నిద్రలేచి |
| దనుజ ప్రభుండు | = | రాక్షసరాజు |

**తాత్పర్యం :**

పీక చీల్చి ప్రేగులను బయటకులాగి మాంసం మొత్తాన్ని వేరుచేసి మూటగా కట్టుకొని తెల్లవారగానే వెళ్ళిపోయాడు. ఆ సమయంలో నిద్రలేచిన రాక్షసరాజు

500.

| | | |
|---|---|---|
| పొలవలచెన్ | = | నీచు వాసనగా ఉంది |
| ఏమి కీడొకొ | = | ఏమి హాని |
| తలచి | = | ఆలోచించి |
| కలగగ | = | కలత చెందగా |
| ఉగ్గడించుచు | = | చెబుతూ |
| చలియించుచు | = | కదిలిపోతూ |

**తాత్పర్యం :**

విరూపాక్షుడు మాంసపు వాసన వస్తుంది. ఏమి హాని జరుగుతుందో అని ఆలోచించి మనసు కలతచెందగా తన పరివారంతో దాని గురించి మాట్లాడుతూ చలిస్తూ ఉండగా, జాముప్రొద్దు ఎక్కింది.

501.

| | | |
|---|---|---|
| తలంచి | = | ఆలోచించి |

502. సమగ్రవ్యాఖ్యను చూడండి

503.

| | | |
|---|---|---|
| తూర వగచి | = | మిక్కిలి బాధపడి |
| ఆరయ పనిచెన్ | = | కొంగను వెతుకుటకు పంపాడు |
| పలువుర | = | అనేకులను |
| బకము | = | కొంగ |
| డొక్క | = | ఎముకుల గూడు |
| ఏర్పడ | = | స్పష్టంగా |
| కని | = | చూచి |
| పుచ్చిరి | = | పంపారు |

**తాత్పర్యం :**

అని ఎక్కువగా బాధపడి నాడీజంఘుని చూచి రమ్మని అనేక మంది భటులను పంపగా, వారును కొంగ డొక్కను స్పష్టంగా చూసి ఆ విషయాన్ని అతనికి వేగంగా చెప్పి పంపారు.

504.

చొప్పువట్టి = జాడ తెలుసుకొని

505. సమగ్రవ్యాఖ్యను చూడండి.

506.

అతండు = అతడు

507.

| | | |
|---|---|---|
| తినుడు | = | తినండి |
| తినకుడు | = | తినకుండా ఉండండి |
| ఒండు ఏమైనా | = | ఇంకా ఏమైనా |
| నా ముందటికి | = | నా ముందుకు |
| కొని వచ్చితిరి | = | తీసుకువచ్చారు |
| దనుజులు | = | రాక్షసులు |
| పురి వెడలన్ | = | నగరం బయటకు |
| తద్గాత్రంబున్ | = | అతడి శరీరాన్ని |

**తాత్పర్యం :**

తినండి లేకపోతే తినకుండా ఉండండి. ఇంకా ఏమైనా చేయండి. అతడిని నా ముందుకు ఎందుకు తెచ్చారు? అని విరూపాక్షులు పలుకగా, రాక్షసులు వాడి శరీరాన్ని నగరం బయటకు తెచ్చి

508.

| | | |
|---|---|---|
| కౌరవముఖ్యా | : | ఓ ధర్మరాజా ! |
| వెడకోతల | = | చిన్న చిన్న ముక్కలుగా కోసిన గాయాల నుండి |
| నెత్తురు ఒలక | = | రక్తం కారగా |
| పడద్రోచిన | = | పారవేయగా |
| పదుపు | = | మంద |
| కబళింపన్ | = | తినటానికి |
| ఒల్లక | = | ఇష్టపడక |
| నకనక బడంగ | = | ఆకలితో నకనకలాడగా |

**తాత్పర్యం :**

ఓ ధర్మరాజా ! చిన్నచిన్న ముక్కలుగా చేసిన గాయాల నుండి రక్తం కారుచుండగా పారవేయగా కుక్కలమంద ఆకలితో కడుపులు నకనకలాడుతున్న ఆ మాంసాన్ని తినటానికి ఇష్టపడక భయపడ్డాయి.

509.

| | | |
|---|---|---|
| అది అట్టిద | = | అది అలాంటిదే |
| రోయు | = | అసహ్యించుకుంటాయి |
| కృతఘ్ను దేహం | = | కృతఘ్నుడి శరీరాన్ని |
| ఆగమంబులు | = | వేదాలు |
| మనుజేశ్వర | = | ఓ రాజా |
| తెల్లమయ్యె | = | స్పష్టమైంది |

**తాత్పర్యం :**

ఓ రాజా ! అది అలాంటిదే మన వేదాలు "కుక్కలు కూడా కృతఘ్నుడి శరీరమాంసాన్ని తినటానికి అసహ్యించు కుంటాయి" అని చెప్పిన మాటలు ఇక్కడ ఋజువయ్యాయి.

511. వెండియు = ఇంకా

512.

| | | |
|---|---|---|
| పురపురన్ పొక్కించు | = | ఎంతో బాధపడుచూ |
| బకపతి | = | కొంగల రాజైన నాడీజంఘుని |
| కరం కము | = | డొక్క |
| తేర పనిచి | = | తీసుకురావటానికి ఆజ్ఞాపించి |
| గారవమున | = | ఎంతో గౌరవంతో |
| నెయ్యురును | = | స్నేహితులు |
| తాను | = | తను |
| అగ్నియిచ్చి | = | తలకొరివి పెట్టి |
| అసురపతి | = | రాక్షసరాజు |
| సురపతి | = | దేవతల రాజు దేవేంద్రుడు |
| నెమ్మిన్ | = | ప్రేమతో |

**తాత్పర్యం :**

ఎంతో బాధపడుచూ విరూపాక్షుడు నాడీజంఘుని డొక్కను తేవటానికి పంపి, ఎంతో గౌరవంతో తానూ తన స్నేహితులు తలకొరివి పెట్టి ఉండగా ఎంతో ప్రేమతో దేవేంద్రుడు వచ్చాడు.

513.

| | | |
|---|---|---|
| సంభ్రమంబు | = | ఆశ్చర్యం |
| వినయంబు | = | వినయం |
| పెరయ | = | కలయగా |
| గౌరవించి | = | గౌరవించి |
| దైన్యం | = | దీనత్వం |
| తోప | = | కన్పించగా |
| వగచి | = | దుఃఖించి |
| అశ్రులు తొరగన్ | = | కన్నీరు జారగా |
| రాజధర్మన్ + ఈవే | = | రాజధర్మని బ్రతికించు |

**తాత్పర్యం :**

ఇంద్రుడిని చూచి ఆశ్చర్యంతో వినయంతో గౌరవించి అతడిని దీనంగా బాధపడుతూ కన్నీరు కారుస్తూ రాజధర్ముడిని ఇవ్వు అని అడిగాడు.

514.

| | | |
|---|---|---|
| అమర విభుండు | = | దేవేంద్రుడు |
| సఖుండు | = | స్నేహితుడు |
| చతుర్ముఖునకు | = | బ్రహ్మదేవుడికి |

| | | |
|---|---|---|
| ఎఱుంగవే | = | తెలియదా ? |
| వగవనేల | = | విచారించటం ఎందుకు |
| అవ్వారి జాసనుండు | = | ఆ బ్రహ్మదేవుడు |
| తనపాలికి | = | తన దగ్గరకు |
| అనుదినంబు | = | ప్రతిరోజు |
| కోరుచుండు | = | కోరుకుంటాడు. |

**తాత్పర్యం :**

అని అడుగగా దేవేంద్రుడు "నీ స్నేహితుడు బ్రహ్మదేవుడికి స్నేహితుడని నీకు తెలియదా ? దానికి బాధపడటం ఎందుకు ? ఆ బ్రహ్మ ప్రతిరోజు తన దగ్గరికి నాడీజంఘుడు రావటాన్ని కోరుకుంటుంటాడు కనుక

**515.**

| | | |
|---|---|---|
| పలుమాఱును | = | అనేకసార్లు |
| రామికి | = | రాకపోవటానికి |
| ఉత్తల పడియెను | = | దుఃఖపడ్డాడు |
| ఇట్టిదశన్ అతడు ఒందెన్ | = | ఇలాంటి దశను పొందాడు |
| చెలియగుటన్ | = | స్నేహితుడవ్వటం వలన |
| అఘువిధిన్ | = | గొప్ప పద్ధతిలో |
| వహ్ని | = | అగ్ని |

**తాత్పర్యం :**

అనేకసార్లు అతడు రానిదానికి బయపడ్డాడు. నాడీజంఘుడు ఇలాంటి ఉన్నతస్థితి పొందాడు. స్నేహితుడవ్వటం వలన అతని డొక్కకు అగ్నిసంస్కారం చేశావు, అది మంచిది కదా.

**516.**

| | | |
|---|---|---|
| అనంతరంబు | = | తర్వాత |
| తత్ + చితా సమీపంబు | = | ఆ చితి దగ్గరలో |

**తాత్పర్యం :**

నువ్వు అలా అగ్నిసంస్కారం చేసి వచ్చిన తర్వాత ఆ చితి సమయంలో

**517.**

| | | |
|---|---|---|
| అనఘా | = | పాపరహితుడా ! |
| కడున్ అర్మిని | = | మిక్కిలి ప్రేమతో |
| క్రేపును | = | దూడను |
| క్రూడుప దొడగె | = | పాలివ్వ సాగింది |
| సురభి | = | కామధేనువు |
| కుర్పాల్ | = | చిన్న చేప వలన |

| | | |
|---|---|---|
| పెరయన్‌పడు | = | చింది పడగా |
| వత్స | = | దూడ |
| వక్త్రఫేనము | = | నోటి నురగ తుంపర |
| తూలిపడియె | = | చెదిరి పడింది |
| సాదపై | ః | చితిపై |

**తాత్పర్యం :**

ఎంతో ప్రేమతో ఒక ఆవు తన దూడకు పాలిస్తుండగా సుడిగాలికి ఆ దూడ నోటి నురుగు తుంపర చితిపై పడింది.

**518.**

| | | |
|---|---|---|
| దానం చేసి | = | దాని కారణంగా |
| సంజీవితుండయి | = | తిరిగి పునర్జీవితుడై |
| అరుగుదెంచుచున్నాడు | = | వస్తున్నాడు |
| దేవదేవుని | = | బ్రహ్మదేవుని |
| చిత్తంబు మహానుభావంబు | = | మనసులోని సంకల్పం |

**తాత్పర్యం :**

దాని కారణంగా నాడీజంఘుడు తిరిగి జీవించాడు. ఎప్పటిలాగే తనదైన రూపంతో వస్తున్నాడు. ఇలా జరగటానికి ఆ బ్రహ్మదేవుని మనస్సులోని సంకల్పమే కారణం.

**519.**

| | | |
|---|---|---|
| బకపతి | = | కొంగలరాజైన నాడీజంఘుడు |
| అరుదెంచెను | = | వచ్చాడు |
| దనుజపతికి | = | రాక్షసరాజైన విరూపాక్షుడికి |
| సమ్మదం ఎసగన్ | = | ఆనందం కలుగగా |
| వాసవుడు | = | ఇంద్రుడు |
| అజవాక్యము | = | బ్రహ్మమాటచే |
| పాశనిబద్ధుడిని | = | పాశాలతో బంధించి |
| ఆ విప్రుని | = | ఆ బ్రాహ్మణుడిని |

**తాత్పర్యం :**

అని చెప్పాడు. అంతలో నాడీజంఘుడు రాక్షసరాజుకు ఎంతో ఆనందం కలిగేవిధంగా ఆక్కడకు వచ్చాడు. నాడీజంఘుడు రాకముందే బ్రహ్మమాటపై ఆ బ్రాహ్మణుడిని పాశాలతో ఇంద్రుడు బంధించాడు.

**520.**

| | | |
|---|---|---|
| దానిని ఎఱింగి | = | దాని గురించి తెలుసుకొని |
| భూసురునకు | = | బ్రాహ్మణుడికి |
| తన కతమున | = | తన కారణంగా |

| | | |
|---|---|---|
| దీనదశ | = | హీనస్థితి |
| ఓర్వక | = | సహించలేక |
| విడుపు | = | విముక్తి |
| వేడె | = | ప్రార్థించాడు. |

**తాత్పర్యం :**

ఆ నాడీజంఘుడు ఆ సంగతి తెలిసి తన కారణంగా బ్రాహ్మణుడికి ఈ దుస్థితి కలిగిందని బాధపడి దానికి ఓర్వలేక ఇంద్రుడిని వరంగా ఆ బ్రాహ్మణుడిని విడువమని కోరాడు.

521. సమగ్రవ్యాఖ్యను చూడండి.

522.

| | | |
|---|---|---|
| ధనసంచయంబు | = | ధనపు మూటను |
| సంభ్రమంబు | = | ఆశ్చర్యం |
| తనదతరంబు | = | ఆ తర్వాత |

**తాత్పర్యం :**

ఆ బ్రాహ్మణుడు ధనపు మూటను మోసుకుంటూ తిరిగితిరిగి చూస్తూ ఆశ్చర్యపోతూ వెళ్ళిపోయాడు. ఆ తర్వాత

523.

| | | |
|---|---|---|
| త్రివిష్టపమునకు | = | దేవలోకానికి |
| అరిగెన్ | = | వెళ్ళాడు |
| బకాధీశుడు | = | నాడీజంఘుడు |
| నిజాలయమునకు | = | తన నివాసానికి |
| గరిమంబు మెరయ | = | గొప్పతనం ఒప్పే విధంగా |
| చనియె | = | వెళ్ళాడు |
| పరితుష్టుండు | = | సంతృప్తి చెందినవాడై |
| దైత్యపాలుడు | = | రాక్షసరాజు |
| అనుపన్ | = | సాగనంపగా |

**తాత్పర్యం :**

దేవేంద్రుడు స్వర్గానికి వెళ్ళాడు. రాక్షసరాజు ఎంతో సంతోషంగా సాగనంపగా కొంగలరాజైన నాడీజంఘుడు తన నివాసానికి గొప్పతనం మెరిసే విధంగా వెళ్ళాడు.

524.

| | | |
|---|---|---|
| విమలచరిత్రా | = | పవిత్రమైన ప్రవర్తన కలవాడా ! |
| తాత | = | భీష్ముడు |
| మనుమడు | = | ధర్మరాజు |
| ఆదరమున | = | ప్రేమతో |

| | | |
|---|---|---|
| బ్రహ్మఘ్నునకును | = | బ్రాహ్మణుడిని చంపినవానికి |
| నిష్కృతి | = | విముక్తి |
| కృతఘ్నునకు | = | చేసిన మేలు మరిచే కృతఘ్నునకు |

**తాత్పర్యం :**

పవిత్రమైన ప్రవర్తన గల ఓ ధర్మరాజా ! బ్రాహ్మణ హత్య చేసినవాడికి పాపవిముక్తి ఉందేమో కానీ చేసిన మేలు మరిచే కృతఘ్నునకు విముక్తిలేదు అని భీష్ముడు ఎంతో ఆదరంగా ధర్మరాజుతో చెప్పాడు.

525.

| | | |
|---|---|---|
| అరయన్ | = | చూడగా |
| మిత్రద్రోహము | = | స్నేహితుడికి హాని చేయటం |
| దారుణమగు పాతకము | = | భయంకరమైన పాపం |
| ఈ రెండు తెఱుగులవారిని | = | ఈ రెండు రకాలైన మిత్రద్రోహులను, కృతఘ్నులను |
| వైరముగాని | = | శతృత్వం పూని |
| విడువవలయు | = | విడిచిపెట్టాలి |

**తాత్పర్యం :**

ఆలోచిస్తే మిత్రద్రోహం కృతఘ్నత కంటే భయంకర పాపం. మిత్రద్రోహులను, కృతఘ్నులను శతృత్వం పూని విడిచిపెట్టాలి.

526.

| | | |
|---|---|---|
| ఐహికములు | = | ఇహలోకానికి సంబంధించినవి |
| ఆముత్రికములు | = | పరలోకానికి సంబంధించినవి |
| భద్రములు | = | శుభాలను |
| తలకొలపున్ | = | కలిగిస్తాయి |
| ఎక్కుడు | = | ఎక్కువ |
| ప్రాజ్ఞుల్ | = | పెద్దలు |

**తాత్పర్యం :**

స్నేహితుడు ఇహలోకానికి, పరలోకానికి సంబంధించిన శుభాలనిస్తాడు. మిత్రుడు, ధనాలలో స్నేహితుడే అధికుడని పెద్దలు మెచ్చుకుంటారు.

527.

| | | |
|---|---|---|
| ఉత్తమ కులజుడు | = | మంచి కులంలో జన్మించినవాడు |
| సుగుణాయత్తుడు | = | మంచి గుణాలు కలిగినవాడు |
| సస్నేహమతియు | = | మంచి స్నేహబుద్ధి కలిగినవాడు |
| చిత్త మెలర్చు | = | మనస్సు అలరిస్తుంది. |

**తాత్పర్యం :**

శుభాలు కోరుకునేవారు మంచి కులంలో జన్మించినవాడు, మంచి గుణాలు కలిగినవాడు, స్నేహబుద్ధి కలిగినవాడు అయిన స్నేహితుడితో మనసు అలరించే విధంగా మెలగాలి.

528.

| | | |
|---|---|---|
| అధిక పాతకంబు | = | భయంకర పాపాలు |
| సన్మిత్రుడు | = | మంచి స్నేహితుడు |
| భీమాగ్రజుడు | = | ధర్మరాజు |
| ఉత్తమ పురుషులు | = | గొప్ప వ్యక్తులు |
| అడుగుటలు | = | ప్రశ్నలు |
| ఉత్తరం చిచ్చుటం | = | సమాధానాలు ఇవ్వటం |
| లెస్సలై | = | గొప్పవై |

**తాత్పర్యం :**

చేసిన మేలు మరవటం, మిత్రుడికి హాని చేయటం అనేవి భయంకర పాపాలని, మంచి స్నేహితుడిని సంపాదించుకోవటం మేలు చేయటం గురించి భీష్ముడు చెప్పాడు. లోకంలో గొప్పవ్యక్తులు అడిగిన ప్రశ్నలు, సమాధానాలు ఇవ్వటం గొప్పవై లోకంలో ఎలా చెల్లుబాటు అవుతున్నాయో చెప్పమని ధర్మరాజు భీష్ముడుని అడిగాడు.

**డా॥ డి. ధాత్రికుమారి**
సహాయాచార్యులు
వై.ఎ. ప్రభుత్వ మహిళా కళాశాల,
చీరాల, ప్రకాశం జిల్లా

పాఠం - 5

# నాడీజంఘోపాఖ్యానం

- తిక్కన

**(మహాభారతం - శాంతి పర్వం - తృతీయాశ్వాసం - 472 నుండి 528 పద్యాల వరకు)**

**విషయసూచిక :**

**5.1** సమగ్ర వ్యాఖ్యలు

**5.1 ఉద్దేశ్యం :**

విద్యార్థులకు సమగ్ర వ్యాఖ్యలను వివరించటం ఈ పాఠ్యభాగ ఉద్దేశ్యం

**సమగ్ర వ్యాఖ్యలు :**

472

వినుమొక బ్రాహ్మణుడు కులవృత్తము పెంపుఁదొఱంగి బోయదా
నినొకత నాలిఁజేసికొని నెమ్మిఁగిరాతులఁగూడి వేఁటకుం
జనుఁ దినుమాంస మద్దురితసక్తుఁడు భోగపరుండు గావునన్
ధనము ఘటింపఁగా ఁదగు విధంబని చూచి వణిగ్జనంబుతోన్

**పరిచయం :**

తిక్కనచే రచింపబడిన మహాభారతం శాంతిపర్వం తృతీయాశ్వాసంలోని “నాడీ జంఘోపాఖ్యానం” అనే పాఠ్యభాగం నుండి గ్రహింపబడిందీ పద్యం.

**సందర్భం :**

భీష్ముడు ధర్మరాజుకు రాజనీతిధర్మాలు బోధించే విషయంలో క్రూరుడు. అత్యాశకలవాడు, మూర్ఖుడు, చాడీలు చెప్పేవాడు. తెలివితక్కువవాడు, అబద్ధాలు చెప్పేవాడు, పిరికివాడు, కృతఘ్నుడు, చెడు స్వభావంగల నీచుడు రాజు ఆశ్రయంలో వుంటే ప్రమాదం. వీరిలోకల్లా చేసినమేలు మరిచే కృతఘ్నుడు ప్రమాదకరమైనవాడు. దానికి సంబంధించి నాడీజంఘుడి వృత్తాంతాన్ని చెబుతాను విను అని భీష్ముడు పలికే సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| వినుము | = | విను |
| ఒక బ్రాహ్మణుడు | = | ఒక బ్రాహ్మణుడు |
| కులవృత్తము | = | కులానికి తగిన ప్రవర్తన |
| పెంపున్ + తొఱంగి | = | గౌరవాన్ని వదలి |
| బోయదానిన్ ఒకతన్ | = | ఒక బోయ స్త్రీని |
| ఆలిన్ + చేసుకొని | = | భార్యగా చేసుకొని |
| నెమ్మిన్ | = | సంతోషంతో |
| కిరాతులన్ | = | బోయవారితో |

| | | |
|---|---|---|
| కూడి | = | కలిసి |
| వేటకున్ + చనున్ | = | వేటాడుటకు వెళ్ళేవాడు |
| మాంసమున్ | = | మాంసాన్ని |
| తినున్ | = | తినేవాడు |
| ఆ + దురితసక్తుడు | = | ఆ పాపాత్ముడు |
| భోగపరుండు | = | సుఖాలపట్ల ఆసక్తి కలవాడు |
| కావునన్ | = | కనుక |
| ధనము | = | ధనాన్ని |
| ఘటింపఁగా | = | సంపాదించగా |
| తగువిధంబు | = | తగిన పద్ధతి |
| అని చూచి | = | అని అనుకొని |
| వణిక్ + జనంబుతోన్ | = | వర్తకుల సమూహంలో |

**తాత్పర్యం :**

విను. ఒక బ్రాహ్మణుడు తన కులానికి తగిన ప్రవర్తనను, గౌరవాన్ని విడిచిపెట్టి ఒక బోయదానిని భార్యగా చేసుకొని ఇష్టంతో బోయవాళ్ళతో కలిసి వేటకు వెళ్ళాడు. మాంసాన్ని తినేవాడు. పాపాలపట్ల ఆసక్తికలవాడు, భోగాలు అనుభవించాలనే ఆశ కలవాడు కనుక ధనం సంపాదించటం కోసం తగిన విధానమని ఆలోచించి వర్తక సమూహంతో.

**వ్యాకరణ విశేషాలు :**

**సంధులు :**

| | | | | |
|---|---|---|---|---|
| పెంపుదొఱంగి | = | పెంపు + తొఱంగి | - | సరళాదేశ సంధి |
| వణిగ్జనంబుతోన్ | = | వణిక్ + జనంబుతోన్ | - | జశ్త్వ సంధి |
| తగు విధంబని | = | తగువిధంబు + అని | - | ఉత్వ సంధి |

**సమాసాలు :**

| | | | | |
|---|---|---|---|---|
| కులవృత్తము | - | కులము యొక్క వృత్తము | - | షష్ఠీతత్పురుష సమాసం |
| దురితసక్తుండు | - | దురితముల యందు ఆసక్తుడు | - | సప్తమీ తత్పురుష సమాసం |

**ఛందస్సు :**

| న | జ | భ | జ | జ | జ | ర |
|---|---|---|---|---|---|---|
| III | IUI | UII | IU I | IU I | IU I | UIU |
| వినమొ | క బ్రాహ్మ | ణుండు కు | ల వృత్త | ము | పెంపు | దొఱంగి బోయదా |

దీనిలో న - జ - భ - జ - జ - జ ర అనే గణాలున్నాయి. వి, వృ 1 - 11 అనే అక్షరాలకు యతి చెల్లింది. ఈ నియమం చంపకమాల చెందింది. కాబట్టి ఇది చంపకమాల పద్యం.

495.

కుడిచిన పళ్లెరంబును నకుంఠిత హర్షముతోడ నిచ్చినం
గడుముదమంది యెత్తికొని గాఢభరంబున మార్చి మోపఁగా
మెడమును వీఁపు మూఁపులును మిక్కిలి నొవ్వనఁగొంకు బోవనె
క్కుడు వెస నేఁగుదెంచెఁగని కొక్కెర సమ్మదమంద మఱ్ఱికిన్.

**పరిచయం :**

ఈ పద్యం తిక్కన రచించిన మహాభారతం శాంతిపర్వం తృతీయాశ్వాసం నుండి గ్రహింపబడిన "నాడీ జంఘోపాఖ్యానం" అనే పాఠ్యభాగంలోనిది.

**సందర్భం :**

బ్రాహ్మణుని దారిద్ర్యాన్ని పోగొట్టాలనే ఉద్దేశ్యంతో నాడీజంఘుడు తన స్నేహితుడైన విరూపాక్షుడి దగ్గరకు అతడిని పంపగా విరూపాక్షుడు బ్రాహ్మణుడిని సత్కరించి మోయలేనంత బంగారాన్ని, రత్నాలను కానుకలుగా అతడికి ఇచ్చే సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| కుడిచిన | = | తినిన |
| పళ్లెరంబునున్ | = | బంగారు పళ్ళాన్ని |
| అకుంఠిత | = | మొక్కలోని |
| హర్షముతోడన్ | = | సంతోషంతో |
| ఇచ్చినన్ | = | ఇవ్వగా |
| కడుముదమున్ + అంది | = | ఎక్కువ సంతోషాన్ని పొంది |
| ఎత్తుకొని | = | పైకి ఎత్తుకొని |
| గాఢ భరంబునన్ | = | అధికమైన బరువుతో |
| మార్చి | = | మార్చుకుంటూ |
| మోనఁగాన్ | = | మోయగా |
| మెడయున్ | = | మెడ |
| వీఁపు | = | వీపు |
| మూఁపులును | = | భుజాలు |
| మిక్కిలి | = | ఎక్కువగా |
| నొవ్వనన్ | = | నొప్పివలన |
| కొంకు పోవన్ | = | కృంగిపోగా |
| ఎక్కుడు | = | ఎక్కువ |
| వెసన్ | = | వేగంగా |
| మఱ్ఱికిన్ | = | మఱ్ఱి చెట్టు దగ్గరకు |
| ఏగుదెంచెన్ | = | వచ్చాడు |

| | | |
|---|---|---|
| కని | = | చూచి |
| కొక్కెర | = | కొంగ |
| సమ్మదము + అందన్ | = | సంతోషాన్ని పొందగా |

**తాత్పర్యం :**

విరూపాక్షుడు ఆ బ్రాహ్మణుడికి తిన్న బంగారుపళ్ళాన్ని కూడా ఎంతో సంతోషంతో ఇవ్వగా అతడు ఎంతో సంతోషించి తీసుకున్నాడు. కానుకలు అధికమైన భారంతో ఉండటంచేత మార్చుకుంటూ మోయగా అతడి మెడ, వీపు, భుజాలు అధికంగా నొప్పిపుట్టాయి. ఆ నొప్పికి అతడు వంగిపోయాడు. ఎక్కువ వేగంగా నాడీజంఘుడు ఉన్న మర్రిచెట్టు దగ్గరకు రాగా అతడిని చూచి కొంగ ఎంతో సంతోషాన్ని పొందింది.

**వ్యాకరణాంశాలు :**

**సమాసం :**

అకుంఠిత హర్షము - అకుంఠితమైన హర్షము - విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం

**ఛందస్సు :**

| న | జ | భ | జ | జ | జ | ర |
|---|---|---|---|---|---|---|
| III | IUI | UII | IU I | IU I | IU I | UIU |
| కుడిచి | న పళ్ళె | రంబును | నకుంఠి | త హర్ష | ముతోడ | నిచ్చినం |

దీనిలో న - జ - భ - జ - జ - జ - ర అనే గణాలున్నాయి. కు, కుం అనే 1 - 11 అక్షరాలకు యతి చెల్లింది. ఈ నియమం చంపకమాలకు చెందింది. కాబట్టి ఇది చంపకమాల పద్యం.

502.

**నిచ్చలు వచ్చు రేపడక నెయ్యమెలర్పఁగ మత్సఖుండునే,**
**డిచ్చల కేలరాఁడు? గుణహీనత విప్రునియందుఁ గల్మినా**
**యిచ్చఁదలంచితిం దులువయేమి దలంచెనొయక్కటా మదిం**
**బొచ్చెములేదునమ్మి బకపుంగవుడెట్లగు నొక్కొ దైవమా.**

**పరిచయం :**

ఈ పద్యం తిక్కన రచించిన మహాభారతం శాంతిపర్వం తృతీయాశ్వాసం నుండి గ్రహింపబడిన "నాడీ జంఘోపాఖ్యానం" అనే పాఠ్యభాగంలోనిదీ.

**సందర్భం :**

ఎంతసేపటికి తన దగ్గరకు తన ఆప్తమిత్రుడు నాడీజంఘుడు రాని కారణంగా రాక్షసరాజైన విరూపాక్షుడు బాధపడుతూ దుష్ట బ్రాహ్మణుడైన గౌతముడి గురించి ఆలోచించే సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| నెయ్యము | = | స్నేహం |
| ఎలర్పగాన్ | = | పెంపొందగా |

| | | |
|---|---|---|
| మత్ + సఖుండు | = | నా స్నేహితుడు |
| రేపకడన్ | = | ఉదయాన్నే |
| నిచ్చలు | = | ప్రతినిత్యం |
| వచ్చున్ | = | వచ్చెడివాడు |
| నేడు | = | ఈరోజు |
| ఇచ్చటికిన్ | = | ఇక్కడికి |
| ఏలరాడు | = | ఎందుకు రాలేదో |
| విప్రుని + అందు | = | బ్రాహ్మణుడిలో |
| గుణహీనత | = | చెడుగుణం, నీచ స్వభావం |
| కల్మిన్ | = | ఎక్కువగా వుంది |
| నా + ఇచ్చన్ | = | నా మదిలో |
| తలంచితిన్ | = | ఆలోచిస్తున్నాను |
| తులువ | = | తుంటరివాడు |
| ఏమి తలెంచెనో | = | ఏ చెడు ఆలోచన చేశాడో |
| అక్కటా | = | అయ్యో |
| దైవమా | = | భగవంతుడా |
| బక పుంగవుడు | = | కొంగరాజైన నాడీజంఘుడు |
| మదిన్ | = | మనసులో |
| పొచ్చెము + లేదు | = | కల్మషం లేనివాడు |
| నమ్ము | = | నమ్ముము. |

**తాత్పర్యం :**

నా స్నేహితుడైన నాడీజంఘుడు ప్రతిరోజూ ఉదయాన్నే నా దగ్గరకు వచ్చేవాడు. ఈరోజు ఎందుకని రాలేదో. ఆ బ్రాహ్మణుడు నీచుడు. ఆ తుంటరి బ్రాహ్మణుడు ఏ కీడు చేశాడోనని నా మనసులో ఆలోచిస్తున్నాను. అయ్యో ! దేవుడా ! నాడీజంఘుడు కల్మషం లేనివాడు, అందరినీ నమ్ముతాడు. ఏ ఆపదలో చిక్కుకున్నాడో.

వ్యాకరణాంశాలు :

**సంధులు :**

మదింబొచ్చెములేదు = మదిన్ + పొచ్చెములేదు - సరళాదేశసంధి

**ఛందస్సు :**

| భ | ర | న | భ | భ | ర | వ |
|---|---|---|---|---|---|---|
| U I I | U I U | I I I | U I I | U I I | U I U | IU |
| నిచ్చలు | వచ్చు రే | పకడ | నెయ్య మె | లర్పఁగ | మత్సఖుం | డు నే |

ఈ పద్యంలో భ - ర - న - భ - భ - ర - వ అనే గణాలున్నాయి. ని, నె అనే 1 - 10 అక్షరాలకు యతి చెల్లింది. ఈ నియమం ఉత్పలమాలకు చెందింది. కాబట్టి ఇది ఉత్పలమాల పద్యం.

505.

పరిమెయి బాఱి వానిఁగని పట్టి పడింబెడగేలు గట్టి తె
చ్చి రసురభర్తసూచి యిటు సేరఁగఁ దేవలదీ కృతఘ్నునిం
బొరిగొని వే తినుం డనినఁబోకడ మాలినవారమయ్య యి
ద్దురిత శరీరముం దినఁగ దోసము మా కని వార లొల్లమిన్.

**పరిచయం :**

ఈ పద్యం తిక్కన రచించిన మహాభారతం శాంతిపర్వం తృతీయాశ్వాసం నుండి గ్రహించిన "నాడీ జంఘోపాఖ్యానం" అనే పాఠ్యభాగంలోనిది.

**సందర్భం :**

నాడీజంఘుడిని వధించిన నీచబ్రాహ్మణుడైన గౌతముడిని బంధించి రాక్షసరాజు విరూపాక్షుని దగ్గరికి రాక్షసభటులు తీసుకువచ్చిన సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| పరిమెయిన్ | = | మిక్కిలి వేగంగా |
| పాఱి | = | పరుగెత్తి |
| వానిన్ | = | ఆ బ్రాహ్మణుడిని |
| కనిపెట్టి | = | వెదికి పట్టుకొని |
| పెడకేలుగట్టి | = | చేతులు వెనక్కి విరిచికట్టి |
| తెచ్చిరి | = | తీసుకువచ్చారు |
| అసురభర్త | = | రాక్షసరాజైన విరూపాక్షుడు |
| చూచి | = | చూసి |
| ఈ కృతఘ్నునిన్ | = | ఈ చేసిన మేలు మరిచేవాడిని |
| ఇట్లు + చేరగన్ | = | ఈవిధంగా నా సమీపానికి |
| తేవలదు | = | తీసుకురావద్దు |
| పొరిగొని | = | వధించి |
| వే తినుండు | = | వెంటనే తినండి |
| అనినన్ | = | అనగా |
| ఈ దురిత శరీరమున్ | = | ఈ పాపిష్ఠి శరీరాన్ని |
| తినగన్ | = | తినటానికి |
| పోకడ మాలినవారము | = | మేము నీతిమాలిన వాళ్ళముకాదు |
| అయ్యా | = | ఓ రాజా |
| దోసము | = | పాపము |
| అని వారలు | = | అని ఆ సేవకులు |
| ఒల్లమిన్ | = | అంగీకరించలేదు |

**తాత్పర్యం :**

విరూపాక్షుని భటులు వేగంగా పరుగెత్తికెళ్ళి దుష్ట బ్రాహ్మణుడిని వెదికి పట్టుకొని పెడరెక్కలు విరిచి కట్టి రాజు ముందుకు తీసుకురాగా విరూపాక్షుడు ఆ ద్రోహిని ఇలా సమీపానికి తీసుకురావద్దు. వెంటనే వాడిని చంపి తినండి అని చెప్పాడు. ఆ మాటలు విన్న సేవకులు ఈ పాపిష్ఠి శరీరాన్ని తినేందుకు మేమంత నీతిలేనివాళ్ళం కాదు వీడిని తింటే మాకు పాపం అంటుకుంటుందని ఇష్టపడలేదు.

**వ్యాకరణాంశాలు :**

**సంధులు :**

ఇద్దురిత శరీరము = ఈ + దురిత శరీరము - త్రికసంధి

**సమాసాలు :**

దురిత శరీరము - పాపాత్ముని యొక్క శరీరము - షష్ఠీ తత్పురుష సమాసము

**ఛందస్సు :**

| న | జ | భ | జ | జ | జ | ర |
|---|---|---|---|---|---|---|
| III | IUI | UII | IUI | IUI | IUI | UIU |
| పరియె | యి బాఁటి | వాని గ | ని పట్టి | వడిం బె | డ గేలు | గట్టితె చ్చి |

దీనిలో న - జ - భ - జ - జ - జ - ర అనే గణాలున్నాయి. ప, ప అనే 1, 11 అక్షరాలకు యతి చెల్లింది. ఇది చంపకమాల పద్యం.

521.

అతడు(ను దివ్యభోదమున నాసమయంబున బ్రహ్మ సత్కృపా
న్వితు(డగు టేర్పడంగని వినీతతముండుగురాజధర్మువాం
ఛిత మొనరించె విప్రు(నకుజేర్చిరి తెచ్చినవారు తద్ధన
వ్రతతియు దైత్యనాయకు(డు పంప బకాధిపు(బ్రస్తుతించుచున్.

**పరిచయం :**

ఈ పద్యం తిక్కన రచించిన మహాభారతం శాంతిపర్వం తృతీయాశ్వాసం నుండి గ్రహింపబడిన "నాడీజంఘోపాఖ్యానం" అనే పాఠ్యభాగంలోనిది.

**సందర్భం :**

బ్రహ్మ అనుగ్రహముతో తిరిగి బ్రతికిన నాడీజంఘుడు తన కారణంగా బ్రాహ్మణుడు మరణించాడని బాధపడుతూ అతడిని తిరిగి బ్రతికించమని ఇంద్రుడిని కోరగా అతడిని తిరిగి బ్రతికించిన సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| అతడును | = | ఆ ఇంద్రుడు |
| ఆ సమయంబునన్ | = | ఆ సమయంలో |

| | | |
|---|---|---|
| బ్రహ్మ | = | బ్రహ్మదేవుడు |
| సత్కృప + అన్వితుడు + అగుట | = | మంచి కరుణ కలిగిన వాడైనందున |
| దివ్యబోధమునన్ | = | అతీంద్రియ జ్ఞానంచేత |
| ఏర్పడన్ + కని | = | స్పష్టంగా తెలిసికొని |
| వినీతతముండు + అగు | = | అధిక వినయవంతుడైన |
| రాజధర్మ | = | కొంగరాజైన నాడీజంఘుని |
| వాంఛితమున్ | = | కోరికను |
| ఒనరించెన్ | = | తీర్చెను |
| దైత్యనాయకుడు | = | రాక్షసరాజైన విరూపాక్షుడు |
| పంపన్ | = | పంపగా |
| తత్ ధన ప్రతతియున్ | = | ఆ ధనం మొత్తాన్ని |
| తెచ్చినవారు | = | తీసుకొని వచ్చిన రాక్షసులు |
| విప్రునకు | = | ఆ బ్రాహ్మణునికి |
| చేర్చిరి | = | తిరిగి ఇచ్చారు |
| బకాధిపున | = | నాడీజంఘుడిని |
| ప్రస్తుతించుచున్ | = | ప్రశంసించిరి. |

**తాత్పర్యం :**

ఇంద్రుడు నాడీజంఘుడు అడిగిన వరం ఇవ్వడానికి బ్రహ్మదేవుడి అనుగ్రహం వుందని దివ్యదృష్టితో తెలుసుకొని వెంటనే ఆ బ్రాహ్మణుడిని విడిచిపెట్టి కొంగలరాజు కోర్కె తీర్చాడు. రాక్షసరాజు ఆజ్ఞతో అతడి సేవకులు బ్రాహ్మణుడి ధనం మొత్తాన్ని తిరిగి అప్పగించారు. నాడీజంఘునుడిని ప్రశంసించారు.

**వ్యాకరణాంశాలు :**

**సంధులు :**

తద్ధన ప్రతతియు = తత్ + ధన ప్రతతియు - జస్త్వ సంధి

**ఛందస్సు :**

| న | జ | భ | జ | జ | జ | ర |
|---|---|---|---|---|---|---|
| III | IUI | UII | IUI | IUI | IUI | UIU |
| అతడు | ను దివ్య | బోధము | న నాస | మయంబు | న బ్రహ్మ | సత్కృపా |

దీనిలో న - జ - భ - జ - జ - జ ర అనే గణాలున్నాయి. 1, 11అక్షరాలకు యతి చెల్లుతుంది. ఇది చంపకమాల వృత్తము.

**డా॥ డి. ధాత్రికుమారి**
సహాయాచార్యులు
వై.ఎ. ప్రభుత్వ మహిళా కళాశాల,
చీరాల, ప్రకాశం జిల్లా

**పాఠం - 6**

# నాడీజంఘోపాఖ్యానం

**- తిక్కన**

**(మహాభారతం - శాంతి పర్వం - తృతీయాశ్వాసం - 472 నుండి 528 పద్యాల వరకు)**

**విషయసూచిక :**

**6.1** సందర్భసహిత వ్యాఖ్యలు

**6.1 ఉద్దేశ్యం :**

విద్యార్థులకు సందర్భసహిత వ్యాఖ్యలు వివరించటం ఈ పాఠ్యభాగ ఉద్దేశ్యం

**సమగ్ర వ్యాఖ్యలు :**

**సందర్భసహిత వ్యాఖ్యలు :**

1) నల్దిక్కులఁబఁబఱచిరెల్లవారుఁబటుదయమున

**కవి పరిచయం :**

ఈ వాక్యం తిక్కన రచించిన ఆంధ్ర మహాభారతం శాంతిపర్వం తృతీయాశ్వాసంలోని నాడీజంఘోపాఖ్యానం అనే పాఠ్యాంశం నుండి గ్రహించబడింది.

**సందర్భం :**

బ్రాహ్మణుడు కలసి ప్రయాణిస్తున్న వ్యాపారుల సమూహం పర్వతాలు అరణ్యాల వంటి ప్రవేశించటానికి వీలులేని ప్రదేశంలో ప్రయాణిస్తుండగా ఒక అడవిఏనుగు ఆ వర్తకుల గుంపుపై పడగా పారిపోవు సందర్భంలోనిదీ పద్యం.

**వివరణ :**

అడవి ఏనుగు వర్తకుల గుంపులోనికి ఉరికి ఉన్మాదంతో వారిని నేలపైవేసి కాళ్ళతో తొక్కగా చాలామంది మరణించగా మిగిలినవారందరూ భయంతో ఎంతో వేగంగా నాలుగుదిక్కులగు పారిపోయారు.

2) అతం డట్లుండ నచ్చటికి లలితగతిన్

**కవి పరిచయం :**

ఈ వాక్యం తిక్కన రచించిన ఆంధ్ర మహాభారతం శాంతిపర్వం తృతీయాశ్వాసంలోని నాడీజంఘోపాఖ్యానం అనే పాఠ్యాంశం నుండి గ్రహించబడింది.

**సందర్భం :**

వర్తకుల గుంపుపై అడవి ఏనుగు పడగా వారందరూ పారిపోవు సందర్భంలో బ్రాహ్మణుడు ఉత్తరదిక్కుగా పరుగెత్తి అక్కడ ఒకపెద్ద మర్రిచెట్టు నీడలో విశ్రమించాలనుకునే సంద్భంలోనిదీ వాక్యం.

**వివరణ :**

ఒకపెద్ద మఱ్ఱిచెట్టును చూచి తాను అక్కడ విశ్రమిద్దామనుకుని బ్రాహ్మణుడు ఆ చెట్టునీడను చేరాడు. అడవి పూతీగల సుగంధంతో కూడిన గాలి అతడి అలసటను, దాహాన్ని కొంత తీర్చగా అతడు ఆ చెట్టు నీడలో కూర్చున్నాడు. ఆ సమయములో అతడి దగ్గరికి ఎంతో మెల్లగా ఒక పెద్ద కొంగ వచ్చింది.

3) నాకు నీదువిధముల జెపుమా

**కవి పరిచయం :**

ఈ వాక్యం తిక్కన రచించిన ఆంధ్ర మహాభారతం శాంతిపర్వం తృతీయాశ్వాసంలోని నాడీజంఘోపాఖ్యానం అనే పాఠ్యాంశం నుండి గ్రహించబడింది.

**సందర్భం :**

నాడీజంఘుడు అనే కొంగ ఆ మఱ్ఱిచెట్టుపై నివసిస్తుంది. తన చెట్టునీడలో విశ్రాంతి తీసుకుంటున్న గౌతముడు అనే బ్రాహ్మణుడి దగ్గరకువచ్చి అతడి వివరాలన్నీ తెలుసుకోవాలనుకునే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :**

ఆ పెద్ద కొంగ బ్రాహ్మణుడి దగ్గరకువచ్చి అతడిని చూచి చూపులలోనే ప్రేమను వ్యక్తీకరిస్తూ ఆదరించి "ఎక్కడి నుండి ఏ పనికోసం ఎక్కడకు వెళుతున్నావు. నిను చూసి నేను సంతోషించాను. నాకు తగిన అతిథివయ్యావు. నీ వృత్తాంతం చెప్పు" అని అడిగింది.

4) నీ దారిద్ర్యమపనయింతుఁ జింతయపనయింపు

**కవి పరిచయం :**

ఈ వాక్యం తిక్కన రచించిన ఆంధ్ర మహాభారతం శాంతిపర్వం తృతీయాశ్వాసంలోని నాడీజంఘోపాఖ్యానం అనే పాఠ్యాంశం నుండి గ్రహించబడింది.

**సందర్భం :**

బ్రాహ్మణుడు తన వృత్తాంతం చెప్పిన తర్వాత విన్న నాడీజంఘుడు బ్రాహ్మణుడితో ఉపశమనంగా మాటలు చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :**

బ్రాహ్మణుడు "వ్యాపారస్థులతో కలసి ప్రయాణం చేసే సమయంలో అడవి ఏనుగు వర్తకుల గుంపులపైపడి వ్యాపారస్థులను చంపటం మొదలుపెట్టింది. మిగిలినవారు అన్ని దిక్కులకు పరుగెత్తగా నేను భయంతో పరుగెత్తినా అదృష్టంకొద్దీ నీ నివాసానికి వచ్చాను" అని చెప్పగా వినిన నాడీజంఘుడు మంచిది, నీ దారిద్ర్యాన్ని, నీ దుఃఖాన్ని పోగొడతాను అని చెప్పింది.

5) దేవగురుండు సెప్పె నన్నిటిలోనన్

**కవి పరిచయం :**

ఈ వాక్యం తిక్కన రచించిన ఆంధ్ర మహాభారతం శాంతిపర్వం తృతీయాశ్వాసంలోని నాడీజంఘోపాఖ్యానం అనే పాఠ్యాంశం నుండి స్వీకరించబడింది.

**సందర్భం :**

దరిద్ర్యాన్ని పోగొట్టేవి ఏంటో నాడీజంఘుడు బ్రాహ్మణుడికి చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :**

"విను, స్నేహితుడు, వెండి, బంగారం, బుద్ధి, మానవుడి దరిద్ర్యాన్ని పోగొట్టే కారణాలని దేవగురువైన బృహస్పతి చెప్పాడు" అని కొంగ బ్రాహ్మణుడితో చెప్పింది.

6) పాత్రముగాకుండదే యపారశ్రీకిన్

**కవి పరిచయం :**

ఈ వాక్యం తిక్కన రచించిన ఆంధ్ర మహాభారతం శాంతిపర్వం తృతీయాశ్వాసంలోని నాడీజంఘోపాఖ్యానం అనే పాఠ్యాంశం నుండి గ్రహించబడింది.

**సందర్భం :**

దరిద్ర్యాన్ని పోగొట్టేవేవో నాడీజంఘుడు బ్రాహ్మణుడికి చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :**

"స్నేహితుడు, వెండి, బంగారం, బుద్ధి మానవుడి దరిద్ర్యాన్ని పోగొట్టే కారణాలని దేవగురుడు చెప్పాడు. ఆ నాల్గింటిలోనూ స్నేహితుడు ఎక్కువ. నేను నీతో స్నేహం చేస్తున్నాను కనుక అదే అపారసందప నీకు లభించడానికి అర్హత కల్పిస్తుంది" అని నాడీజంఘుడు బ్రాహ్మణుడితో చెప్పాడు.

7) సంచితుఁగాజేసి యిచ్చునప్పుడు నీకున్

**కవి పరిచయం :**

ఈ వాక్యం తిక్కన రచించిన ఆంధ్ర మహాభారతం శాంతిపర్వం తృతీయాశ్వాసంలోని నాడీజంఘోపాఖ్యానం అనే పాఠ్యాంశం నుండి గ్రహించబడింది.

**సందర్భం :**

తన స్నేహితుడు బ్రాహ్మణుడి దరిద్ర్యాన్ని పోగొట్టగలడని నాడీజంఘుడు బ్రాహ్మణుడికి చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :**

స్నేహితుడు విరూపాక్షుడు. అతడిది మధువ్రజపురం అది ఇక్కడికి మూడు యోజనాల దూరంలో వుంది. ఆ పురానికి ఉన్న దారివెంట నువ్వు వెళ్ళి ఆ రాక్షసరాజును దర్శించు అని నాడీజంఘుడు బ్రాహ్మణుడికి చెప్పాడు.

8) యితనికిఁదృప్తియగునట్టు విత్తుధనంబుల్

**కవి పరిచయం :**

ఈ వాక్యం తిక్కన రచించిన ఆంధ్ర మహాభారతం శాంతిపర్వం తృతీయాశ్వాసంలోని నాడీజంఘోపాఖ్యానం అనే పాఠ్యాంశం నుండి గ్రహించబడింది.

**సందర్భం :**

బ్రాహ్మణుడి వృత్తాంతం విన్న విరూపాక్షుడు అతడిని నాడీజంఘుడు పంపాడు గనుక అతనికి కావలసినంత ధనం ఇస్తాననుకునే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :**

బ్రాహ్మణుడు ఎలాంటివాడైతేనేమి ? నాడీజంఘుడికి ఇతడు స్నేహితుడు. గొప్పదైన స్నేహం ఇతడికి అర్హత కలిగిస్తుంది కదా. ఇతనిని సంతృప్తిపరిచే విధంగా ధనాన్ని ఇస్తాను'' అని రాక్షసరాజైన విరూపాక్షుడు అనుకున్నాడు.

9) దుర్వహభారము గా(గ గనకరాశియు మణులున్.

**కవి పరిచయం :**

ఈ వాక్యం తిక్కన రచించిన ఆంధ్ర మహాభారతం శాంతిపర్వం తృతీయాశ్వాసంలోని నాడీజంఘోపాఖ్యానం అనే పాఠ్యాంశం నుండి గ్రహించబడింది.

**సందర్భం :**

బ్రాహ్మణుడికి రాక్షసరాజు దానం చేసిన సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :**

కార్తీక పౌర్ణమిన బ్రాహ్మణులకు యథావిధిగా తాను చేసే దానధర్మాలు ఆచరిస్తూ విరూపాక్షుడు గౌతముడికి కూడా ఆ బ్రాహ్మణ సమూహంతో కలిపి తగిన పూజాధికాలు ఆచరించి, సంతృప్తిగా భోజనంపెట్టి ఆ బ్రాహ్మణుడు మోయలేనంత బంగారాన్ని, మణులను ఆ బ్రాహ్మణుడికి భోజనంపెట్టిన బంగారపు పళ్ళెంతోపాటు దానం చేశాడు.

10) నిసియైన సుఖనిద్ర సేయుచుండ

**కవి పరిచయం :**

ఈ వాక్యం తిక్కన రచించిన ఆంధ్ర మహాభారతం శాంతిపర్వం తృతీయాశ్వాసంలోని నాడీజంఘోపాఖ్యానం అనే పాఠ్యాంశం నుండి గ్రహించబడింది.

**సందర్భం :**

తిరిగివచ్చిన బ్రాహ్మణుడికి తగిన సేవచేసి నాడీజంఘుడు విశ్రాంతి తీసుకునే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :**

మోయలేనంత భారం కలిగిన ధనరాశులను మోస్తూ బ్రాహ్మణుడు కొంగకు సంతోషం కలిగే విధంగా మర్రిచెట్టు దగ్గరికి తిరిగివచ్చాడు. దానికి ఎంతో సంతోషించిన కొంగ అతడి అలసట తీరేవిధంగా తన రెండురెక్కలతో మెల్లగా వీచింది. అతడికి ఆహారాన్ని సమర్పించి రాత్రి సమయం కావటంచేత సుఖంగా నిద్రిస్తుండగా, తర్వాతిరోజు తన భోజనం కోసం బ్రాహ్మణుడు దానిని చంపాడు.

11) అట్టి సమయమున మేలుకని దనుజప్రభుండు

**కవి పరిచయం :**

ఈ వాక్యం తిక్కన రచించిన ఆంధ్ర మహాభారతం శాంతిపర్వం తృతీయాశ్వాసంలోని నాడీజంఘోపాఖ్యానం అనే పాఠ్యాంశం నుండి గ్రహించబడింది.

**సందర్భం :**

కొంగను బ్రాహ్మణుడు కృతఘ్నతతో వధించిన సమయములో రాక్షసరాజు నిద్ర నుండి మేలుకునే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :**

ఆ కొంగను చంపి దాని మాంసాన్ని అంతా మూటగా కట్టి తెల్లవారటంచేత ఆ బ్రాహ్మణుడు వెళ్ళిపోయాడు. ఆ సమయంలోనే రాక్షసరాజు నిద్ర నుండి మేల్కొని నీచువాసన వస్తుంది, ఏమి కీడు జరుగుతుందో అని మనసులో కలతపడ్డాడు.

12) బకము డొక్కయేర్పడఁగని యతనికిఁజె.ప్పి పుచ్చి కడువేగమునన్

**కవి పరిచయం :**

ఈ వాక్యం తిక్కన రచించిన ఆంధ్ర మహాభారతం శాంతిపర్వం తృతీయాశ్వాసంలోని నాడీజంఘోపాఖ్యానం అనే పాఠ్యాంశం నుండి గ్రహించబడింది.

**సందర్భం :**

తన స్నేహితుడైన నాడీజంఘుడి క్షేమం తెలుసుకురమ్మని తన సైనికులను విరూపాక్షుడు పంపిన సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :**

రోజూ వచ్చి స్నేహాన్ని చూపే నా స్నేహితుడు ఈరోజు ఇంకా రాలేదు. గుణహీనమైన ఆ బ్రాహ్మణుడు నా స్నేహితుడిని ఏమి చేయాలనుకున్నాడో, మనసుకు శాంతి లేదు'' అని ఆలోచించి తన భటులను తన స్నేహితుడి క్షేమం తెలుసుకోమని పంపాడు. వారు కూడా వెళ్ళి కొంగ డొక్కను స్పష్టంగా చూసి, ఆ విషయాన్ని రాజుకు వెంటనే తెలియజేశారు.

13) కడుపులు నకనకఁబడంగఁ గౌరవముఖ్యా

**కవి పరిచయం :**

ఈ వాక్యం తిక్కన రచించిన ఆంధ్ర మహాభారతం శాంతిపర్వం తృతీయాశ్వాసంలోని నాడీజంఘోపాఖ్యానం అనే పాఠ్యాంశం నుండి గ్రహించబడింది.

**సందర్భం :**

కృతఘ్నుడైన బ్రాహ్మణుడి మాంసాన్ని తినటానికి కుక్కలు కూడా ముందుగురాని సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :**

బ్రాహ్మణుడిని తన దగ్గరకు తీసుకురావద్దని, అతడిని చంపి తినమని విరూపాక్షుడు తన సేవకులకు చెప్పగా వారు "మేము అంత పనికిమాలినవారం కాము, ఆ దుష్టుడి శరీరం తినటం దోషం'' అని ఆ రాక్షసుడిని నగరం వెలుపలకు తెచ్చి నెత్తురు కారేవిధంగా అతడి శరీరాన్ని ఖండించారు. ఆ మాంసాన్ని కుక్కలకు వేయగా అవి ఆకలితో కడుపులు నకనకలాడుతున్నప్పటికీ ఆ మాంసాన్ని ముట్టుకోవటానికి భయపడ్డాయి.

14) మనుజేశ్వర తెల్లమయ్యే మనకిచ్చోటన్

**కవి పరిచయం :**

ఈ వాక్యం తిక్కన రచించిన ఆంధ్ర మహాభారతం శాంతిపర్వం తృతీయాశ్వాసంలోని నాడీజంఘోపాఖ్యానం అనే పాఠ్యాంశం నుండి గ్రహించబడింది.

**సందర్భం :**

వేదవాక్యాలు నిరూపించబడ్డాయని భీష్ముడు ధర్మరాజుతో చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :**

ధర్మరాజా ! విను. అది అలాంటిదే. వేదాలు కృతఘ్నుడి మాంసాన్ని తినటానికి కుక్కలు కూడా అసహ్యించుకుంటాయి'' అని చెప్పాయి. అది మనకు ఇక్కడ స్పష్టంగా నిరూపించబడింది.

15) దైన్యము ద్రోఁపవగచి యశ్రులుదొరఁగన్

**కవి పరిచయం :**

ఈ వాక్యం తిక్కన రచించిన ఆంధ్ర మహాభారతం శాంతిపర్వం తృతీయాశ్వాసంలోని నాడీజంఘోపాఖ్యానం అనే పాఠ్యాంశం నుండి గ్రహించబడింది.

**సందర్భం :**

విరూపాక్షుడు దగ్గరికి ఇంద్రుడురాగా, అప్పుడు రాజధర్ముడిని ఇవ్వమని రాక్షసరాజు దేవేంద్రుడిని అడిగే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :**

ఎంతో దుఃఖిస్తూ నాడీజంఘుడి శరీరానికి అగ్నిసంస్కారం చేసి ఉండగా విరూపాక్షుడి దగ్గరికి ఇంద్రుడు వచ్చాడు. అతడిని ఎంతో వినయంతో సత్కరించి "రాజధర్ముడిని తిరిగి బ్రతికించు'' అని దీనంగా కళ్ళనుండి కన్నీరు రాలుతుండగా ఇంద్రుడిని అర్థించాడు విరూపాక్షుడు.

16) సుడిగాలిం దూలిపడియె సొదపై ననఘా

**కవి పరిచయం :**

ఈ వాక్యం తిక్కన రచించిన ఆంధ్ర మహాభారతం శాంతిపర్వం తృతీయాశ్వాసంలోని నాడీజంఘోపాఖ్యానం అనే పాఠ్యాంశం నుండి గ్రహించబడింది.

**సందర్భం :**

ఇంద్రుడు నాడీజంఘుడు ఏవిధంగా పునర్జీవితుడయ్యాడో చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :**

"నీవు స్నేహితుడివి అయిన కారణంగా కొంగకు అగ్నిసంస్కారం చేశావు. అది ఎంతో మంచిపని. నీవలా అగ్నిసంస్కారం చేసి వచ్చిన తర్వాత ఆ సమీపంలోనే కామధేనువు తన దూడకు పాలిస్తుంది. సుడిగాలికి ఆ దూడ నోటినుండి పాల నురుగు వచ్చి ఆ చితిపై పడింది. దానికారణంగా నాడీజంఘుడు తిరిగి బ్రతికాడు'' అని ఇంద్రుడు విరూపాక్షుడితో చెప్పాడు.

17) పాశ నిబద్ధుఁజేసినాడవ్విప్రున్

**కవి పరిచయం :**

ఈ వాక్యం తిక్కన రచించిన ఆంధ్ర మహాభారతం శాంతిపర్వం తృతీయాశ్వాసంలోని నాడీజంఘోపాఖ్యానం అనే పాఠ్యాంశం నుండి గ్రహించబడింది.

**సందర్భం :**

ఇంద్రుడు బ్రాహ్మణుడి జీవుడిని బంధించే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :**

"నాడీజంఘుడు తిరిగి బ్రతకటానికి ఆ బ్రహ్మదేవుడి చిత్తమే" అని దేవేంద్రుడు చెప్పి ఆ బ్రాహ్మణుడిని బంధించాడు.

18) పరితుష్టుండగుచు దైత్యపాలుం డనుపన్

**కవి పరిచయం :**

ఈ వాక్యం తిక్కన రచించిన ఆంధ్ర మహాభారతం శాంతిపర్వం తృతీయాశ్వాసంలోని నాడీజంఘోపాఖ్యానం అనే పాఠ్యాంశం నుండి గ్రహించబడింది.

**సందర్భం :**

నాడీజంఘుడి కోరికపై తిరిగి బ్రతికిన బ్రాహ్మణుడిని చూసి ఎంతో సంతోషంతో నాడీజంఘుడు తన నివాసానికి వెళ్ళే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :**

తన కారణంగా బ్రాహ్మణుడికి మరణం సంభవించిందని నాడీజంఘుడు బాధపడి అతడిని విడిచిపెట్టమని ఇంద్రుడిని కోరాడు. అతడూ ఆ కోరిక తీర్చగా బ్రాహ్మణుడు తిరిగి బ్రతికాడు. రాక్షసరాజు ఆ ధనరాశినంతా ఆ బ్రాహ్మణుడికి ఇచ్చి సాగనంపాడు. ఇంద్రుడు స్వర్గానికి వెళ్లాడు. రాక్షసరాజు తనను సాగనంపుతుండగా ఎంతో సంతృప్తిచెందినవాడై నాడీజంఘుడు తన నివాసానికి వెళ్ళాడు.

19) బ్రహ్మఘ్నునకును నిష్కృతి గలుగును

**కవి పరిచయం :**

ఈ వాక్యం తిక్కన రచించిన ఆంధ్ర మహాభారతం శాంతిపర్వం తృతీయాశ్వాసంలోని నాడీజంఘోపాఖ్యానం అనే పాఠ్యాంశం నుండి గ్రహించబడింది.

**సందర్భం :**

భీష్ముడు ధర్మరాజుకు నాడీజంఘుడి వృత్తాంతం చెప్పి దానివలన బోధపడే నీతి తెలిపే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :**

నాడీజంఘుడి కథ చెప్పి భీష్ముడు ధర్మరాజుతో ఈవిధంగా అన్నాడు. "బ్రహ్మపాతకం చేసిన వాడికి విముక్తి ఉంటుందికానీ నమ్మినవారిని వంచించే కృతఘ్నునకు మాత్రం నిష్కృతిలేదు"

20) ఆ రెండు దెఱఁగులవారి నాప్తులనైనన్

**కవి పరిచయం :**

ఈ వాక్యం తిక్కన రచించిన ఆంధ్ర మహాభారతం శాంతిపర్వం తృతీయాశ్వాసంలోని నాడీజంఘోపాఖ్యానం అనే పాఠ్యభాగంలోనిది.

**సందర్భం :**

భీష్ముడు ధర్మరాజుకు కృతఘ్నులను, మిత్రద్రోహులను విడువాలని చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :**

'విచారిస్తే మిత్రద్రోహమనేది భయంకరమైన పాపం. అది కృతఘ్నత కంటే భయంకరమైనది. కాబట్టి కృతఘ్నులను, మిత్రద్రోహులను శత్రుత్వం వహించి వదలివేయాలి. ఈ రెండురకాలవారు ఎంతటి ఆప్తులైనా వారిని విడిచిపెట్టాలి'' అని భీష్ముడు ధర్మరాజుకు బోధించాడు.

21) మిత్రుఁడ యొక్కడనుమాట మెత్తురుప్రాజ్ఞల్

**కవి పరిచయం :**

ఈ వాక్యం తిక్కన రచించిన ఆంధ్ర మహాభారతం శాంతిపర్వం తృతీయాశ్వాసంలోని నాడీజంఘోపాఖ్యానం అనే పాఠ్యభాగంలోనిది.

**సందర్భం :**

భీష్ముడు మంచి మిత్రుడి ఔన్నత్యాన్ని ధర్మరాజుకు చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :**

స్నేహితుడు ఇహలోకానికి చెందిన, పరలోకానికి చెందిన శుభాలు కలిగిస్తాడు. ధనం, స్నేహితుడు ఈ రెండింటిలోనూ స్నేహితుడే ఎక్కువ అని పెద్దలు చెబుతారు'' అని భీష్ముడు ధర్మరాజుకి చెప్పాడు.

**ప్రశ్నలు - సమాధానాలు :**

**1) నాడీజంఘుడి వృత్తాంతాన్ని వ్రాయండి**

**లేదా**

**కృతఘ్నుతను మించిన పాపం లేదని నిరూపించే నాడీజంఘుని కథను వివరించండి.**

**లేదా**

**మంచి స్నేహితుడి ఔన్నత్యాన్ని నిరూపించే నాడీజంఘోపాఖ్యానం గురించి వివరించండి.**

జ. ఒక బ్రాహ్మణుడు కులప్రవర్తనను విడిచిపెట్టి బోయస్త్రీని భార్యగా చేసుకొని కిరాతులతో కలిసి వేటకు వెళ్ళేవాడు. మాంసం తినేవాడు. భోగంపట్ల ఆసక్తి కలవాడు కనుక అతడు ధనం సంపాదించటం కోసం వ్యాపారస్తులతో కలిసి తానూ వెళ్ళాడు. అలా ఆ వర్తకుల వ్యాపారసమూహం పర్వతాలలో అడవులలో ప్రయాణిస్తుండగా ఒక అడవి ఏనుగు వారిపైపడి

వారిని చంపటం ప్రారంభించింది. మిగిలినవారు భయంతో నాలుగుదిక్కులకు పరుగెత్తారు. అప్పుడు బ్రాహ్మణుడు కూడా ఉత్తరదిక్కుకు పరుగెత్తి దూరంగా ఉన్న దారి వెంటవెళ్ళి ఒక పెద్ద మర్రిచెట్టును చూశాడు. ఆ చెట్టునీడను చేరి చల్లగాలికి కొంత సేద తీరి ఆ చెట్టుక్రింద విశ్రాంతి తీసుకుందామనుకున్నాడు.

అప్పుడు ఒక పెద్దకొంగ అతడి దగ్గరకు మెల్లగా వచ్చింది. అది బ్రహ్మదేవుడి అనుగ్రహం పొంది రాజధర్ముడు, నాడీజంఘుడు అని పిలవబడేది. ఆ మర్రిచెట్టు దాని నివాసం. తన నివాసానికి వచ్చిన బ్రాహ్మణుడిని ఎంతో ప్రేమగా చూస్తూ "ఏ పని కోసం ఎక్కడినుండి ఎక్కడికెళుతున్నావు? నిన్ను చూసి నేను సంతోషిస్తున్నాను. నాకు నీవు తగిన అతిథివి. నీ వృత్తాంతం చెప్పు" అని అడిగింది. ఆ బ్రాహ్మణుడు తన పేరు గౌతముడని చెప్పి, ఇంకా తన వృత్తాంతమంతయూ చెప్పాడు. అడవిఏనుగు వల్ల పారిపోయి అదృష్టంకొద్దీ నీ నివాసానికి చేరాను అని చెప్పాడు. అప్పుడా కొంగ నీ దరిద్ర్యాన్ని పోగొడతాను, నా ఆతిథ్యం స్వీకరించమని రుచికరమైన చేపలను వండిపెట్టి, తియ్యటి ఫలాలనుపెట్టి అతడికి తృప్తిగా భోజనం పెట్టింది. రాత్రి కావటంతోనే మెత్తని చిగురాకులతో, పూలతో పక్క ఏర్పరచి ఆ బ్రాహ్మణిడితో సరససంభాషణలు చేసింది. ఆ రాత్రి గడచి తెల్లవారిన తర్వాత ఆ బ్రాహ్మణుడిని చూసి "మానవుడి దరిద్ర్యం పోవటానికి స్నేహితుడు, వెండి, బంగారం, బుద్ధి అనేవి నాలుగు కారకాలని దేవగురువైన బృహస్పతి చెప్పాడు. ఈ నాల్గింటిలో మిత్రుడే అధికం. నేను నీతో సస్నేహం చేస్తున్నాను. కాబట్టి అది అపారసంపద పొందటానికి కారణమవుతుంది. నా స్నేహితుడు విరూపాక్షుడు. అతడి నగరం మధువ్రజం ఇక్కడి నుండి మూడుయోజనాల దూరంలోనున్న ఆ నగరానికి ఈ దారివెంట వేగంగావెళ్ళి రాక్షసరాజైన నా స్నేహితుడిని దర్శించు. నేను పంపించానని చెప్పు. అతడు ఎంతో అభిమానంతో నీకు బంగారం, రత్నాలు ఇస్తాడు" అని నాడీజంఘుడు చెప్పాడు.

ఆ బ్రాహ్మణుడు నాడీజంఘుడు చెప్పిన దారివెంట వెళ్ళి విరూపాక్షుడిని చూసి తాను రాజధర్ముడి స్నేహితుడనని, తనను రాజధర్ముడే ధనం కోసం అక్కడకు పంపాడని చెప్పాడు. ఆ బ్రాహ్మణుడిని చూసి విరూపాక్షుడు ఇతడిని చూచుటకు నీచుడివలె ఉన్నాడని అతడి వివరాలు తెలుపమని అడిగాడు. ఆ బ్రాహ్మణుడు తన వృత్తాంతమంతా తెలుపగా ఇతడెలాంటి వాడైతే నాకెందుకు నా స్నేహితుడికి మిత్రుడు. అదే ఇతడిని అర్హుడిగా చేస్తుంది. ఇతనికి తృప్తికలిగే విధంగా ధనం ఇస్తానని అనుకున్నాడు. ఆ తర్వాతిరోజు కార్తీకపౌర్ణమి అవటంచేత ఎప్పటిలాగే బ్రాహ్మణులకు దానధర్మాలు చేస్తూ వారితోపాటుగా గౌతముడికి ఎంతో గౌరవంగా భోజనంపెట్టి అతడు మోయలేనంత బంగారపురాసిని, మణులను, అతడు భోజనం చేసిన బంగారం పళ్ళెంతో సహా ఎంతో సంతోషంగా సమర్పించాడు. ఎక్కువ బరువు కారణంగా తన మెడ, భుజాలు బాధిస్తుండగా ఆ ధనరాశిని మోసుకొని నాడీజంఘుడి నివాసమైన మర్రిచెట్టు దగ్గరకు ఆ బ్రాహ్మణుడు వచ్చాడు. అలా అలసివచ్చిన బ్రాహ్మణుని అలసటపోయే విధంగా నాడీజంఘుడు తన రెక్కలతో విసిరి అతడికి ఆహారంపెట్టి రాత్రి కావటంతో తాను నిద్రించాడు.

ఆ బ్రాహ్మణుడు తన మరునాటి ప్రయాణానికి ఆహారం ఎలా అని ఆలోచించి 'ఈ పెద్ద కొంగ శరీరం బాగా బలసివుంది. మాంసం రుచిగా ఉంటుంది. ఇది ఆదమరచి నిద్రపోతుంది, దీనిని చంపి మాంసం తీసుకొనిపోతాను" అని ఆలోచించి ఒక్క కట్టెతోటి ఆ కొంగ మెడను, తలను అనేకసార్లు కొట్టి చంపి దాని ఈకలన్నీ పీకి మాంసాన్ని మూటకట్టుకొని వెళ్ళిపోయాడు. ఈ సమయంలోనే విరూపాక్షుడు నిద్రలేచి ఇదేంటి మాంసం నీచవాసన వస్తుంది, రాజధర్ముడికే ఏమి కీడు జరిగిందో అని కీడు శంకించాడు. ఎంత ప్రొద్దుక్కినా రోజూ వచ్చే రాజధర్ముడు రాకపోవటంతో చింతించి ఆ దుష్టబ్రాహ్మణుడు తన స్నేహితుడికి ఏమి కీడు కలిగించాడోనని ఆలోచించి తన భటులను రాజధర్ముడి క్షేమసమాచారం కొరకు పంపాడు. వెళ్ళిన ఆ భటులు ఆ కొంగడొక్క చూచి తమ రాజుకి ఆ విషయం తెలిపారు. వెంటనే ఆ బ్రాహ్మణుడిని పెడరెక్కలు విరిచి కట్టి ఆ రాక్షసరాజు దగ్గరకు తీసుకుపోగా ఆ కృతఘ్నుడిని తన దగ్గరకు తేవద్దని, వాడి మాంసం తినమని భటులకు చెప్పాడు.

ఆ భటులు మేము అంత పనికిమాలినవారముకామని, ఈ దుష్టుడి శరీరం తింటే దోషమని తాము తినమని నిరాకరించారు. తినండి, తినకపోండి, వీడిని నా ముందుకు ఎందుకు తెచ్చారు, దూరంగా తీసుకుపోండి అని విరూపాక్షుడు పలుకగా వారు ఆ బ్రాహ్మణుడిని నగరం బయటకు తీసుకువెళ్లి ఖండించి ఆ మాంసాన్ని కుక్కలకు వేస్తే అవి ఎంతగా ఆకలవుతున్నప్పటికీ ఆ కృతఘ్నుడి మాంసాన్ని తినటానికి ఇష్టపడలేదు. కృతఘ్నుడి మాంసాన్ని కుక్కలు కూడా అసహ్యించుకుంటాయి అనే వేదవాక్యం ఇక్కడ నిరూపితమైంది.

ఎంతో దుఃఖిస్తూ విరూపాక్షుడు నాడీజంఘుడి డొక్కను తెప్పించి ఎంతో గౌరవంగా దానికి అగ్నిసంస్కారం చేశాడు. అప్పుడు దేవేంద్రుడు ఆ రాక్షసరాజు దగ్గరకురాగా విరూపాక్షుడు అతడిని వినయంగా సన్మానించి, నా స్నేహితుడైన రాజధర్ముడిని తిరిగి బ్రతికించు అని ప్రార్థించాడు. ఇంద్రుడు 'నీ స్నేహితుడు ఆ బ్రహ్మదేవుడికి స్నేహితుడే బ్రహ్మ రోజూ తన దగ్గరకు నాడీజంఘుడు రావాలని కోరుకుంటూ ఉంటాడు. ఈరోజు రాని కారణంగా ఎంతో ఆవేదనపడ్డాడు. నువ్వు నీ స్నేహితుడికి అగ్నిసంస్కారం చేసి మంచిపని చేశావు. నీవు అగ్నిసంస్కారం చేసిన తర్వాత ఆ చితి దగ్గరలోనే సురభి తన బిడ్డకు పాలిస్తుండగా ఆ దూడ నోటి తుంపరల నుంచి ఆ పాల నురుగు ఈ చితిపై పడింది. దానితో నాడీజంఘుడు తిరిగి బ్రతికి నీ దగ్గరకే వస్తున్నాడు' అని చెప్పాడు. అప్పుడు రాక్షసరాజు సంతోషించే విధంగా నాడీజంఘుడు వచ్చాడు. తన కారణంగా బ్రాహ్మణుడికి దుర్గతి పట్టిందని బాధపడి బ్రాహ్మణుడిని బంధించిన ఇంద్రుడితో ఆ బ్రాహ్మణుడిని విడిచిపెట్టమని కోరాడు. బ్రహ్మ అనుగ్రహం లభించిందని వాడికి రాక్షసరాజు ధనసంపాదనంతా తిరిగి ఇవ్వగా వాడు తిరిగితిరిగి చూస్తూ ఆశ్చర్యంతో వెళ్ళిపోయాడు. ఆ తర్వాత ఇంద్రుడు స్వర్గానికి వెళ్ళాడు. నాడీజంఘుడు తన నివాసానికి రాక్షసరాజు సంతోషంగా సాగనంపగా వెళ్ళాడు.

ఈ నాడీజంఘుడి వృత్తాంతం వలన కృతఘ్నత మహాపాపమని, అంతకుమించిన పాపం మిత్ర ద్రోహమని తెలుస్తుంది. ఉత్తముడైన స్నేహితుడు ఒక్కడుంటే చాలు ఇహపర సుఖాలన్నీ పొందవచ్చనే సందేశాన్ని ఈ కథ తెలుపుతుంది.

**డా॥ డి. ధాత్రికుమారి**

సహాయాచార్యులు

వై.ఎ. ప్రభుత్వ మహిళా కళాశాల,

చీరాల, ప్రకాశం జిల్లా

పాఠం - 7

# గజేంద్ర మోక్షము

- బమ్మెర పోతన

**(మహాభాగవతం - అష్టమ స్కంధం - 25 నుండి 115 పద్యాల వరకు)**

## కవి - కథా పరిచయాలు

**విషయసూచిక :**

7.1 ఉద్దేశ్యం
7.2 కవి పరిచయం
7.3 కావ్య పరిచయం
7.4 కథా సందర్భం
7.5 పాఠ్యభాగ సారాంశం

### 7.1 ఉద్దేశ్యం :

గజేంద్ర మోక్షణ కథాభాగమున్న భాగవతకర్తయైన బమ్మెర పోతనామాత్యుని గుఱించి పరిచయం చేయడం, భాగవతాన్ని గూర్చి క్లుప్తంగా తెలపడం, ప్రస్తుత పాఠ్యంశమైన గజేంద్రమోక్ష కథా సందర్భాన్ని ఉటంకించడం, చివరగా పాఠ్యభాగ సారాంశాన్ని సంక్షిప్తంగా చెప్పడం ఇందలి ఉద్దేశ్యం.

### 7.2 కవి పరిచయం :

గజేంద్రమోక్షణ కథాభాగం ఉన్న భాగవతాన్ని బమ్మెర పోతనామాత్యుడు రచించాడు. వేదవ్యాస మహర్షిచే సంస్కృత భాషలో రచింపబడిన శ్రీమద్భాగవత పురాణాన్ని సద్యోహృద్యంగా సహృదయ నైవేద్యంగా తెనింగించి తెలుగువారికి అనుగ్రహించిన మహానుభావుడు బమ్మెర పోతనామాత్యుడు. "విద్యావతాం భాగవతే పరీక్షా" (విద్వాంసులకు భాగవతం పరీక్ష) అన్న ప్రథ వహించిన శ్రీమద్భాగవతాన్ని "బాలరసాలసాల నవపల్లవకోమల కావ్యం"గా తెలుగులో తీర్చిదిద్దిన మహాపుణ్యాత్ముడు బమ్మెర పోతనామాత్యుడు.

బమ్మెర పోతన క్రీ.శ. 15వ శతాబ్దములోనివాడు. ఈయన నేటి తెలంగాణాలోని బ్రమ్మెర అను గ్రామమునకు చెందినవాడుగా అందరూ అంగీకరిస్తున్నారు. కడప మండలంలోని "ఒంటిమిట్ట"లోని శ్రీ కోదండరామాలయంలో పోతన భాగవతరచన గావించాడని జనశ్రుతి. ఏమైనా బమ్మెర పోతన తెలుగువారి హృదయాంతర్నివాసి అనడంలో సందేహం లేదు.

భాగవతమే కాకుండా పోతన మరి మూడు గ్రంథాలు కూడా రచించాడు. అవి 1) వీరభద్ర విజయము, 2) నారాయణ శతకము, 3) భోగినీ దండకము. వీరభద్ర విజయాన్ని బాల్యంలో రచించాడు. ఆయన కులగురువైన ఇవటూరి సోమనారాధ్యుల ఆజ్ఞపై దాన్ని రచించాడు. ఆయన నారాయణ శతకం కూడా ప్రసిద్ధమైనదే. నారాయణా అనే మకుటంతో అలరారుతుంది.. భోగినీ దండకాన్ని సర్వజ్ఞసింగ భూపాలునకు కానుకగా ఇచ్చాడు. అయితే భాగవత రచనా కాలానికి ఆయన దృక్పథం మారింది. రాజాశ్రయాన్ని నిరసించాడు. ఈ విషయాన్నిట్లా ప్రకటించాడు.

**ఇమ్మనుజేశ్వరాధముల కిచ్చి పురంబులు వాహనంబులున్**
**సొమ్ములుగొన్ని పుచ్చుకొని చొక్కి శరీరమువాసికాలచే**
**సమ్మెటవ్రేటులం బడక సమ్మతి శ్రీహరి కిచ్చి చెప్పె నీ**
**బమ్మెర పోతనాదాకఁడు భాగవతంబు జగద్ధితంబుగన్.**

భాగవతాన్ని శ్రీహరి కంకితముగా రచించాడు. జగద్ధితం కోసం రచించాడు.

పోతనగారు నారాయణ ప్రపంచ రచనా కుతూహలుడై గంగాపులిన తలంబున మహేశ్వర ధ్యానంబు సేయుచు అర్థనిమీలిత నేత్రుడై యుండగా రామభద్రుడాయనకు సాక్షాత్కరించాడు. తనపేర శ్రీ మహాభాగవతమును తెనిగింపుమని ఆజ్ఞాపించాడు. ఇదే చిత్రం. చేసింది ఈశ్వర ధ్యానం, సాక్షాత్కరించింది రామచంద్రుడు. వ్రాయమన్నదేమో శ్రీమహాభాగవతం (కృష్ణ కథ).

భాగవత రచనకు నిర్ణయించుకున్నాడు. దాన్ని ఇలా ప్రకటించుకొన్నాడు.

**భాగవతము దెలిసి పలుకుట చిత్రంబు**
**శూలికైనఁ దమ్మిచూలికైన**
**విబుధవరుల వలన విన్నంతకన్నంత**
**తెలియవచ్చినంత తేటపఱతు**

భాగవతరచనమెంత కష్టమైనదో దీనివలన తెలుస్తుంది. విబుధవరుల వలన విన్నంత చెప్తానన్నాడు. ఎవరీ విబుధులు ? వ్యాసభాగవత వ్యాఖ్యాతలైన శ్రీధరాదులు. అందుకే పోతన అనువాదంలో వ్యాసరచిత శ్లోకానువాదాలతోపాటు అక్కడక్కడా శ్రీధరుని వ్యాఖ్యానాన్ని కూడా పోతన అనువదించాడు. తెలియవచ్చినంత తేటపరిచెదనన్నాడు. ఎంత వినయశీలి పోతన !

పోతన అనువాదంలో సంస్కృతాంధ్ర ప్రౌఢి కన్పిస్తుంది. ఈ విషయాన్ని ఆయనే ఇలా వెల్లడించాడు.

**కొందఱకుఁదెనుఁగు గుణమగుఁ**
**గొందఱకును సంస్కృతంబు గుణమగు రెండుఁ**
**గొందఱికి గుణములగు నే**
**నందఱ మెప్పింతుఁగృతుల నయ్యెయెడలన్**

భాగవతాన్ని అనువదించడం తన పురాకృత సుకృతంగా భావించాడు పోతన. దాన్ని అనువదించడం వలన జన్మసార్థక్యంగా భావించాడు. జన్మరాహిత్యాన్ని ఆశించాడు.

**ఒనరన్ నన్నయతిక్కనాదికవు లీయుర్విం బురాణావళుల్**
**తెనుఁగుంజేయుచు మత్పురాకృతశుభాధిక్యంబు దా నెట్టిదో**
**తెనుఁగూజేయరు మున్నుభాగవతముం దీనిం దెనింగించి నా**
**జననంబున్ సఫలంబుఁ జేసెదఁ బునర్జన్మంబు లేకుండఁగన్**

అని సంస్కృతంలో వ్యాసమహర్షి చేత రచింపబడిన భాగవతాన్ని ఆంధ్రీకరింపబూనుకొన్నాడు.

స్థాలీపులాకన్యాయంగా పోతన అనువాద వైఖరికి ఒక ఉదాహరణ చూద్దాం.

**నయస్యదేవా ఋషయఃపదం విదుః**
**జంతుః పునఃరోర్హతి గంతు మీరితుమ్**
**యథా నటస్యాకృభి ర్విచేష్టితో**
**దురత్యయానుక్రమణ స్స మావతు**

| | | |
|---|---|---|
| యస్యః | = | ఏ పరమేశ్వరుని యొక్క |
| పదమ్ | = | స్వరూపమును |

| | | |
|---|---|---|
| దేవాః | = | దేవతలు |
| ఋషయః | = | ఋషులు |
| న విదుః | = | తెలియకున్నారో |
| జంతుః పునః | = | ప్రాకృతజనడైన |
| కః | = | ఎవడు |
| గంతుమ్ | = | తెలియుటకు |
| ఈరితుమ్ | = | వర్ణించుటకు |
| అర్హతి | = | అర్హుడగును |
| ఆకృతిభిః | = | వివిధ రూపములచే |
| విచేష్టితః | = | నటిస్తున్న |
| నఉస్యయథా | = | నటుని యొక్క తత్త్వమువలె |
| దురత్యయ + అనుక్రమణ | = | తెలియశక్యము గాని చరితము గల |
| సః | = | ఆ పరమేశ్వరుడు |
| మా | = | నన్ను |
| అవతు | = | రక్షించుగాక |

పోతన గారు దీని నిట్లనువదించిరి

**నర్తకునిభంగి పెక్కగు**
**మూర్తులతో నెవ్వడాడు, మునులున్ దివిజుల్**
**కీర్తింపనేర, రెవ్వని**
**వర్తన మొరు లెఱుగనేర రట్టివాని నుతింతున్**

అద్భుతమైన యనువాదము, మూలంలో ఋషయః సవియః అనగా ఋషులే తెలిసికొనలేరు అని యున్నదానిని మునులు కీర్తింపనేరరు అని తీర్చాడు. పైగా మునులే కీర్తింపలేనివానిని తాను (గజేంద్రుడు) కీర్తిస్తానన్నాడు. ఇది పోతన గారి అభివ్యక్తిలోని వైచిత్రి. అంటే ఋషుల కన్నా గజేంద్రుడు గొప్పవాడనే అర్థంకాదు. రక్షించే వరకూ కీర్తిస్తూనే ఉంటానని దాని అర్థం. దీనినిబట్టి గజేంద్రుని దైన్యం, పోతన భక్తిపారవశ్యం గమ్యమానం.

అంతేకాదు "దురత్యయానుక్రమణః" అనే దాన్ని "ఎవ్వని వర్తన మొరులెఱుగ నేరరు" అనుట విశేషం. జాత్య మగురమ్యానువాదం "వర్తనం" అనుట అమోఘం. పోతన అనువాద శిల్పానికి నిదర్శనం.

పోతన సహజపాండిత్యుడు కావడంచేత ఆయన కవితలో సంస్కృతప్రౌఢి తెనుగుదనం రెండు సమపాళంగా గోచరిస్తాయి.

**తాటంకాచలనంబుతో భుజనటద్ధమ్మిల్ల బంధంబుతో**
**శాటీముక్త కచంబుతో నదృఢ చంచత్కాంచితో శీర్ణలా**
**లాటా లేపముతో, మనోహరకరాలగ్నోత్తరీయలంబుతోఁ**
**గోటీందుప్రభతో నురోజభరసంకోచద్విలగ్నంబుతోన్**

అనే పద్యంలో సంస్కృతపద విన్యాసం ప్రస్ఫుటం, ఒక్క తెలుఁగు పదం కూడా కానరాదు.

అడిగెదనని కడువడి(జను
నడిగిన(దను మగుడనుడుగ(డని నడయుడుగున్
వెడవెడ చిడిముడి తడ(బడ
నడుగిడు నడుగిడదు జడిమ నడుగిడునెడలన్

అనే పద్యంలో తెలుగుదనం విరబారింది. అంతేకాదు ఈ పద్యంలో అనే కవితాంశాలు చోటుచేసుకున్నాయి.

అందులో ఒకటి శయ్య, పద్యగతి భావానుగుణంగా సాగింది. లక్ష్మీదేవి ఊగిసలాట కనబడుతుంది. ఆమె నడక పద్యం నడక ద్వారా బోధపడుతుంది.

రెండవది ఛందో విశేషం. ఇది సర్వలఘుకందం. లక్షణార్థం ఉండాల్సిన రెండు గురువులు తప్ప అన్నీ లఘువులే. ఇవి కూడా భావానికి వన్నె పెట్టింది.

మూడవది అలంకార శోభ. ఇందు వృత్త్యనుప్రాసాలంకారం ఉంది. "డ"కారం పునఃపునరావృతమైంది. ఇది వట్టి వర్ణాడంబరం కాదు, సార్థకం. సాభిప్రాయం తడబడుతూ లక్ష్మీదేవి వేస్తున్నది అడుగులు. అందుచేత "డ" వర్ణావృత్తి ఆ ఊగిసలాటను స్ఫురింపజేస్తూ సార్థకమైంది.

పోతనలో ఇతర శబ్దాలంకారాలైన లాటానుప్రాసము, ఛేకానుప్రాసము, అంత్యానుప్రాసము కోకొల్లలుగా కన్పించును.

పోతనలో ఉపమాది అర్థాలంకారాలనేకం. సందర్భానుసారం ప్రయోగింపబడ్డాయి. అట్లుండటమేకాదు ఒక్కొక్కచోట ఉపమాలంకారం చక్కని కథాశిల్పం సాధించిన లావులు కూడా కలవు.

అన్నింటిని మించి పోతన భక్తిపరుడు. నవవిధ భక్తులను ప్రదర్శించాడు. భాగవతంలో సగుణ నిర్గుణ భక్తి చక్కగా విశ్లేషింపబడింది. కుంతీప్రభృతులు సగుణభక్తులు కాగా ప్రహ్లాదాదులు నిర్గుణ భక్తులు. గజేంద్రుడు సగుణ నిర్గుణ సంధి. అంటే ప్రహ్లాదుడు కుచేలుడువలే జన్మతః సమ్యకీజ్ఞాన సంపన్నులుకాక పూర్వజన్మలో సగుణయోగాభ్యాసులై తదభ్యాసఫలంగా ఉత్తరజన్మ మధ్యలో జ్ఞానోదయమైనవాడు.

ఏమైనను శ్రీవిశ్వనాథ సత్యనారాయణగారన్నట్లు "పోతన తెలు(గుల పుణ్యపేటి"

### 7.3 కావ్యపరిచయం :

ప్రస్తుత పాఠ్యాంశమైన గజేంద్రమోక్షణం శ్రీ మహాభాగవతంలోనిది. దీనిని సంస్కృతంలో వ్యాసమహర్షి రచించాడు. బ్రమ్మెరపోతనార్యుడు దాన్ని తెలుగులోనికనువదించారు.

భాగవతమంటే ఏమిటి ? "భగవత ఇదమ్ భాగవతమ్" అన్నారు పెద్దలు. భగవంతుడి చరిత్ర భాగవతం. భాగవతుల చరిత్ర కూడా భాగవతమే. "భగ అప్య అస్తి ఇతి భగవాన్" అని భగవత్ అనే శబ్దానికి వ్యుత్పత్తి. "ఐశ్వరస్య సమగ్రస్య వీర్యస్య యశసః అయః జ్ఞాన వైరాగ్యయాశ్చైవ షణ్ణామ్ భగ ఇవీరణా" అని విష్ణుపురాణంలో చెప్పబడింది. ఐశ్వర్యము, బలము, యశము, సంపద, జ్ఞానం, వైరాగ్యం అనే ఆరు గుణాలకు భగమని పేరు. అవి ఎవనియందు సమగ్రంగా ఉంటాయో వాడే భగవంతుడు.

"ప్రవృత్తించ నివృత్తించ భూతానా మాగతిమ్ గతిమ్, వేత్తిధర్మ మధర్మంచ స వాచ్యో భగవా నితి" అని కూడా భగవచ్ఛబ్దాన్ని నిర్వచించారు. ప్రవృత్తి నివృత్తులు, గతాగతాలు, ధర్మాధర్మాలు అనే ఆరూ సంపూర్ణంగా తెలిసినవాడే భగవంతుడు. రెండు నిర్వచనాలసారం ఒక్కటే.

"భక్త్యా భాగవతం జ్ఞేయం
నవ్యుత్పత్త్యా నటీకయా"

అనే భాగవతాన్ని గూర్చిన ఆభాణకం. భాగవతం అర్థం కావాలంటే భక్తి కావాలి, ఏవో టీకాతాత్పర్యాలున్నంత మాత్రాన అర్థంకాదు.

విద్యావతాం భాగవతే పరీక్షా
విపత్తికాలే గృహిణీపరీక్షా
రణాంగణే శస్త్రభృతాం పరీక్షా
ధనంజయే హాటకపరీక్షా

అనేది ఆర్యోక్తి. విద్వాంసులకు భాగవతం పరీక్ష.

అటువంటి భాగవతాన్ని బమ్మెర పోతనాచార్యుడు బాలరసాలసాల నవపల్లవ కోమల కావ్యంగా తీర్చిదిద్దాడు. సంస్కృత భాగవతానికున్న వ్యాఖ్యానాలలో శ్రీధరీయం ప్రధానం. శ్రీధరుని వ్యాఖ్యాన భాగాన్ని కూడా పోతన తన అనువాదంలో పొందుపరిచాడు.

అష్టాదశ పురాణాలలో భాగవతం ఒకటి. దీనినే "సాత్వత పురాణం" అని కూడా అంటారు. సత్త్వగుణ ప్రధానుడైనవాడు సత్త్వంతుడు. అతడే విష్ణువు. ఆయన గుణచేష్టాదులను వర్ణించేది కావుననే ఈ భాగవత పురాణాన్ని సాత్వత పురాణం అని కూడా అంటారు. భాగవతానికే ఉన్న మరొకపేరు "పారమహంస్య సంహిత".

భాగవత పురాణంలో ప్రతిపాదింపబడినవి సత్యధర్మాలనే రెండంశాలు. మొదటిది చేరవలసిన స్థానం, రెండవది చేర్చే సాధనం. ఇదంతా వ్యాస భాగవతం గురించి.

తెలుగుభాషలో భాగవతానికి అంత ప్రశస్తి రావటానికి కారణం పోతనగారి భక్తివిశేష మొకటైతే ఆయన కవితా మహత్త్వము రెండవకారణము. ఆంధ్ర ప్రజానీకంలో ఆ బాలగోపాలాన్ని ఆకర్షించింది పోతనగారి భాగవతమే. పండిత పామరులందరికీ పల్లెలలోని ప్రజలకు సైతం భాగవతంలోని పద్యాలు రానివారుండరు. రామాలయం లేని ఊరు భాగవతం లేని ఇల్లు ఉండదని సామెత.

వ్యాసభాగవతం ప్రధానంగా పురాణం. పోతన భాగవతం ప్రధానంగా కావ్యం. అందుకే ఇది రసమయం, రెండూ భక్తిభరితాలే. "భజసేవాయామ్" అనే ధాతువు నుండి భక్తి శబ్దం నిష్పన్నమైంది. త్రికరణశుద్ధిగా పరమేశ్వరుణ్ణి సేవించడమే భక్తి. భాగవతభక్తికి మోక్షమే చరమ లక్ష్యం. "మోక్షసాధన సామగ్ర్యామ్ భక్తిరేవ గరీయసీ" అని శంకర భగవత్పాదులన్నారు. అందుకే భక్తిపరుడైన పోతన "శ్రీకైవల్యపదంబు చేరుటకు నై చింతించెదన్" అని అన్నాడు. అంతేకాదు, జన్మరాహిత్యాన్ని పొందడానికి భాగవతాన్ని వ్రాస్తానన్నాడు.

ఒనరన్ నన్నయ తిక్కనాదు లేయుర్వింబురాణావళుల్
తెనుఁగుంజేయుచు మత్పురాకృతశుభాధిక్యంబు దా నెట్టిదో
తెనుగుంజేయరు మున్ను భాగవతమున్ దీనిం దెనింగించి నా
జననంబున్ సఫలంబుఁజేసెదఁబునర్జన్మంబు లేకుండగన్

భాగవతంలో నవవిధ భక్తులు ప్రతిపాదింపబడ్డాయి. ఆ భక్తి విధాలేవియో భాగవతంలోని ఈ పద్యం తెలియజేస్తుంది.

తనుహృద్భాషల సఖ్యమున్, శ్రవణమున్, దా సత్వమున్, వందనా
ర్చనముల్, సేవయు, నాత్మలో నెఱుకయున్, సంకీర్తనల్, చింతనం
బను నీతొమ్మిది భక్తిమార్గముల సర్వాత్మున్ హరిన్ నమ్మి స
జ్జనుఁడై యుండుట భద్ర మంచుఁదలఁతున్ సత్యంబు దైత్యోత్తమా !

నవవిధ మార్గాలకు పోతన భాగవతంలో ఉదాహరణలు కనిపిస్తాయి.

| | | |
|---|---|---|
| 1) శ్రవణం | - | పరీక్షిత్తు |
| 2) కీర్తనం | - | కుంతీదేవి, భీష్ముడు |
| 3) స్మరణం | - | ఖట్వాంగుడు |
| 4) పాదసేవనం | - | సుదాముడు |
| 5) అర్చనం | - | కుబ్జ |
| 6) వందనం | - | అక్రూరుడు |
| 7) దాస్యం | - | అంబరీషుడు |
| 8) సఖ్యం | - | కుచేలుడు |
| 9) ఆత్మనివేదనం | - | గజేంద్రుడు |

ఇందులో కొందరు సగుణభక్తులు, కొందరు నిర్గుణభక్తులు కాగా గజేంద్రుడు మాత్రం సగుణ నిర్గుణ సంధి స్థానంలోనివాడు.

ఈ క్రింది భాగవత కావ్య స్వరూపాన్ని ఆవిష్కరిస్తుంది.

**లలితస్కంధము, కృష్ణమూలము, శుకాలాపాభిరామంబు, మం**
**జులతాశోభితమున్, సువర్ణసుమనస్సుజ్ఞేయమున్, సుందరో**
**జ్జ్వల వృత్తంబు, మహాఫలంబు, విమల వ్యాసాల వాలంబునై**
**వెలయున్ భాగవతాఖ్యకల్పతరు వుర్విన్ సద్ద్విజశ్రేయమై**

భాగవతంలో స్కంధాలున్నాయి. భాగవతానికి కృష్ణుడే మూలం. అది శుకమహర్షిచే చెప్పబడింది. అది పండితులచే బాగా తెలియదగ్గది. గొప్ప అందమైన ఇతివృత్తాలతో కూడింది. అది గొప్ప ఫలాన్ని (మోక్షం) ఇచ్చేది. వ్యాసమహర్షిచే వ్రాయబడింది. సజ్జనులకు బ్రహ్మజ్ఞులకు శ్రీయస్సును కలిగించేది.

రామాయణంలో "కాండ"లు, భారతంలో "పర్వాలు" ఉన్నట్లే భాగవతంలో "స్కంధా"లున్నాయి. అవి 12. పాఠ్యాంశమైన గజేంద్రమోక్షం "అష్టమ స్కంధం"లోనిది.

ఎంతో వైశిష్ట్యం కలిగిన శ్రీమహాభాగవతాన్ని బమ్మెర పోతన తెలుగువారి కందించటం తెలుగుజాతి అదృష్టం.

భాగవతం సాక్షాత్కరించిన భగవత్స్వరూపం.

### 7.2.4 కథా సందర్భం :

శుకమహర్షి భాగవతాన్ని పరీక్షిత్తునకు ప్రవచిస్తాడు. గజేంద్ర మోక్షణం అనే కథ శ్రీ మహాభాగవతంలోని అష్టమ స్కంధము నందలిది. ప్రతి స్కంధమూ అందమైనదే. అట్లాగే అష్టమ స్కంధం కూడా. ఇందులోని కథలు బహుళ ప్రచారాన్ని పొందాయి. "అష్టమశ్చక్షుషీ విష్ణోః" అని కౌషీతకీ సంహితలో ఉంది. అష్టమ స్కంధం విష్ణువు కన్నులు అని భావం.

అష్టమ స్కంధారంభంలో పరీక్షిత్తు శుకమహర్షినిలా ప్రశ్నించాడు. మహాత్మా ! శ్రీహరి ఏ మనువు కాలంలో ఏ పనిమీద పుట్టాడు. ఆ మనువుల పేర్లేమిటి ? వివరించండి అని అనుగగా శుకమహర్షి ఇలా చెప్పసాగాడు.

మనువులలో మొదటి మనువు స్వాయంభువు. రెండవవాడు స్వారోచిష మనువు. మూడవవాడు ఉత్తముడు. ఉత్తముని సోదరుడు తామసుడనువాడు నాల్గవవాడు. తామసునకు పదిమంది పుత్రులు. హరిమేధునకు హరిణియందు హరి జన్మించాడు. ఈతడే మొసలికి చిక్కిన గజేంద్రుణ్ణి ప్రాణ భయం నుండి రక్షించాడు.

అని అనగానే పరీక్షిత్తు శుకుని ఈవిధంగా అడిగాడు. నీళ్ళల్లో ఉండే మొసలికి అరణ్యంలో తిరిగే ఏనుగునకు ఎలా యుద్ధం సంభవించింది. ఈ పోరాటాన్ని పురుషోత్తముడు ఏవిధంగా ఆపి, గజేంద్రుని ఆరాటాన్ని మానేట్లు చేశాడు. ఓ మునీశ్వరా ! ఈ కథాస్థితిని వినాలని నాకు వేడుకగా ఉంది. నా కర్ణేంద్రియాలకు పండువయ్యేట్లుగా దానిని వినిపింపుము అని ప్రాయోపవిష్ణుండైన పరీక్షిత్తు శుకమహర్షిని ప్రార్థింపగా శుకుడు పరీక్షిత్తునకు గజేంద్రమోక్షణ కథను చెప్పటానికి ప్రారంభించాడు.

### 7.5 పాఠ్యభాగ సారాంశము :

రాజేంద్రా ! పాలసముద్రంలో త్రికూటం అనే పర్వతం ఉంది. ఆ త్రికూటపర్వత సమీపంలోని అడవులలో చెంచులు, చెలచెతలు నివసిస్తుంటారు. అడవిదున్నలు, ఎలుగుబంట్లు, ఖడ్గమృగాలు, చమరీమృగాలు, కోతులు, అడవి పందులు మొదలైన వన్యమృగాలు సంచరిస్తుంటాయి.

ఆ అడవిలో కొన్ని ఏనుగులు బాగా మదించినవి ఉన్నాయి. ఒకనాడు మదించిన ఏనుగుల గుంపు ఒకటి చెర్లాటలాడుకొంటూ తిరిగితిరిగి అలసిపోయి, దప్పికగొని నీటిమడుల్లో దిగాలన్న కోరికతో నీరు గాలి వీచే వైపు నడక సాగించాయి. అవి ఎంతో నల్లగా ఉన్నాయి. గుహల్లోనుంచి బయటికివచ్చిన చీకటియేమో అని అనిపించేంత నల్లగా ఉన్నాయి. అందులో కొన్ని గున్న ఏనుగులున్నాయి. అవి కూడా పెద్ద ఏనుగులకే మాత్రం తీసిపోవు. ఆ ఏనుగుల గుంపు విహరిస్తుండగా వాటి ధాటికి భయపడి పులులు పొదరిండ్లలో దూరాయి. ఎలుగుబంట్లు గుహల్లో దాక్కొన్నాయి. అడవిపందులు నేల బొరియల్లోకి వెళ్లిపోయాయి. కోతులు కొండలెక్కాయి.

ఆ ఏనుగుల చెక్కిళ్ళ నుండి మదజాలం కారుతోంది. అది చాలా మంచి వాసనను వెదజల్లుతోంది. దానిని త్రాగడం తుమ్మెదలకు ఇష్టం. దానిని త్రాగి సంతోషంగా ఎగురుతూ జుం జుం అంటూ పాటలు పాడాయి. మగతుమ్మెదలు ఆడుతుమ్మెదలతో కలసి ఉల్లాసాన్ని పొందాయి.

గున్నఏనుగులు కూడా విజృంభింపసాగాయి. అవి తమ కుంభస్థలాలతో కొండల్ని ఢీకొట్టిసాగాయి. అప్పుడు కొండలు కూడా తలక్రిందులై పడిపోయేవి. ఆ శబ్దానికి దిక్కులు బ్రద్దలయ్యేవి. దీన్ని చూచిన లోకాలన్నీ గడగడలాడాయి.

ఈవిధంగా ఇష్టానుసారం తిరుగుతున్న ఏనుగుల గుంపులో నుండి ఒక్క గజేంద్రుడు తన ఆడ ఏనుగులతో సహా దారి తప్పాడు. ఆ గజేంద్రుడు, తన ఆడ ఏనుగులతో కూడా మరోదారిలో ముందుకు సాగిపోయాడు. ఆ గజేంద్రుడు నీటి గుంటల ప్రక్కనే మొలచిన పచ్చికను మచ్చికతో ఆడ ఏనుగులకు అందిస్తున్నది. చేటల వంటి తన చెవులతో విసురుతూ ఆడ ఏనుగులు అలసటపోగొట్టి చెమటను నివారిస్తున్నది. ఈవిధంగా విలాసంగా విహరించి విహరించి దప్పిక ఎక్కువకాగా మనస్సు స్వాధీనం తప్పిపోయింది. ఎటుబడితే అటు నీటి కోసం చూస్తూ ప్రయాణం సాగించాడు.

ఆ సమీపంలోనే నీటిమడుగును చూచాడాగజేంద్రుడు. అందులో విచ్చుకొన్న కలువలు తామరలు రెండూ ఉన్నాయి. వాటిపై తుమ్మెదలు ముసురుతున్నాయి. చేపలు, తాబేళ్ళు, మొసళ్ళు భయంకరంగా నీటిని పైకి

ఎగజిమ్ముతున్నాయి. హంసలు, కొంగలు, చక్రవాక పక్షులు సంచరిస్తున్నాయి. ఆ మడుగు గట్టుమీద మర్రి, తాడి, మద్ది చెట్లతోపాటు పూలతీగలు పొదరిండ్లు ఉన్నాయి.

పద్మగంధంతో కూడిన చల్లనిగాలులు ఆ ఏనుగుల శరీరాలకు హాయినిచ్చాయి. తామరతూండ్లు తింటూ మధురమైన శబ్దాలుచేసే రాజహంసలు గొంతులు వాటి చెవులకు విందుగొలిపాయి. నిర్మలమైన అలల నుండి ఎగిసే నీటితుంపరలు ఆ ఏనుగుల దాహాన్ని తీరుస్తున్నాయి. ఆనందంగా ఆ మడుగులోకి ఒక్కసారిగా దిగాయి. దిగంగానే గజేంద్రుడు తొండంతో నీళ్ళు పీల్చాడు. మునిగాళ్ళపైనిక్కి నీటిని ఆకాశం వైపు చిమ్మాడు. పద్మాలున్న ఆ సరస్సులో విహరిస్తున్న గజేంద్రుని మీద ఆడ ఏనుగులు తొండాలతో నీళ్ళు చల్లాయి. అప్పుడాతడు సెలయేళ్ళతో కూడిన నీలాద్రిలాగా మెరిసాడు. కొన్ని ఆడ ఏనుగులు గజేంద్రునిపై పద్మాలు విసిరాయి. అప్పుడాతడు వేయికన్నులతో కూడిన దేవేంద్రునిలాగా విరాజిల్లాడు. గున్న ఏనుగులు అతనిపై కలువల పుప్పొడి చల్లాయి. అప్పుడాతడు బంగారుకొండలా వెలిగిపోయాడు.

ఈవిధంగా గజేంద్రుడు ఆ సరస్సులో క్రీడిస్తుండగా ఉన్నట్టుండి ఒక్కసారిగా ఒక పెద్దముసలి సరస్సులో నుండి పైకెగసింది. ఆ ధాటికి అందులోని ఇతర మొసళ్ళు చేపలు అదిరిపోయాయి. ఒక్క ఉదుటున పైకి దూకింది. తోకను ఝాడించింది. అప్పుడు సరస్సులోని అలల తాకిడికి గట్టుమీద చెట్లన్నీ నేలకొరిగే విధంగా భయంకరమైన హుంకారం చేస్తూ ఒక్కదెబ్బతో ఆ గజేంద్రుణ్ణి కోరలతో కరచి పట్టుకుంది.

వెంటనే గజేంద్రుడు మొసలిపట్టును తప్పించుకొని తన తొండం పైకెత్తి మొసలిపై ఒక దెబ్బ వేసింది. ఆ దెబ్బకు మొసలి నీళ్ళలో చచ్చినట్లుపడి వెంటనే తేఱుకొని చాలా వేగంతో ఆ మొసలి ముందరికాళ్ళను గట్టిగా పట్టుకుంది. అయినా గజేంద్రుడు భయపడలేదు. తన రెండు దంతాలతో పొడచి మొసలి బొరుసులు మూలాలు చిట్లిపోయేలా చేసాడు. ఆ మొసలి కూడా కాళ్ళను వదలిపెట్టి ఏనుగుతోక మూలాన్ని కరిచింది. ఏనుగుని మడుగులోకి లాగింది. ఏనుగు మొసలిని గట్టునకీడ్చింది. ఇది చూస్తే ఏనుగు కన్నా మొసలి, మొసలికన్నా ఏనుగు బలంగానే కనిపిస్తున్నాయంటూ అతలకుతల భటులు అదిరిపడ్డారు. ఈవిధంగా ఏనుగూ మొసలీ ఒకదానితో ఒకటి విజృంభించి ఒకదాన్ని మరొకటిమించాలని "ఢీ" కొన్నాయి. ఈ పోరాటంలో నిద్రాహారాలు మాని మహాపరాక్రమంతో ఘోరంగా చెలరేగి చాలాకాలం పోరాడాయి. నీటిలోకి మళ్ళీమళ్ళీ ఈడుస్తున్న మొసలిని గజేంద్రుడు తన దంతాలతో దాని కొమ్ము పగిలేట్లు పొడిచాడు. తొండంతో దాని మెడను చుట్టుపట్టి విసేరేశాడు. ఇలా పోరాడుతున్న గజేంద్రుణ్ణి ఒంటరిగా విడిచిపెట్టిపోలేక ఆడు ఏనుగులు ఆత్రంగా అలాగే చూస్తూ నిలబడిపోయాయి.

ఇక మొసలి విజృంభించటం ప్రారంభమైంది. అది సింహంలాగా గర్జించి ఏనుగు కుంభస్థలం పైకి ఉరికింది. పాదాలను ఆక్రమించింది. వీపు చరిచింది. తోకతో కొట్టింది. అంతటి ఏనుగును సైతం నీళ్ళలో ముంచింది. తానూ మునిగింది. నక్కినక్కి ఒక్కసారిగా ఆ ఏనుగుపై పడసాగింది. నీళ్ళల్లో దాక్కొంటూ ఏనుగు గట్టుమీదకు వెళ్తుండగా అడ్డంగా వస్తుంది. దాని కాళ్లను బంధిస్తుంది. ముందుకుపోనీక వెనక్కిరానీక భయంతో కూలిపోయేట్లు చేస్తుంది. లేస్తే ఒళ్ళు ఝాడించి పైకెగురుతుంది. శౌర్యంతో చీలుస్తుంది. క్రోధంతో వేధిస్తుంది. తన రెండు కాళ్ళను నేలపై గట్టిగా ఆనిస్తుంది. ఊపిరి బిగబట్టి పంచేంద్రియోన్మాదాన్ని పరిమార్చుతుంది. పరమాత్మ స్థానాన్ని ఆక్రమించి ఆనందించే పరమ యోగిలాగా ఒప్పుచూ ఆ ఏనుగు పాదాలను వదలకుండా పట్టుకొని పరాక్రమాన్ని చూపిస్తుంది.

గజేంద్రుణ్ణి బాధిస్తున్న మొసలిని చూచి స్వర్గంలో ఉండే ఐరావతం తెల్లబోయింది. దేవేంద్రుణ్ణి క్రిందబడద్రోసింది. దేవతలు పట్టుకోవడానికి పోగా పరుగెత్తింది.

ఇక ఆ గజేంద్రుడు కలత చెందాడు. బ్రతుకు ప్రవాహంలోబడి, మోహమనే తీగతోకట్టి వేయబడ్డ స్థితిని వదలించుకోలేక సందేహావస్థలో దొర్లే దేహి వలె దీనదశను బొందాడు ఆ గజేంద్రుడు. మొసలి యొక్క కోరలకు చిక్కి

గాయమైన కాలిగిట్టలతో గజేంద్రుడు పోరాడుతూనే ఉన్నాడు. అలసిపోకుండా విసుగూ విరామంలేకుండా వేయి సంవత్సరాల పాటు పోరు సాగించాడు. తన బలాన్ని ముసలిబలాన్ని బేరీజు వేసుకొన్నాడు. దీనిని గెలవాలన్న ఆశ పెట్టుకోరాదు, దీనితో పోరాడేశక్తి నాలోలేదు అని ఆలోచించాడు. పూర్వపుణ్యఫల దివ్యజ్ఞాన సంపత్తితో ఇలా అనుకొన్నాడు.

దీనినేవిధంగా గెల్వగలను. ఏ దేవుణ్ణి ప్రార్థించాలి. ఎవరిని పిలవాలి. నాకు అడ్డుపడే వారెవ్వరు. ఈ ముసలిని వారించేవారెవరు? నా మొరను ఆలకించే మహాపుణ్యాత్ములు లేరా ? ఉంటే వారికి మ్రొక్కుతాను. నన్ను సేవించే ఆడ ఏనుగులతో హాయిగా గంధపుచెట్ల నీడలో ఉండకుండా ఈ నీరాశతో ఈ మడుగునకే ఎందుకు రావాలి. భయం భయంగానే ఉంది. ఈశ్వరా ! ఇంకెట్లో కదా !

ఈ జగమంతా ఎవరివల్ల పుడుతుందో, ఎవనిలో లీనమైయుంటుందో, ఎవనియందు అణగి ఉంటుందో, ఈ జగత్తుకు మూలకారణం అయిన వాడెవడో, అనాది మధ్య లయుడెవ్వడో, సర్వమూ తానే అయినావాడెవడో ఆ ఈశ్వరుడే శరణు కోరతాను. ఒకసారి లోకాలను సృష్టించి, ఇంకొకసారి తనలో లీనం చేసుకొని, రెండుతానే అయి, ఆత్మలకు మూలమైన ఆ పరమేశ్వరుణ్ణి ధ్యానిస్తాను.

ఈ లోకాలు, లోకేశులు, లోకస్థులు నశించిన తర్వాత కూడా, లోకరహితమైన చీకట్లకు ఆవలిప్రదేశంలో అఖండ తేజోరూపంలో వెలుగొందే పరమాత్మను నేను సేవిస్తాను. ఏ దేవుడు నటుడిలాగా అనేక రూపాలతో నటిస్తాడో, ఎవని ప్రవర్తన ఇతరులకు అగోచరంగా ఉంటుందో ఆ పరమపురుషుని స్తుతిస్తాను. ఋషులు, పుణ్యాత్ములు, సాధువులు, సత్పురుషులు ఎవనిని అర్చిస్తారో ఆ పరమాత్ముడే నాకు దిక్కు. భవము, దోషము, రూపము, కర్మము, ఆహ్వాయము, గుణాలు లేకుండానే లోకాలను సృష్టించడానికి, నశింపజేయడానికై తన మాయచే భవరూపాదులను ధరిస్తాడో, ఆ పరేశునకు, ఆ అనంతశక్తికి, ఆ బ్రహ్మకు, చిత్రప్రవర్తనకు, ఫలాపేక్ష లేకుండా కర్మను చేసేవారికి అభినందించేవానికి నేను నమస్కరిస్తాను. అలాగే శాంతుడైనవానికి, మోక్షాధిపతికి, స్వపరభేద రహితునకు, దుష్టులను ఘోరంగా శిక్షించేవానికి విజ్ఞానానికి, సర్వజ్ఞునకు, మూలప్రకృతికి, ఆత్మమూలునకు నిష్కారణునకు నన్ను మన్నించడానికై నమస్కరిస్తాను.

యోగాగ్నిలో తమ కర్మలను దగ్ధంచేసి యోగులు ఆ దేవుని ఎల్లప్పుడూ చూస్తుంటారో ఆ పరమపురుషుని నేను సేవిస్తాను. ఆగమామ్నాయ జలధియైనవానికి, ఉత్తమగుణరాశికి, దిక్కులేకి నాబోటి పశువుల పాపాలను హరించేవానికి, నేను నమస్కరిస్తాను. ధర్మార్థ కామాదులను విడిచిపెట్టి విబుధులు ఎవనిని సేవించి ఇష్టగతిని పొందుతారో, ముక్తాత్ములెవ్వని ధ్యానిస్తుంటారో, ఆ మహేశుని, అతీంద్రియుని, ఈశుని, నేను సేవిస్తాను. అగ్నిదేవుడు జ్వాలలను, సూర్యుడు తన కిరణాలను నిడిగించి మరలా తానే అడగింపజేస్తారో ఆ విధంగానే తన కిరణాల చేత అఖిల లోకాలను ప్రాణులను అనేక నామరూపాలతో మిరయించి, మళ్ళీ లయింపజేస్తాడో - అట్లే తాను స్త్రీపుంనపుంసక భేదాలలో ఏదీ కాకుండా అతీతంగా ఉంటూ తరువాత అన్నీ తానే అయి ప్రకాశిస్తుంటాడో అట్టి విభుని స్మరిస్తాను.

భగవంతుడు దీనుల యెడ ఉన్నాడని అంటారు. పరమయోగి గణముల పాలివాడని కూడా అంటారు. అన్ని దిక్కుల్లోనూ ఆయన ఉన్నాడనీ అంటారు. కలడు, కలడు అని అనబడేవాడు నిజంగా ఉన్నాడో లేడో ! ఉన్నవాడు, లేనివాడు అని చూడకుండా ప్రత్యక్ష్యమయ్యే దేవుడు, నాపాలిట ఉన్నాడో లేదో అని సందేహిస్తుండగా సాక్ష్యాత్కరింపడా! అసాధువులచేత సాధువులు పీడింపబడుతుంటే వారికి అడ్డుపడేవాడు - నాకు రక్షణగా రాడా! బహిశ్చక్షువులతోనేకాక అంతరింద్రియాలతో చూచేవారిని దయతో చూచునట్టివాడు నా పాటును చూడడా ! దీనుల మొరను వింటూ తన్ను తాను మరచిపోయేవాడు నా మొర వినడా ! అన్నిరూపాలు తానైనవాడు, ఆదిమధ్యాంతాలు లేక సర్వవ్యాపియైనవాడు భక్తజనముల దీనుల పాలివాడు అయిన భగవంతుడు నా మొర వినడె, నా దశ చూడడె, నన్ను రక్షించాలని ఆలోచించడె! వెంటనే రాడె !

విశ్వకరుని, విశ్వదూరుని, విశ్వాత్మకుని, విశ్వవేద్యుని, విశ్వుని, అవిశ్వుని, శాశ్వతుని, అజుని, బ్రహ్మను, ప్రభువును, ఈశ్వరుని, పరమపురుషునినే సేవిస్తాను". అని ఈవిధంగా పలికి గజేంద్రుడు మనస్సులో ఈశ్వర సన్నిధానంబు కల్పించుకొని ఈ విధంగా అన్నాడు.

"భగవంతుడా ! నా దేహంలో శక్తిలేదు, ధైర్యం సన్నగిల్లిపోయింది. పంచప్రాణాలు కుంగిపోతున్నాయి. మూర్ఛ వస్తున్నది. శరీరం అలసిపోయింది. శ్రమావహంగా ఉంది. నీవే తప్ప ఇతఃపం బెఱుంగను. ఈ దీనుని మన్నింపవలసినది. ఈశ్వరా ! రా ! వరదా ! రక్షించు. పుణ్యాత్ముడా ! కాపాడు. ఓ దయాసాగరా ! నీవు జీవుల మాట వింటావట. నీవు ప్రవేశింపరాని చోటేలేదట. శరణు కోరినవారు పిలవగానే "ఓ" అని బదులిస్తాడట. అన్నింటినీ గమనిస్తుంటావట.

ఓ కమలాప్త ! ఓ వరద ! ఓ ప్రతిపక్ష విదూర ! ఓ విమల ప్రభావ ! రావే ! కరుణింపవే ! నన్ను రక్షింపవే అని పలికి ఈశ్వరుండా పన్నుడనైన నన్ను రక్షించుగాక !" అని గజేంద్రుడు ఆకాశం వైపు చూస్తూ నిట్టూర్పులు నిగుడిస్తూ మొరపెట్టుకొన్నాడు.

ఆ సమయంలో బ్రహ్మాదిదేవతలందరూ గజేంద్రుని మొరను విన్నారు. వారికి విశ్వమయత లేకుండుటచేత విన్నా ఊరుకున్నారు. విశ్వమయుడైన విష్ణువు మాత్రం గజేంద్రుణ్ణి రక్షించాలని సంకల్పించాడు. ఆ సమయంలో విష్ణువు ఎక్కడో వైకుంఠపురంలో అంతఃపురంలోని ప్రధానమైన మేడకు ఎడమప్రక్కన ఉన్న మందారవనంలోని "అమృత" సరస్సు ప్రాంతంలో చంద్రకాంత శిలలతో కూడిన తిన్నిపై లక్ష్మీదేవితో వినోదిస్తున్నాడు. భయంతో స్వాధీనం తప్పిన గజేంద్రుడు "పాహి పాహి" అనడం విన్నాడు. వేగంగా బయలుదేరాడు. ఆ తొందరలో ఆ విషయాన్ని లక్ష్మీదేవికి చెప్పలేదు. శంఖచక్రాలను సైతం ధరించలేదు. పరివారాన్ని ఎవరినీ పిలవలేదు. గరుత్మంతుణ్ణి సిద్ధపఱువలేదు. లక్ష్మీదేవి పైట కొంగును వదలిపెట్టటం కూడా మర్చిపోయాడు. అంతలోనే ఆ భక్తజన పాలన పరాయణుండునైన నారాయణుండు తన పరికరాలను ధరించి ఆకాశమార్గంలో ప్రయాణం సాగించాడు.

అప్పుడు విష్ణువు వెంట లక్ష్మీదేవి, ఆమె వెంట అంతఃపుర పరివారము, ఆ వెన్క గరుత్మంతుడు, ఆ సమీపంలో ధనుస్సు, గద, శంఖచక్రాలు, నారదుడు, సేనాపతి, రాగా వైకుంఠంలో ఆ బాలగోపాలం పరుగెత్తుకుంటూ వచ్చారు.

తనపైట కొంగును విడువకుండా వెళ్తున్న విష్ణువు వెంట సాగుతున్న లక్ష్మీదేవి ఈవిధంగా మనసులో అనుకున్నది "స్వామివారు ఎక్కడికి వెళ్తున్నారో చెప్పడం లేదు, అనాథస్త్రీల ఆక్రందనం ఏమైనా విన్నాడా ? వేదాలను ఏ దుర్మార్గులైన దొంగిలించారా ? రాక్షసులేమైనా అమరావతిపై దండయాత్ర చేశారా? ఏడీ విష్ణువని దుర్జనులెవరైనా భక్తులను నిలదీసారా?" అని ఆలోచిస్తూ స్వామి వెంట పరుగులు తీసే లక్ష్మీదేవికి చెవిపోగులు బాగా కదలాడుతున్నాయి. భుజాలమీద కొప్పు నృత్యం చేస్తున్నది. పైట జారిపోతున్నది. ఒడ్డాణం వదలైపోతున్నది. నదుటిపూతలు చెదిరిపోతున్నాయి. పైట కొంగు మాత్రం విష్ణువు చేతిలోనేయుంది.

విష్ణువు ఎక్కడికి వెళ్తున్నాడో అడగాలనుకొని వేగంగా ముందుకు వెళ్తుంది. అడిగినా ఆ తొందరలో బదులివ్వడని ఊరుకుంది. ఇట్లా ఊగిసలాటలో ఒక అడుగు ముందుకు ఒక అడుగు వెనక్కి వేస్తుంది.

అలా వెళ్తున్న లక్ష్మీదేవి చాలా అందంగా వుంది. ఆమె ముఖపద్మం మీద తుమ్మెదలు ముసరుతున్నాయి. తుమ్మెదలను తోలగానే దొండపండులాంటి ఆమె పెదవుల్ని చిలుకలు సమీపించాయి. చిలకలను తోలగానే చేపలవంటి తన కన్నుల కోసం అంటే కన్నులనే చేపలుగా భ్రమించి వాటికోసం ఆకాశగంగలోని చేపలు ఎగిసిపడ్డాయి. ఆమె శరీరంతో రాసుకొనుటకై ఆకాశంలో మెరుపుతీగలు బారులు తీశాయి. నీలమేఘశ్యాముని వెంట ఆమె తళుక్కుమనే మెరుపుతీగలా మెరుస్తున్నది.

లక్ష్మీదేవి ఆ విధంగా వుండగా - రాక్షస జీవన సంపత్తిని నశింపజేసేవాడు, కరుణతో వర్ధిల్లువాడి యోగుల హృద్వన్యాలతో వర్ధిల్లువాడు, భక్తుల ప్రాభవాన్ని మరీ అలంకరించేవాడు, ఇందిరా సేవలనందుకొనేవాడు, జయశీలుడు, తేజోమయుడైన విష్ణువు ఆకాశమార్గంలో వస్తుండగా దేవతలు చూశారు. చూచి - “అడుగో ఘనుడైన విష్ణువు, విష్ణువు ప్రక్కనే లక్ష్మీ వుంది, చూచారా ! అదుగో శంఖనాదం, విన్నారా ! అదుగో చక్రం, వాడే గరుత్మంతుడు అడుగో అడుగో” అని అంటూ “నమో నారాయణ” అని ఏనుగును కాపాడటానికి వస్తున్న విష్ణువునకు దేవతలు మ్రొక్కారు.

కుంజరేంద్ర పాలన పారవశ్యంబుననున్న విష్ణువు దేవతలుపెట్టే నమస్కారాలను గమనింపలేదు, అలా విష్ణువు కొంతదూరం పోయి, శింశుమారచక్రంవలే మకరకుళీర మీన మిధునం బైనదియు, కుబేరుని భాండాగారంవలే స్వచ్ఛకచ్ఛపం బైనదియును, భాగ్యవంతుని భాగధేయంవలె నరాగజీవనమైనదియును, వైకుంఠంవలె శంఖచక్రకమలాలచే అలంకరింపబడినదియును, సంసారచక్రం వలే ద్వంద్వ సంకీర్ణమైనదియును అగు సరస్సును చూచాడు. వెంటనే విష్ణువు వేగంచేత భూచక్రాన్నే కదిలించేది, పై కెగజిమ్మే అగ్నికణాలతో ఆకాశంలోని చుక్కలనే పరాభవించగలిగేది, బ్రహ్మాండ భాండాల కాంతుల నడుడ తిరుగులేనిది, దేవతలను కాపాడేది అయిన చక్రాన్ని నక్రాన్ని ఖండించడానికై పంపాడు.

ఆ చక్రం మిక్కిలి వేగంతో సరస్సులోకి చొచ్చుకొనిపోయింది. అప్పుడే వికసించిన పద్మాలను ఆలింగనం చేసుకోవటానికై వచ్చిన సూర్యబింబంలా ఆ చక్రం ప్రకాశించింది. దుష్టమైన మొసలి ఉండే చోటును సమీపించింది. అవిభయంకరంగా మొసలి తలను నరికి దాన్ని చంపింది. సుదర్శనచక్రం మొసలి తలను ద్రుంచే సమయంలో జగుత్తులోని మొసళ్ళన్నీ భయపడ్డాయి. వాటి దిక్కున్నచోటునకు పోయాయి. రాశిచక్రంలోని మకరం సూర్యుని చాటునకు పోయింది. మరొక మకరం కుబేరుణ్ణి ఆశ్రయించింది. సముద్రంలోని ఇతర మొసళ్ళన్నీ ఆదికూర్మం చెంత దాక్కున్నాయి.

చీకటి నుండి వెలువడిన చంద్రుడిలాగా, సంసార బంధాల నుండి విముక్తుడైన విరక్తునిలాగా మొసలిపట్టు విడిపించుకొని కాళ్ళు ఝాడించి, ఆడుఏనుగులు తమ తొండాలతో చిమ్మబడిన అమృతజల స్నానంతో అలసట తీర్చుకొన్నవాడై సౌందర్యంతో గజేంద్రుడు ప్రకాశించాడు.

- డా॥ శ్రిష్టి చంద్రమౌళిశర్మ
రిటైర్డ్ ప్రిన్సిపాల్
శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ డిగ్రీ కళాశాల
పొదిలి, ప్రకాశం జిల్లా.

పాఠం - 8

# గజేంద్ర మోక్షము

- బమ్మెర పోతన

## (మహాభాగవతం - అష్టమ స్కంధం - 25 నుండి 115 పద్యాల వరకు)

## అర్థ తాత్పర్యాలు

**విషయసూచిక :**

8.1 ఉద్దేశ్యం

8.2 అర్థ తాత్పర్యాలు

### 8.1 ఉద్దేశ్యం :

"శబ్దార్థౌ సహితౌ కావ్యమ్" కాబట్టి ఒక కావ్యాన్ని అవగాహన చేసుకోవటానికి శబ్దార్థాలు రెండూ తెలుసుకోవటం ఆవశ్యకం. ఒక పదానికి అనేకార్థాలున్నప్పుడు ప్రస్తుతార్థం ఏది అని తెలుసుకునే పరిజ్ఞానం ఏర్పడాలి. అర్థాలు తెలుసుకోవడం ద్వారా పద్యభావం బోధపడుతుంది. అదీ దీని ముఖ్యోద్దేశ్యం.

### 8.1 అర్థతాత్పర్యాలు :

**25వ పద్యం :**

| | | |
|---|---|---|
| భిల్లీ | = | చెంచెత, |
| బోయత (అడవిజాతి స్త్రీ) | | |
| భిల్లుడు | = | చెంచు, బోయవాడు |
| లులాయకము | = | అడవిదున్న |
| భల్లుకము | = | ఎలుగుబంటి |
| ఖడ్గ | = | ఖడ్గమృగము |
| గవయ | = | గురుపోతు |
| వలిముఖము | = | కోతి |
| చమరీ | = | చమరీ మృగములు (దీని తోక చివర కుచ్చుగవుండును) |
| ఝిల్లీ | = | ఈలపురుగు |
| హరి | = | సింహము |
| శరభము | = | శరభ మృగము (సింహము కన్నా క్రూరము) |
| కిటిమల్ల | = | బలిసిన పంది |
| ఘూక | = | గుడ్లగూబ |

**తాత్పర్యము :**

చెంచెతలతోను, చెంచులతోను, అడవిదున్నతలతోను, ఎలుగుబంట్లతోను, పాములతోను, ఖడ్గ, గవయ మృగములతోను, కోతులతోను, చమరీమృగములతోను, సింహ శరభ మృగములతోను, బలిసిన పందులతోను, అద్భుతమైన కాకులతోను, గుడ్లగూబలతోను నిండిన ఆ అడవియందు (తరువాతి పద్యంలో అన్వయం)

26వ పద్యం : సమగ్ర వ్యాఖ్యలో చూడండి.

**27వ పద్యం :**

| | | |
|---|---|---|
| అంధకారము | = | చీకటి |
| అద్రి | = | కొండ |
| వెఱచి | = | భయపడి |
| ఎడరు వేచి | = | తగిన సమయం కొఱకు కాచుకొని |

**తాత్పర్యం :**

పగటివేళకు భయపడిన చీకటి కొండగుహలలో దాగింది. సమయం కోసం కాచుకొని, సూర్యుడు అస్తమించగనే (వృద్ధతనున్నన్) ఆ చీకటి గుహలలో నుండి బయటకు వచ్చిందా అన్నట్లు గుహల్లో నుండి ఏనుగులు బయటకు వచ్చాయి. (గుహల్లో ఉండటం, నల్లగా ఉండటం చీకటికి, ఏనుగులకు సామ్యం) అలం = ఉత్ప్రేక్ష

**28వ పద్యం :**

| | | |
|---|---|---|
| తలఁగవు | = | తొలగిపోకుండు |
| మలఁగవు | = | వదలిపోకుండు |
| మార్కొను | = | ఎదిరించు |
| కడిమి | = | పరాక్రమము |
| కలఁగవు | = | కలతపడవు, క్షోభపడవు (భయపడవు) |
| ఇల | = | నేల, భూమి |

**తాత్పర్యం :**

అయ్యటవీ భూమిలోని గున్నఏనుగులు సైతం బలసంపదచేత కొండలను కూడా ఢీకొంటాయి. సింహాలను చూచినా వెనక్కు మళ్ళవు. పరాక్రమంతో ఎదిరిస్తాయి. పిడుగులకైనా బెదరవు.

**29వ పద్యం :**

| | | |
|---|---|---|
| భూదారములు | = | అడవి పందులు |
| హరిత్ + అంతములు | = | హరిదంతములు దిక్కుల చివరి భాగములు |
| హరిణచయము | = | లేళ్ళ సమూహము |
| మహిషము | = | దున్నపోతు |
| సంఘము | = | సమూహము, గుంపు |
| కపులు | = | కోతులు |
| గండశైలములు | = | కొండ నుండి జారిపడిన రాళ్ళు |
| వల్మీకములు | = | పుట్టలు |
| వనము | = | అడవి |
| భుజంగము | = | పాము |
| నీలకంఠములు | = | నెమళ్ళు |
| నింగి | = | ఆకాశము |
| వాలము | = | తోక |

| | | |
|---|---|---|
| చామరము | = | విసనకఱ్ఱ |
| భయదము | = | భయంకరము |
| పరిహేల | = | లీల |
| భద్రకరులు | = | మదపుటేనుగులు |
| జాతి | = | దిగులు |

**తాత్పర్యం :**

ఆ మదపుటేన్గులు విలాసంగా విహరిస్తూ వస్తూండగా వాటి గాలి సోకినంతమాత్రాన పులులన్నీ పొదరిండ్లలో దూరాయి. భీకరమైన ఎలుగుబంట్లు గుహలలో ప్రవేశించాయి. అడవిపందులు నేల బొరియలలో దాక్కుంటున్నాయి. లేళ్ళు దిగంతాలదాకా పారిపోతున్నాయి. అడవిదున్నల గుంపులు నీటి మడుగులలో చొరబడుతున్నాయి. కోతులు కొండరాళ్ళపైకి ప్రాకుతున్నాయి. అడవిపాములు పుట్టలలోకి పోతున్నాయి. నెమళ్ళు నింగిపై కెగురుతున్నాయి. సవరపు మెకములు తమ తోకలనే విసనకఱ్ఱలతో విసురుతూ ఏనుగుల అలసటను పోగుడుతున్నాయి.

**30వ పద్యం :**

| | | |
|---|---|---|
| దానము | = | ఏనుగుల గండస్థలము (చెక్కిళ్ళు) నుండి కారే మదజలము |
| ఆమోదము | = | వాసన |
| తమకము | = | మోహము |
| కొదమ | = | యౌవనము అంకురించినది |
| పొదలు | = | విజృంభించు |

**తాత్పర్యం :**

పడుచు తుమ్మెదల గుంపులు పరిమళంతో కూడిన ఏన్గుల మదజలాన్ని మిక్కిలి వ్యామోహంతో పానం చేసి విజృంభించుచూ జుం జుం అని గానం చేశాయి.

**31వ పద్యం :**

| | | |
|---|---|---|
| నాగము | = | ఏనుగు |
| బోటి | = | ఆడది |
| పోటుతనము | = | మగటిమి |
| తేఁటి | = | తుమ్మెద (మగతుమ్మెద అని ప్రకరణార్థం) |
| ఒరుప్రియ | = | వేరొకరి ప్రియురాలు |

**తాత్పర్యం :**

ఒక గండుతుమ్మెద ఏనుగుల దమజల పరిమళాన్ని వేరొకరి ప్రియురాలికి మాటిమాటికి ఎందుకివ్వడం అని, తన దగ్గరజేరిన ఆడుతుమ్మెదకు నిండైన మగతనము మీరగా ఆ పరిమళాన్ని అందిస్తుంది.

**32వ పద్యం :**

| | | |
|---|---|---|
| అంగీకృతము | = | అంగీకరింపబడిన, స్వీకరింపబడిన |
| రంగత్ | = | ఒప్పుచున్న |
| మాతంగి | = | ఆడఏనుగు |

| | | |
|---|---|---|
| భృంగీగణము | = | ఆడుతుమ్మెదల సమూహము |
| భ్రమానుపెట్టినమాడ్కి | = | చలనము లేక కొయ్యబారినట్లు చేయు విధము |

**తాత్పర్యం :**

ఆడుతుమ్మెదల సమూహములు ఆడుఏనుగులు మదజల గంధాన్ని ఆఘ్రాణించిన వగుచు, మిక్కిలి వేడుకతో తమ గాన విశేషములచేత నిశ్చేష్టులగువారినిగా చేయుచు ఒప్పుచున్నవి.

**33వ పద్యం :**

| | | |
|---|---|---|
| వల్లభలు | = | ఆడతుమ్మెదలు |
| మునుపడన్ | = | ముందుగా |
| వారణము | = | ఏనుగు |
| మధుకరము | = | తుమ్మెద |
| వల్లభుఁడు | = | భర్త |
| మధుకరవల్లభులు | = | మగ తుమ్మెదలు |
| ఒల్లక | = | ఇష్టపడక |
| ఉల్లము | = | హృదయము |
| ఉల్లాసము | = | సంతోషము |

**తాత్పర్యం :**

ఆడుతుమ్మెదలు ముందుగాపోయి తన కిష్టమని మదజలము కోసం ముసురుకొన్నప్పుడు మగతుమ్మెదలు మదజలాన్నికాదని హృదయాల్లో ఎంతో ఉల్లాసాన్ని పొందాయి (ఆడుతుమ్మెదలను చూచి అని)

**35వ పద్యం :**

| | | |
|---|---|---|
| కలభము | = | గున్నఏనుగు (30 సం॥ల కలది) |
| పల్వలము | = | నీలపడియ |
| కారు | = | అడవి |
| మట్టాడు | = | త్రొక్కు |
| ఫలభూజంబులు | = | పండ్లచెట్లు |
| కొలఁకు | = | గుంట, సరస్సు |
| గొబ్బిళ్ళు | = | వినోదక్రీడ |
| కోరాడు | = | దంతములతో నేలను పొడిచి దుమ్మెత్తి పైకిచల్లు |
| చెరలాడు | = | విహరించు |
| జొంపము | = | ఆకులు, కొమ్మలు మొదలగువాని గుంపు |

**తాత్పర్యము :**

నీటిపడియలను వాసన చూసి త్రొక్కుచూ, పండ్లచెట్లను దాటుకుంటూ, గుబురుగావున్న చివుళ్ళను గబగబ మేస్తూ, పులులను అడవిదున్నలను, మృగములను తప్పించుకొనిపోకుండా కట్టడిచేస్తూ సరస్సులోనికి చొచ్చి చిందరవందర చేస్తూ కొండలమీద వినోదక్రీడలతో గున్నఏనుగులు విహారం చేస్తున్నాయి.

**36వ పద్యం :**

| | | |
|---|---|---|
| వృత | = | చుట్టబడిన |
| గండంబులు | = | చెక్కిళ్ళు |
| ఘట్టన | = | గట్టించుట |
| బెండుపడు | = | నిస్సారమగు |
| బెగడు | = | భయము |

**తాత్పర్యము :**

ఆ మదించిన ఏనుగులు తమ తొండాలతో తమ చెక్కిళ్ళను, కుంభస్థలాలను గట్టింపగా (ఆ ధ్వనికి) కొండలు కూడా తల్లక్రిందులై పడుతున్నాయి. దిక్కులు పిక్కటిల్లుతున్నాయి. దానిని చూచి లోకాలు భయభ్రాంతులౌతున్నాయి.

**37వ పద్యం :**

| | | |
|---|---|---|
| ఇభయూథము | = | ఏనుగుల సమూహము |
| కరినాథుడు | = | గజేంద్రుడు |
| కరేణువు | = | ఆడుఏనుగు |
| కోటి | = | సమూహము |
| ఎడతెగి | = | విడివడి |
| చిక్కెన్ | = | చిక్కుపడెను (వెనుకబడెను) |

**తాత్పర్యం :**

అడవిలో ఎక్కడచూచినా అధిక సంఖ్యలో తిరుగు ఏన్గుల గుంపులో ఒక్క గజేంద్రుడు కొన్ని ఆడఏనుగులు మాత్రం తనను సేవించుచుండగా గుంపులో నుండి విడివడి చిక్కుపడ్డాడు.

**38వ వచనం :**

| | | |
|---|---|---|
| ఉభయ పార్శ్వంబులు | = | రెండు ప్రక్కలు |
| తృష + ఆర్ధితంబులు + ఐ | | |
| తృషార్ధింబులై | = | దప్పిక గొన్నవై |
| గములు | = | గుంపులు |
| తెఱంగు | = | దారి |
| తొలంగుడుపడి | = | తొలగిపోయి |
| ఈశ్వర + ఆయత్తము | | |
| ఈశ్వరాయత్తము | = | దైవాధీనము |
| సంవిత్తము | = | తెలివిబొందినది |

**తాత్పర్యం :**

ఈవిధంగా తనకు ముందువెనుకలు, రెండువైపుల దప్పికగొని వచ్చు ఏనుగు గుంపులను చూడక, దారితప్పి ప్రక్కదారిపట్టి దైవాధీనమైన చిత్తము స్వాధీనంలో లేనికారణంగా తనను తాను ఆడుఏనుగుల సమూహము ఒకదారిలో పోతూ (తరువాతి పద్యంలో అన్వయం)

**39వ పద్యం :**

| | | |
|---|---|---|
| మచ్చిక | = | మోహము |
| అచ్చికము | = | కొఱత |
| ఇవురు | = | చిగురు |
| క్రొవ్వు | = | చేవ |
| ఎలయు | = | చేరు |
| పాలు | = | భాగము |
| కర్ణతాళంబులు | = | తాటాకులంతటి చెవులు |
| దయిత | = | ప్రియురాలు |
| పిఱుదుచక్కట్ల | = | వెనుకవైపు |
| మూర్కొని | = | వాసనచూచి |
| వెద | = | పశుఋతువు |
| వివేకించు | = | ఎఱుగు |
| కొమ్ము | = | దంతము |

**తాత్పర్యము :**

శ్రేష్ఠుడైన ఆ గజరాజు నీటిపడియలందలి లేతపచ్చికను దండిగా తన ప్రియురాంద్రకు మచ్చికతో నందిస్తాడు. చిగురు గుబురులను, చేవదేలిన పూగొమ్మలను పంచిపెడతాడు. గొప్పదానజలముచే శీతలమైన తాటాకులంతటి చెవులతో విసరి ప్రియురాంద్ర యొక్క మేనిచెమటను పోగడతాడు. దంతములతో మెత్తగా మెల్లగా మెడ నిమురుచూ అనురాగముతో ప్రేమను చూపిస్తాడు. వెనుకకు చేసి వాసనచూసి తొండమును ఆకాశము వైపు చాపుతాడు. ఋతుసమయాన్ని గుర్తించి క్రీడిస్తాడు. విశ్రమిస్తాడు.

**40వ పద్యం :**

| | | |
|---|---|---|
| డిగ్గి | = | దిగి, తగ్గి |
| ఈఁగన్ | = | పొందగా |
| యానము | = | నడక |
| చిఱుదొడ | = | పిక్క |
| కరము | = | తొండము |
| మేఖల | = | మొలనూలు (ఒడ్డాణము) |
| రుచి | = | కాంతి |
| దీప్తులు | = | కాంతులు |
| తిగుచు | = | ఆకర్షించు |
| హరిత్ + ఇభేంద్రుడు | = | దిగ్గజేంద్రుడు |
| కుంభివిభుడు | = | గజరాజు |
| ఒప్పులకుప్ప | = | అందాలప్రోవు (ఒప్పులకుప్ప - ఒక జాతీయం) |

**తాత్పర్యం :**

తన కుంభస్థలం యొక్క నిండుదనానికన్న తాము తక్కువయని స్త్రీల కుచములు పైట కొంగున మాటుగొనగా, తన నడకలతీవికి సరిపోదని స్త్రీల నడకలు అందెల యొక్క అండనందగా, తన తొండము యొక్క శోభచూచి తగ్గి స్త్రీల పిక్కలు మొలనూలు కాంతిని తోడుచేసికొనగా, తన దంతాల తెల్లని కాంతికి ఓడిపోయి జవ్వనుల నవ్వుల ముఖమనెడి చంద్రుని కాంతిని కప్పుకొనగా, తన మనోజ్ఞమైన కాంతిమంతమైన రూపము చూచి అంజన, అభ్రముపు, కపిల మొదలైన దిగ్గజాల భార్యలందరూ తన వెంట నడువగా ఆ గజేంద్రుడు ఒప్పులకుప్పలాగా ఒప్పెను.

**41వ వచనం :**

| | | |
|---|---|---|
| గహనము | = | అరణ్యము |
| పిపాసా పరాయత్తచిత్తము | = | నీరు దావనిచ్ఛకు వశమైన మనస్సు |

**తాత్పర్యం :**

ఇంకను ఆ గజేంద్రుడు ఎన్నో అడవులలో విహరించి, దారితప్పి దప్పికగొని మనస్సు స్వాధీనము తప్పగా, మదించిన ఆడ ఏనుగులు మొత్తము తాను పోయిపోయి (మందటి పద్యంతో అన్వయం)

**42వ పద్యం : సమగ్ర వ్యాఖ్యలలో చూడండి.**

**43వ పద్యం :**

| | | |
|---|---|---|
| అనన్యపురుష సంచారంబు + ఐ | = | ఇతర మానవసంచారము లేనిదై |
| నిష్కళంకము | = | నిర్మలినము |
| పంకజ + ఆకరము | = | పంకజాకరము - సరస్సు |

**తాత్పర్యం :**

ఈవిధంగా జనసంచారము లేని, నిర్మలమైన సరోవరాన్ని చూచి (తరువాతి పద్యంతో అన్వయం)

**44వ పద్యం :**

| | | |
|---|---|---|
| తోయజము | = | పద్మము |
| తోఁగిన | = | మునిగిన (కలసిన) |
| కమలనాళము | = | తామరతూడు |
| రవము | = | నాదము |
| ఇందీవరము | = | నల్లకలువ |
| అంభోరుహము | = | పద్మము |
| ఆమోదము | = | పరిమళము |
| ఘ్రాణము | = | ముక్కు |
| కల్లోలము | = | పెద్ద అల |
| నిర్గత | = | వెలువడిన |
| ఆసారము | = | నీటి తుంపరలజడి |
| వదనగహ్వరము | = | గుహవంటి నోరు |
| వాడు | = | ఎండిపోవుట |
| అభినవ సౌభాగ్యము | = | క్రొత్తసొగసు |
| దీప్తము | = | ప్రకాశింపజేయబడిన |

**తాత్పర్యం :**

పద్మగంధం మిళితమైన చల్లనిపిల్ల గాలులచేత శరీరాలు హాయిని పొందగా, తామరతూండ్లను తినుటచే విమలమైన వాక్కులు గల కలహంసనాదాలు చెవులకు పండుగ చేయుచుండగా, వికసించిన నల్లకలువల యొక్కయు పద్మముల యొక్కయు వాసన ముక్కురంధ్రములను గౌరవిస్తుండగా, నిర్మలమైన యలల నుండి వెలువడు తుంపరలబడి గుహవంటినో రెండిపోవుట నుండి తేరుకొనునట్లు చేస్తుండగా, ముల్లోకములకు క్రొత్త సొగసుచేత ప్రకాశింపబడిన దైన వైభవము కనులవిందు చేస్తుండగా వెళ్ళి తమ పంచేంద్రియములు చేయు పనిని సైతం మఱచి మదించిన ఏనుగుల సమూహము మడుగులోనికి ప్రవేశించెను.

**45వ పద్యం :**

| | | |
|---|---|---|
| వలుఁద | = | స్థూలము (పెద్ద) |
| వేదండము | = | ఏనుగు |

**తాత్పర్యం :**

తుండములలో నీళ్ళు నింపుకొనుచు, చెక్కిళ్ళపై జల్లుకొనుచు గళగళ ధ్వనులు అతిశయింపగా పెద్దపొట్టలు నిండునట్లుగా ఏనుగుల సమూహము నీళ్ళు తాగాయి.

**47వ పద్యం :**

| | | |
|---|---|---|
| ఇభలోకేంద్రుడు | = | గజేంద్రుడు |
| (ఇభము | = | ఏనుగు |
| లోకము | = | సమూహం |
| ఇంద్రుడు | = | ప్రభువు) |
| హస్తము | = | తొండము |
| చండభమార్గము | = | సూర్యుని మార్గము అనగా ఆకాశము |
| ఉడ్డాడించు | = | కలఁకబారునట్లుచేసి (అటు నిటు త్రిప్పి) |
| పింజింపన్ | = | చిమ్మగా |
| నిక్కి | = | గర్వించి |
| ఆరభటిన్ | = | ప్రౌఢిమతో, మ్రోతతో |
| పెల్లు | = | మిక్కిలి |
| నక్రము | = | మొసలి |
| గ్రాహము | = | నీటిపాదు |
| పాఠీనము | = | చేప |
| మీనము | = | చేప, మీనరాశి |
| కర్కటము | = | ఎండ్రకాయ, కర్కాటకరాశి |
| మ్రాన్పడు | = | స్తంభించు |

**తాత్పర్యం :**

గజేంద్రుడు తొండములోనికి నీరు నింపి, దానిని పైకి సాచి గర్వంతో వేగంగా అటునిటు త్రిప్పి చిమ్మగా, ఆ నీటినుండి పైకెగిరి నక్రగ్రాహపాఠీనములు ఆకాశమునందున్న మీనకర్కటములను పట్టుకొన్నవి.

**48వ వచనం :**

| | | |
|---|---|---|
| నిరర్గళము | = | అడ్డులేనిది |

**తాత్పర్యం :**

మరియు నాగజరాజు అడ్డులేకుండా విహరించుటలో (తరువాతి పద్యంలో అన్వయం)

**49వ పద్యం :**

| | | |
|---|---|---|
| ఉజ్ఝిత | = | విడువబడిన |
| కంకణము | = | నీటిబిందువు |
| ఛట | = | కాంతి |
| తోఁగి | = | తడిసి |
| హస్తిని | = | ఆడుయేనుగు |
| హస్తము | = | తొండము |
| విన్యస్యము | = | బాగ ఉంచబడిన |
| వెరవు | = | విధము |
| కలభము | = | గున్నఏనుగు |
| కలభీ | = | ప్రాయములో వున్న ఆడ ఏనుగు |
| సముత్కీర్ణము | = | మిక్కిలిగా పైకి వ్యాపింపజేయబడిన |
| కల్హారము | = | కొంచెము ఎఱుపు తెలుపుగలిగి మిక్కిలి వాసనగల కలువ (సౌగంధిక పుష్పము) |
| రజము | = | పుప్పొడి |
| కనకాచలము (కనక+అచలము) | = | బంగరు పర్వతము (మేరు పర్వతము) |
| కుంజరి | = | ఆడుయేనుగు, పరిచితము పరిచయము కలది |
| కుముదము | = | ఎఱ్ఱదామర |
| కాండము | = | తూడు (నాళము, కాడ) |
| ఫణిరాజ మండనుడు | = | ఈశ్వరుడు |
| (ఫణిరాజు | = | వాసుకి, శ్రేష్ఠమైన పాములు |
| మండనము | = | అలంకారము) |
| ప్రభ | = | కాంతి |
| కరేణువు | = | ఆడుయేనుగు |
| ముక్తము | = | విడువబడినది (ఒసంగబడిన) |
| మౌక్తికము | = | ముత్యము |
| శుక్తి | = | ముత్తెపుచిప్ప |
| మొగిలు | = | మేఘము |
| వనజగేహము | = | సరస్సు |
| వనజము | = | పద్మము |

| | | |
|---|---|---|
| (వనము | = | నీరు (నీటి నుండి పుట్టినది) |
| జ | = | పుట్టిన) |
| గేహము | = | ఇల్లు |
| (వాలు | = | మీఱు, విజృంభించు |
| గరిమ | = | గొప్పతనము |

**తాత్పర్యం :**

గజరాజు ఆ సరస్సులో ఎదురులేని గొప్పతనముతో విహారములో విజృంభించునపుడు ఆడుయేనుగులు తమ తొండముతో చల్లిన నీటిలో తడిసి నీలాద్రి (కాటుకకొండ) యొక్క అందమునే తిరస్కరించినది. (నీలగిరి కన్నా సౌందర్యం కలిగి ఉన్నాడని భావం). ఆడయేనుగులు చేత ఉంచబడిన పద్మముల వలన దేవేంద్రుడన్న విధమును గనబరచును. పరువములోనున్న ఆడయేనుగుచేత వెదజల్లబడిన తామరలలోని పుప్పొడి వలన మేరు పర్వతము యొక్క గొప్పతనమును కలిగియున్నది. ఆడు ఏనుగుల చేత కూర్చబడి తామరతూండ్ల వలన ఈశ్వరశోభను పొందింది. (పాములు ఆభరణములుగా గల వాని శోభను అనగా ఈశ్వరుని శోభ) మదించిన ఆడయేనుగుచేత విసరివేయబడిన ముత్యాలచిప్పల వలన మెఱుపుతో కూడిన మేఘముతో పరిహాసాలాడింది. (ఎగతాళి చేసింది) (అనగా అంతకన్నా కాంతివంతంగా ఉందని భావం)

**50వ వచనం :**

| | | |
|---|---|---|
| వ్యాకులితము | = | కలత నొందినది |
| అనంగుడు | = | మన్మధుడు |
| నిరూఢము | = | ప్రసిద్ధి కెక్కినది |
| పల్లవుడు | = | విటుడు |
| వ్యాకీర్ణము | = | చెదరినది |
| చికురము | = | వెంట్రుక |
| మధుకరము | = | తుమ్మెద |
| నికరము | = | సమూహము |
| రథాంగము | = | చక్రవాకము |
| యుగళము | = | జంట |
| లంపటితము | = | శ్రమపడినట్టిది (అలసినట్టిది) |
| జఘనము | = | మొల (పిఱుదు) |
| పులినతలము | = | ఇసుకతిన్నె |

**తాత్పర్యం :**

ఆ మత్తేభం అనేకవిధాలుగా విహరించడంవల్ల క్షోభపడి ఆ సరస్సు క్రొత్త అందంతో కూడినదై శృంగారక్రీడలో రాటుదేలిన విటుని బాహుబంధంలో నలిగిన శరీరాలంకారాలు గల పూబోడిలాగా చెదిరిపోయిన వెంట్రుకలనెడి తుమ్మెదలు గలదియు, నీరసించిన ముఖమనే కమలాలు గలదియు, తన స్థానము నుండి జారిన స్తనాలనే చక్రవాకములు గలదియు, అలసిన పిఱుదులనే ఇసుకతిన్నెలు గలదియునయి ఉన్నది. అంతట్లో ... (తరువాతి పద్యంతో అన్వయం)

**51వ పద్యం :**

| | | |
|---|---|---|
| ఆయితము | = | సిద్ధము |
| భూరి | = | అధికము |
| బుద్బుదము | = | బుడగ |
| ఛట | = | గుంపు |
| భంగము | = | అల |
| పూత్కారరవము | = | పూత్కారధ్వని |
| వాలము | = | తోక |
| విక్షేపము | = | జాడించు |
| ఝంఝానిలము | = | ధ్వనితో కూడిన గాలి |
| అనిలము | = | గాలి |
| ఆవర్తము | = | నీటిసుడి |
| కల్లోలము | = | అల |
| జాలము | = | సమూహము |
| సంఘట్టనము | = | తాకిడి |
| సంభ్రమించు | = | వేగపడి |
| ఉదరి | = | చలించి |
| స్వర్భానువు | = | రాహువు |
| మకరము | = | మొసలి |

**తాత్పర్యం :**

భుగభుగమంటూ లేచిన బుడగల గుంపుతో అలలు ఆకాశమంత ఎత్తునకు లేవగా, లోకాలకు భయాన్ని కలిగించేఎ పూత్కార ధ్వనులతో నక్రగ్రాహాల సమూహాలు అదిరిపడుచుండగా, తోకను జాడింపగా పుట్టిన ప్రళయ కాలపు గాలిచేత నీటిసుడులు రేగగా, అలల తాకిడికి ఒడ్డుననున్న చెట్లు కూలుచుండగా సరస్సులో నుండి ఒక్కసారిగా విజృంభించి దూకి సూర్యుని మింగే రాహువులాగా గజరాజును మకరరాజు గట్టిగా పట్టింది.

**52వ పద్యం :**

| | | |
|---|---|---|
| తప్పించి | = | తప్పించుకొని |
| వడిన్ | = | వేగంగా (వెంటనే) |
| నిడద | = | పొడవైన |
| నీరాటము | = | మొసలి |
| పొడవడఁగినట్లు | = | చచ్చిన మాదిరి |
| పూర్వపదములు | = | ముందటి కాళ్ళు |

**తాత్పర్యం :**

ఆ గజేంద్రుడు వేగంగా ముసలి పట్టును తప్పించుకొని, తన పొడవైన తొండంతో మొసలిని కొట్టగా అది చచ్చినట్లు నీళ్ళలోపడి, మిక్కిలి తొందరగా గజేంద్రుని ముందరి రెండుకాళ్ళను పట్టుకొన్నది.

**53వ పద్యం :**

| | | |
|---|---|---|
| తలఁకుబాటు | = | భయం |
| ధృతి | = | ధైర్యము |
| యుగము | = | జంట |
| ఘట్టన | = | రాపిడి |
| చిప్పలు | = | వీపు మీద పొలుసులు |
| పాదులుదప్పు | = | కుదుళ్ళుచెదరు |
| చీరు | = | చీల్చు |

**తాత్పర్యం :**

ధైర్యశాలియైన గజేంద్రుడు ఏమాత్రం భయపడకుండా తన రెండు దంతాల మొనలతో ఆ మొసలి వీపుమీద గట్టి పొలుసులను సమూలంగా చిట్లిపోయేట్లు చెదిరిపోయే విధంగా చిమ్మివైచాడు. అప్పుడు ఆ మొసలి కాళ్ళను వదిలిపెట్టి ఈ ఏనుగుతోక మూలాన్ని కోరలతో చీల్చసాగింది.

**54వ పద్యం :**

| | | |
|---|---|---|
| తిగుచు | = | లాగు, ఈడ్చు |
| కరకలి | = | క్రూరభావము (క్రౌర్యము) |
| బెరయు | = | ఎక్కువగునట్లు |
| భరము | = | బరువు |
| అతలము | = | పాతాళము |
| కుతలము | = | భూతలం |

**తాత్పర్యం :**

పాతాళంలోని, భూతలంలోని వీరులు అదిరిపడేట్లుగా మొసలి ఏనుగును సరస్సులోకి లాగుతుంది. ఏనుగు మొసలిని బలంగా క్రౌర్యంతో ఒడ్డుకు లాగుతుంది.

**55వ పద్యం :**

| | | |
|---|---|---|
| సముద్దండదండంబులు+ఐ | = | మిక్కిలి ఎక్కువైన దండోపాయముగలవియై |
| ఆలోకనభీకరంబులు + ఐ | = | చూచుటకు భయంకరములై |
| అన్యోన్య విజయశ్రీవశీకరంబులు+ఐ | = | ఒకదానికొకటి విజయలక్ష్మిని వశీకరించుకొనునవి యై |
| సంక్షోభితకమలాకరంబులు + ఐ | = | కలత పెట్టబడిన సరస్సులు గలవియై |
| హరి | = | సింహము |
| పిఱుతివియక | = | వెనుకాడక |
| పెనఁగు | = | పోరాడు |
| అనుకారము | = | పోలిక |
| ఉప్పరము | = | ఆకాశము |
| అప్పళించు | = | గ్రహించు |
| నిశితము | = | మిక్కిలి పదునుతేలిన |

| | | |
|---|---|---|
| నితాంతము | = | అధికమైన |
| దురంతము | = | అంతములేని |
| దంతకుంతంబులు | = | బల్లెముల వంటి దంతములు |
| నెప్పళము | = | వేగము |
| పునుకచిప్పలు | = | తలపుఱ్ఱెలు |
| కమఠము | = | తాబేలు |
| కర్కటము | = | ఎండ్రకాయ |
| గండకము | = | చేప |
| మండూకము | = | కప్ప |
| రభసము | = | వేగము |
| ఇక్కలు | = | స్థానములు |
| మ్రక్కు | = | చచ్చు |
| తండము | = | సమూహము |
| తాడనము | = | దెబ్బ |
| ఓలమాసగొనక | = | మరుగుపడక |
| బెట్టిదము | = | ధృఢము |
| నిర్గతము | = | పోయిన |

**తాత్పర్యం :**

ఈవిధంగా ఆరెండును ఒకదానికొకటి దండోపాయం కలవియై, సమస్త లోకాలు చూడటానికి భయమును గొల్పునవై, ఒకదానికొకటి విజయలక్ష్మిని వశం జేసుకొనునవియై, సరస్సులు కలుషితం చేయబడినవి కాగా, సింహం మరొక సింహాన్ని, కొండ మరొక కొండను ఎదిరించి తగ్గకుండా పెనుగులాడే విధంగా నీళ్ళలో జరిగే పోరాటంలో ఒకదానినొకటి లోపలికి బయటికి లాగుకొనుచు, సరస్సు సంకటపడునట్లు మిక్కిలి వేగంతో, అటు ఇటు పడుచూ, తడబాటులేక బుడబుడ మను ధ్వనులను పోలినవియై, బుగులు బుగుల్లను శబ్దాలతో నురుగులు గట్టుచు నీళ్ళు ఆకాశంవైపు ఎగురగా, ఆ నీటిని చప్పరిస్తూ గుహలవంటి నోళ్ళతో గ్రహిస్తూ, పనును తేలిన ఈటెలవంటి దంతాలతో ముక్కలుముక్కలై వేగంగా కపాలపు పొలుసులు కుదుళ్ళు తప్పి రక్తం కారగా హుమ్మని ఒక్కసారిగా చిమ్ముచూ, ఒకదానినొకటి లాగేటప్పుడు వాటి వాటి కాళ్ళ పట్టు వీడకుండా, కుదురుగనుండి, పరిభ్రమించే వేగంతో నీళ్ళలో తిరుగుచూ, మొసళ్ళు, తాబేళ్ళు, ఎండ్రకాయలు కప్పలు మొదలైన జలచరాల ప్రాణాలు పోవునట్లుగా ఒకదానితో నొకటి ఎదిరించే వేగానికి స్థానం తప్పుతూ, అణగద్రొక్కుచూ బలహీనపడగా ఒకదానికొకటి కొట్టేటప్పుడు నాచు, నత్తగుల్లలు అడ్డముగా వేసికొనుచు, గెలవాలన్న కోరిక ఎక్కువకాగా రాత్రింబగళ్ళువలె క్రమక్రమంబుగ విజృంభించి పోరాడుతూ నిద్రాహారాలు మాని, మొక్కవోని పరాక్రమంతో పోరాడుచున్న సమయంలో ... (తరువాతి పద్యంతో అన్వయం)

**56వ పద్యం :**

| | | |
|---|---|---|
| జవము | = | వేగం |
| చలము | = | పట్టుదల |
| కరటి | = | ఏనుగు |
| నివహము | = | గుంపు |

**తాత్పర్యము :**

వేగముగను, పట్టుదలతోను, బలముతోను అనేకవిధాలుగా పోరాడుతున్న ఏనుగు పరాక్రమమునకు భువిలోగల దివిలోగల మొసళ్ళు, చేపలు ఎండ్రకాయలు మిత్రమండలిని బొందాయి. (మిత్ర శబ్దానికి రెండర్థాలు. 1) హితుడు, 2) సూర్యుడు). భూమియందుండు జలచరాలైన మొసళ్ళు చేపలు ఎండ్రకాయలు వాటి వాటి మిత్రులను చేరగా, ఆకసమునందుండు మకరము, మీనము, కర్కటము అను రాశులు సూర్యమండమును బొందినవి భావం).

**57వ పద్యం : సమగ్ర వ్యాఖ్యలలో చూడండి.**

**59వ పద్యం =**

| | | |
|---|---|---|
| మాతంగము | = | ఏనుగు |
| యూథంబు | = | సమూహము |

**తాత్పర్యం :**

మొసలితో పోరాడుచున్న గజేంద్రుని ఒంటరిగా విడిచిపెట్టి పోవడానికి మనసొప్పక ఆడఏనుగులు అలాగే చూస్తూ నిలబడ్డాయి. భార్యలకు భర్తలు విడరానివారు కదా !

**61వ పద్యం :**

| | | |
|---|---|---|
| జీవనము | = | నీళ్ళు, బ్రతుకుతెఱువు |
| అలవు | = | బలము |
| చలము | = | పట్టుదల |
| శీతభానుడు | = | చంద్రుడు |

**తాత్పర్యం :**

నీరు తన బ్రతుకును స్థానమైయుండటంచేత బలం, పట్టుదల క్రమక్రమంగా అధికమై మొసలి ఒప్పారింది. యోధుడైన గజేంద్రుడు కృష్ణపక్షంలోని చంద్రునిలాగా క్షీణిస్తూ అలసిపోయాడు.

**62వ పద్యం :**

| | | |
|---|---|---|
| యుగంబు | = | నాలుగుమూరల పరిమితి గల కొలత (విశాలమైన) |
| హరిక్రియన్ | = | సింహమువలె |
| నెఱయు | = | వ్యాపించు (ఆక్రమించు) |
| నెగయు | = | ఎగురు |
| శల్యము | = | ఎముక |
| కదియు | = | దగ్గరకు వచ్చు (పైబడు) |
| వేదండ యూథోత్తమున్ | = | ఏనుగుల సమూహములో శ్రేష్ఠమైన దానిని (గజేంద్రుని) |

**తాత్పర్యం :**

(మొసలి) సింహంలాగా హుంకరించి ఏనుగు యొక్క విశాలమైన కుంభస్థలం పైకి ఉరికింది. పాదాలను ఆక్రమించింది. మెడను, వీపును రాచుకుంటుంది. విలాసంగా ఎగురుతుంది. తోకను చరుస్తుంది. నలిగిపోయేటట్లు ఎదుర్కొంటుంది. ఏనుగును నీళ్ళలో ముంచుతుంది. తానూ మునుగుతుంది. ఎముకలు దంతాలు విరిగిపోయేటట్లు కొట్టుచూ నక్కినక్కి గజేంద్రునిపై పడుతుంది.

**63వ పద్యం :**

| | | |
|---|---|---|
| పొడగానంబడకుండ | = | కనబడకుండా |
| డాఁగు | = | దాగు |
| పొడచూపు | = | కనబడు |
| బెగ్గడిలు | = | భయపడు |
| ఉద్ఘాటించు | = | బాదు, చీల్చు |
| లంఘించు | = | ఎగురు, |
| చీరు | = | చీల్చు |
| తలఁగున్ | = | తొలగును (ప్రక్కకుపోవు) |
| మలఁగు | = | మరలిపోవు (వెనక్కి తగ్గు) |
| ఒడియు | = | పట్టుకొను |

**తాత్పర్యము :**

ఆ మొసలి కనిపించకుండా నీళ్ళలో దాక్కుంటుంది. ఏనుగు నీటి నుండి బైటకురాగా తాను అడ్డంవచ్చి కనబడుతుంది. కాళ్ళను పెనవేసుకొంటుంది. ముందుకుపోనీక వెనక్కురానీక భయపడిపోయి కూలబడేట్లుగా కొడుతుంది. లేచేటప్పుడు బాదుతుంది. పైకెరుతుంది. బలంగా చీల్చుస్తుంది. ప్రక్కకు తొలగుతుంది, వెనక్కి తగ్గుతుంది. పట్టుకుంటుంది. కోపంతో బాధిస్తుంది.

**64వ వచనం :**

| | | |
|---|---|---|
| విస్మితనక్రచక్రంబు | = | ఆశ్చర్యపడిన మొసళ్ళు సమూహం కలది |
| దిద్వక్రము | = | వంకరకానట్టి |
| అతిక్రమించు | = | మీఱు |
| కలహసన్నాహము | = | కలహ ప్రయత్నం |
| అవగాహంబు | = | మునుక |

**తాత్పర్యము :**

ఈవిధంగా అవక్రపరాక్రమంతో (ఆ మొసలి) ఇతర మొసళ్ళను ఆశ్చర్యపరుస్తూ అల్పహృదయుని యొక్క జ్ఞానమనే దీపాన్ని అతిక్రమించే (కప్పివైచే) మహామాయ అనే చీకటిలాగా పోనుపోను ఉత్సాహంతో కూడిన పోరాడే ప్రయత్నంలో అనేకవిధాలుగా నీటిలో మున్కలువేసే మొసలి గొప్ప సాహసంతో (తరువాతి పద్యంలో అన్వయం)

**65వ పద్యం : సమగ్ర వ్యాఖ్యలలో చూడండి.**

**66వ పద్యం :**

| | | |
|---|---|---|
| వనగజంబు | = | అడవియేనుగు |
| ఎగుచు | = | తరుము (బాధించు) |
| వనము | = | నీరు |
| వనచారి | = | నీటిలో సంచరించునది (మొసలి) |
| వనగజంబు | = | నీటిలో పుట్టిన యేనుగు (ఐరావతము - ఇంద్రుని యేనుగు) |

| | | |
|---|---|---|
| వ్రజి | = | ఇంద్రుడు |
| వెల్లనగు | = | తెల్లబోవు |
| వేచి | = | పడవేసి |
| సుధాంధులు | = | దేవతలు |
| బయలు | = | ఆకాశము |

**తాత్పర్యం :**

గజేంద్రుని బాధిస్తున్న మొసలిని చూచి ఇంద్రుని ఐరావతమే తెల్లబోయింది. అది యింద్రుని క్రిందకు పడవేసి దేవతలు పట్టుకోవడానికి రాగా వారికి చిక్కకుండా ఆకాశంలో పరుగెత్తింది.

**67వ పద్యం : సమగ్ర వ్యాఖ్యలలో చూడండి.**

**69వ పద్యం :**

| | | |
|---|---|---|
| సొలయక | = | వెనుదీయక |
| వేసట | = | శ్రమము |
| ఒలయక | = | పొందక |
| ఉద్దండతన్ | = | మిక్కిలిగా, |
| దివసంబు | = | పగలు |

**తాత్పర్యం :**

అలసిపోకుండా, వెనుదీయకుండా, శ్రమను పొందకుండా రాత్రుళ్ళు, రెండు సంధ్యవేళలు, పగళ్ళు ఆ యేనుగు మొసలితో పోరాటాన్ని ఒక్కవేయి సంవత్సరాలు గొప్పగా చేసింది.

**70వ పద్యం :**

| | | |
|---|---|---|
| పృథుశక్తి | = | గొప్పశక్తి |
| జలగ్రహము | = | మొసలి |
| లావు | = | బలము, ఆధిక్యం |
| మిథ్యామనోరథము | = | లేనిపోని ఆశ |
| సవ్యథమై | = | బాధతో కూడినదై |

**తాత్పర్యం :**

గొప్ప బలంతో గజము ఆ మకరంతో ఎన్నో సంవత్సరాలు పోరాడి శిథిలముకాగా, తన బలాన్నీ శత్రువుల బలాన్నీ (బేరీజు వేసుకొని) అంచనా వేసుకొని ఆలోచించి, వట్టి ఆశ ఎందుకు ? దీనిని గెల్చుటకు సరిగా పోరాడలేను అని అనుకొని బాధతో కూడినదై పూర్వజన్మలోని పుణ్యము యొక్క ఫలమైన జ్ఞానవైభవముతో ఇట్లా ఆలోచించింది.

**71వ పద్యం :**

| | | |
|---|---|---|
| రూపంబున | = | విధంబున |
| చింతింతున్ | = | ధ్యానింతున్ |
| చీరు | = | పిలుచు |

| | | |
|---|---|---|
| వారి ప్రచారము | = | మొసలి |
| వ్యాపారము | = | పని |
| పారాయణులు | = | దిట్టలు |

**తాత్పర్యం :**

ఏవిధంగా ఈ ముసలిని గెల్వగలను. ఇకపై ఏ దేవుని ధ్యానించేది. ఎవరిని పిలిచేది, ఈ గొప్పమొసలిని అడ్డగించే వారెవరు ? అన్ని పనులను చక్కబెట్టే శక్తికలవారు, దిక్కులేనివారి మొర ఆలించే పుణ్యాత్ములు లేరా ? వారికి మ్రొక్కెదను.

**72వ పద్యం : సమగ్రవ్యాఖ్యలో చూడండి.**

**73వ పద్యం : సమగ్ర వ్యాఖ్యలో చూడండి.**

**74వ పద్యం :**

| | | |
|---|---|---|
| ఒకపరి | = | ఒకసారి |
| అకలంకునిన్ | = | మచ్చలేనివానిని (నిష్కల్మషుని) |
| అర్థిన్ | = | కోరికతో |

**తాత్పర్యము :**

ఒకసారి లోకాలను బయటపెట్టి (సృష్టించి) ఒకసారి లోపలికి తీసికొంటూ (తనలో లీనం చేసుకుంటూ) రెండూ తానేయయి, అన్నింటికి సాక్షియై తనకుతానే మూలమైన ఆ నిష్కల్మషుని కోరికతో ప్రార్థించెదను.

**75వ పద్యం :**

| | | |
|---|---|---|
| తెగు | = | నశించు |
| అలోకము | = | లోకములేని స్థితి |

**తాత్పర్యం :**

లోకాలు, లోకపాలకులు, లోకనివాసులు నశించిన తరువాత కూడా లోకరహితమైన కారుచీకటికి ఆవలివైపున అఖండైక తేజోరూపంగా ఎవడు ప్రకాశిస్తూ ఉంటాడో అతనిని నేను సేవిస్తాను.

**76వ పద్యం :**

| | | |
|---|---|---|
| నర్తకుడు | = | నటుడు |
| దివిజులు | = | దేవతలు |

**తాత్పర్యం :**

ఎవడు నటునివలే అనేక రూపాలతో నటిస్తాడో, మునులు, దేవతలు సైతం ఎవరిని కీర్తించుటకు చాలరో, ఎవనియొక్క లీలలు ఇతరులకు అర్థంకావో, అట్టివానిని నేను స్తుతిస్తాను.

**77వ పద్యం :**

| | | |
|---|---|---|
| ముక్తసంగులు | = | విడువబడిన బంధాలు కలవారు (ఏ బంధం లేనివారు) |
| దిదృక్షులు | = | చూచుట యందు కోరిక గలవారు |

| | | |
|---|---|---|
| భూతము | = | ప్రాణి |
| అసదృశ | = | సాటిలేని |
| వ్రతము | = | నియమము |
| అఢ్యుడు | = | సంపన్నుడు |

**తాత్పర్యం :**

ఏ బంధాలులేని మహర్షులు, భగవద్దర్శనాపేక్ష కలవారు, సర్వప్రాణుల మేలు కోరేవారు, మంచి మనసున్నవారు, అసమాన సంపన్నులై ఎవని దివ్యపాదాలను పూజిస్తారో ఆతడే నాకు దిక్కు.

**78వ పద్యం :**

| | | |
|---|---|---|
| భవము | = | పుట్టుక |
| ఆహ్వాయము | = | పేరు |
| సమయించు | = | లయింపజేయు |
| ఇద్ధరూపి | = | ప్రకాశించు రూపము గలవాడు |
| చిత్రచారి | = | చిత్రముగా ప్రవర్తించువాడు |
| ఆత్మరుచి | = | స్వయం ప్రకాశము గలవాడు |
| ఎఱుక | = | జ్ఞానం |
| శుచికి | = | పరిశుద్ధునకు |
| సత్త్వగమ్యుడు | = | సత్త్వగుణముతో పొందదగినవాడు |
| నిష్కర్మతకు | = | కర్మ రాహిత్యానికి |

**తాత్పర్యం :**

పుట్టుక, దోషం, రూపం, కర్మ, పేరు, గుణం అనేవి ఏవీ లేకపోయినా లోకాన్ని సృష్టించటం కోసం నశింపజేయటం కోసం తన మాయచే ఎవడు వాటినన్నింటినీ ధరిస్తాడో ఆ పరమేశ్వరునకు, ఆ అనంతమైన శక్తికి, ఆ సృష్టికర్తకు, ఆ ప్రకాశించే మూర్తికి, ఆ నిరాకారునకు, ఆ చిత్రమైన ప్రవర్తన గలవానికి, ఆ సర్వసాక్షికి, ఆ స్వయం ప్రకాశకునకు, మాటల చేతగాని, జ్ఞానముచేతగాని, మనస్సుచేతగాని చేరలేని ఆ పరిశుద్ధునకు, సాత్విక గుణములు చేత పొందదగినవాడగుచు నైపుణ్యం గల వాని యొక్క కర్మరాహిత్యానికి ఎవడు మెచ్చుకుంటాడో అతనికి నేను నమస్కరిస్తాను.

**79వ పద్యం :**

| | | |
|---|---|---|
| అపవర్గము | = | మోక్షము |
| నిర్వాణము | = | ముక్తి |
| నిర్విశేషునకు | = | తనవాడు, పరాయివాడు అనే భేదంలేనివానికి |
| ఘోరునకు | = | శివస్వరూపునకు |
| గూఢునకు | = | అంతుచిక్కనివానికి |
| అఖిలేంద్రియద్రష్టకు | = | అన్ని ఇంద్రియ వ్యాపారములను చూచువానికి |
| బహుక్షేత్రజ్ఞునకున్ | = | సకలమెరిగినవానికి |
| మూలప్రకృతికి | = | అన్నింటికి మూలమైనవానికి |
| ఆత్మమూలునకు | = | ఆత్మకు ఆధారభూతుడైనవానికి |

| | | |
|---|---|---|
| జ్ఞాపకునకున్ | = | జ్ఞప్తికి తెచ్చువానికి |
| ఎక్కటికి | = | అసహాయునకు |
| మహోత్తరునకు | = | మిక్కిలి శ్రేష్ఠుడైనవానికి |
| నిష్కారణునకు | = | కారణము లేనివానికి |

**తాత్పర్యం :**

శాంతుడైనవానికి, మోక్షసుఖం తెలిసినవానికి, ముక్తికి అధిపతియైనవానికి, తన, పర అనే భేదం లేనివానికి, శివస్వరూపునకు, అంతుచిక్కనివానికి, గుణములే ధర్మంగా గలవానికి, సౌమ్యస్వభావునకు, అందరికన్నా అధికమైన విజ్ఞానముగలవానికి, అన్ని యింద్రియ వ్యాపారాలను చూచువానికి, సర్వము తెలిసినవానికి, సముద్రమంతటి దయగల మనస్సుగలవానికి, అన్నింటికి కారణభూతమైన వానికి, ఆత్మకు ఆధారమైనవానికి అన్ని యింద్రియ వ్యాపారాలను జ్ఞప్తికి తెచ్చువానిని, దుఃఖమును అంతమొందించువానికి, పూర్తిగా అసత్యమనెడి నీడతో ప్రకాశించు, అసహాయునకు, మిక్కిలి శ్రేష్ఠుడైనవానికి, అన్నింటికి కారణమైనవానికి, తనకు కారణంలేనివానికి నన్ను రక్షించటానికై నేను నమస్కరిస్తాను.

**80వ పద్యం :**

| | | |
|---|---|---|
| భాసితము | = | ప్రకాశింప జేయబడిన |
| పరముడు | = | మోక్షము నిచ్చువాడు |

**తాత్పర్యం :**

యోగమనే అగ్నిలో తమ కర్మలను కాల్చివైచిన మహాయోగులు వేరెవరిని తెలిసికొనక వారి యోగప్రకాశితమైన మనస్సులతో ఏ మహాత్ముని చక్కగా చూస్తారో ఆ మోక్షప్రదాతను సేవిస్తాను.

**81వ పద్యం :**

| | | |
|---|---|---|
| ఆగమము | = | దేవపూజా విధానమును తెలుపుట్టి శాస్త్రము |
| ఆమ్నాయము | = | వేదం |
| ఉత్తమమందిరుడు | = | ఉత్తమత్వానికి నిలయమైనవాడు |
| ఆరణి | = | అగ్ని ఉండే కొయ్య |
| ఛన్నము | = | కప్పబడిన |
| బోధ | = | తెలివి, జ్ఞానం |
| సంవర్తిత కర్మ | = | నివర్తింపబడిన కర్మ |
| పశువులు | = | జీవులు |
| నివేశము | = | ఇల్లు |
| తనూజులు | = | బిడ్డలు |
| దార | = | భార్య |

**తాత్పర్యం :**

శాస్త్రాలకు, వేదాలకు సముద్రమంతటివాడైన వానికి, మోక్షస్వరూపునకు, అన్ని సద్గుణములనే అరణిలో దాగియున్న జ్ఞానమనే అగ్నికి అనగా సకల సుగుణమయుడును, జ్ఞానియైనవానికి, స్వయం ప్రకాశముగల ధన్యమైన మనస్సుగలవానికి, గుణములను (త్రిగుణములు) లయించుటచేత వెలిగింపబడిన గొప్ప మనస్సుగలవానికి, కర్మల నుండి నివృత్తి పొందిన

వారిలో వర్తిల్లువానికి, దిక్కులేని నా వంటి జీవుల పాపాన్ని పోగొట్టేవానికి అందరిలోను అంతరాత్మగా వెలిగేవానికీ, నాశనం లేనివానికీ, అన్నింట వ్యాపించుశీలము గలవానికి, బిడ్డలయందు, ప్రాణులందు, గృహములందు భార్యయందు ఆసక్తులకు అందనట్టివానికి నమస్కారమొనర్చెదను.

**83వ పద్యం :**

| | | |
|---|---|---|
| వర్జితము | = | విడువబడినది |
| వార్ధి | = | సముద్రము |
| మగ్నము | = | మునిగినది |
| ఏకాంతులు | = | ఏకాగ్రచిత్తులు |
| భద్రము | = | శుభకరము |
| పరుని | = | పరమాత్ముని |
| అతీంద్రియుడు | = | ఇంద్రియములకు గోచరింపనివాడు |
| స్థూలుడు | = | బృహత్తరమైన ఆకారము గలవాడు |
| సూక్ష్ముడు | = | అణువు మాత్రమైన ఆకృతిగలవాడు |

**తాత్పర్యం :**

శ్రేష్ఠమైన ధర్మమునందును, కామము నందును, అర్థము నందును వాంఛను విడిచినవారై పండితులు ఎవనిని సేవించి తమకిష్టమైన మార్గాన్ని పొందుతారో, తన దగ్గరచేరి కోరువారికి దయతో ఎవడు శాశ్వతమైన దేహాన్నిస్తాడో, బంధముల నుండి విముక్తమైన ఆత్మగలవారు ఎవరిని ముందుగా ధ్యానిస్తారో, ఆనందమనే సముద్రంలో మునిగిపోయిన హృదయం గలవారు, ఏకాగ్రచిత్తులునైనవారు ఏ కోరిక లేకుండా ఎవనియొక్క శుభకరమైన చరిత్రను గానం చేస్తారో ఆ మహేశ్వరుని, ఆ మొదటివానిని వ్యక్తముగాని అవ్వానిని, ఆధ్యాత్మ యోగముచే పొందదగినవానిని, ఏకారణములేక నిండైనవానిని, మహాత్ముని, పరబ్రహ్మ స్వరూపుడైనవానిని, ఇంద్రియములకు గోచరింపవానిని, బృహదాకారుని, అణుమాత్రమైన ఆకృతిగల వానిని (అగు) ఈశుని నేను భజిస్తాను.

**85వ పద్యం :**

| | | |
|---|---|---|
| పావకుడు | = | అగ్ని |
| అర్చి | = | మంట |
| నిగిడించు | = | వ్యాపింపజేయు |
| కరము | = | కిరణము |
| ఆవళి | = | సమూహము |
| గణము | = | సమూహము |
| తిర్యక్కులు | = | పశుపక్ష్యాదులు (అడ్డముగా పోవునవి) |

**తాత్పర్యం :**

అగ్నిదేవుడు జ్వాలలను, సూర్యుని కాంతిని ఏవిధంగా వ్యాపింపజేసి ఉపశమింపజేస్తారో, అదేవిధంగా తన కిరణాల సమూహంచేత బ్రహ్మ మొదలగు దేవతలను, సమస్త జంతు సమూహాన్ని, అన్ని లోకాలను వేరువేరు నామాలతో, రూపాలతో ప్రకాశింపజేసి మళ్ళీ అణచివేస్తాడో, మనస్సు, బుద్ధి, ఇంద్రియాలు తానే అయి ఎవడు గుణములు ప్రవర్తిల్లునట్లు చేస్తాడో, స్త్రీమూర్తిగాక, పురుషాకృతిగాక, నపుంసకుడుగాక పశుపక్ష్యాదులునుగాక, దేవతాకృతియుగాక, నరుడునుగాక, భిన్నకర్మలుగను భిన్నగుణములుగను కాక, ఉండుటగాని లేకపోవుటగాని కాక చివరకు అన్నీ తానేయగు ప్రభువును తలచెదను.

**86వ పద్యం :**

| | | |
|---|---|---|
| పరమము | = | శ్రేష్ఠము |
| గణము | = | సమూహము |

**తాత్పర్యం :**

(భగవంతుడు) దీనులపట్ల ఉన్నాడంటారు, శ్రేష్ఠులైన యోగుల సమూహం పాలిట ఉన్నాడంటారు. అన్ని దిక్కులలోను ఉన్నాడంటారు. ఉన్నాడు ఉన్నాడు అని అనబడేవాడు నిజంగా ఉన్నాడో లేడో కదా !

**87వ పద్యం :**

| | | |
|---|---|---|
| నాపాలి కలిమి | = | నాయెడ కలుగుట (నన్నాదుకొనుట) |
| అసాధువులు | = | దుష్టులు |
| మొఱగులు | = | మొర పెట్టుకొనువారు |
| మొఱఁగువాడు | = | చాటు చేసుకొనువాడు |

**తాత్పర్యం :**

ఉన్నవాడు లేనివాడు అని చూడకుండా అందరికీ ఉన్నాడనేవాడు నాపట్ల ఉన్నాడా అని సందేహించుచుండగా నాదెస ఉండుకుండా ఉంటాడా ! దుష్టులచే బాధపెట్టబడే మంచివారికి మంచిరక్షకుడైన వాడు నన్ను రక్షించకుండా ఉంటాడా ! చర్మచక్షువులతోగాక అంతర్ముఖంగా తనను చూచేవారిని దయతో కాపాడేవాడు నన్ను మాత్రం చూడకుండా ఉంటాడా ! మొరపెట్టుకొనేవారి మొరలను వింటూ తన్ను తాను మాటు మణగవేసుకొనేవాడు తన లీలలో భాగంగా నా మొర వినకుండా ఉంటాడా ! అన్నిరూపాలు తన రూపమే అయినట్టినాడు, ఆదిమధ్యాంతములేక వ్యాపించువాడు, భక్తుల దీనులు పక్షమైనవాడు నా మొరవినడా, నాపాట్లు చూడడా, నన్ను రక్షించాలని తలంచడా ! వెంటనే రాడా ! (వస్తాడని భావం)

**88వ పద్యం :**

| | | |
|---|---|---|
| విశ్వకరుడు | = | విశ్వమును చేయువాడు (సృష్టికర్తయని యర్థం) |
| విశ్వదూరుని | = | విశ్వమునకు దూరంగా ఉండేవానిని |
| విశ్వవేద్యుడు | = | లోకంచేత తెలియదగినవాడు |
| అజుడు | = | పుట్టుకలేనివాడు |

**తాత్పర్యం :**

విశ్వాన్ని సృష్టించి దానికి దూరంగా ఉండేవానిని, లోకానికి ఆత్మయైనవానిని లోకంచేత తెలుసుకోదగ్గవానిని, తానే లోకమైనవానిని, లోకాతీతుడైనవానిని, శాశ్వతుడైనవానిని, పుట్టుకలేనివానిని, పరమాత్మయైనవానిని, లోకాధిపతిని, ఈశ్వరుని, పురుషోత్తముని నేను ఆరాధిస్తాను.

**90వ పద్యం : సమగ్ర వ్యాఖ్యలలో చూడండి.**

**91వ పద్యం :**

| | | |
|---|---|---|
| చనరానిచోటు | = | ప్రవేశించటానికి గూడా వీలుకాని చోటు |
| కరుణావార్ధీ | = | దయకు సముద్రుని వంటి వాడా ! |

**తాత్పర్యం :**

ఓ దయాసాగరా ! జీవులమాటలు నీవు వింటావట. వెళ్ళటానికి వీలుకాని చోట్లకు సైతం నీవు వెళ్ళగలవట (సర్వగతుడని అర్థం) శరణుకోరినవారికి ఓ ! అని బదులు పలుకుతావట. అన్నింటిని చూస్తావట. ఇది నిజమేనా ?

**92వ పద్యం :**

| | | |
|---|---|---|
| కమల | = | లక్ష్మీదేవి |
| వంద్యుడు | = | నమస్కరింపదగినవాడు |
| అమరానోకహము | = | కల్పవృక్షము |

**తాత్పర్యం :**

ఓ లక్ష్మీపతీ ! ఓ వరప్రదాతా ! ప్రతివాదులకు దూరంగా ఉండేవాడా ! ఒక పక్షమంటూలేనివాడా ! కవులకు యోగులకు నమస్కరింపదగినవాడా ! మంచి గుణములచేత ఉత్తముడవైనవాడా ! శరణువేడినవారికి కల్పవృక్షము వంటివాడా! ముని శ్రేష్ఠులకు ప్రియమైనవాడా ! ఓ నిర్మలమైన ప్రభావము కలవాడా ! రావా ! కరుణింపవా ! నన్ను పట్టించుకోవా! శరణువేడిన వాడనగు నన్ను రక్షింపవా !

**93వ పద్యం :**

| | | |
|---|---|---|
| అరక్షితరక్షకుడు | = | రక్షింపబడనివారిని రక్షించువాడు |
| ఆపన్నుడు | = | ఆపదలో ఉన్నవాడు |

**తాత్పర్యం :**

అని ప్రార్థించి ఇంకును, రక్షణలేనివారిని రక్షించేవాడైన ఆ భగవంతుడు ఆపదలో ఉన్న నన్ను కాపాడుగాక ! అని ఆకాశంవైపునకు తలయెత్తి నిట్టూర్పులు విడుస్తూ, చుట్టుప్రక్కలకు చెవులు అప్పగిస్తూ, ఆ గజేంద్రుడు మొరపెట్టుచున్న సమయంలో (తరువాతి పద్యంతో అన్వయం)

**94వ పద్యం :**

| | | |
|---|---|---|
| విశ్వమయత | = | విశ్వమంతా నిండియుండుట |
| అంబుజాసనుడు | = | బ్రహ్మ |
| జిష్ణుడు | = | జయశీలుడు |

**తాత్పర్యం :**

బ్రహ్మ మొదలైన దేవతలకు విశ్వవ్యాపకత్వం లేకపోవటంచేత గజేంద్రుని మొర విని కూడా పట్టించుకొనలేదు. విష్ణువు విశ్వమయుడు కావటంచేత జయశీలుడగుటచేత భక్తునకు అడ్డుపడాలని నిశ్చయించుకొన్నాడు.

**95వ పద్యం : సమగ్ర వ్యాఖ్యలో చూడండి**

**96వ పద్యం : సమగ్ర వ్యాఖ్యలో చూడండి**

**97వ వచనం :**

| | | |
|---|---|---|
| పరాయణుడు | = | ఆసక్తి కలవాడు |
| సదనము | = | ఇల్లు |

| | | |
|---|---|---|
| దీనాలాపము | = | మొర |
| ఆకర్ణించుట | = | వినుట |
| తగులు | = | ఆసక్తి, అభిలాష |
| అవధరించు | = | ధరించు |
| ఉద్గమించు | = | ఎగయు |

**తాత్పర్యం :**

ఈవిధంగా భక్తులను రక్షించడంలో ఆసక్తికలవాడును, సమస్త ప్రాణుల యొక్క పద్మాలవంటి హృదయాలనే ఇంటిలో ఉండేవాడును అయిన నారాయణుడు గజేంద్రునిచే విన్నవించుకొనబడిన అనేకవిధలైన మొరను విని, లక్ష్మీదేవి తోడి వినోదము నందలి అభిలాషను మాని, తొందరించి, దిక్కులు చూచి గజేంద్రుని రక్షించడానికి నిర్ణయించుకొని, తన సాధన సామాగ్రిని ధరించి ఆకాశమునకెగిరి వచ్చునప్పుడు (తరువాతి పద్యంతో అన్వయం)

**98వ పద్యం : సమగ్ర వ్యాఖ్యలో చూడండి.**

**99వ వచనం :**

| | | |
|---|---|---|
| అరవిందము | = | పద్మము |
| పరిష్యందనము | = | స్రవించుట |
| ఆనందిత్ | = | ఆనందిస్తున్న |
| ఇందిందిరము | = | తుమ్మెద |
| ఇందిర | = | లక్ష్మీదేవి |
| సమాకృష్యమాణము | = | లాగబడుచున్నట్టిది |
| సంవ్యానము | = | ఉత్తరీయము, వస్త్రము |
| చేలము | = | వస్త్రము (పైట) |

**తాత్పర్యం :**

ముఖపద్మం యొక్క తేనెబిందువుల సమూహం స్రవించుట చేత ఆనందిస్తున్న తుమ్మెదలు గల లక్ష్మీదేవి విష్ణువుచేత లాగబడుచున్న పైటకొంగుకలదై (తరువాతి పద్యంలో అన్వయం)

**100వ పద్యం :**

| | | |
|---|---|---|
| వేం చేయు | = | వెళ్ళు |
| పదంబు | = | చోటు |
| ద్రుచ్చులు | = | దొంగలు |
| ఖలుల్ | = | నీచులు |
| దేవతానగరి | = | అమరావతి (దేవతల పట్టణం) |

**తాత్పర్యం :**

తాను వెళ్తున్న చోటేదో చెప్పడు, అనాథస్త్రీల యొక్క ఆర్తనాదం విన్నాడో, నీచులైన దొంగలు వేదరాశిని దొంగిలించారో, రాక్షస సమూహం అమరావతిపై దండెత్తిందో, దుర్మార్గులు భక్తులను చూచి (నీవు సేవించే) విష్ణువు ఏడిరా? అని ధిక్కరించారో.

**101వ వచనం :**

| | | |
|---|---|---|
| వితర్కించు | = | అనేకవిధాలుగా ఊహించు |

**తాత్పర్యము :**

అని లక్ష్మీదేవి అనేకవిధాలుగా ఆలోచిస్తూ (విష్ణువు వెనుక వెళ్ళుచున్నది)

**102వ పద్యం : సమగ్ర వ్యాఖ్యలో చూడండి**

**103వ పద్యం :**

| | | |
|---|---|---|
| వడి | = | వేగము |
| మగుడ | = | మరల |
| నుడుగు | = | వచించు |
| నడ | = | గమనం |
| వెడవెడ | = | కొంచెం కొంచెం |
| చిడిముడి | = | తొట్రు, వేగపాటు |
| జడిమ | = | జడత్వంతో (నిశ్చేష్ట) |

**తాత్పర్యం :**

(తన భర్త ఎక్కడికి వెళ్తున్నాడో) అడిగెదను అని లక్ష్మీదేవి వేగంగా వెళ్తుంది. అడిగితే మళ్ళీ చెప్పడేమో అని మానుకుంటుంది. వ్యధపడి తడలుడుతూ అడుగులు వేసేటప్పుడు అనగా ముందుకు సాగేటప్పుడు మెల్లమెల్లగా అడుగులు వేసివేయనట్టుంది.

**104వ పద్యం :**

| | | |
|---|---|---|
| నిటలము | = | నొసలు |
| అలకములు | = | నెఱికురులు |
| సరోజము | = | పద్మము |
| తేంట్లు | = | తుమ్మెదలు |
| అళులు | = | తుమ్మెదలు |
| చోపు | = | త్రోలు |
| ఓష్ఠము | = | పెదవి |
| బింబము | = | దొండపండు |
| ఒడియు | = | ఆకర్షించు |
| శుకములు | = | చిలుకలు |
| మందాకిని | = | ఆకాశగంగ |
| పాఠీనము | = | చేప |
| లోకము | = | సమూహము |
| శంప | = | మెఱుపు |
| సరణి | = | వరుస |

| | | |
|---|---|---|
| మెలఁత | = | స్త్రీ |
| పిఱిఁది | = | వెనుక |
| మొగిలు | = | మేఘం |
| జలదవర్ణుఁడు | = | విష్ణువు (మేఘము వంటి రంగుగలవాడు) |

**తాత్పర్యం :**

లక్ష్మీదేవి (మెలఁత) విష్ణువు (జలదవర్ణుడు) వెంట మేఘము వెంట మెఱుపులాగా వెళ్ళేటప్పుడు ఆమె తన నొసటి మీది అందమైన కురులను తాకి నిమురగనే జుం జుం అంటూ ఆమె పద్మము వంటి ముఖం నిండా తుమ్మెదలు ముసిరాయి. తుమ్మెదలను త్రోలగానే చిల్కలుచేరి దొండపండు వంటి ఆమె పెదవి కాంతులను పట్టుకోడానికై పరుగెత్తాయి. చిలుకలను త్రోలగానే చేపల వంటి ఆమె కన్నుల కోసం ఆకాశగంగలోని చేపలు ఎగిరిపడుతున్నాయి. వాటిని తప్పించుకొనినంతనే తీగవంటి ఆమె మేనుతో రాసుకోటానికై మెఱుపుతీగలు ఆకాశంలో బారులు తీరాయి. ఆ మెఱుపు తీగలను జయించగానే చక్రవాకాలు వచ్చి ఆమె స్తనాలను తాకి నిక్కాయి.

**105వ పద్యం : సమగ్రవ్యా3ఖ్యలలో చూడండి**

**106వ వచనం :**

| | | |
|---|---|---|
| పొడగని | = | చూచి |

**107వ పద్యం :**

| | | |
|---|---|---|
| పజ్జ | = | ప్రక్క |
| నినాదము | = | ధ్వని |
| భుజగధ్వంసి | = | గరుత్మంతుడు |
| క్రన్నన | = | వేగంగా |
| ఏతెంచు | = | వచ్చు |
| నిస్వనము | = | శబ్దము |
| మిన్ను | = | ఆకాశం |

**తాత్పర్యం :**

అడుగో గొప్పవాడైన హరి, ఆయన ప్రక్కనే ఉన్న లక్ష్మీదేవిని చూచారా ! అదుగో శంఖధ్వని, అదుగో చక్రం, అతడే గరుత్మంతుడు, వేగంగా వచ్చాడు అని ఆకాశంలోని దేవతలు "నమో నారాయణాయ" అని అంటూ గజేంద్రుని దురవస్థను పోగొట్టే విష్ణువునకు నమస్కరించారు.

**108వ వచనం :**

| | | |
|---|---|---|
| పాలనము | = | రక్షణము |
| పారవశ్యము | = | పరవశత్వము, పరాధీనత |
| కుళీరము | = | ఎండ్రకాయ |
| గురు, మకర, కుళీన, మీన మింధునంబై | = | పెద్ద మొసళ్ళు ఎండ్రకాయలు చేపల జంటలు కలదియై (గురు = బృహస్పతి, మకరరాశి, కర్కాటకరాశి, మీనరాశి, మిధునరాశి, అని అర్థాంతరము) |

| | | |
|---|---|---|
| కిన్నెర + ఇంద్రుడు | = | కిన్నరేంద్రుడు = కుబేరుడు |
| భాండారము | = | ధనాగారము |
| వరకచ్ఛపంబు + ఐ | = | శ్రేష్ఠమైన తాబేళ్ళుగలదియై (గొప్ప కచ్ఛపనిధి కలదియై) |
| భాగధేయము | = | భాగ్యము |
| ద్వంద్వము | = | రెండు |
| సంకులము | = | వ్యాపించినది |
| పంకము | = | బురద |
| సంకీర్ణము | = | ఒకదానితో ఒకటి కలిసిపోవుట, వ్యాపించినది |
| పంకజాకరము | = | సరస్సు |

**తాత్పర్యం :**

గజేంద్రుణ్ణి రక్షించాలనే పారవశ్యంతో విష్ణువు దేవతలు సమర్పించే నమస్కారాలను స్వీకపింపకుండా పోతూ కొంతదూరంలో సరస్సును చూచాడు. ఆ సరస్సు -

(1) శింశుమార చక్రం వలే ఉన్నది. శింశుమార చక్రం గురుమకర కుళీరమీన మిధునమైనది. అనగా గురు, మకర, కర్కాటక, మీన, మిధునరాశుల గలది. సరస్సులో కూడా అవే ఉన్నాయి. అయితే శ్లేష చేత అర్థం మారుతుంది. (గురు = పెద్ద) పెద్దమొసళ్ళు, ఎండ్రకాయలు, చేపల జంటలు కలది.

(2) కిన్నరేంద్రుని భాండాగారంబునుంబోలె స్వచ్ఛవరకచ్ఛపమైనది. కుబేరుని పరంగా అర్థం - గొప్ప కచ్ఛప నిధి కలది. సరస్సు పరంగా అర్థం : గొప్ప కచ్ఛపనిధి కలది అనగా తాబేళ్ళు నిధి కలదని అర్థం.

(3) భాగ్యవంతుని భాగధేయమువలె ఉన్నది - అది పరాగజీవనము కలది. అనగా భాగ్యవంతుని భాగ్యం అనురాగంతో కూడిన జీవనం. సరస్సు కూడా సరాగజీవనం గలదే. అనగా రంగుతో కూడిన నీళ్ళు గలది. జీవనం=నీరు.

(4) వైకుంఠంబునుంబోలె శంఖచక్రకమలాంలంకృతంబైనది. వైకుంఠం శంఖం (విష్ణువు యొక్క పాంచజన్యం) చక్రం (విష్ణువు యొక్క సుదర్శన చక్రం) కమల (లక్ష్మీదేవి) చేత అలంకరింపబడింది. సరస్సు కూడా శంఖ, చక్ర, కమలాలంకృతమైనది. ఇక్కడ శంఖ అనగా నీటిలో ఉండే శంఖాలు, చక్ర - అంటే చక్రవాక పక్షులు, కమల అనగా తామర పువ్వులని అర్థం. వీటిచేత సరస్సు అలంకరింపబడిందని,

(5) సంసార చక్రంబునుంబోలె ద్వంద్వసంకుల పంకసంకీర్ణమైనది. సంసారమనగా జగత్తు. ఈ భూమండల మండలమంతా ద్వంద్వసంకులమే. అనగా శీతోష్ణాదులు, పంకము అనగా కలుషాలు. అట్లే సరస్సు కూడా ద్వంద్వ సంకులమే. అనగా ఇద్దరు చేయు యుద్ధంతో కూండిందని అర్థం. పంక మంటే బురద. కాబట్టి బురదతో కూడిందని, ఉపమేయోపమానములందుండు సమాన లక్షణములను వర్ణించడంలో శ్లేష వలన రెండింటికి సాదృశ్యము సంభవించినది.

**109వ పద్యం : సమగ్ర వ్యాఖ్యలలో చూడండి.**

**110వ వచనం =**

| | | |
|---|---|---|
| పంచు | = | పంపించు (ప్రయోగించు) |

**111వ పద్యం : సమగ్ర వ్యాఖ్యలలో చూడండి.**

**112వ పద్యం : సమగ్ర వ్యాఖ్యలలో చూడండి.**

**113వ వచనం :**

| | | |
|---|---|---|
| నిమిష స్పర్శనంబున | = | ఒక్క నిమిషంపాటు తాకగానే |
| మకరి | = | మొసలి |

**తాత్పర్యం :**

ఈవిధంగా సుదర్శనచక్రం క్షణకాలంలోనే మొసలితలను త్రుంచునప్పుడు (తరువాతి పద్యంలో అన్వయం)

**114వ పద్యం :**

| | | |
|---|---|---|
| రవి | = | సూర్యుడు |
| ధనదుడు | = | కుబేరుడు |
| మకరాలయము | = | సముద్రం |

**తాత్పర్యం :**

పన్నెండు రాశులలో ఒకటైన మకరం సూర్యుని చాటునకు పోయింది మఱియొక మకరం కుబేరుని చాటునకు (ఇక్కడ మకరం అనగా మకరనిధి అని అర్థం) పోయింది. సముద్రంలో ఉన్న మొసళ్ళు ఆదికూర్మం చాటునకు వెళ్లిపోయాయి.

**115వ పద్యం : సమగ్ర వ్యాఖ్యలో చూడండి.**

**- డా॥ శ్రిష్టి చంద్రమౌళిశర్మ**
రిటైర్డ్ ప్రిన్సిపాల్
శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ డిగ్రీ కళాశాల
పొదిలి, ప్రకాశం జిల్లా.

పాఠం - 9

# గజేంద్ర మోక్షము

- బమ్మెర పోతన

(మహాభాగవతం - అష్టమ స్కంధం - 25 నుండి 115 పద్యాల వరకు)

## సమగ్ర వ్యాఖ్యలు

**విషయసూచిక :**

9.1 ఉద్దేశ్యం

9.2 సమగ్రవ్యాఖ్యలు

9.3 రాదగిన ప్రశ్నావిధానం

**9.1 ఉద్దేశ్యం :**

సమగ్ర వ్యాఖ్య ద్వారా పద్య నిర్మాణశక్తి వ్యక్తమౌతుంది. కవితాశిల్పం కనులముందావిష్కృత మౌతుంది. సందర్భ శుద్ధికై రసపిద్ధికై కవి గావించిన గుణరీతివృత్తి శయ్యాలంకార ఛందో వైభవాదులు ద్యోతమానమౌతాయి. సృజన వ్యాపారధోరణి బోధపడుతుంది. ఇది దీని ముఖ్యోద్దేశ్యం.

**9.2 సమగ్ర వ్యాఖ్యలు :**

**26వ పద్యం :**

**అన్యాలోకనభీకరంబులు జితాశానేకపానీకముల్**
**వన్యేభంబులు గొన్ని మత్తతనులై వ్రజ్యావిహారాగతో**
**దన్యత్వంబున భూరిభూధరదరీ భాగంబులందుండి సౌ**
**జన్యక్రీడల నీరుగాలివడి కాసారావగాహార్థ మై**

**1. కవి, పాఠ్యాంశము :**

ఈ పద్యము బమ్మెరపోతనచే రచింపబడిన శ్రీమహాభాగవతములోని అష్టమ స్కంధమునందలి ప్రస్తుత పాఠ్యభాగమైన గజేంద్రమోక్షణములోనిది.

**2. సందర్భము :**

భిల్లీ భిల్లులతోను, లులాయకాది జంతుసంతానముతోను నిండినయడవియందు కాసారావగాహార్థమైన కొన్ని వన్యేభంబులను కవి వర్ణించు సందర్భములోనిదీ పద్యము.

**3. ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| అన్య | : | ఇతరుల యొక్క |
| ఆలోకన | : | చూపులకు |
| భీకరంబులు | : | భయమును కలిగించునవి |
| (జితాశానేకపానీకముల్ | : | జిత + ఆశా + అనేకప + అనేకముల్) |
| జిత | : | జయింపబడిన |
| ఆశా | : | దిక్కులయందలి |
| అనేకప | : | ఏనుగుల యొక్క |
| అనేకముల్ | : | సమూహములు గలవియు నగు |

| | | |
|---|---|---|
| వన్య | : | అడవియందు పుట్టిన |
| ఇభంబులు | : | ఏనుగులు |
| కొన్ని | : | కొన్ని |
| మత్త | : | మదించిన |
| తనులు + ఐ | : | శరీరములు కలవియై |
| వ్రజ్యావిహారాగతోదన్యత్వంబున్ | : | వ్రజ్యావిహార + ఆగత + ఉదన్యత్వంబునన్ |
| వ్రజ్యావిహార | : | ప్రయాణవిహారముచేత |
| ఆగత | : | వచ్చిన (ఏర్పడిన) |
| ఉదన్యత్వంబునన్ | : | దప్పిక వలన |
| భూరిభూధరదరీద్వారంబులందుండి | | |
| భూరి | : | పెద్దవైన |
| భూధర | : | పర్వతముల యొక్క |
| దరీ | : | గుహల యొక్క |
| ద్వారంబులందుండి | : | ముఖప్రదేశముల నుండి |
| సౌజన్యక్రీడలున్ | : | మంచి యాటలతో |
| నీరుగాలి | : | చల్లనిగాలి |
| పడి | : | పొంది |
| (కాసారావగాహార్థమై | : | కాసార + అవగాహార్థము + ఐ) |
| కాసార | : | కొలనులో |
| అవగాహార్థము + ఐ | : | మునుగుట కొఱకై |

**4. తాత్పర్యం :**

ఇతరులు చూడటానికి కూడా భయాన్ని గొలిపేవి, దిగ్గజాలను సైతం జయించినవియైన కొన్ని మదించిన యేనుగులు ప్రయాణంచేత విహారంచేత దప్పిక గొన్నవై పెద్ద కొండగుహల వాకిళ్ళ నుండి ఆటలాడుతూ కొలనులో మునుగుట కొఱకై (బయలువెడలిన వని తరువాతి పద్యంతో అన్వయం)

**5. సంధులు :**

ఆశా + అనేకపము = ఆశానేకపము - సవర్ణదీర్ఘ సంధి
నీరుగాలి + పడి = నీరుగాలిపడి - గసడదవాదేశ సంధి

**6. సమాసములు :**

అన్యాలోకనము - అన్యుల యొక్క ఆలోకనము - షష్ఠీతత్పురుష సమాసము

**7. ఛందస్సు :**

| మ | స | జ | స | త | త | గ |
|---|---|---|---|---|---|---|
| U U U | I I U | I U I | U U I | UUI | UUI | U |

జన్య క్రీ డల నీ రు గాలి వడి కా సారావ గాహార్థ మై

ఇందు, మ, స, జ, స, త, త, గ అను గణములు గలవు. యతిస్థానం 13వ అక్షరం (జ-సా) ప్రాస కలదు. కావున ఇది శార్దూలము.

**8. కవితా విశేషాలు :**

ఏనుగుల ఔద్ధత్యమునకు తగినట్లుగా పద్యమున ఓజోగుణము పోషింపబడి గౌడీరీతిలో నడిచినది.

**42వ పద్యం :**

అటఁగాంచెం గరిణీవిభుండు నవపుల్లాంభోజకల్హారమున్
నటదిందీవరవారమున్ గమఠమీనగ్రాహదుర్వారమున్
వటహింతాలరసాలసాల సుమనోవల్లీకుటీతీరముం
జటులోద్ధూత చక్రబకసంచారంబుఁ గాసారమున్

**1. కవి, పాఠ్యభాగము :**

ఈ పద్యము బమ్మెరపోతనచే రచింపబడిన శ్రీమహాభాగవతములోని అష్టమ స్కంధమునందలి ప్రస్తుత పాఠ్యభాగమైన గజేంద్రమోక్షణములోనిది.

**2. సందర్భము :**

గజేంద్రుడెన్నో అడవులలో విహరించి దారితప్పి దప్పికగొని తన ఆడఏనుగులతో సహా తిరిగి తిరిగి ఒక సరస్సును చూచిన సందర్భములో దానిని కవి వర్ణించు సందర్భములోనిదీ పద్యము.

**3. ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| అటన్ | : | అక్కడ |
| కరిణీవిభుండు | : | ఆడఏనుగుల భర్తయైన గజేంద్రుడు |

నవపుల్లాంభోజకల్హారమున్

| | | |
|---|---|---|
| నవ | : | క్రొత్తగా |
| పుల్ల | : | వికసించిన |
| అంభోజ | : | పద్మములు |
| కల్హారమున్ | : | కలువలు గలదియు |

నటదిందీవరవారమున్

| | | |
|---|---|---|
| నటత్ | : | నటించుచున్న అనగా ఎగురుచున్న |
| ఇందీవర | : | తుమ్మెదల యొక్క |
| వారమున్ | : | సమూహము గలదియు |

కమఠమీనగ్రాహదుర్వారమున్

| | | |
|---|---|---|
| కమఠ | : | తాబేళ్ళు వలన |
| మీన | : | చేపల వలన |
| గ్రాహ | : | మొసళ్ళు వలన |
| దుర్వారమున్ | : | వారింపదగినది యు |

వటహింతాలరసాలసాలసుమనోవల్లీకుటీతీరమున్

| | | |
|---|---|---|
| వట | : | మఱ్ఱి చెట్లతోను |
| హింతాల | : | గిరకతాడి చెట్లతోను |
| రసాల | : | తియ్యమామిడి చెట్లతోను |
| సాల | : | మద్దిచెట్లతోను |
| సుమనోవల్లీ | : | పూతీగలతోను |
| కుటీ | : | పొదరిండ్లతోను కూడిన |
| తీరమున్ | : | ఒడ్డు గలదియు |

చటులోద్భూతమరాళచక్రబకసంచారంబున్

| | | |
|---|---|---|
| చటుల | : | చలించినవియు అనగా తిరుగుచున్నవియు |
| ఉద్భూత | : | మీదికి కదిలింపబడినవియు అనగా ఎగురుచున్నవియునగు |
| మరాళ | : | హంసల యొక్కయు |
| చక్ర | : | జక్కవల యొక్కయు |
| బక | : | కొంగల యొక్కయు |
| సంచారంబున్ | : | సంచారముకలదియునగు |
| కాసారమున్ | : | సరస్సును |
| కాంచెన్ | : | చూచెను |

**4. తాత్పర్యం :**

అప్పుడే వికసించినట్టి పద్మాలు కలువపూలు గలదియు, అటూయిటూ ఆడుతున్న తుమ్మెదల గుంపుగలదియు, తాబేళ్ళు, చేపలు, మొసళ్ళు గలదియు, మఱ్ఱి చెట్లతోను, పొట్టితాటి చెట్లతోడను, తియ్యమామిడి చెట్లతోడను, మద్ది చెట్లతోడను, పూతీవలతోను, పొదరిండ్ల తోడను కూడిన ఒడ్డు గలదియు హంసల యొక్కయు, చక్రవాకపక్షుల యొక్కయు, కొంగలయొక్కయు సంచారము గలదియునగు ఒక సరస్సును గజేంద్రుడు ఆ సమీప ప్రదేశమున చూచెను.

**5. సంధులు :**

ఫుల్లాంభోజము = ఫుల్ల + అంభోజము - సవర్ణదీర్ఘసంధి

చటుల + ఉద్ధూతము = చటులోద్ధూతము - గుణసంధి

**6. సమాసములు :**

కరిణీవిభుండు = కరిణి యొక్క విభుండు - షష్ఠీ తత్పురుష సమాసం

ఫుల్లాంభోజము = ఫుల్లమైన అంభోజము - విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం

**7. ఛందస్సు :**

| స | భ | ర | న | మ | య | వ |
|---|---|---|---|---|---|---|
| IIU | UII | UIU | III | UUU | IUU | IU |
| నటదిం | దీవర | వారముం | గమత | మీనగ్రా | హదుర్వా | రమున్ |

ఈ పద్యపాదము నందు స, భ, ర, న, మ, య, వ అను గణములు కలవు. 14వ అక్షరం యతిస్థానం. పద్యంలో ప్రాసనియమం ఉంది. కాబట్టి ఇది మత్తేభము.

**8. కవితా విశేషాలు :**

క్రియను పద్యారంభంలోగాని, ప్రారంభానికి ఒక రెండుపదాల తర్వాతగాని ప్రయోగించి, వర్ణ్యమాన వస్తువుని పద్యాంతంలో చెప్పి దానిని రెండింటి నడుమ వర్ణించడం క్రియ తర్వాత కర్తృవాచకాన్ని చెప్పడం ఒకవిధమైన పద్యశిల్పం. అది ఇచ్చట కలదు.

ఇట వర్ణ్యమాన వస్తువు కాసారం. అది పద్యాంతంలో ఉంది. కాంచెన్ అనేది క్రియ. అది ఆరంభపదం తర్వాత ఉంది. నడిమిభాగం అంతా కాసారవర్ణనమే. కాంచెన్ తర్వాతనే కరిణీవిభుండు అని ఉంది.

9. ఈ పద్యంలో అంత్యానుప్రాసాలంకారం గలదు.

**లక్షణం :** అనుప్రాస పాదాంతంలో ఉంటే అది అంత్యానుప్రాస.

**సమన్వయం :** "మున్" అనే వర్ణం పద్యంలోని నాలుగు పాదాల చివరలో ఉంది కాబట్టి అందు అంత్యానుప్రాసాలంకారం గలదని చెప్పవచ్చును.

**57వ పద్యం :**

**ఆటోపంబునఁజిమ్ము ఔమ్మగల వజ్రాభీలదంతంబులం**
**దాటించున్ మెడఁజుట్టిపట్టి హరిదోర్దండాభశుండాహతిన్**
**నీటన్ మాటికిమాటికిం దిగువఁగా నీరాటమున్ నీటిపో**
**రాట న్నోటమిపాటుఁజూపుట కరణ్యాటంబు వాచాటమై**

**1. కవి, పాఠ్యభాగము :**

ఈ పద్యము బమ్మెరపోతనచే రచింపబడిన శ్రీమహాభాగవతములోని అష్టమ స్కంధమునందలి ప్రస్తుత పాఠ్యభాగమైన గజేంద్రమోక్షణములోనిది.

**2. సందర్భము :**

కరిమకరాలకు నీళ్ళల్లో జరిగే పోరాటంలో మకరాన్ని గెలవాలని కరిచేసే ప్రయత్నాన్ని కవి వర్ణించే సందర్భం.

**3. ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| నీటన్ | : | నీటిలో |
| మాటికిమాటికిన్ | : | తడవతడవకు |
| తిగువఁగాన్ | : | లాగుచుండగా |
| నీటిపోరాటన్ | : | నీటిలో జరిగే పోట్లాటలో |
| ఓటమిపాటున్ | : | ఓటమిని |
| చూపుటకు | : | చూపించుటకు |
| అరణ్యాటంబు | : | ఏనుగు |
| వాచాటము + ఐ | : | ఘీంకరిస్తూ |
| నీరాటమున్ | : | మొసలిని |

| | | |
|---|---|---|
| వజ్ర | : | వజ్రాయుధమువలె |
| అభీల | : | భయంకరమైన |
| దంతంబులన్ | : | దంతములతో |
| రొమ్ము | : | రొమ్ము |
| అగలన్ | : | పగులునట్లు |
| ఆటోపంబునన్ | : | వేగముగా |
| చిమ్మన్ | : | పొడుచును |
| హరి | : | ఇంద్రుని యొక్క |
| దోర్దడ | : | దండము వంటి బాహువుతో |
| ఆభ | : | సమానమైన |
| శుండా | : | తుండము యొక్క |
| హతిన్ | : | దెబ్బతో |
| మెడన్ | : | మెడను |
| చుట్టి | : | చుట్టివైచి |
| పట్టి | : | పట్టుకొని |
| తాటించున్ | : | కొట్టును |

**4. తాత్పర్యం :**

ఏనుగును మొసలి నీటిలోనికి మాటిమాటికి లాగుతున్నది. నీటి పోట్లాటలో మొసలిని ఓడించేందుకు ఏనుగు ఘీంకరిస్తూ వజ్రాయుధం లాంటి తన దంతాలతో మొసలిరొమ్ము పగులునట్లుగా వేగంగా పొడిచింది. ఇంద్రుని బాహువులాగా పొడవైన తొండంతో మొసలి మెడను చుట్టి వైచి కొట్టింది.

**5. సంధులు :**

వజ్ర + ఆభీలము = వజ్రాభీలము - సవర్ణదీర్ఘ సంధి

రొమ్ము + అగల = రొమ్మగల - ఉత్వసంధి

**6. సమాసములు :**

ఆభీలదంతంబులు = ఆభీలమైన దంతంబులు - విశేషణ పూర్వపద కర్మధారయ సమాసము.

హరిదోర్దండము = హరి యొక్క దోర్దండము - షష్ఠీ తత్పురుష సమాసము.

దోర్దండము = దండము వంటి బాహువు - ఉపమాన ఉత్తరపద కర్మధారయ సమాసము.

**7. ఛందస్సు :**

| మ | స | జ | స | త | త | గ |
|---|---|---|---|---|---|---|
| U U U | I I U | I U I | U U I | UUI | UUI | U |
| నీటన్ మా | టికిం మా | టికి ది | గువఁగా | నీరాట | మున్ నీటి | పో |

ఈ పద్యంలో మ, స, జ, స, త, త, గ అనే గణాలున్నాయి. 13వ అక్షరంతో యతి కుదిరింది. ప్రాస నియమం ఉంది. కనుక ఇది శార్దూల పద్యం.

**8. అలంకారం :**

ఈ పద్యమునందు వృత్త్యనుప్రాసాలంకారము కలదు. ఒక హల్లుగాని, పెక్కు హల్లులుగాని పలుమారులు ప్రయుక్తములైనచో అది వృత్త్యనుప్రాసాలంకార మనబడును.

ఈ పద్యమునందు చివరి రెండు పాదములో ట కారము పలుమార్లు ప్రయుక్తమైంది. కాన అందు వృత్త్యనుప్రాసాలంకారమున్నదని చెప్పవచ్చును.

**65వ పద్యం :**

**పాదద్వంద్వము నేలమోపి పవనున్ బంధించి పంచేంద్రియో**
**న్మాదంబుం బరిమార్చి బుద్ధిలతకున్ మాఱాకుహత్తించి ని**
**ష్ఖేదబ్రహ్మపదావలంబనరతిం గ్రీడించుయోగీంద్రుమ**
**ర్యాదన్ నక్రము విక్రమించె కరిపాదాక్రాంతి నిర్వక్రమై**

**1. కవి, పాఠ్యభాగము :**

ఈ పద్యము బమ్మెరపోతనచే రచింపబడిన శ్రీమహాభాగవతములోని అష్టమ స్కంధమునందలి ప్రస్తుత పాఠ్యభాగమైన గజేంద్రమోక్షణములోనిది.

**2. సందర్భము :**

మొసలి గజేంద్రునిపై విజృంభించు సందర్భమున ఆ విజృంభణమును కవి వర్ణించు ఘట్టములోనిది.

**3. ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| పాదద్వంద్వము | : | రెండుకాళ్ళను |
| నేలన్ | : | నేలమీద |
| మోపి | : | ఆనించి, ఉంచి |
| పవనున్ | : | గాలిని |
| బంధించి | : | బిగబట్టి |
| పంచేంద్రియ | : | పంచేంద్రియముల యొక్క |
| ఉన్మాదంబున్ | : | వెట్టిని (మితిమీరిన వాంఛలను) |
| పరిమార్చి | : | అణచి |
| బుద్ధిలతకున్ | : | బుద్ధియనే తీగకు |
| మాఱాకున్ | : | మారాకును |
| హత్తించి | : | తొడిగి |
| నిష్ఖేద | : | దుఃఖము లేనట్టి |
| బ్రహ్మవద | : | బ్రహ్మపదమును |
| అవలంబన | : | ఆశ్రయించుట యందలి |
| రతిన్ | : | ఆసక్తితో |
| క్రీడించు | : | ఆటాడునట్టి (ఉల్లాసపడు) |
| యోగీంద్రుమర్యాదన్ | : | గొప్పయోగి మాదిరి |

| | | |
|---|---|---|
| న(క్రము | : | మొసలి |
| కరి | : | ఏనుగు యొక్క |
| పాద | : | పాదములను |
| ఆ(క్రాంతి | : | ఆ(క్రమించుట యందు |
| నిర్వ(క్రము + ఐ | : | వ(క్రత్వము లేనిదై (పట్టువదలనిదై) |
| వి(క్రమించెన్ | : | పరా(క్రమించెను |

**4. తాత్పర్యం :**

రెండు కాళ్ళను నేలపై నిలిపి, ఊపిరి బిగబట్టి, పంచేం(ద్రియాల వెఱ్ఱిపోకడలను నిలువరించి, బుద్ధిని వికసింపజేసికొని, ఏ దుఃఖములేని (బ్రహ్మపద్మాన్ని (మోక్షాన్ని) ఆ(శయించడంలోగల ఆసక్తితో దోగాడు యోగివరేణ్యునివలె మొసలి ఏనుగు పాదమును ఆ(క్రమించడంలో పట్టుదల సడలనీయకుండా పరా(క్రమించింది.

**5. విశిష్ఠ సంధులు :**

పంచేం(ద్రియ + ఉన్మాదము = పంచేం(ద్రియోన్మాదము - గుణసంధి
యోగి + ఇం(ద్రుడు = యోగీం(ద్రుడు - సవర్ణదీర్ఘ సంధి

**6. విశిష్ఠ సమాసములు :**

పంచేం(ద్రియములు - ఐదైన ఇం(ద్రియములు - ద్విగు సమాసము
బుద్ధిలత - బుద్ధి అనెడి లత - రూపక సమాసము

**7. ఛందస్సు :**

| మ | స | జ | స | త | త | గ |
|---|---|---|---|---|---|---|
| UUU | IIU | IUI | IIU | UUI | UUI | U |
| పాదద్వం | ద్వమునే | ల మోపి | పవనున్ | బంధించి | పంచేం(ద్రి | యో |

ఈ పద్యపాదమున మ, స, జ, స, త, త, గ అను గణములు కలవు. యతిస్థానము 13వ అక్షరం (పా-బం) పద&ంయలో (ప్రాసనియమం కూడా కలదు. కావున ఇది శార్దూలము.

**8. అలంకారం :**

ఈ పద్యంలో ఉపమాలంకారం ఉంది.

ఉపమేయ ఉపమానములకు సొగసైన సాదృశ్యము చెప్పబడినచో అది ఉపమాలంకారమగును.

ఉపమాలంకారంలో సాధారణంగా నాలుగు అంశాలుంటాయి. ఒకటి ఉపమేయం - అనగా (ప్రస్తుతం వస్తువు. రెండు ఉపమానం - అంటే పోలికగా చెప్పబడింది. మూడు - సమానధర్మం - అంటే ఉపమేయంలోను ఉపమానంలోను కనబడే సమాన లక్షణం. నాల్గవది ఉపమా వాచకం - అంటే ఉపమానం ఏదో దాని సూచించేపదం (వలె, వంటి పదాలు)

**అన్వయం :**

ఈ పద్యంలో (ప్రస్తుత వస్తువు అనగా ఉపమేయం- న(క్రము, ఉపమానం - యోగీం(ద్రుడు, సమానధర్మం - పదముల నా(శయించడం, ఉపమావాచకం - మర్యాదన్ (విధము, వలె అని అర్థం)

**67వ పద్యం :**

ఊహ గలంగి జీవనపుటోలమునంబడి పోరుచున్ మహా
మోహలతానిబద్ధపదమున్ విడిపించుకొనంగలేక సం
దేహముఁబొందు దేహిక్రియదీనదశన్ గజముండె భీషణ
గ్రాహదురంతదంతపరిఘట్టి తపాదఖురాగ్రశల్యమై

**1. కవి, పాఠ్యభాగము :**

ఈ పద్యము బమ్మెరపోతనచే రచింపబడిన శ్రీమహాభాగవతములోని అష్టమ స్కంధమునందలి ప్రస్తుత పాఠ్యభాగమైన గజేంద్రమోక్షణములోనిది.

**2. సందర్భము :**

కరిమకరముల పోరులో కరి యొక్క దీనదశను వర్ణించు సందర్భములోనిదీ పద్యము.

**3. ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| ఊహ | : | ఆలోచన |
| కలంగి | : | కలత చెందిన (చెదరిపోయి) |
| జీవనపుటోలమునన్ + పడి | : | బ్రతుకుతెరువులో తడిసి (బ్రతుకు తెరువులో మునిగి) |
| పోరుచున్ | : | పోరాడుచు, కొట్టుమిట్టాడుచు |
| మహా | : | గొప్ప |
| మోహలతా | : | వ్యామోహమనెడి తీగచే |
| నిబద్ధ | : | కట్టబడిన |
| పదమున్ | : | స్థానమును |
| విడిపించుకొనంగలేక | : | విడిపించుకోలేక |
| సందేహమున్ | : | సందేహమును |
| పొందు | : | పొందునట్టి |
| దేహిక్రియన్ | : | జీవుని వలె |
| గజము | : | ఏనుగు |
| భీషణ | : | భయంకరమైన |
| గ్రాహ | : | మొసలియొక్క |
| దురంత | : | అంతములేని |
| దంత | : | కోరలచే |
| పరిఘట్టిత | : | మిక్కిలిగా గట్టింపబడిన (కరవబడిన) |
| పాద | : | కాలియొక్క |
| ఖుర + అగ్ర = ఖురాగ్ర | : | గిట్టల చివరల యొక్క |
| శల్యము + ఐ | : | ఎముకలు గలదియై |
| దీనదశన్ | : | దైన్యముతో కూడిన స్థితిలో |
| ఉండెన్ | : | ఉండెను. |

**4. తాత్పర్యం :**

ఆలోచనలు చెదిరిపోయి, బ్రతుకుతెరువులో మునిగిపోయి, కొట్టుమిట్టాడుచూ వ్యామోహాలనే బంధనాల నుండి తప్పించుకొనలేక సందేహాలకు గురి అయ్యే జీవునివలే ఏనుగు కూడా భయంకరమైన మొసలి కోరలచే బాగా కరవబడిన కాలిగిట్టల ఎముకలుగలదియై దీనావస్థలో నున్నది.

**5. సంధులు :**

ఊహ + కలంగి = ఊహగలంగి - గసడదవాదేశ సంధి

జీవనము + ఓలము = జీవనపుటోలము - పుంప్వాదేశ, టుగాగమ సంధులు

**6. సమాసములు :**

మోహలత = మోహమనెడి లత - రూపక సమాసము

భీషణగ్రాహము = భీషణమైన గ్రాహము - విశేషణపూర్వపద కర్మధారయ సమాసము.

**7. ఛందస్సు :**

| భ | ర | న | భ | భ | ర | వ |
|---|---|---|---|---|---|---|
| U I I | U I U | I I I | U I I | U I I | U I U | I U |
| గ్రాహదు | రంతదం | తపరి | ఘట్టిత | పాదఖు | రాగ్రశ | ల్యమై |

ఈ పద్యపాదము నందు భ, ర, న, భ, భ, ర, వ అను గణములున్నవి యతిస్థానం 10వ అక్షరం (గ్రా - ఘ) పద్యంలో ప్రాస నియమం కలదు. కావున ఇది ఉత్పలమాల.

**8. అలంకారం :**

ఈ పద్యంలో ఉపమాలంకారం ఉంది.

ఉపమేయ ఉపమానాలకు సొగసైన సాదృశ్యము చెప్పబడినచో అది ఉపమాలంకారం అవుతుంది.

ఇందులో ప్రధానంగా నాలుగు అంశాలుంటాయి. 1) ఉపమేయం (ప్రస్తుత వస్తువు, 2) ఉపమానం (పోలికగా చెప్పబడినవి, 3) సమాన ధర్మం (ఉపమేయంలోను ఉపమానంలోను ఉన్నట్టి సమాన లక్షణం, 4) ఉపమా వాచకం (ఉపమానాన్ని సూచించే పదం - వలె, వంటి మొదలగునవి)

**అన్వయం :**

ఉపమేయం - ఏనుగు, ఉపమానం - దేహి, సమానధర్మం - దీనదశ, ఉపమావాచకం - క్రియన్ (వలె అని అర్థం)

**9. విశేషాంశాలు :**

దేహిస్థితిని వర్ణిస్తూ గజేంద్రుని స్థితి ఏదో కూడా భంగ్యంతరంగా పోతన సూచించాడు.

**72వ పద్యం :**

**నానానేకపయూథముల్ వనములోనం బెద్దకాలంబు స**
**న్మానింపన్ దశలక్షకోటికరిణీనాథుండనై యుండి మ**
**ద్దానాంభః పరిపుష్ట చందనలతాంతచ్ఛాయలం దుండలే**
**కీవీరాశనిటీల వచ్చితి భయం బెట్లోకదే యీశ్వరా !**

**1. కవి, పాఠ్యభాగము :**

ఈ పద్యము బమ్మెరపోతనచే రచింపబడిన శ్రీమహాభాగవతములోని అష్టమ స్కంధమునందలి ప్రస్తుత పాఠ్యభాగమైన గజేంద్రమోక్షణములోనిది.

**2. సందర్భము :**

మొసలిని జయించటం తన వల్ల కాదని జ్ఞానోదయమైన తర్వాత గజేంద్రుడు భగవంతుని ప్రార్థించడం మొదలుపెడుతుంది. ఆ సందర్భంలోనిదీ పద్యం.

**3. ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| నానా | : | అనేకమైన |
| అనేక ప | : | ఏనుగుల యొక్క |
| యూథముల్ | : | సమూహములు |
| పెద్దకాలంబు | : | చాలకాలము |
| సన్మానింపన్ | : | గౌరవిస్తుండగా |
| దశలక్షకోటి | : | పదిలక్షలకోట్ల |
| కరిణీ | : | ఆడుఏనుగులకు |
| నాథుండును+ఐ | : | భర్తనై |
| వనములోనన్ | : | అడవిలో |
| ఉండి | : | ఉండి |
| మత్ | : | నాయొక్క |
| దాన+అభః | : | దానజలముచే |
| పరిపుష్ట | : | బాగుగా పోషింపబడిన |
| చందన | : | గందపుచెట్ల యొక్కయు |
| లతా | : | తీగల యొక్కయు |
| అంతచ్ఛాయలందు | : | చక్కనైన నీడలందు (అనగా విశాలమైన నీడలందు) |
| ఉండలేక | : | ఉండకుండా |
| ఈ నీరు + ఆశన్ | : | ఈ నీళ్ళపై ఆశతో |
| ఇటు | : | ఇక్కడికి |
| ఏలవచ్చింది | : | ఎందుకు వచ్చితిని |
| ఈశ్వరా | : | భగవంతుడా |
| భయంబు | : | ఈ భయం |
| ఎట్లోకదే | : | ఎట్లగునో కదా ! |

**4. తాత్పర్యం :**

ఎన్నో పనులు చాలాకాలంగా నన్ను గౌరవిస్తుండగా అనేకములైన ఆడయేనుగులకు భర్తనైయుండి, నా చెక్కిళ్ళ నుండి స్రవించే మదజలం చేత పోషింపబడి ఎదిగిన గంధపు చెట్ల యొక్కయు, తీవల యొక్కయు చక్కని నీడలలో ఉండకుండా ఈ నీటిమీది ఆశతో ఇక్కడికి ఎందుకు వచ్చానో ? దేవుడా ! ఈ భయం ఎట్లా తీరుతుందో కదా !

**5. విశిష్ఠ సంధులు :**

నీరు + ఆశ = నీరాశ - ఉత్వసంధి

నానా + అనేపయూథముల్ = నానానేపయూథముల్ - సవర్ణదీర్ఘసంధి

**6. సమాసములు :**

కరిణీనాథుడు - కరిణి యొక్క నాథుడు - షష్ఠీ తత్పురుష సమాసము

అభఃపరిపుష్టము - అంభస్సు చేత పరిపుష్టము - తృతీయా తత్పురుషసమాసము

**7. ఛందస్సు :**

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| మ | స | జ | స | త | త | గ |
| UUU | IIU | IUI | IIU | UUI | UUI | U |
| దానాంభః | పరిపు | ష్ట చంద | నలతాం | త చ్ఛాయ | లందుంజ | లే |

ఈ పద్యమునందు మ, స, జ, స, త, త, గ అను గణములు కలవు. యతిస్థానం 13వ అక్షరం. (దా-త) పద్యంలో ప్రాసనియమం కలదు. కావున ఇది శార్దూలము.

**8. విశేషాంశాలు :**

ఈ పద్యంలో మానవ స్వభావ చిత్రణం ఉంది. సుఖంగా ఉన్నచోట ఉండకుండా ఏదో ఆశతో ఎక్కడికోపోయి చిక్కుకబడ్డప్పుడు ప్రతిమనిషీ ఇలానే అనుకోవడం సహజం కదా !

**73వ పద్యం :**

ఎవ్వనిచే జనించుజగ, మెవ్వనిలోపలనుండు లీనమై,
యెవ్వనియందుడిందుఁ బరమేశ్వరుఁడెవ్వఁడు, మూలకారణం
బెవ్వఁడనాదిమధ్యలయుఁడెవ్వఁడు, సర్వముఁదానయైనవాఁ
డెవ్వఁడు వాని నాత్మభవు నీశ్వరునే శరణంబు వేఁడెదన్

**1. కవి, పాఠ్యభాగము :**

ఈ పద్యము బమ్మెరపోతనచే రచింపబడిన శ్రీమహాభాగవతములోని అష్టమ స్కంధమునందలి ప్రస్తుత పాఠ్యభాగమైన గజేంద్రమోక్షణములోనిది.

**2. సందర్భము :**

మొసలిని జయించుటకు తన శక్తి చాలదన్న జ్ఞానం కలిగిన పిమ్మట అది దైవాన్ని ప్రార్థించే సందర్భంలోనిదీ పద్యం.

**3. ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| జగము | : | ప్రపంచము |
| ఎవ్వనిచే | : | ఎవనిచేత |
| జనించున్ | : | జనించునో |
| లీనము + ఐ | : | లయమై |

| | | |
|---|---|---|
| ఎవ్వనిలోపల | : | ఎవనియందు |
| ఉండున్ | : | ఉండునో |
| ఎవ్వనియందు | : | ఎవనియందు |
| డిందున్ | : | అణఁగియుండునో |
| పరమేశ్వరుడు | : | పరమాత్ముడైనవాడు |
| ఎవ్వడు | : | ఎవ్వడో |
| మూలకారణంబు | : | ఈ విశ్వానికి మూలమైనవాడు |
| ఎవ్వడు | : | ఎవ్వడో |
| అనాది మధ్యలయుడు | : | ఆదిమధ్యాంతములు లేనివాడు |
| ఎవ్వడు | : | ఎవ్వడో |
| సర్వము | : | అంతయు |
| తాన | : | తానే |
| ఐనవాడు | : | అయినట్టివాడు |
| ఎవ్వడు | : | ఎవ్వడో |
| వానిన్ | : | అట్టివాడైన |
| ఆత్మభవున్ | : | తనకు తానుగా పుట్టినవానిని |
| ఈశ్వరున్ | : | భగవంతుని |
| ఏన్ | : | నేను |
| శరణంబున్ | : | శరణము |
| వేఁడెదన్ | : | వేడుకొందును |

**4. తాత్పర్యం :**

ఈ జగత్తంతా ఎవనిచే పుడుతుందో, ఎవనియందు లయమై ఉంటుందో, ఎవనియందు అణఁగియుంటుందో, పరమాత్ముడైనవాడెవడో, ఈ విశ్వానికంతటికీ మూలకారణమైన వాడెవడో, ఆదిమధ్యాంతములు లేనివాడెవడో అంతా తానే అయినవాడెవడో, తనకు తానై పుట్టినవాడైన వాడెవడో ఆ భగవంతుని నేను శరణము వేడుకొందును.

**5. సంధులు :**

పరమేశ్వరుఁడు = పరమ + ఈశ్వరుడు - గుణసంధి
పరమేశ్వరుడు + ఎవ్వడు = పరమేశ్వరుడెవ్వడు - ఉత్వసంధి

**6. సమాసములు :**

మూలకారణము = మూలమైన కారణము - విశేషణ పూర్వపద కర్మధారయ సమాసము

**7. ఛందస్సు :**

| భ | ర | న | భ | భ | ర | వ |
|---|---|---|---|---|---|---|
| UII | UIU | III | UII | UII | UIU | IU |
| ఎవ్వని | చే జనిం | చు జగ | మెవ్వని | లోపల | నుండు లీ | నమై |

ఈ పద్యపాదము నందు భ, ర, న, భ, భ, ర, వ అను గణములు కలవు. యతిస్థానం 10వ అక్షరం (ఎవ్వనిచే .... జగము + ఎవ్వని) ప్రాసనియమం కూడా కలదు. కాన ఇది ఉత్పలమాల.

**8. విశేషాంశాలు :**

ఒకనాడు ఇది ప్రార్థనాపద్యంగా కావటం ఒక విశేషం. ఛందౌచిత్యం మరొక విశేషం. ఉత్పలమాలను భగవంతునకు అర్పించి ప్రార్థనారంభించి నట్లున్నది.

**90వ పద్యం :**

**లా వొక్కింతయు లేదు, ధైర్యము విలోలంబయ్యెఁ బ్రాణంబులున్**
**ఠావుల్ దప్పెను, మూర్ఛవచ్చెఁ, దనువున్ డస్సెన్, శ్రమం బయ్యెడిన్**
**నీవేతప్ప నితఃపరం బెఱుఁగ, మన్నింపందగున్ దీనునిన్,**
**రావే యీశ్వర ! కావవే వరద ! సంరక్షింపు భద్రాత్మకా !**

**1. కవి, పాఠ్యభాగము :**

ఈ పద్యము బమ్మెరపోతనచే రచింపబడిన శ్రీమహాభాగవతములోని అష్టమ స్కంధమునందలి ప్రస్తుత పాఠ్యభాగమైన గజేంద్రమోక్షణములోనిది.

**2. సందర్భము :**

ఏనుగు భగవంతుని ప్రార్థిస్తూ ఈశ్వర సన్నిధానాన్ని కల్పించుకొని శరణాగతిని జొచ్చు సందర్భములోనిదీ పద్యం.

**3. ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| లావు | : | బలం |
| ఒక్కింయున్ | : | ఒక కొంచెముగూడ |
| లేదు | : | లేదు |
| ధైర్యము | : | ధైర్యము |
| విలోలంబు | : | చలించినదిగా (సడలిపోయినదిగా) |
| అయ్యెన్ | : | అయినది |
| ప్రాణంబులన్ | : | పంచప్రాణములు కూడ |
| ఠావుల్ | : | తమ స్థానములు |
| తప్పెను | : | తప్పినవి |
| మూర్ఛ | : | మూర్ఛ |
| వచ్చెన్ | : | కలుగుచున్నది |
| తనువున్ | : | శరీరము కూడ |
| డస్సెన్ | : | అలసిపోయినది |
| శ్రమంబు | : | కష్టము |
| అయ్యెడిన్ | : | అగుచున్నది |
| నీవేతప్పన్ | : | నీవు గాకుండగా |
| ఇతఃపరంబున్ | : | ఇంతకన్నా వేరెవరిని |
| ఎఱుగన్ | : | తెలియనివాడను |
| దీనునిన్ | : | గర్వముడినవానిని |

| | | |
|---|---|---|
| వన్నింపన్ | : | మన్నించుట |
| తగున్ | : | తగును |
| ఈశ్వర | : | దేవ |
| రావే | : | రమ్ము (రాగదే) |
| వరద | : | వరములు నిచ్చువాడా ! |
| కావవే : | : | బాధ తొలగించి రక్షింపవే |
| భద్ర + ఆత్మకా = భద్రాత్మకా | : | శుభకరమైన ఆత్మగలవాడా ! |
| సంరక్షింపు | : | కాపాడుము |

**4. తాత్పర్యం :**

బలం ఏమాత్రంలేదు. ధైర్యం సడలిపోయింది.. పంచప్రాణాలు పట్టుతప్పాయి. మూర్ఛ కలుగుతున్నది. శరీరం అలసిపోయింది. కష్టమనిపిస్తుంది. నీవు తప్ప వేరెవరిని ఎఱుగను. ఈ దీనుని మన్నింపవలసినది. ఈశ్వరా ! రమ్ము వరదా ! బాధలు తొలగింపు. పుణ్యాత్ముడా ! నన్ను రక్షింపుము.

**5. సంధులు :**

లావు + ఒక్కింతయు = లావొక్కింతయు - ఉత్వసంధి
భద్ర + ఆత్మకా = భద్రాత్మకా - సవర్ణదీర్ఘసంధి

**6. సమాసములు :**

భద్రాత్మ = భద్రమైన ఆత్మ - విశేషణపూర్వపద కర్మధారయ సమాసము

**7. ఛందస్సు :**

| మ | స | జ | స | త | త | గ |
|---|---|---|---|---|---|---|
| UUU | IIU | IUI | IIU | UUI | UUI | U |
| లావొక్కిం | తయులే | దు ధైర్య | మువిలో | లంబయ్యె | ప్రాణంబు | లున్ |

ఈ పద్యపాదము నందు మ, స, జ, స, త, త, గ అను గణాలున్నవి. యతిస్థానం 13వ అక్షరం (లా-లం) పద్యంలో ప్రాస నియమం ఉంది. కావున ఇది శార్దూలము.

**8. విశేషాంశాలు :**

గజేంద్రుని ఆర్తికి, నిస్సహాయతకు అనురూపంగా కరుణరసం పోషింపబడింది. చిన్న చిన్న మాటలలో రచన సాగింది. ఎక్కడికక్కడికి భిన్నభిన్న క్రియాపద ప్రయోగం చేయబడింది. రసానుగుణంగా ప్రసాదగుణం సంతరింపబడింది. మరో ముఖ్యవిషయం "నీవేతప్ప ఇతఃపరంబెఱుగ" అనుటలో "శరణాగతి" వ్యక్తమౌతున్నది. ఆర్తునకిదే చివరిమెట్టు.

**95వ పద్యం :**

**అలవైకుంఠపురంబు నగరిలో నామూలసౌధంబు దా**
**పల మందారవనాంతరామృతసరః ప్రాంతేందుకాంతోపలో**
**త్పలపర్యంకరమావినోదియగు నాపన్నప్రసన్నుండు వి**
**హ్వలనాగేంద్రము పాహిపాహియనఁ గుయ్యాలించి సంరంభియై**

**1. కవి, పాఠ్యభాగము :**

ఈ పద్యము బమ్మెరపోతనచే రచింపబడిన శ్రీమహాభాగవతములోని అష్టమ స్కంధమునందలి ప్రస్తుత పాఠ్యభాగమైన గజేంద్రమోక్షణములోనిది.

**2. సందర్భము :**

విశ్వమయుడైన విష్ణువు గజేంద్రునికి అడ్డుపడదలంచిన సందర్భములోనిది.

**3. ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| అల | : | అక్కడెక్కడో (అల - ప్రసిద్ధార్థము) ప్రసిద్ధమైన |
| వైకుంఠపురంబులోన్ | : | వైకుంఠమనెడి పట్టణములో |
| నగరులోన్ | : | అంతఃపురములో |
| ఆ | : | ఆ |
| మూల | : | మూలమైన, ప్రధానమైన |
| సౌధంబు | : | మేడయొక్క |
| దాపల | : | ఎడమ భాగమందలి |
| మందారవన | : | మందారపు తోట యొక్క |
| అంతర | : | నడిమిచోటుగల |
| అమృతసరః | : | అమృత సరస్సు యొక్క |
| ప్రాంత | : | తీరము నందలి |
| ఇందుకాంత + ఉపల | : | చంద్రకాంతమణుల అరుగుపై |
| ఇందుకాంతోపుల | | |
| ఉత్పలపర్యంక | : | కలువలుపరచిన పాన్పుమీద |
| రమావినోది + అగు | : | లక్ష్మీదేవితో వినోదిస్తున్న వాడైన |
| ఆపన్నప్రసన్నుండు | : | ఆపదోనున్నవారికి రక్షకుడగు విష్ణువు |
| విహ్వల | : | భయంచేత స్వాధీనం తప్పినట్టి |
| నాగేంద్రము | : | గజేంద్రము |
| పాహి, పాహి | : | కాపాడు కాపాడు |
| అనన్ | : | అని అనగా |
| కుయ్యి | : | మొఱ |
| ఆలించి | : | విని |
| సంరంభి + ఐ | : | వేగిరపాటుగలవాడై |

**4. తాత్పర్యం :**

అక్కడెక్కడో ఉన్న వైకుంఠపురంలోగల అంతఃపురంలో ప్రధానమైన మేడకు ఎడమప్రక్కనగల మందారవనంలోని అమృతపు సరస్సునకు తీరంలోనున్న చంద్రకాంతమణులతో నిర్మింపబడిన అరుగుమీద గల కలువలుపరచిన పాన్పు మీద లక్ష్మీదేవితో వినోదించుచున్న దీనరక్షకుడైన శ్రీమహావిష్ణువు భయంతో స్వాధీనం తప్పిన గజేంద్రుని మొఱవిని వేగంతో (తరువాతి పద్యంతో అన్వయం)

**5. సంధులు :**

నాగ + ఇంద్రము = నాగేంద్రము - గుణసంధి
కుయ్యి + ఆలించి = కుయ్యాలించి - ఇత్వసంధి

**6. సమాసములు :**

వైకుంఠపురము = వైకుంఠమనేపేరుగల పురము - సంభావనాపూర్వపద కర్మధారయం
వనాంతరము = వనము యొక్క అంతరము - షష్ఠీతత్పురుష సమాసము

**7. ఛందస్సు :**

| స | భ | ర | న | మ | య | వ |
|---|---|---|---|---|---|---|
| IIU | UII | IUI | III | UUU | IUU | IU |
| పల మం | దారవ | నాంతరా | మృతస | రఃప్రాంతేం | దుకాంతో | పలో |

ఈ పద్యపాదము నందు స, భ, ర, న, మ, య, వ అను గణములు కలవు. యతి స్థానం 14వ అక్షరం. పద్యంలో ప్రాస నియమం కలదు. కావున ఇతి మత్తేభం.

**8. విశేషాంశాలు :**

రమావినోదియైన విష్ణువునకు పర్యాయంగా "రమావల్లభుడ"ని అనకుండా "ఆపన్నప్రసన్నుండు" అని అనడం అతడు "సంరంభియై" అని అనడంలో పోతన కవిత్వపటుత్వం కనబడుతుంది. "కుయ్యి" శబ్ద ప్రయోగం దీనావస్థ సూచకం. ఇక్కడి "సంరంభియై" ప్రయోగంవల్లనే "సిరికింజెప్పడు" మొదలైనవి సమర్థనీయాలగుచున్నవి. భగవంతునికి తన వినోదం కన్నా "ఆపన్న ప్రసన్నత" ముఖ్యం అన్న భగవత్తత్త్వం ప్రతిపాదితం.

**96వ పద్యం :**

**సిరికింజెప్పఁడు శంఖచక్రయుగముం జేదోయి సంధింపఁడే**
**పరివారంబును జీరఁడభ్రగపతిం బన్నింపఁడా కర్ణికాం**
**తరథమ్మిల్లముఁ జక్కనొత్తఁడు వివాదప్రోత్థిత శ్రీకుచో**
**పరిచేలాంచలమైన వీడఁడు గజప్రాణావనోత్సాహియై**

**1. కవి, పాఠ్యభాగము :**

ఈ పద్యము బమ్మెరపోతనచే రచింపబడిన శ్రీమహాభాగవతములోని అష్టమ స్కంధమునందలి ప్రస్తుత పాఠ్యభాగమైన గజేంద్రమోక్షణములోనిది.

**2. సందర్భము :**

గజేంద్రము పాహిపాహి అని మొఱపెట్టుకొనగా ఆ మొఱ విని విష్ణువు సంరంభుడై దానిని రక్షించుటకు బయలుదేరు సన్నాహమును వర్ణించు సందర్భము.

**3. ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| గజ | : | ఏనుగు యొక్క |
| ప్రాణ | : | ప్రాణమును |
| అవన | : | కాపాడుటయందలి |

| | | |
|---|---|---|
| ఉత్సాహియై | : | ఉత్సాహము కలవాడై (విష్ణువు) |
| సిరికిన్ | : | లక్ష్మీదేవికి |
| చెప్పఁడు | : | చెప్పలేదు |
| శంఖచక్రయుగమున్ | : | శంఖచక్రములు రెండింటిని |
| చేదోయిన్ | : | రెండు చేతులకు |
| సంధింపడు | : | కూర్చుకొనడు |
| ఏ | : | ఎట్టి |
| పరివారంబున్ | : | బలగమును |
| చీరఁడు | : | పిలవడు |
| అభ్రగసుతిన్ | : | గరుత్మంతుని |
| వన్నింపడు | : | సిద్ధపఱుపడు |
| ఆకర్ణిక + అంతర | : | చెవి కమ్మ నడిమి వరకు జారిన |
| ధమ్మిల్లమున్ | : | జుట్టుముడిని |
| చక్కన్ + ఒత్తడు | : | సరిచేసుకొనడు |
| వివాద | : | ప్రణయ కలహంతో |
| ప్రోత్థిత | : | లేచిన |
| శ్రీ | : | లక్ష్మీదేవి యొక్క |
| కుచ | : | స్తనముల యొక్క |
| ఉపరి | : | పైభాగమున గల |
| చేల + అంచలము + ఐనన్ | : | పైట కొంగును సైతం |
| వీడడు | : | వదలడు |

**4. తాత్పర్యం :**

శ్రీ మహావిష్ణువు ఏనుగును కాపాడాలనే ఉత్సాహం కలవాడై ఆ తొందరలో లక్ష్మీదేవికావిషయం చెప్పడు. శంఖ చక్రాలను ధరించడు. ఎట్టి బలగాన్ని పిలవడు. గరుత్మంతుని వాహనంగా సిద్ధపరచుకోడు. చెవిదాకా జారిన జుట్టుముడిని చక్కదిద్దుకోడు. పందెం పెట్టాల్సిందేనన్న వివాదంలో పట్టుకొన్న లక్ష్మీదేవి పైటకొంగును సైతం వదలిపెట్టలేదు.

**5. సంధులు :**

ప్ర + ఉత్థితము = ప్రోత్థితము - గుణసంధి
చీల + అంచలము = చీలాంచలము - సవర్ణదీర్ఘసంధి

**6. సమాసములు :**

శంఖచక్రములు = శంఖము, చక్రము - ద్వంద్వ సమాసము
వివాదప్రోత్థితము = వివాదము వలన ప్రోత్థితము - పంచమీ తత్పురుష సమాసము

**7. ఛంధస్సు :**

| స | భ | ర | న | మ | య | వ |
|---|---|---|---|---|---|---|
| IIU | UIU | U IU | I I I | UUU | I UU | IU |
| సిరికిం | జెప్పఁడు | శంఖచ | క్రయుగ | ముంజేదో | యిసంధిం | పఁడే |

ఈ పద్యపాదము నందు స, భ, ర, న, మ, య, వ అను గణములు కలవు. యతిస్థానం 14వ అక్షరం (సి-చే) పద్యంలో ప్రాసనియమం కలదు. కాన ఇది మత్తేభం.

**8. విశేషాంశాలు :**

మత్తేభాన్ని రక్షించాలని బయల్దేరే విష్ణువు యొక్క సన్నాహాన్ని మత్తేభంలో వర్ణించడం ఛందౌచిత్యం.

**98వ పద్యం :**

**తనవెంటన్‌సిరి, లచ్చివెంట నవరోధవ్రాతమున్, దానివె**
**న్కను బక్షీంద్రుఁడు వానిపొంతను ధనుఃకామోదకీ శంఖచ**
**క్ర నికాయంబును, నారదుండు, ధ్వజినీకాంతుండు రా వచ్చిరొ**
**య్యన వైకుంఠపురంబునం గలుగువారా బాలగోపాలమున్**

**1. కవి, పాఠ్యభాగము :**

ఈ పద్యము బమ్మెరపోతనచే రచింపబడిన శ్రీమహాభాగవతములోని అష్టమ స్కంధమునందలి ప్రస్తుత పాఠ్యభాగమైన గజేంద్రమోక్షణములోనిది.

**2. సందర్భము :**

గజేంద్రుని దీనాలాపాలను విని రమావినోదము చాలించి, ఏనుగును రక్షించుటకై తన పరికరాలను స్మరించి ఆకాశమార్గాన ఆర్త రక్షకుడైన విష్ణువు వేంచేయు సందర్భం.

**3. ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| తన | : | తనయొక్క (విష్ణువు యొక్క) |
| వెంటన్ | : | వెంబడి |
| సిరి | : | లక్ష్మీదేవి |
| లచ్చివెంటన్ | : | లక్ష్మీదేవి వెంబడి |
| అవరోధవ్రాతమున్ | : | అంతఃపుర స్త్రీల సమూహం |
| దానివెన్కన్ | : | ఆ సమూహము వెనుక |
| పక్షీంద్రుడు | : | గరుత్మంతుడు |
| వాని | : | వానియొక్క |
| పొంతను | : | సమీపాన |
| ధనుః | : | విల్లు (శార్ఙ్గము) |
| కౌమోదకీ | : | కౌమోదకి అను పేరుగల గద |
| శంఖ | : | శంఖము (పాంచజన్యము) |
| చక్ర | : | చక్రము (సుదర్శనము) |
| నికాయంబును | : | సమూహము (మొదలగువాని) |
| నారదుండు | : | నారదుడు |
| ధ్వజినీకాంతుడు | : | సేనాధిపతియైన విష్వక్సేనుడు |
| రాన్ | : | రాగా |

| | | |
|---|---|---|
| వైకుంఠపురంబునన్ | : | వైకుంఠమనుపేరుగల పురములో |
| కలుగువారు | : | ఉన్నవారైన |
| ఆ బాలగోపాలమున్ | : | అందఱును |
| ఒయ్యనన్ | : | వరుసగా |
| వచ్చిరి | : | వచ్చారు. |

**4. తాత్పర్యం :**

విష్ణువు బయలుదేరగనే ఆయన వెంట లక్ష్మీదేవి, ఆమె వెంట అంతఃపుర కాంతలు, వారి వెనుక గరుత్మంతుడు, వాని సమీపంగా శార్ఙ్గమను విల్లు, కౌమోదకి అను గద, పాంచజన్యమను శంఖము, సుదర్శన చక్రము మొదలగు ఆయుధ సమూహం, నారదమహర్షి, సేనాపతియైన విష్వక్సేనుడు రాగా, వైకుంఠపురములోగల వారందరూ వరుసగా వచ్చారు.

**5. సంధులు :**

పక్షి + ఇంద్రుడు = పక్షీంద్రుడు - సవర్ణదీర్ఘసంధి
వెన్కను + పక్షీంద్రుడు = వెన్కనుబక్షీంద్రుడు - సరళాదేశ సంధి

**6. సమాసములు :**

అవరోధవ్రాతము = అవరోధము యొక్క వ్రాతము - షష్ఠీతత్పురుష సమాసము
వైకుంఠపురంబు = వైకుంఠమను పేరుగల పురంబు - సంభావనా పూర్వపద కర్మధారయ సమాసము

**7. ఛందస్సు :**

| స | భ | ర | న | మ | య | వ |
|---|---|---|---|---|---|---|
| IIU | UIU | UIU | III | UUU | I UI | IU |
| య్యన వై | కుంఠపు | రంబునం | గలుగు | వా రాబా | లగోపా | లమున్ |

ఈ పద్యమునందు స, భ, ర, న, మ, య, వ అను గణములు గలవు. యతిస్థానం 14వ అక్షరం (య ...వారు + ఆబాల) పద్యంలో ప్రాస నియమం ఉంది. కాన ఇది మత్తేభం.

**8. విశేషాంశాలు :**

విష్ణువు వెంట వచ్చిన వానియొక్క క్రమం చెప్పటంలో పోతన ప్రదర్శించిన కవితాశిల్పం అద్భుతమైంది. "ఆబాలగోపాలమున్" అన్న జాతీయం సందర్భానికి కుదిరింది.

**102వ పద్యం :**

**తాటంకాచలనంబుతో భుజనటద్ధమ్మిల్లబంధంబుతో**
**శాటీముక్తకుచంబుతో సదృఢచంచత్కాంచితో శీర్ణలా**
**లాటూ లేపముతో మనోహరకరాలగ్నోత్తరీయంబుతోఁ**
**గోటీందుప్రభతో నురోజభరసంకోచద్విలగ్నంబుతోన్.**

**1. కవి, పాఠ్యభాగము :**

ఈ పద్యము బమ్మెరపోతనచే రచింపబడిన శ్రీమహాభాగవతములోని అష్టమ స్కంధమునందలి ప్రస్తుత పాఠ్యభాగమైన గజేంద్రమోక్షణములోనిది.

**2. సందర్భము :**

ఉన్నపాటున స్వామి ఎందుకు ఎక్కడికి వెళ్తున్నారో గదా అని వితర్కించుచూ వెంటజను ఇందిరాదేవిని వర్ణించు సందర్భములోనిదీ పద్యము.

**3. ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| తాటంక | : | చెవికమ్మల యొక్క |
| ఆచలనంబుతోన్ | : | మిక్కిలి కదలికతో |
| భుజ | : | భుజముల మీద |
| నటత్ | : | నర్తించుచున్న (కదులుచున్న) |
| ధమ్మిలబంధంబుతోన్ | : | కొప్పుముడితో |
| శాటీ | : | వస్త్రము చేత (పైట చేత) |
| ముక్త | : | విడువబడిన |
| కుచంబుతోన్ | : | స్తనములతో |
| అధృఢ | : | సడలినట్టిదైన |
| చంచత్ | : | చలించుచున్న |
| కాంచితోన్ | : | ఒంటిపేట మొలనూలుతో |
| శీర్ణ | : | చెదరిన |
| లాలాట | : | నుదుటి యందలి |
| ఆలేపముతోన్ | : | పూతతో |
| మనోహర | : | మనోహరమైన |
| కర | : | చేతి యందు |
| ఆలగ్న | : | తగులుకొనిన |
| ఉత్తరీయంబుతోన్ | : | పైట కొంగుతో |
| కోటి + ఇందు | : | కోటిఇంద్రుల యొక్క |
| ప్రభతోన్ | : | కాంతితో |
| ఉరోజ | : | స్తనముల యొక్క |
| భర | : | బరువు చేత |
| సంకోచన్ | : | కుంచింపబడుతున్న |
| విలగ్నంబుతోన్ | : | నడుముతో |

**4. తాత్పర్యం :**

(లక్ష్మీదేవి) చెవికమ్మలు కదులుతుండగా, కొప్పు ముడి భుజములపై నాట్యము చేయుచుండగా, పైట జారగా, మొల నూలు సడలిపోగా, నుదుటిపై పూత చెదరిపోగా, పైటను చేతితో పట్టుకొనుచూ, కోటిచంద్రుల కాంతితో, స్తనభారముతో కుంచించుకొనిపోతున్న నడుముతో (విష్ణువు వెన్క సాగింది)

**5. సంధులు :**

తాటంక + ఆచలనము = తాటంకాచలనము - సవర్ణదీర్ఘసంధి
కోటి + ఇందుప్రభ = కోటీందుప్రభ - సవర్ణదీర్ఘ సంధి

**6. సమాసములు :**

శాటీముక్తము = శాటి చేత ముక్తము - తృతీయాతత్పురుష సమాసము
మనోహరకరము = మనోహరమైన కరము - విశేషణ పూర్వపద కర్మధారయ సమాసము

**7. ఛందస్సు :**

| మ | స | జ | స | త | త | గ |
|---|---|---|---|---|---|---|
| UUU | IIU | IUI | IIU | UUI | UUI | U |
| కోటీందు | ప్రభతో | నురోజ | భరసం | కోచద్వి | లగ్నంబు | తోన్ |

ఈ పద్యపాదము నందు మ, స, జ, స, త, త, గ అను గణములు కలవు. యతిస్థానం 13వ అక్షరం. పద్యంలో ప్రాస నియమం కలదు. కావున ఇది శార్దూలం.

**105వ పద్యం :**

వినువీధి జనుదేరఁగాంచి రమరుల్ విష్ణున్, సురారాతిజీ
వనసంపత్తి నిరాకరిష్ణుఁ గరుణావర్ధిష్ణు, యోగీంద్ర హృ
ద్వనవర్తిష్ణు, సహిష్ణు, భక్తజనబృందప్రాభవాలంకరి
ష్ణు నవోడోల్లసదిందిరాపరిచరిష్ణున్ జిష్ణు రోచిష్ణునిన్

**1. కవి, పాఠ్యభాగము :**

ఈ పద్యము బమ్మెరపోతనచే రచింపబడిన శ్రీమహాభాగవతములోని అష్టమ స్కంధమునందలి ప్రస్తుత పాఠ్యభాగమైన గజేంద్రమోక్షణములోనిది.

**2. సందర్భము :**

ఆకాశమార్గాన చనుదెంచు విష్ణువును దేవతలు చూచు సందర్భంలో ఆ శ్రీమహావిష్ణువును గూర్చి వర్ణించు సందర్భములోనిది.

**3. ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| సుర + అరాతి | : | దేవతల శత్రువులైన రాక్షసుల యొక్క |
| జీవన | : | బ్రతుకు అనెడి |
| సంపత్తి | : | ధనమును |
| నిరాకరిష్ణున్ | : | తిరస్కరించు వానిని |
| కరుణా | : | దయతో |
| వర్ధిష్ణున్ | : | వృద్ధి పొందువానిని |
| యోగీంద్ర | : | పరమయోగుల యొక్క |
| హృత్ | : | హృదయమనెడి |
| వన | : | వనము నందు |
| వర్తిష్ణున్ | : | ప్రవర్తిల్లు వానిని |
| సహిష్ణున్ | : | ఓర్చువానిని |
| భక్తజన | : | భక్తుల యొక్క |

| | | |
|---|---|---|
| బృంద | : | సమూహము యొక్క |
| ప్రాభవ | : | వైభవమును |
| అలంకరిష్ణున్ | : | అలంకరించు వానిని |
| నవ | : | కొత్తగా |
| ఊఢా | : | పెండ్లాడిన దైన (పెళ్ళి కూతురైన) |
| ఇందిరా | : | లక్ష్మీదేవికి |
| పరిచరిష్ణున్ | : | సేవలు చేయువానిని |
| జిష్ణున్ | : | జయశీలుడైనవానిని |
| రోచిష్ణున్ | : | ప్రకాశించువానిని |
| విష్ణున్ | : | విష్ణువును |
| వినువీధిన్ | : | ఆకాశమార్గము గుండ |
| చనుదేరన్ | : | వస్తుండగా |
| అమరుల్ | : | దేవతలు |
| కాంచిరి | : | చూచిరి |

**4. తాత్పర్యం :**

రాక్షసుల ప్రాణాలను తీసేవాళ్ళను, దయతో వృద్ధి పొందేవాడును, యోగుల హృదయాల్లో నివసించేవాడును, ఓర్పుగలవాడును, భక్తుల వైభవాన్ని శోభిల్లజేసేవాడును, కొత్త పెళ్ళికూతురగు లక్ష్మీదేవికి సేవలు చేసేవాడును, జయశీలుడును, తేజోమయుడును అగు విష్ణువును ఆకాశమార్గంలో వస్తుండగా దేవతలు చూచారు.

**5. సంధులు :**

సురర + అరాతి = సురారాతి - సవర్ణదీర్ఘసంధి

నవ + ఊఢ = నవోఢ - గుణసంధి

**6. సమాసములు :**

జీవనసంపత్తి = జీవనమనెడి సంపత్తి - రూపక సమాసము

వనవర్తిష్ణువు = వనము నందు వర్తిష్ణువు - సప్తమీ తత్పురుష సమాసము.

**7. ఛందస్సు :**

| స | భ | ర | న | మ | య | వ |
|---|---|---|---|---|---|---|
| IIU | UII | UIU | III | UIU | I UU | IU |
| వినువీ | ధింజను | దేరగాం | చి రమ | రుల్విష్ణున్ | సురారా | తిజీ |

ఈ పద్యపాదము నందు స, భ, ర, న, మ, య, వ అను గణములు గలవు. యతిస్థానం 14వ అక్షరం (వి-వి) పద్యంలో ప్రాస నియమం కూడా కలదు. కావున ఇది మత్తేభం.

**8. అలంకారం :**

ఈ పద్యంలో వృత్యను ప్రాసాలంకారం కలదు.

**లక్షణం :**

ఒక వర్ణంగాని పలు వర్ణాలుగాని, మరల మరల పద్యంలో ఆవృత్తమైతే అవి వృత్యాను ప్రాసాలంకారమనబడును.

**సమన్వయం :**

ఇచ్చిన పద్యంలో "ష్ణ" అనే సంయుక్తాక్షరం పద్యంలో చాలాసార్లు ఆవృత్తమైంది కాబట్టి అందు వృత్యను ప్రాసాలంకారం గలదనవచ్చును.

**109వ పద్యం :**

**కరుణాసింధుఁడు శౌరి వారి చరమున్ ఖండింపఁగాఁబంపె స**
**త్వరితాకంపిత భూమిచక్రము, మహోద్యద్విస్ఫులింగచ్ఛటా**
**పరిభూతాంబరశుక్రమున్ బహువిధబ్రహ్మాండభాండచ్ఛటాం**
**తరనిర్వక్రముఁబాలితాఖిల సుధాంధశ్చక్రముం జక్రమున్**

**1. కవి, పాఠ్యభాగము :**

ఈ పద్యము బమ్మెరపోతనచే రచింపబడిన శ్రీమహాభాగవతములోని అష్టమ స్కంధమునందలి ప్రస్తుత పాఠ్యభాగమైన గజేంద్రమోక్షణములోనిది.

**2. సందర్భము :**

గజేంద్రుని కాపాడాలనే తొందరలో దేవతల నమస్కారాలను గూడా స్వీకరించకుండ వచ్చి శ్రీమహావిష్ణువు ఆ సరస్సును చూచి మొసలిని ఖండించుటకై చక్రమును పంపించు సందర్భములోనిదీ పద్యం.

**3. ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| కరుణాసింధుఁడు | : | దయా సముద్రుడైన |
| శౌరి | : | విష్ణువు |
| వారిచరమున్ | : | మొసలిని |
| ఖండింపగాన్ | : | చంపడానికై |
| సత్వరిత | : | వేగముతో కూడిన |
| ఆకంపిత | : | మిక్కిలి కంపింపజేయబడిన |
| భూమిచక్రమున్ | : | భూమండలము కలదియును |
| మహా + ఉద్యత్ | : | మిక్కిలిగా పైకి లేచుచున్న |
| విస్ఫులింగ | : | అగ్నికణముల యొక్క |
| ఛటా | : | కాంతిచేత |
| పరిభూత | : | అవమానింపబడిన |
| అంబర | : | ఆకాశమందలి |
| శుక్రమున్ | : | చుక్కలు గలదియును |
| బహువిధ | : | అనేక విధములైన |
| బ్రహ్మాండభాండ | : | భాండముల వంటి బ్రహ్మాండముల యొక్క |
| ఛటా | : | సమూహము యొక్క |

| | | |
|---|---|---|
| అంతర | : | లోపల |
| నిర్వక్రమున్ | : | ఆటంకములేనిదియును |
| పాలిత | : | పాలింపబడిన |
| అఖిల | : | సమస్తమైన |
| సుధాంధః | : | దేవతల యొక్క |
| చక్రమున్ | : | సమూహము గలదియును - అగు |
| చక్రమున్ | : | సుదర్శన చక్రమును |
| పంపెన్ | : | పంపించెను |

**4. తాత్పర్యం :**

భూమండలమును కంపింపజేయునంతటి వేగముతో కూడినదియు, ఆకాశమందలి చుక్కలను పరిభవింపజేయునంతటి గొప్ప అగ్నికణ ప్రకాశము గలదియు, బ్రహ్మాండ భాండములందు నిరాటంక స్ఫూర్తి కలదియు, దేవతా సమూహమును రక్షించునదియును నగు చక్రమును దయా సముద్రుడైన శ్రీమహావిష్ణువు మొసలిని చంపుటకై ప్రయోగించెను.

**5. సంధులు :**

సత్వరితా కంపితము = సత్వరిత + ఆకంపితము - సవర్ణదీర్ఘ సంధి

ఛటాంతరము = ఛటా + అంతరము - సవర్ణదీర్ఘ సంధి

**6. సమాసములు :**

ఆకంపితభూమిచక్రము = ఆకంపితమైన భూమి చక్రము - విశేషణపూర్వపద కర్మధారయ సమాసము

విస్ఫులింగచ్ఛట = విస్ఫులింగము యొక్క ఛట - షష్ఠీతత్పురుష సమాసం

**7. ఛందస్సు :**

| స | భ | ర | న | మ | య | వ |
|---|---|---|---|---|---|---|
| IIU | UII | U I U | III | UUU | I U I | IU |
| పరిభూ | తాంబర | శుక్రమున్ | బహావి | ధబ్రహ్మాం | డభాండ | చ్ఛటాం |

ఈ పద్యపాదమునందు స, భ, ర, న, మ, య, వ అను గణములు కలవు. యతిస్థానం 14వ అక్షరం. (ప-బ్ర) పద్యంలో ప్రాసనియమం కూడా కలదు. కావున ఇది మత్తేభం.

**8. అలంకారం :**

ఈ పద్యంలో వృత్యనుప్రాసాలంకారం ఉంది.

లక్షణం :

ఒక హల్లుగాని పలుహల్లులుగాని పెక్కుమార్లు ఆవృత్తమైతే అది వృత్యనుప్రాస.

సమన్వయం :

ఈ పద్యంలో "క్రమున్" అనే జంటహల్లులు పలుమార్లావృత్తమయ్యాయి కాబట్టి ఇది వృత్యనుప్రాస.

**111వ పద్యం :**

**అంభోజాకరమధ్యనూతనవిన్యాలింగనక్రీడనా**
**రంభుం డైనవెలుగుతేని చెలువారన్ వచ్చి నీటన్ గుభుల్**
**గుంభధ్వానముతోఁ గొలంకును గలంకుబొందంగా జొచ్చిదు**
**ష్టాంభోవర్తి వసించుచక్కటికి డాయం బోయి హృద్వేగమై**

## 1. కవి, పాఠ్యభాగము :

ఈ పద్యము బమ్మెరపోతనచే రచింపబడిన శ్రీమహాభాగవతములోని అష్టమ స్కంధమునందలి ప్రస్తుత పాఠ్యభాగమైన గజేంద్రమోక్షణములోనిది.

## 2. సందర్భము :

శౌరి వారిచరాన్ని ఖండింపగా బంపిన చక్రాయుధం సరస్సులో మొసలి ఉన్న చోటునకు సమీపించు సందర్భాన్ని వర్ణించు పద్యమిది.

## 3. ప్రతిపదార్థము :

| | | |
|---|---|---|
| అంభోజ + ఆకర | : | సరస్సు యొక్క |
| మధ్య | : | నడిమి భాగమున ఉన్న |
| నూతన | : | క్రొత్తదైన |
| నలినీ | : | పద్మినిని |
| ఆలింగక్రీడన | : | కౌగిలించుకొను పనికి |
| ఆరంభుడు + ఐన | : | ప్రయత్నము కలవాడైన |
| వెలుంగుతేని | : | సూర్యుని యొక్క |
| చెలువు | : | విధము |
| ఆరన్ | : | ఒప్పుచుండగా |
| వచ్చి | : | వచ్చి |
| నీటన్ | : | నీటియందు |
| గుభుల్ గుంభధ్వానముతోన్ | : | గుభుల్లుమనే శబ్దంతో |
| కొలంకును | : | సరస్సులును |
| కలంకుంబొందగాన్ | : | కలత పొందే విధంగా |
| చొచ్చి | : | ప్రవేశించి |
| దుష్ట | : | దుష్టమైన |
| అంభోవర్తి | : | మొసలి |
| వసించు | : | ఉంటున్న |
| చక్కటికి | : | చోటునకు |
| డాయన్ | : | సమీపించుటకు |
| పోయి | : | వెళ్ళి |
| హృద్వేగమై | : | మనోవేగంతో |

**4. తాత్పర్యం :**

సరస్సులో అప్పుడే వికసించిన పద్మినిని ఆలింగనం చేసుకునే ప్రయత్నంలో ఉన్న సూర్యబింబంవలే సుదర్శన చక్రం వచ్చి నీటిలో గుభుల్లుమని శబ్దిస్తూ సరస్సును కలచివేస్తూ ప్రవేశించి క్రూరమైన మొసలి ఉండే చోటునకు సమీపించుటకై వెళ్ళి మనోవేగంతో ... (తరువాతి పద్యంతో అన్వయం)

**5. సంధులు :**

నలినీ + ఆలింగనము = నలిన్యాలింగనము - యణాదేశసంధి

చెలువు + ఆరన్ = చెలువారన్ - ఉత్వసంధి

**6. సమాసములు :**

అంభోజాకరమధ్యము = అంభోజాకరము యొక్క మధ్యము - షష్ఠీతత్పురుష సమాసము

దుష్టాంభోవర్తి = దుష్టమైన అంభోవర్తి - విశేషణపూర్వపద కర్మధారయ సమాసము

**7. ఛందస్సు :**

| మ | స | జ | స | త | త | గ |
|---|---|---|---|---|---|---|
| UUU | IIU | IUI | IIU | UUI | UUI | U |
| రంభుండై | నవెలుం | గుజేని | చెలువా | రన్వచ్చి | నీటన్ గు | భుల్ |

ఈ పద్యపాదము నందు మ, స, జ, స, త, త, గ అను గణములు కలవు. యతిస్థానం 13వ అక్షరం (రం-రన్) పద్యంలో ప్రాస నియమం ఉంది. కావున ఇది శార్దూలం.

**8. అలంకారం :**

ఈ పద్యంలో ఉపమాలంకారం కలదు.

**లక్ష్యం :**

ఉపమేయ ఉపమానాలకు సొగసైన సాదృశ్యం చెప్పబడినట్లయితే అది ఉపమాలంకారం అని అనబడును. ఉపమాలంకారంలో ప్రధానంగా నాలుగు అంశాలుంటాయి.

1) ఉపమేయం = ప్రస్తుత వస్తువు, 2) ఉపమానం = పోలికగా చెప్పబడింది, 3) సమానధర్మం = రెండింటి యందును గల సమానమైన లక్షణం, 4) ఉపమా వాచకం = ఉపమను సూచించే వలె, వంటి శబ్దాలు.

సమన్వయం : ఈ పద్యంలో

1) ఉపమేయం = చెప్పబడలేదు కానీ ఊహింపవలసినదే. అది - చక్రం

2) ఉపమానం = సూర్యబింబం

3) సమానధర్మం = ఆలింగన క్రీడ

4) ఉపమావాచకం = చెలువారన్

అట్లే మరో ఉపమేయం ఉపమానం కూడా ఇందు ఉన్నాయి.

1) ఉపమేయం = మొసలి, 2) ఉపమానం = పద్మిని, 3) సమానధర్మం = సరస్సులో నుండుట, 4) ఉపమావాచకం = లుప్తం.

**112వ పద్యం :**

భీమం బై తలఁద్రుంచి ప్రాణములఁబాపెం జక్రమాశుక్రియన్
హేమక్ష్మాధరదేహమున్, జకితవన్యేభేంద్రసందోహముం
గామక్రోధనగేహముం గరటిరక్తస్రావగాహంబు ని
స్సీ మోత్సాహము వీతదాహము జయశ్రీమోహమున్ గ్రాహమున్.

**1. కవి, పాఠ్యభాగము :**

ఈ పద్యము బమ్మెరపోతనచే రచింపబడిన శ్రీమహాభాగవతములోని అష్టమ స్కంధమునందలి ప్రస్తుత పాఠ్యభాగమైన గజేంద్రమోక్షణములోనిది.

**2. సందర్భము :**

విష్ణువుచే విడువబడిన చక్రం నీటిలో మొసలి ఉండేచోటును సమీపించి దాని తలను త్రుంచి ప్రాణం తీసిన సందర్భంలో వర్ణితమైనదీ పద్యం.

**3. ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| చక్రము | : | చక్రము |
| ఆశుక్రియన్ | : | వేగము యొక్క విధముచే |
| భీమంబు + ఐ | : | భయానకమై |
| హేమక్ష్మాధరదేహమున్ | : | మేరు పర్వతము వంటి దేహము కలదియును |
| చకిత | : | భయపెట్టబడిన |
| వన్య + ఇభ | : | అడవియేనుగుల యొక్క |
| సమూహమున్ | : | గుంపుగలదియును |
| కామ | : | కామమునకు |
| క్రోధ | : | కోపమునకు |
| గేహమున్ | : | నిలయమైనదియును |
| కరటి | : | ఏనుగు యొక్క |
| రక్త | : | నెత్తురు యొక్క |
| స్రావ | : | కారుట యందు |
| గాహమున్ | : | మునిగినదియును |
| నిస్సీమ | : | హద్దులేని |
| ఉత్సాహమున్ | : | ఉత్సాహము కలదియును |
| వీత | : | పోయిన |
| దాహమున్ | : | దప్పిక కలదియును |
| జయశ్రీ | : | విజయలక్ష్మి యందు |
| మోహమున్ | : | మోహము కలదియును అగు |
| గ్రాహమున్ | : | మొసలిని |
| తలన్ | : | తలను |

| | | |
|---|---|---|
| త్రుంచి | : | నరికి |
| ప్రాణములన్ | : | ప్రాణములను |
| పాపెన్ | : | పోగొట్టెను. |

**4. తాత్పర్యం :**

మేరు పర్వతమంత పెద్ద శరీరము కలదియు, అడవి యేనుగులను భయపెట్టునదియు, కామక్రోధములకు నిలయమైనదియు, ఏనుగు రక్తస్రావంతో తడిసి ముద్దయినదియు, అంతులేని ఉత్సాహము కలదియు, అలసట చెందనిదియు, విజయమునం దారాటము గలదియునగు మొసలిని వేగముగా వచ్చిన చక్రము దాని తలను భయానకముగా నరికి ప్రాణములను తీసెను.

**5. సంధులు :**

ప్రాణములన్ + పాపె = ప్రాణములఁబాపె - సరళాదేశ సంధి
వన్య + ఇభము = వన్యేభము - గుణసంధి
నిస్సీమ + ఉత్సాహము = నిస్సీమాత్సాహము - గుణసంధి

**6. సమాసములు :**

చకితవన్యేభము = చకితమైన వన్యేభము - విశేషణ పూర్వపద కర్మధారయ సమాసము
కరటిరక్తము = కరటి యొక్క రక్తము - షష్ఠీ తత్పురుష సమాసము

**7. ఛందస్సు :**

| మ | స | జ | స | త | త | గ |
|---|---|---|---|---|---|---|
| UUU | IIU | IUI | IIU | UUI | UUI | U |
| భీమంబై | దలఁద్రుం | చి ప్రాణ | ములఁబా | పెంజక్ర | మాశుక్రి | యన్ |

ఈ పద్యపాదము నందు మ, స, జ, స, త, త, గ అను గణములు కలవు. యతిస్థానం 13వ అక్షరం (భీ-పెం) పద్యంలో ప్రాస నియమం కలదు. కావున ఇది శార్దూలం.

**8. అలంకారం :**

ఈ పద్యంలో వృత్యనుప్రాసాలంకారం ఉంది.

లక్షణం :

ఒక హల్లుగాని, పలు హల్లులుగాని పెక్కుమార్లా వృత్తమైతే అది వృత్యనుప్రాసం

అన్వయం :

ఈ పద్యంలో "హమున్" అనే జంటహల్లులు అనేకమార్లు ఆవృత్తమైనవి కాబట్టి దానిని వృత్యనుప్రాసగా చెప్పవచ్చును.

**115వ పద్యం :**

తమముంబాసిన రోహిణీవిభుక్రియన్ దర్పించి సంసారదుః
ఖము వీడ్కొన్న విరక్తచిత్తునిగతిన్ గ్రాహంబు పట్టూడ్చి పా
దము లల్లార్చి కరేణుకావిభుఁడు సౌందర్యంబుతోనొప్పె సం
భ్రమదాశాకరిణీకరోజ్ఝిత సుధాంభస్స్నాన విశ్రాంతుఁడై

**1. కవి, పాఠ్యభాగము :**

ఈ పద్యము బమ్మెరపోతనచే రచింపబడిన శ్రీమహాభాగవతములోని అష్టమ స్కంధమునందలి ప్రస్తుత పాఠ్యభాగమైన గజేంద్రమోక్షణములోనిది.

**2. సందర్భము :**

విష్ణుమూర్తి సుదర్శన చక్రంతో మొసలి తలత్రుంచి వైవగా ఏనుగు మొసలి బారినుండి బయటపడు సందర్భమున వర్ణింపబడినదీ పద్యం.

**3. ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| తమమున్ | : | చీకటిని |
| పాసిన | : | విడిచినట్టి |
| రోహినీవిభుక్రియన్ | : | చంద్రునివలె |
| దర్పించి | : | గర్వించి (సంతోషించి) |
| సంసార | : | సంసారము నందలి |
| దుఃఖమున్ | : | దుఃఖమును |
| వీడ్కొన్న | : | వదలిన |
| విరక్తచిత్తునిగతిన్ | : | విరాగి వలె |
| గ్రాహంబు | : | మొసలి యొక్క |
| పట్టు | : | పట్టు |
| ఊడ్చి | : | విడిపించుకొని |
| పాదములు | : | కాళ్ళు |
| అల్లార్చి | : | జాడించి |
| కరేణుకావిభుఁడు | : | గజేంద్రుడు |
| సంభ్రమత్ | : | తొందరించుచున్న |
| ఆశా | : | దిక్కుల యందలి |
| కరిణీ | : | ఆడుఏనుగుల యొక్క |
| కర | : | తొండముల చేత |
| ఉజ్జిత | : | విడువబడిన (చిమ్మబడిన) |
| సుధాంభస్స్నాన | : | అమృతజల స్నానంతో |
| విశ్రాంతుడు + ఐ | : | ఊరడిల్లినవాడై |
| సౌందర్యంబుతోన్ | : | అందముతో |

ఒప్పెన్ : ఒప్పెను

**4. తాత్పర్యం :**

చీకటిని వీడిన చంద్రునిలాగా, సంసార దుఃఖాన్ని వదలిన విరాగిలాగ మొసలిపట్టు విడిపించుకొని, కాళ్ళు జాడించి, ఆడదిగ్గజాలు తమ తొండంతో చిమ్మిన అమృతజలంతో స్నానమాడి, గజేంద్రుడు అందంగా ప్రకాశించాడు.

**5. సంధులు :**

పట్టు + ఊడ్చి = పట్టూడ్చి - ఉత్వసంధి
కర + ఉజ్జితము = కరోజ్ఝితము - గుణసంధి

**6. సమాసములు :**

రోహిణీవిభుడు = రోహిణి యొక్క విభుడు - షష్ఠీతత్పురుష సమాసం

**7. ఛందస్సు :**

| స | భ | ర | న | మ | య | వ |
|---|---|---|---|---|---|---|
| III | UII | UIU | III | UUU | IUU | IU |

దముల ల్లార్చిక రేణు కా విభుఁడు సౌందర్యం బుతోనో ప్పెసం

ఈ పద్యపాదమున స, భ, ర, న, మ, య, వ అను గణములున్నవి. యతిస్థానం 14వ అక్షరం (ద-ద) పద్యంలో ప్రాస నియమం కూడా వుంది. అందుచేత ఇది మత్తేభం.

**8. అలంకారం :**

ఈ పద్యంలో ఉపమాలంకారం గలదు. అది రెండుచోట్ల కన్పించుచున్నది. అవి

1) తమముంబాసిన రోహిణీ విభుక్రియన్, 2) సంసారదుఃఖము వీడ్కొన్న విరక్తచిత్తునిగతిన్.

ఉపమాలంకార లక్షణం : ఉపమేయానికి ఉపమానాన్ని సొగసైన సాదృశ్యం చెప్పబడినట్లయితే అది ఉపమాలంకార మనబడును.

ఉపమాలంకారంలో నాలుగంశాలుంటాయి.

1) ఉపమేయం అనగా ప్రస్తుతం చెప్పబడుచున్నది.
2) ఉపమానం అనగా పోలికగా చెప్పబడేది
3) సమానధర్మం అనగా ఉపమేయము నందు, ఉపమానములు ఉండే సమాన లక్షణం
4) ఉపమావాచకం అనగా ఉపమానం ఏదో దాన్ని తెలియజేసే వలె, వంటి పదాలు.

సమన్వయం :

**1. తమముంబాసిన రోహిణీవిభుక్రియన్ :**

ఉపమేయాలు : మొసలి - ఏనుగు
ఉపమానాలు : తమము - రోహిణీ విభుడు (చంద్రుడు)
సమానధర్మం : పాయుట
ఉపమావాచకం : క్రియన్

2. సంసారదుఃఖము వీడ్కొన్న విరక్తచిత్తుని గతిన్

ఉపమేయాలు : మొసలి - ఏనుగు
ఉపమానము : సంసారదుఃఖ విరక్తచిత్తుడు
సమానధర్మం : వీడ్కొనుట
ఉపమావాచకం : గతిన్

**9.3 రాదగిన ప్రశ్నావిధానం :**

**క్రింది పద్యాలలో ఒకదానికి సమగ్రవ్యాఖ్య వ్రాయండి.**

ఎవ్వనిచేజనించు జగ, మెవ్వని లోపలనుండు లీనమై,
యెవ్వనియందుడిందు, బరమేశ్వరుడెవ్వడు, మూలకారణం
బెవ్వడనాది మధ్యలయుడెవ్వడు, సర్వము దానయైన వా
డెవ్వడు వాని నాత్మభవు నీశ్వరునే శరణంబు వేడెదన్

(లేదా)

సిరికింజెప్పడు శంఖ చక్రయుగముంజేదోయి సంధింపడే
పరివారంబుకు జీరడభ్రగపతిం బన్నింప డాకర్ణికాం
తర ధమ్మిల్లము జక్కనొత్తడు వివాదప్రోత్థిత శ్రీకుచో
పరి చేలాంచలమైన వీడడు గజప్రాణా వనోత్సాహియై

**- డా॥ శ్రిష్టి చంద్రమౌళిశర్మ**
రిటైర్డ్ ప్రిన్సిపాల్
శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ డిగ్రీ కళాశాల
పొదిలి, ప్రకాశం జిల్లా.

పాఠం - 10

# గజేంద్ర మోక్షము

- బమ్మెర పోతన

## (మహాభాగవతం - అష్టమ స్కంధం - 25 నుండి 115 పద్యాల వరకు)
## సందర్భసహిత వ్యాఖ్యలు

**విషయసూచిక :**

**10.1** ఉద్దేశ్యం
**10.2** సందర్భసహిత వ్యాఖ్యలు
**10.3** రాదగిన ప్రశ్నావిధానం

**10.1 ఉద్దేశ్యం :**

సందర్భాన్ని గుర్తించడం ద్వారా జ్ఞాపకశక్తి, వ్యాఖ్య వ్రాయడంవల్ల ఊహాశక్తి వెల్లడి అవుతాయి. ఇచ్చిన వాక్యం నుడికారమా, లోకోక్తిమా, అర్థాంతరన్యాసాలంకారాది అలంకార విశేషమా ఇత్యాది భాషా విషయక అలంకారశాస్త్రాది పరిజ్ఞానం ప్రస్ఫుటమౌతుంది.

**10.2 సందర్భసహిత వ్యాఖ్యలు :**

**1. జంజుమ్మటంచు గానము చేసెన్**

**1. కవి, పాఠ్యభాగం :**

ఈ వాక్యం బమ్మెరపోతనార్యకృత శ్రీమహాభాగవతంలోని అష్టమస్కందమందలి ప్రకృత పాఠ్యాంశమైన గజేంద్రమోక్షణం లోనిది.

**2. సందర్భం :**

అడవి ఏనుగులు విహరిస్తుండగా అక్కడి జింకలు, నెమళ్ళు, చమరీ మృగాల స్థితిని వర్ణించి పిమ్మట తుమ్మెదల తీరును కవి వర్ణించే సందర్భములోనిది.

**3. అర్థం :**

తుమ్మెదలు ఝుంకార ధ్వనితో గానం ఆలపిస్తున్నారని అర్థం.

**4. వ్యాఖ్య :**

తుమ్మెదలు ఎగిరేటప్పుడు వచ్చే ధ్వని జుం, జుం అని అనిపించడం సహజం. సహజమైన ధ్వన్యనుకరణ శబ్దాన్ని ప్రయోగించి తుమ్మెద నాదాన్ని వినిపించడం పోతన కవితా ప్రతిభ.

**2. చూచి బెగడున్ జగముల్ :**

**1. కవి పాఠ్యభాగం :**

ఈ వాక్యం బమ్మెరపోతన రచించిన శ్రీ మహాభాగవతంలోని అష్టమ స్కంధమందలి ప్రస్తుత పాఠ్యభాగమైన గజేంద్రమోక్షణం లోనిది.

**2. సందర్భం :**

ఏనుగులు తమ చెక్కిళ్ళతో, కుంభ స్థలాలలో కొండలను ఢీకొట్టినప్పుడు అవి తలక్రిందయ్యేవట. దిక్కులు కూడా బలహీనత నొందినవట. ఆ సందర్భమున కవిచే చెప్పబడిన వాక్యమిది.

**3. అర్థం :**

కొండల యొక్కయు దిక్కుల యొక్కయు స్థితిని చూచి లోకాలు గూడా భయపడ్డాయని అర్థం.

**4. వ్యాఖ్య :**

ఈ వాక్యం ద్వారా ఏనుగుల యొక్క అతిశయం వ్యక్తమౌతుంది.

**3. ఒప్పె నొప్పులకుప్పలోలె :**

**1. కవి పాఠ్యభాగం :**

ఈ వాక్యం బమ్మెరపోతన రచించిన శ్రీ మహాభాగవతంలోని అష్టమ స్కంధమందలి ప్రస్తుత పాఠ్యభాగమైన గజేంద్రమోక్షణం లోనిది.

**2. సందర్భం :**

గజేంద్రుని కుంభములు, నడక, తొండము, దంతాల కాంతి స్త్రీల కుచాలు మొదలగువానికన్నా ఉత్కృష్టములని గజేంద్రుని రూపలావణ్యాదులను చూచి అంజనాది కరిణులు గజేంద్రుని వెంటబడుచున్నవనియు చెప్పు సందర్భమున కవిగజేంద్రుని అందమును వర్ణించుచు అన్న వాక్యమిది. ఒప్పుల కుప్ప వలే నొప్పినవాడు - గజేంద్రుడు.

**3. అర్థం :**

గజేంద్రుడు అందగాడువలె ప్రకాశించెను అని అర్థం.

**4. వ్యాఖ్య :**

అందగాడు, సోగ్గాడు అనే అర్థాలనిచ్చే తెలుగు జాతీయం "ఒప్పులకుప్ప" ఈ ప్రయోగం ద్వారా సౌందర్యాతిశయం సూచితం.

**4. భానుకబళించిపట్టు స్వర్భానువగిది :**

**1. కవి పాఠ్యభాగం :**

ఈ వాక్యం బమ్మెరపోతన రచించిన శ్రీ మహాభాగవతంలోని అష్టమ స్కంధమందలి ప్రస్తుత పాఠ్యభాగమైన గజేంద్రమోక్షణం లోనిది.

**2. సందర్భం :**

సరస్సులో దిగిన గజేంద్రుని అందలి మొసలి కుప్పించి లంఘించి హుంకరించి పట్టుకొను సందర్భంలో కవి వర్ణించిన వాక్యమిది.

**3. అర్థం :**

సూర్యుణ్ణి మ్రింగి పట్టుకొనే రాహువులాగా అని దీని అర్థం.

**4. వ్యాఖ్య :**

గజేంద్రుని సూర్యునితో, మొసలిని రాహువుతో పోల్చడంలోనే ఒక వైచిత్రి కలదు. రాహువు సూర్యుణ్ణి పట్టుకొన్నా, కొంతసేపటికి విడువక తప్పదు. అట్లే మొసలినుండి గజేంద్రునికి కాసేపటికి మోక్షం వస్తుందని ధ్వని. ఉపమాలంకారం ఇందు కలదు. కబళించు అనేది సాభిప్రాయ ప్రయోగం. ఒక నుడి.

**5. మగల దగులు గారె మగువలకును :**

**1. కవి పాఠ్యభాగం :**

ఈ వాక్యం బమ్మెరపోతన రచించిన శ్రీ మహాభాగవతంలోని అష్టమ స్కంధమందలి ప్రస్తుత పాఠ్యభాగమైన గజేంద్రమోక్షణం లోనిది.

**2. సందర్భం :**

మొసలితో పోరాడే తమ భర్తయైన గజేంద్రుని ఒంటరిగా వదలి వెళ్ళిపోలేని ఆడయేనుగులు చూస్తూ ఉండిపోయాయని చెప్పు సందర్భంలో కవి చెప్పిన వాక్యము ఇది.

**3. అర్థం :**

భర్తలు భార్యలకు విడువరాని వారు కదా అని దీని అర్థం.

**4. వ్యాఖ్య :**

ఇది అర్థాంతరన్యాసాలంకారము. మగలు, మగువలు సమతూకంగల శబ్దసంపుటులు. ఈ వాక్యంలోని ప్రతిపదంలోను "గ"కారము గలదు. కావున శబ్దాలంకారమైన వృత్యనుప్రాస అను అలంకారము కూడా కలదు.

**6. బహుళపక్ష శీతభానుపగిది :**

**1. కవి పాఠ్యభాగం :**

ఈ వాక్యం బమ్మెరపోతన రచించిన శ్రీ మహాభాగవతంలోని అష్టమ స్కంధమందలి ప్రస్తుత పాఠ్యభాగమైన గజేంద్రమోక్షణం లోనిది.

**2. సందర్భం :**

జీవనం (నీరు) జీవనమై (బ్రతుకుతెరువై) యుండుటచేత మొసలికి బలం అంతకంతకు అధికంకాగా గజేంద్రుని బలం క్షీణించిందని కవి చెప్పు సందర్భములోనిదీ వాక్యము. ఆ క్షీణించడం ఎలా ఉందో తెలుపుతుందీ వాక్యం.

**3. అర్థం :**

బహుళ పక్షమనగా కృష్ణపక్షం. శీతభానుడనగా చంద్రుడు. కృష్ణపక్షంలో చంద్రుడు క్రమక్రమంగా క్షీణిస్తాడు. అలాగే గజేంద్రుడు కూడా క్షీణించాడు. కృష్ణపక్షంలోని చంద్రునిలాగా అని దాని అర్థం.

**4. వ్యాఖ్య :**

ఇందులో ఉపమాలంకారం ఉంది. గజేంద్రునికి కృష్ణపక్ష చంద్రునితో సామ్యం. ఇలా పోల్చడంలో ఒక భావం ధ్వనిస్తుంది. కృష్ణపక్షం పోగానే శుక్లపక్షం వస్తుంది. చంద్రుడు మళ్ళీ ఉదయిస్తాడు. అలాగే కాలం అనుకూలించగానే గజేంద్రునకు కూడా అభ్యుదయం కలుగుతుందని ధ్వని.

**7. సలిపెంబోరొక్కవేయి సంవత్సరముల్ :**

**1. కవి పాఠ్యభాగం :**

ఈ వాక్యం బమ్మెరపోతన రచించిన శ్రీ మహాభాగవతంలోని అష్టమ స్కంధమందలి ప్రస్తుత పాఠ్యభాగమైన గజేంద్రమోక్షణం లోనిది.

**2. సందర్భం :**

అలసిపోకుండా, సోలిపోకుండా గజేంద్రుడు మొసలితో రాత్రి పగలు అనకుండా పోరాడు సందర్భంలో కవి చెప్పిన వాక్యమిది.

**3. అర్థం :**

పోరు అనగా యుద్ధం. యుద్ధాన్ని ఒక వేయి సంవత్సరాలపాటు సలిపాడు అని దీని అర్థం.

**4. వ్యాఖ్య :**

గజేంద్రుడు ఒక వేయిసంవత్సరములు యుద్ధం చేసింది. వేయి సంవత్సరాలు దీర్ఘకాలం. దీనినిబట్టి గజేంద్రుని వీరత్వము భాసమానము. స్వశక్తి క్షీణించనంతవరకు ఎంతకాలమైనా సరే - అదివేయి సంవత్సరాలు కావచ్చు, శత్రువుతో విజయంకై పోరాడవలసిందే.

**8. భయం బెట్లో కదే యీశ్వరా :**

**1. కవి పాఠ్యభాగం :**

ఈ వాక్యం బమ్మెరపోతన రచించిన శ్రీ మహాభాగవతంలోని అష్టమ స్కంధమందలి ప్రస్తుత పాఠ్యభాగమైన గజేంద్రమోక్షణం లోనిది.

**2. సందర్భం :**

పెక్కేన్గులు పెద్దకాలంబు సన్మానించుచుండగా, పదిలక్షల కోట్ల ఆడయేన్గులకు మగడనై, నా దానధారచే పెంచబడిన చందనలతాంతచ్ఛాయలందు ఉండలేక నీరాశతో ఇటేల వచ్చితినోయని మొసలి వాతబడిన గజేంద్రుడు చింతించు సందర్భములోనిది.

**3. అర్థం :**

భగవంతుడా ! (నాకైన) ఈ భయం ఎట్లగునో కదా ! అని అర్థం. ఏవిధంగా పరిణమిస్తుందో విముక్తుణ్ణి అవుతానా ? కానా ? అని ఆందోళన.

**4. వ్యాఖ్య :**

ఇక్కడ ఈశ్వరా ! అనగా త్రిమూర్తులలో లయకారకుడైన శివుడని కాదు, కేవల భగవద్వాచ్యమది.

**9. ఈశ్వరునే శరణంబు వేడెదన్ :**

**1. కవి పాఠ్యభాగం :**

ఈ వాక్యం బమ్మెరపోతన రచించిన శ్రీ మహాభాగవతంలోని అష్టమ స్కంధమందలి ప్రస్తుత పాఠ్యభాగమైన గజేంద్రమోక్షణం లోనిది.

**2. సందర్భం :**

మొసలి బారినపడిన గజేంద్రుడు పూర్వపుణ్యఫల దివ్యజ్ఞాన సంపత్తితో తన్మోక్షణమునకై భగవంతుని ప్రార్థించు మొదటి పద్యంలోనిది. ఈ జగత్తు ఎవనిచే జనిస్తుందో, ఎవనిలో లీనమౌతుందో, దీనికి మూలకారణమైనవాడెవడో వానిని నేను శరణు వేడుకొంటానని గజేంద్రుడు ప్రార్థించు సందర్భములోనిది.

**3. అర్థం :**

ఈశ్వరుణ్ణే శరణు వేడుకొంటాను అని అర్థం.

**4. వ్యాఖ్య :**

ఇక్కడ ఈశ్వరశబ్దం భగవద్వాచ్యం. "త్వం ప్రపద్యే స్వయం భువమ్" అని మూలంలో ఉన్న దానికి అనువాదమిది. స్వయంభువమ్ అను దానిని ఈశ్వరుని అని స్పష్టపరచినాడు పోతన.

**10. ఆత్మమూలు నర్థిఁదలంతున్ :**

**1. కవి పాఠ్యభాగం :**

ఈ వాక్యం బమ్మెరపోతన రచించిన శ్రీ మహాభాగవతంలోని అష్టమ స్కంధమందలి ప్రస్తుత పాఠ్యభాగమైన గజేంద్రమోక్షణం లోనిది.

**2. సందర్భం :**

మొసలిచే పట్టుబడిన గజేంద్రుడు పోరాడి పోరాడి క్షీణబలుడై, పూర్వపుణ్యఫల దివ్యజ్ఞాన సంపత్తితో తన శక్తి నెఱిగినవాడై, తన శక్తి చాలదని తెలిసి తన్మోక్షణమునకై భగవంతుని ప్రార్థించుచు లోకాలను సృష్టించే వాడు, తనలో లీనం చేసుకొనేవాడు, రెండూ తానే అయి సకలములకు సాక్షియైయున్న అకలంకుని, ఆత్మమూలుని ధ్యానిస్తానని అనుకొనే సందర్భములోనిది.

**3. అర్థం :**

ఆత్మమూలుడైన వానిని కోరికతో నేను స్మరించెదను అని అర్థం.
ఆత్మమూలుడు అనగా తన పుట్టుకకు తానే మూలకారణమైనవాడని అర్థం.

**4. వ్యాఖ్య :**

మూలంలో "స ఆత్మమూలః అతడు" అని కలదు. "ఆత్మమూల" అనే ప్రయోగాన్ని యథాతథంగా తెలుగులో ప్రయోగించడం ఔచిత్యం. "అర్థిన్" అనేది సాభిప్రాయం. తలంతున్ అనడంలో తలచు అనే క్రియకు ఉన్న అర్థాలన్నీ ఆ సందర్భంలో కుదురుతాయి. (తలచు = ఎంచు, ధ్యానించు = స్మరించు, స్మరణం = నవవిధ మార్గాలలో ఒకటి)

**11. అతనినే సేవింతున్ :**

**1. కవి పాఠ్యభాగం :**

ఈ వాక్యం బమ్మెరపోతన రచించిన శ్రీ మహాభాగవతంలోని అష్టమ స్కంధమందలి ప్రస్తుత పాఠ్యభాగమైన గజేంద్రమోక్షణం లోనిది.

**2. సందర్భం :**

మొసలికి పట్టుబడిన గజేంద్రుడు దానితో పోరాడి పోరాడి తన బలం శిథిలంకాగా పూర్వపుణ్యఫల దివ్యజ్ఞాన సంపత్తితో తన్మోక్షణమునకై భగవానుని ధ్యానిస్తానన్న సందర్భమిది.

**3. అర్థం :**

అతనిని అనగా లోకంబులు లోకేశులు లోకస్థులు తెగిన పిమ్మట అలోకంబగు పెంజీకటికి ఆవల ఏకాకృతితో వెలుగువానిని సేవిస్తాను అని అర్థం.

**4. వ్యాఖ్య :**

ఈ వాక్యం గల పద్యం ఖగోళశాస్త్ర సంబంధిగా విజ్ఞులు భావిస్తారు. అతనినే అనడంలో అన్యులను సేవింపను అని అర్థాంతరం. "సేవనమ్" నవవిధభక్తి మార్గాలలో ఒకటి.

**12. వాఁడు దిక్కునాకు :**

**1. కవి పాఠ్యభాగం :**

ఈ వాక్యం బమ్మెరపోతన రచించిన శ్రీ మహాభాగవతంలోని అష్టమ స్కంధమందలి ప్రస్తుత పాఠ్యభాగమైన గజేంద్రమోక్షణం లోనిది.

**2. సందర్భం :**

విరాగులు, అందరి మేలుకోరేవారు మొదలగు వారందరూ ఎవరి పాదాన్ని ఉపాసిస్తారో ఆయనే నాకు కూడా శరణు అని మొసలి బారినపడిన గజేంద్రుడు ఈశ్వరుని ప్రార్థిస్తున్న సందర్భములోనిది.

**3. అర్థం :**

వాడు అనగా పరాత్పరుడు, దిక్కు అనగా శరణము అని అర్థం.

**4. వ్యాఖ్య :**

నాకు నీవే దిక్కు వంటి లోకోక్తిని స్ఫురింపజేయుచున్నది. దీనావస్థను సూచించుచున్నది.

**13. వానికే నొనర్తు వందనములు :**

**1. కవి పాఠ్యభాగం :**

ఈ వాక్యం బమ్మెరపోతన రచించిన శ్రీ మహాభాగవతంలోని అష్టమ స్కంధమందలి ప్రస్తుత పాఠ్యభాగమైన గజేంద్రమోక్షణం లోనిది.

**2. సందర్భం :**

జననం, దోషం, రూపం, నామం, గుణం మొదలైనవి లేనివాడైనప్పటికీ లోకాలను సృష్టించడం కోసం లయింపజేయడానికోసం తన మాయతో ఎవడైతే వీటన్నింటినీ పొందుతున్నాడో, ఆ పరమేశ్వరునకు, సకల సాక్షీభూతునకు, ఫలాపేక్షలేకుండా కర్మలు చేసే నిపుణుడైన వానిని మెచ్చుకునే వానికి నేను నమస్కరిస్తానని గజేంద్రుడు మొరపెట్టుకునే సందర్భంలోనిది.

**3. అర్థం :**

వానికిన్ అనగా పరాత్పరునకు అని అర్థం. అట్టివానికి అనగా పైన చెప్పబడిన విధానం గలవానికి నేను నమస్కరిస్తానని అర్థం.

**4. వ్యాఖ్య :**

నవవిధ భక్తి విశేషాల్లో వందనం ఒకటి.

**14. వాని కాచరింతు వందనములు :**

**1. కవి పాఠ్యభాగం :**

ఈ వాక్యం బమ్మెరపోతన రచించిన శ్రీ మహాభాగవతంలోని అష్టమ స్కంధమందలి ప్రస్తుత పాఠ్యభాగమైన గజేంద్రమోక్షణం లోనిది.

**2. సందర్భం :**

దిక్కులేని నా వంటి ప్రాణుల పాపాన్ని పోగొట్టే వానికి, అందరిలో అంతరాత్మగా వెలిగేవానికి, సాక్షాద్భగవానుడైన వానికి, ఇల్లూవాకిలీ, భార్యాబిడ్డలూ అని కొట్టుమిట్టాడేవారికి లభించని వానికి నమస్కరిస్తానని గజేంద్రుడు మొరపెట్టుకునే సందర్భములోనిదీ వాక్యం.

**3. అర్థం :**

వానికి భగవంతునకు నమస్కారాలు చేస్తాను అని దాని అర్థం.

**4. వ్యాఖ్య :**

నవవిధభక్తి విశేషాలలో వందనం ఒకటి.

**15. కలఁడు కలం డనెడువాఁడు కలఁడోలేఁడో :**

**1. కవి పాఠ్యభాగం :**

ఈ వాక్యం బమ్మెరపోతన రచించిన శ్రీ మహాభాగవతంలోని అష్టమ స్కంధమందలి ప్రస్తుత పాఠ్యభాగమైన గజేంద్రమోక్షణం లోనిది.

**2. సందర్భం :**

మొసలికి చిక్కిన గజేంద్రుడు దానితో పోరాడి పోరాడి అలసిపోయి తన్మోక్షణమునకై పూర్వపుణ్యఫల దివ్యజ్ఞాన సంపత్తితో ఈశ్వరునకు మొరపెట్టుకుంటూ ఆ ఈశ్వరుడు దీనులను రక్షించడానికి ఉన్నాడంటారు. పరమయోగి గుణముల నున్నాడంటారు. అన్ని దిక్కులలోను ఉన్నాడంటారు అని అనుకొనే సందర్భంలోనిది.

**3. అర్థం :**

ఉన్నాడు ఉన్నాడు అని చెప్పబడేవాడు (భగవంతుడు) (నిజంగా) ఉన్నాడో లేడో కదా ! అని దాని అర్థం.

**4. వ్యాఖ్య :**

జ్ఞాని కూడా ఒక్కొక్కప్పుడు సందేహావస్థలో పడతాడు అని ఈ వాక్యం బోధిస్తుంది.

**16. వినడె చూడడె తలఁపడె వేగరాడె :**

**1. కవి పాఠ్యభాగం :**

ఈ వాక్యం బమ్మెరపోతన రచించిన శ్రీ మహాభాగవతంలోని అష్టమ స్కంధమందలి ప్రస్తుత పాఠ్యభాగమైన గజేంద్రమోక్షణం లోనిది.

**2. సందర్భం :**

మొసలికి చిక్కిన గజేంద్రుడు దాని బారినుండి మోక్షణం కోసం భగవంతుణ్ణి ప్రార్థిస్తూ ఇలా అనుకున్నది. అన్నిరూపాలు తన రూపమైనట్టి వాడు, ఆదిమధ్యాంతములు లేక అడరువాడు, భక్తజనముల దీనుల పాలివాడునైన సర్వేశ్వరుడు నా మొర వినడా ! అని గజేంద్రుడు మొరపెట్టుకొను సందర్భం.

**3. అర్థం :**

(నా మొర) వినడా ! (నా స్థితి) చూడడా ! (నన్ను గూర్చి) ఆలోచింపడా ! (నన్ను రక్షించడానికి) తొందరగారాడా! అని దీని అర్థం.

**4. వ్యాఖ్య :**

వాక్యంలోని పదక్రమంలో ఒక సౌందర్యం ఉంది. గజేంద్రుని మొర వినడం మొదటిపని, విన్న తర్వాత తనదివ్యత్వంతో గజేంద్రుని స్థితిని చూడడం చూచిన తర్వాత చేయవలసినదాన్ని గూర్చి ఆలోచించడం, ఆలోచించిన తర్వాత కార్యరంగంలోకి దిగడం, ఇదీ క్రమం. ఈ క్రమం ఇందుగలదు.

**17. పరమపురుషు నే భజియింతున్ :**

**1. కవి, పాఠ్యభాగం :**

ఈ వాక్యం బమ్మెరపోతన రచించిన శ్రీ మహాభాగవతంలోని అష్టమ స్కంధమందలి ప్రస్తుత పాఠ్యభాగమైన గజేంద్రమోక్షణం లోనిది.

**2. సందర్భం :**

మొసలి బారినపడిన గజేంద్రుడు దాని చెఱను విడిపించుకొనుటకై పోరాడి పోరాడి అలసిపోయి చివరకు ఈశ్వరుని ధ్యానించినాడు. అతనే విశ్వానికి కర్త, విశ్వానికి ఆత్మ, బ్రహ్మ, ఈశ్వరుడనైన పరమపురుషుని నేను సేవిస్తాను అని గజేంద్రుడు మొరపెట్టుకొను సందర్భములోనిది.

**3. అర్థం :**

పరమపురుషుడు అయిన వానిని నేను సేవిస్తాను అని దాని అర్థం.

**4. వ్యాఖ్య :**

పరమపురుషుడు అనగా పురుషోత్తముడు. పురుషోత్తముడు అని అనబడేవాడు విష్ణువే. కాబట్టి పరమపురుష శబ్దం ద్వారా విష్ణువు సూచితం.

**18. సందేహమయ్యెఁగరుణావార్ధీ :**

**1. కవి పాఠ్యభాగం :**

ఈ వాక్యం బమ్మెరపోతన రచించిన శ్రీ మహాభాగవతంలోని అష్టమ స్కంధమందలి ప్రస్తుత పాఠ్యభాగమైన గజేంద్రమోక్షణం లోనిది.

**2. సందర్భం :**

మొసలికి చిక్కిన గజేంద్రుడు దాని బారినుండి విముక్తి పొందుటకై దానితో పోరాడి పోరాడి అలసిపోయి చివరకు ఈశ్వరుని ప్రార్థించినాడు. అప్పట్టున నీవు ప్రాణుల మాటలు వింటావట. వెళ్ళడానికి వీలుకాని చోట్లకైనా నీవు వెళ్తావట. శరణుకోరిన వారికి "ఓ"యని పలుకుతావట. అన్నింటిని చూడగలవట ! నిజమా స్వామీ ! అని అంటూ, ఈ విషయాన్ని గజేంద్రుడు శకించు సందర్భంలో అనుకొన్న మాటలివి.

**3. అర్థం :**

ఓ దయాసాగరా ! (నాకు) సందేహం కలుగుతున్నది అని దీని అర్థం.

**4. వ్యాఖ్య :**

ఎంత నమ్మకమున్నను శకించుట జీవుని లక్షణము. అది ఇందు ప్రతిపాదితము.

**19. శరణార్థిని నన్ను గావవే :**

**1. కవి పాఠ్యభాగం :**

ఈ వాక్యం బమ్మెరపోతన రచించిన శ్రీ మహాభాగవతంలోని అష్టమ స్కంధమందలి ప్రస్తుత పాఠ్యభాగమైన గజేంద్రమోక్షణం లోనిది.

**2. సందర్భం :**

మొసలికి చిక్కి విడిపించుకొనలేని దీనస్థితిలో నున్న గజేంద్రుడు తన్మోక్షణమునకై ఈశ్వరుని ధ్యానించినది. ఆ పరంపరలో ఇలా అనుకొన్నది. ఓ లక్ష్మీపతి ! ఓ వరద ! శరణుజొచ్చిన వారికి కల్పవృక్షము వంటి వాడా ! నన్ను కరుణింపగా రమ్ము అని ప్రార్థిస్తూ ఈ మాటలను పలికాడు.

**3. అర్థం :**

శరణుగోరినవాడ నగునన్ను రక్షింపుమా ! అని దీని అర్థం.

**4. వ్యాఖ్య :**

శరణుగోరిన వారికి కల్పవృక్షము వంటివాడు అని అన్న సందర్భంలో "శరణార్థిని" అను ప్రయోగం సాభిప్రాయం. శరణాగతి భక్తికి చివరిమెట్టు.

**20. కూర్మరాజు మఱువున కరిగెన్ :**

**1. కవి పాఠ్యభాగం :**

ఈ వాక్యం బమ్మెరపోతన రచించిన శ్రీ మహాభాగవతంలోని అష్టమ స్కంధమందలి ప్రస్తుత పాఠ్యభాగమైన గజేంద్రమోక్షణం లోనిది.

**2. సందర్భం :**

మొసలికి చిక్కిన గజేంద్రుడు దాని నుండి విముక్తి కోసం పెక్కేండ్లు పోరాడి పోరాడి అలసిపోయి చివరకు ఈశ్వరుని ప్రార్థించింది. అప్పుడు విశ్వమయుడైన విష్ణువు దానిని రక్షింపగావచ్చి చక్రాయుధంతో మొసలి తలను ఖండించాడు. అయ్యవసరంబున మకరముల స్థితిని వర్ణించు సందర్భములోనిదిది.

**3. అర్థం :**

కూర్మరాజు అనగా ఆదికూర్మం. మొసళ్ళన్నీ ఆదికూర్మం యొక్క చాటునకు వెళ్ళాయని దీని అర్థం.

**4. వ్యాఖ్య :**

రాజశబ్ద మిచట శ్రేష్ఠతావాచకం.

**10.3 రాదగిన ప్రశ్నావిధానం :**

క్రింది వానిలో ఒకదానికి సందర్భసహిత వ్యాఖ్య రాయండి.

అ) మగలు దగులు గారె మగువలకును

ఆ) కలడు కలండెనుడు వాడు కలడో లేడో

**- డా॥ శ్రిష్టి చంద్రమౌళిశర్మ**
రిటైర్డ్ ప్రిన్సిపాల్
శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ డిగ్రీ కళాశాల
పొదిలి, ప్రకాశం జిల్లా.

పాఠం - 11

# గజేంద్ర మోక్షము

- బమ్మెర పోతన

**(మహాభాగవతం - అష్టమ స్కంధం - 25 నుండి 115 పద్యాల వరకు)**

## వ్యాసరూప ప్రశ్నలు

**విషయసూచిక :**

- **11.1** ఉద్దేశ్యం
- **11.2** వ్యాసరూప ప్రశ్నలు
- **11.3** రాదగిన ప్రశ్నావిధానం

### 11.1 ఉద్దేశ్యం :

పాఠ్యాంశంలోని ఇతివృత్తమందలి ఏ ఘట్టంలో సమాధానం లభిస్తుందో గ్రహించడం జరుగుతుంది. ఆ తరువాత వ్యాసం ఎక్కడ నుండి ఎలా ప్రారంభించాలో తెలుస్తుంది. విషయ వివరణం ఏవిధంగా చేయాలో అవగతమౌతుంది. పేరా విభజన ఎక్కడ కావించాలో అనే పరిజ్ఞానం వస్తుంది. ఏవిధంగా వ్యాసంలో ముగింపు ఉండాలో బోధపడుతుంది. వచన రచన అభ్యాసమౌతుంది. ఈ ప్రయోజనాల్ని విద్యార్థికి సిద్ధింపజేయడమే వ్యాసరూప ప్రశ్నల ముఖ్యోద్దేశ్యం.

### 11.2 వ్యాసరూప ప్రశ్నలు :

**1. గజేంద్రుని వన సరోవిహార వృత్తాంతాన్ని వివరించండి ?**

**(లేదా)**

**గజేంద్రుడు మొసలికి పట్టుబడిన వృత్తాంతాన్ని వివరించండి ?**

త్రికూట పర్వత సమీపంలో పెద్దయడవి ఉండేది. అందులో చెంచులు తిరుగుతుండేవారు. భల్లూకాదులైన అనేక క్రూరమృగాలు సంచరిస్తుంటాయి. కాకులు గుడ్లగూబలు తారాడుతుంటాయి.

దిగ్గజాలను సైతం జయించగలిగినవైన అడవి యేనుగుల గుంపు ఒకటి అక్కడి కొండగుహల్లోంచి బయటకు వచ్చింది. అది ఎలా ఉందంటే పగలంతా సూర్యుడికి భయపడి కొండగుహల్లో దాక్కొని చీకటి సమయం చూచుకొని బయటకు వస్తున్నట్లుగా ఉంది. ఆ యేనుగుల గుంపు తిరిగి అలసిపోయి దప్పికకాగా, నీటిమడుగుల్లో దిగాలనే కోరికతో ముందుకు సాగింది. ఆ గుంపులోని గున్నయేనుగులు గూడా పెద్దయేనుగులంత బలిష్ఠమైనవే. సింహాలను కూడా ఎదుర్కొనగలవు. పిడుగులకు సైతం జడియవు.

అట్లాంటి అడవియేనుగులు విహరిస్తూ ఉండగా పులులు కూడా పొదరిండ్లలోకి దూరాయి. ఎలుగుబంట్లు గుహల్లో చొరబడ్డాయి. అడవిపందులు నేలబొరియల్లో దొక్కొన్నాయి. జింకలు దిక్కుల చివరకు పరిగెత్తాయి. అడవిదున్నలు నీటి మడుగుల్లోకి ప్రవేశించాయి. కోతులు కొండలకెగ్రబాకాయి. పాములు పుట్టల్లో దూరాయి. చమరీమృగాలు మాత్రం తమ కుచ్చుతోకలతో విసురుతూ ఏనుగుల అలసటను నివారిస్తున్నాయి. ఏనుగుల శరీరం నుండి స్రవించే జలాన్ని త్రాగి తుమ్మెదలు జుం జుం అని గానం చేస్తున్నాయి.

గున్నఏనుగులు కూడా విజృంభించాయి. నీటిపడియలను త్రొక్కసాగాయి. పండ్లచెట్లను రాచుకుంటూ చిగుళ్ళను మేసాయి. పులుల్ని జింకల్ని నిలువరించాయి. సరస్సుల్లోకి ప్రవేశించి చిందరవందర చేయసాగాయి. కొండలపై వినోదించాయి. మదగజాలు తొండాలతో, చెక్కిళ్ళతో కుంభస్థలాలతో కొండలను ఢీకొట్టాయి.

అలా విహారం చేస్తున్న ఏనుగుల గుంపుతోపాటుగా తన ఆడయేనుగులు సేవిస్తూండగా విహరించుచున్న ఒక గజేంద్రుడు దారితప్పాడు. తాను తన ఆడుయేనుగుల గుంపు మరోదారిలో ముందుకు సాగాయి.

ఆ గజేంద్రుడు నీటికుంటల చెంత మొలచిన పచ్చికను మచ్చికతో చెలులకందించాడు. చిగుళ్ళ గుత్తులను పూగొమ్మలను తన ప్రియురాండ్రకు అందేట్లు చేసాడు. మదజలంతో తడిసిపోయిన విసనకఱ్ఱల వంటి చెవులతో విసిరి తన భార్యల చెమటను పోగొట్టాడు. తన దంతాలతో తన భార్యల మెడలను మృదువుగా నిమిరి క్రీడించాడు.

నిండైన కుంభస్థలంతో, గంభీరమైన నడకతో, తొండపు శోభతో, దంతకాంతులతో గజేంద్రుడు ప్రకాశిస్తూ స్త్రీల అవయవ విలాసాన్ని అతిగమించాడు. ఇలాంటి గజరాజు ఎన్నో అడవులలో విహరించి విహరించి ఆ విహారమందలి మితిమీరిన ఆసక్తితో చివరకు దారితప్పి దప్పికగొని తన ఆడయేనుగులతోపాటుగా నీటికోసం ప్రయాణాన్ని సాగించాడు.

ఆ సమీపంలో ఒక కాసారాన్ని చూచాడు. అందులో వికసించిన పద్మాలు కలువలూ రెండూ ఉన్నాయి. (రెండూ ఒకేసారి వికసించటం దివ్యత్వం) వాటిపై తుమ్మెద లెగురుతున్నాయి. తాబేళ్ళు, చేపలు, మొసళ్ళు అందులో తిరుగాడుతున్నాయి. దానిగట్టుపై మద్ది, తాడి, మామిడి మొదలగు చెట్లతోపాటుగా పూతీగలు పొదరిండ్లు ఉన్నాయి. అంతేకాదు, హంసలు, చక్రవాకపక్షులు, కొంగలు సంచరిస్తున్నాయి. మానవ సంచారం మాత్రం ఆ ప్రాంతంలో లేదు. అట్లాంటి సరస్సు చాలా నిర్మలంగా ఉంది.

ఆ సరస్సులోని పద్మాల వాసనతో కూడి వీచే చల్లనిపిల్లగాలులు ఆ ఏనుగుల శరీరాలకు హాయిని గూర్చాయి. అందలి తామరతూండ్లనుమేసి హాయిగా పాడే హంసల మధురగానం ఆ ఏనుగుల వీనుల విందుగూర్చాయి. వికసించిన తామరల మొక్కయు కలువల మొక్కయు కమ్మని వాసన వాటి నాసికకు ఇంపును కలిగించాయి. అందలి అలల నుండి ఎగిసిపడే నీటితుంపరలు వాటి నోళ్ళలోపడి దాహంతీర్చాయి. ముల్లోకాలలోని సరస్సుల శోభ ఇందే ఉన్నదా అన్నట్లు ప్రకాశించే ఆ సరస్సు వాటికి కనువిందు కలిగించింది. అలాంటి సరస్సును సమీపించగానే ఏనుగులన్నీ వాటి ఇంద్రియ వ్యాపారాలను మరచిపోయాయి. ఒక్కసారిగా ఆ ఏనుగులన్నీ ఆ మడుగులోకి దిగాయి.

అట్లా ఆ మడుగులోకి దిగిన ఏనుగులన్నీ వెంటనే తమ తొండాలతో నీళ్ళు నింపుకొన్నాయి. ఆ నీళ్ళను చెక్కిళ్ళపై చల్లుకొన్నాయి. గళగళమనే శబ్దాలు చేస్తూ కడుపునిండా నీళ్ళు త్రాగాయి. గజేంద్రుడు తొండంతో మరి మరి నీళ్ళు పీల్చాడు. ఆ నీళ్ళను ఆకాశం వైపు చిమ్మాడు. నీటిలోనుండి ఎగిసిపడిన మీనకర్కటాలు ఆకాశంలోని మీనకర్కటాలను పట్టుకోబోయాయి. ఆ దృశ్యాన్ని చూచి దేవత లాశ్చర్యచకితులయ్యారు.

అట్లా విహరిస్తున్న గజేంద్రుని మీద ఆడుఏనుగులు తమ తొండాలతో నీళ్ళు చల్లాయి. ఆ నీటితో కూడిన గజేంద్రుడు సెలయేళ్ళతో కూడిన నీలాద్రిలాగా ప్రకాశించాడు. కొన్ని ఆడుయేనుగులు గజేంద్రుని పద్మాలతో అలంకరించాయి. అప్పుడు గజేంద్రుడు వేయికన్నులు గల దేవేంద్రునిలాగా కనబడ్డాడు. గున్నయేన్గులు గజేంద్రుని మీద కలువల పుప్పొడి చల్లగా అతడు బంగారుకొండలా భాసిల్లాడు. కొన్ని ఆడఏనుగులు గజేంద్రుని తామరతూండ్లతో అలంకరించాయి. అప్పుడు గజేంద్రుడు నాగాభరణుడైన శివునివలె వెలిగాడు. ఈవిధంగా గజేంద్రుడు తన భార్యలతో సరస్సులో విహరించాడు. ఆ సరస్సు కూడా మగనికౌగిలిలో చిక్కిన మగువలాగా మారిపోయింది.

ఈవిధంగా గజరాజు క్రీడిస్తున్న సమయంలో సరస్సులో నుండి ఒక పెద్దమొసలి పైకెగిరింది. దాని ధాటికి ఆ సరస్సులోని ఇతరములైన మొసళ్ళు అదిరిపడ్డాయి. అది దాని తోకను ఝాడించింది. దాని ధాటికి పుట్టిన గాలివల్ల నీళ్ళలో సుడులు తిరిగాయి. ఆ అలల తాకిడికి గట్టుమీది చెట్లు వ్రేళ్ళతో సహా నేలకూలాయి. సరస్సులో నుండి అమాంతం లేచిన ఆ మొసలి కుప్పించి, హుంకరించి సూర్యుణ్ణి పట్టుకొనే రాహువులాగా విజృంభించి గజేంద్రుని పట్టుకొన్నది. దీనితో గజేంద్రుని వీరవిహారం ముగిసింది.

**2. మొసలికి చిక్కిన గజేంద్రుడు తనను కాపాడవలసినదిగా భగవంతునికి మొరపెట్టుకొనిన విధమును వ్రాయునది.**

త్రికూట పర్వత సమీపంలోగల పెద్దఅడవిలో కొండ గుహలో నుండి ఏనుగుల గుంపు ఒకటి వెలువడింది. ఆ గుంపు యధేచ్ఛావిహారం చేస్తుండగా అందులో నుండి ఒక గజేంద్రుడు దారి తప్పి ఒక ఆడు యేనుగులతో కలసి మరోదారిలో ముందుకుసాగాడు. అలా పోతూ ఒక సరస్సును చూచి అందులో దిగాడు. అందులో ఉన్న పెద్దమొసలి ఎగిరి వచ్చి ఆ గజేంద్రుని పట్టుకొన్నది.

ఈ గజేంద్రుడు మొసలితో పోరాడసాగాడు. ఆ పోరాటంలో గజేంద్రుడు బాగా అలసిపోయాడు. జీవనపుటోలం లోబడి మోహమనే లతచే కట్టివేయబడి దానిని విడిపించుకోలేక సందేహంలోబడ్డ దేహిలాగా దీనదశలో గజేంద్రుడున్నాడు. ఆ మొసలితో పెక్కేండ్లు పోరాడాడు. తన బలం తగ్గింది. వైరిబలంతో పోల్చి చూచుకొన్నాడు. దీనిని గెల్వలేనని నిశ్చయించుకున్నాడు. పూర్వపుణ్య ఫల దివ్యజ్ఞాన సంపత్తిలో ఇలా భగవంతుని గూర్చి ప్రార్థించసాగాడు.

"ఈ మొసలిని ఏవిధంగా జయించగలను? ఏ దేవుణ్ణి గూర్చి ప్రార్థించాలి ? ఎవరిని పిలవాలి ? నాకు తోడ్పడేవారెవరు? ఈ మొసలిని నివారించే వారు లేరా? నా మొరను ఆలించేవారెవరు ? వారికి నేను మ్రొక్కెదను.

అడవిలో అనేకమైన ఏనుగులు నన్ను గౌరవిస్తుండేవి. నాదాన ధారలతో ఏపుగా పెరిగిన చెట్లనీడలలో నుండకుండా ఈ నీరాశతో ఇక్కడికి నేనెందుకు వచ్చానో కదా ! ఈ మడుగుకే ఎందుకు రావాలి ? ఈ భయం ఎలా తీరుతుందో ఎలా పరిణమిస్తుందో ?

ఈ జగమంతా ఎవరివలన పుడుతుందో, ఎవరి లోపల అణగి ఉంటుందో ఎవరిలో లీనమై ఉంటుందో, ఈ విశ్వానికంతటికీ మూలమైన వాడెవడో, ఆదిమధ్యాంతాలు ఎవరికైతే లేవో వానిని ఆత్మభవుడైన వానిని ఈశ్వరుని నేను శరణు వేడుకొంటాను.

ఆ ఈశ్వరుడు జగాలను ఒకసారి సృష్టిస్తాడు. ఒకసారి లయం చేస్తాడు. సృష్టి కారకుడూ లయకారకుడూ రెండూ ఆయనయే. అయినా అన్నింటికీ సాక్షీభూతుడుగా మాత్రమే ఉంటాడు. ఏదీ ఆయనకు అంటదు. ఆత్మలకు మూలమైన ఆ పరమాత్ముని స్మరిస్తాను.

లోకంబులు, లోకేశులు, లోకస్థులు తెగిన తరువాత కూడా లోకరహితమైన కారుచీకట్లకు అవతలివైపున అఖండ తేజోరూపంగా ఎవడు ఎల్లప్పుడూ ప్రకాశిస్తూ ఉంటాడో ఆ పరమాత్ముని నేను సేవిస్తాను.

నటునివలె ఏ దేవుడు అనేకరూపాలతో నటిస్తుంటాడో, మునుల స్తుతులకు కూడా ఏ దేవుడు అందడో, ఏ దేవుని ప్రవర్తన ఇతరులకు అర్థంకాదో, ఆ దేవుని నేను కీర్తిస్తాను. భవబంధాలను వదలిని ఋషులు, భగవద్దర్శనం కోరే మహనీయులు సర్వభూతములకు మేలుకోరే సాధువులు ఎవరి దివ్యపదమును అర్చిస్తారో ఆ దేవుడే నాకు కూడా దిక్కు.

భవదోషాలు, నామరూపాలు లేనివాడైనను, జగత్తును సృష్టించడానికి, లయింపజేయడానికి ఎవడైతే వాటినన్నింటినీ ధరిస్తాడో, ఆ పరేశునకు, ఆ అనంతశక్తికి, ఆ రూపరహితునకు శాంతునకు, మోక్షప్రదాతకు, ఘోరునకు, గూఢునకకు, గుణధర్మికి సౌమ్యునకు, జ్ఞానికి, దయామతికి, మూల ప్రకృతికి, ఆత్మమూలునకు, నిఖిల కారణునకు, నిష్కారుణునకు నేను నమస్కరిస్తాను మరియును ఆగమామ్నాయ జలధియైనవానికి, అపవర్గమయునికి, ఉత్తమ మందిరునకు, ధన్యమతికి, దిక్కులేని నాబోడి పశువుల పాపాలను పోగొట్టేవానికి, అన్నింటికీ అంతరాత్మయై ప్రకాశించే వానికి, భగవంతునకు నేను వందనంలర్పిస్తాను.

ఎవనిని సేవించడంవల్ల పండితులు కోరిన వరాలు పొందుతారో, తన దగ్గరకు చేరి కోరుకున్నవాడికి ఎవడైతే దయతో అవ్యయమైన దేహాన్ని ప్రసాదిస్తాడో, బంధవిముక్తులైనవారు ఎవరిని గూర్చి ధ్యానిస్తారో, ఆనందసాగరంలో మునిగి

నిష్కాములైనవారు ఎవ్వని శుభచరిత్రను గానం చేస్తారో, ఆ మహేశ్వరుని, ఆ అతీంద్రియుని నేను భజిస్తాను. అగ్నిదేవుడు జ్వాలలను సూర్యుడు కిరణాలను ఏవిధంగా వ్యాపింపజేసి మళ్ళీ శమింపజేస్తారో అదేవిధంగా తన కర మహాత్మ్యం బ్రహ్మాదులను, దేవతలను అఖిల జంతు సంతతిని జగాలను వివిధ నామరూపాలతో సృష్టించి, లయింపజేసేవాడెవడో, మనస్సు, బుద్ధి, ఇంద్రియాలూ తానే అయి ఎవడు గుణ సంప్రదాయంబును నెరపుతాడో, ఆ విభుని నేను ధ్యానిస్తాను.

దేవుడనేవాడు దీనులపట్ల ఉంటాడంటారు. యోగులపాల గూడా ఉంటాడట. అన్నిదిక్కులలోనూ ఉంటాడని అంటారు. ఉన్నాడు ఉన్నాడు అని చెప్పబడేవాడు అసలు ఉన్నాడో ! లేడో !

ఉన్నవాడు లేనివాడు అనే భేదభావం లేని దేవుడు నా సందేహం తీరేట్లుగా నాకు సాక్షాత్కరింపడా ! దుష్టుల చేత పీడింపబడే సాధువులకు అడ్డుపడేవాడు నన్నాదుకోకుండా ఉంటాడా ? చర్మచక్షువులతోగాక అంతశ్చక్షువులతో తనను చూచేవారిని కృపతో కనిపెట్టేవాడు నా పాటు చూడకుండా ఉంటాడా ! మొరపెట్టుకొనేవారి మొరలను ఆలకిస్తూ తనను మొరగువాడు నా మొరను ఆలకించకుండా ఉంటాడా ! అన్నిరూపాలు తన రూపమేయైనవాడు, ఆదిమధ్యాంతాలు లేనట్టివాడు భక్తజనముల దీనుల పాలివాడు నా మొరను వినకుండా ఉంటాడా ! నాపాటు చూడకుండా ఉంటాడా ! నన్ను గూర్చి ఆలోచించకుండా ఉంటాడా ! నన్ను రక్షించడానికి రాకుండా ఉంటాడా !

విశ్వాన్ని సృష్టించి కూడా దానికి దూరంగా ఉండేవాడు, విశ్వమునకు ఆత్మయైనవాడు విశ్వవేద్యుడైనవాడు, శాశ్వతుడైనవాడు అయిన ఈశ్వరుని నేను భజిస్తాను'' అని ప్రార్థిస్తూ ఈశ్వర సన్నిధానాన్ని సంకల్పించుకొని మరియు ఈ విధంగా ప్రార్థించింది.

“దేవా ! నాలో ఇంక శక్తిలేదు. ధైర్యం సడలిపోయింది. పంచప్రాణాలు తమ స్థానాల్లో పట్టుతప్పుతున్నాయి. మూర్ఛ వస్తున్నది. శరీరం డస్సిపోయింది. శ్రమావహంగా ఉంది. నీవే తప్ప ఇతఃపరం బెఱుగను. ఈ దీనుని దున్నింపదగును. ఈశ్వరా ! రా ! వరదా ! కాపాడు. భద్రాత్మకా ! సంరక్షించు.

జీవులమాటలు నీవు వింటావట. నీవు ప్రవేశింపరాని పోటీలేదట. శరణుజొచ్చినవారికి బదులిస్తావట. సర్వము నీకు ద్యోతమానమేనట. ఒ కమలాప్త ! ఓ వరద ! ఓ ప్రతిపక్ష విపక్షదూర ! కవియోగివంద్య ! సుగుణోత్తమ ! ఓ శరణాతా మరానోకహా ! ఓ మునీశ్వర మనోహర ! ఓ విపులప్రభావ ! రావే ! కరుణింపవే ! తలపవే ! శరణార్థినైన నన్ను కావవే'' అని భక్తిప్రపత్తులతో గజేంద్రుడు భగవంతునికి మొరపెట్టుకొన్నది.

### 3. విష్ణువు గజేంద్రుని రక్షించిన విధమును వివరించండి ?

త్రికూట పర్వత సమీపానగల పెద్దఅడవిలో కొండగుహల్లో నుండి యేనుగుల గుంపొకటి బయటకు వచ్చింది. తిరిగి తిరిగి ఆ గుంపు అలసిపోయి నీటిమడుగుల్లో దిగాలనే కోరికతో నడక సాగించింది. ఆ గుంపులో నుండి ఒక గజేంద్రుడు తనతోటి ఆడయేనుగులతో సహా దారి తప్పి వేరే మార్గంలో ప్రయాణించాడు. కొంతదూరం పోయాక ఒక సరస్సు కనిపించింది. అందులో దిగి కాసేపు క్రీడించాడు. అంతలో ఒక మొసలి వచ్చి అమాంతం గజేంద్రుణ్ణి పట్టుకుంది.

గజేంద్రుడు ఆ మొసలితో పెక్కేండ్లు పోరాడి పోరాడి అలసిపోయి భగవానుని అన్నివిధాలా ప్రార్థించాడు. చివరకు “నీవే తప్ప ఇతః పరంబెఱుగ''నని శరణాగతిని పొందాడు. ఆ మొరను విన్న అంబుజాసనాదులు (బ్రహ్మ మొదలగువారు) మిన్నకున్నారు. కాని విశ్వమయుడైన విష్ణువు దానికి అడ్డుపడదలచాడు.

వైకుంఠంలో, అంతఃపురంలో, ఒక ప్రధాన సౌధం ప్రక్కన వున్న మందారవనంలోని అమృతసరస్సు ఉన్న ప్రాంతంలో చంద్రకాంత మణులతో నిర్మింపబడిన అరుగుమీద లక్ష్మీదేవితో వినోదించుచున్న విష్ణువు నాగేంద్రము “పాహి పాహి''

యనడం విన్నాడు. వెంటనే గజప్రాణావనోత్సాహియైనాడు. ఆ తొందరలో ఆ విషయాన్ని లక్ష్మీదేవికి కూడా చెప్పలేదు. రక్షించడానికి కావలసిన శంఖచక్రాలను కూడా ధరించలేదు. ఏ పరివారాన్ని పిలువనంపలేదు. ప్రణయకలహంతో లాగి పట్టుకున్న లక్ష్మీదేవి పైట కొంగును విడువలేదు.

ఈవిధంగా భక్తపాలన పరాయణుడైన నారాయణుండు గజేంద్రుని దీనాలాపాలు విని లక్ష్మీదేవితోడి వినోదాన్ని కట్టిపెట్టి గజేంద్రున్ని రక్షించడానికై కావలసిన పరికరాలను మరల ధరించి ఆకాశమార్గంలో బయల్దేరాడు.

అప్పుడు ఆ నారాయణుడు వెంట లక్ష్మీదేవి ఆమె వెంట అంతఃపురకాంతలు వారి వెనుక గరుత్మంతుడు, అతని సమీపంలోనున్న ధనుస్సు, గద, శంఖము, చక్రము, నారదుడు, విష్వక్సేనుడు మొదలగువారితో పాటు వైకుంఠమందున్న వారందరూ వచ్చారు.

ఆ సమయంలో లక్ష్మీదేవి తన మనస్సులో ఇలా అనుకొన్నది - "స్వామివారు ఎక్కడికి వెళ్తున్నారో చెప్పరేమి ? దిక్కులేని స్త్రీల రోదన ఏమైనా విన్నారా ! వేదాలను ఎవరైనా తస్కరించారా ! రాక్షసులెవరైనా అమరావతిపై దండయాత్ర చేసారా ! ". "హరి ఏడిరా చూపించు అని ఎవడైనా దుర్మార్గుడు భక్తులను నిలదీసాడా ! అట్టి వారిని కాపాడటానికా ఈ తొందర అని అనుకున్నది. అలా అనుకొంటూ వెళ్తున్నప్పుడు లక్ష్మీదేవి చెవిపోగులు కదలాడసాగాయి. భుజాల మీద కొప్పుముడి నాట్యం చేస్తున్నది. పైటకొంగు జారింది. ఒడ్డాణం సడలింది. నుదుటిపైని పూతలు చెదిరాయి. అయినా కోటికాంతులు ముఖం నుండి ప్రసరిస్తున్నాయి. ఈ స్థితిలో నున్న లక్ష్మీదేవి తన భర్త ఎక్కడికి వెళ్తున్నాడో అడగాలని వేగంగా కదులుతుంది. అడిగినా అతడు బదులివ్వడని తెలిసి మానుకొంటుంది.

అప్పుడు లక్ష్మీదేవి మేఘం వెంబడి తళుకుమనే మెఱుపుతీగలా ఉంది. అట్టి లక్ష్మీదేవికి సేవలు చేసేవాడు, జయశీలుడు తేజోమయుడు అయిన శ్రీమన్నారాయణుని ఆకాశమార్గంలో వస్తుండగా దేవతలు చూచారు. చూచి "అదుగో స్వామి, హరి ప్రక్కనసే లక్ష్మి, అదుగో శంఖధ్వని, అడుగో గరుత్మంతుడు కూడా వచ్చాడు. చూచారా" అని అంటూ హస్తిదురవస్థావక్రియైన చక్రికి మ్రొక్కారు.

గజేంద్రుని కాపాడాలన్న తొందరలో విష్ణువు దేవతా నమస్కారాలను స్వీకరించలేదు. మనోవేగంతో ముందుకుపోయి కరిమకరాలున్న సరస్సును చూచాడు. వెంటనే భూచక్రాన్ని కంపింపజేసే శక్తి కలది, మిక్కిలి పైకి లేస్తున్న అగ్నికణాలతో ప్రకాశించునది, దేవతలను సంరక్షించేది అయిన సుదర్శనచక్రాన్ని శ్రీ మహావిష్ణువు ప్రయోగించాడు. ఆ సుదర్శనచక్రం దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నది. పద్మాలను కౌగిలించుకోవటానికై వచ్చిన సూర్యబింబంలాగా ఆ చక్రం వెలుగొందుతున్నది. ఆ చక్రం సరస్సులోని నీటిని కలచివేసింది. గుభుల్, గుభుల్ అనే ధ్వనులను పుట్టించింది. దుర్మార్గమైన మొసలి ఉండే చోటును సమీపించింది.

చక్రాయుధం రివ్వురివ్వునపోయి అరిభయంకరంగా తలను నరికి మొసలిప్రాణాలను క్షణంలో తీసింది. పెద్ద పర్వతంలా కనపడే దేహంతో, అడవియేనుగులను సైతం భయపెట్టే స్థితి కలిగిన ఆ మొసలిని చక్రం ఖండించింది. ఇలా చక్రం మొసలిని చంపడాన్ని చూచి జగత్తులోని మొసళ్ళన్నీ భయపడ్డాయి. అవి వాటి వాటి దిక్కున్నచోటుకు పోయాయి. సూర్యుని చాటుకు రాశిచక్రంలోని మొసలి, కుబేరుని చెంతకు మరో మొసలి (మకరనిధి) చేరాయి. సముద్రంలోని మొసళ్ళు ఆదికూర్మం చెంతకు చేరాయి.

మొసలి పట్టునుండి విడివడిన గజేంద్రుడు చీకటి నుండి వెలువడిన చంద్రునిలాగా సంసారదుఃఖమును వీడిన విరక్తునిలాగా ప్రకాశించాడు. తన పాదాలను ఒక్కసారి బాగా కదిలించాడు. ఆడుఏనుగులు తమ తొండాలతో చిమ్మిన అమృతజలంతో స్నానం చేసినవాడై తన సౌందర్యంతో యథావిధి విరాజిల్లాడు.

**4. గజేంద్ర మోక్షణ కథా విశేషాలను సమీక్షించండి.**

త్రికూట పర్వత సమీపంలో ఒక అడవి ఉండేది. ఆ అడవిలో చెంచుజాతివారు భల్లూకాది మృగాలు కాపురం చేస్తున్నాయి. ఆ అడవిలోని కొండగుహల్లో నుండి ఏనుగుల గుంపొకటి బయటకు వచ్చింది. ఆ ఏనుగులు తిరిగి తిరిగి అలసిపోయి దప్పికగొని నీటి మడుగుల్లో దిగాలన్న కోరికతో నడక సాగించాయి.

ఆ అడవి ఏనుగుల వీరవిహారానికి భయపడి పులులు పొదరిండ్లలో దూరాయి. ఎలుగుబంట్లు గుహల్లో దాక్కొన్నాయి. అడవిపందులు బొరియల్లోకి పరారయ్యాయి. చమరీమృగాలు మాత్రం తమ తోక కుచ్చులను విసురుతూ ఏనుగుల బడలికను నివారిస్తున్నాయి.

అందులోని గున్నఏనుగులు కూడా విజృంభించసాగాయి. నీటి మడుగుల్లోకి చొరబడి కలచివేస్తున్నాయి. నీటిగుంటను తొక్కుతూ, పండ్లచెట్లను రాచుకుంటూ, పులుల్నీ జింకల్నీ నిలువరిస్తూ విజృంభించాయి. తమ కుంభ స్థలాలతో కొండలను ఢీకొట్టేవి.

ఆ విధంగా స్వేచ్ఛా విహారం కావిస్తున్న ఆ యేనుగుల గుంపులో నుండి ఒక్క గజేంద్రుడు తన ఆడుయేనుగులు సేవిస్తుండగా దారితప్పాడు. ఏనుగులు గుంపును పట్టించుకోకుండా దైవలీలచేత మనస్సు స్వాధీనం కాకపోవడంతో తన ఆడుయేనుగులతో కలసి మరోదారిలో ముందుకు సాగిపోయాడు. అలాపోతూ తన ఆడుయేనుగులకు ప్రేమతో నీటి వడియల ప్రక్కన ఉన్న లేతపచ్చికను అందిస్తున్నాడు. విసనకఱ్ఱలవంటి తన చెవులను ఆడిస్తూ తన భార్యలకు కలిగిన చెమటను నివారిస్తున్నాడు. ఆవిధంగా గజేంద్రుడు లీలావిహారం చేస్తూ "ఒప్పులకుప్ప" వలె ఒప్పుతున్నాడు. ఇలా ఎన్నో అడవులలో విహరించి నీటి కోసం ప్రయాణంచేస్తూ ఒక సరస్సును చూచాడు. అందులో విచ్చుకొన్న తామరలు, కమలాలు రెండూ ఉన్నాయి. తుమ్మెద లెగురుతున్నాయి. చేపలు, తాబేళ్ళు, ముసళ్ళు తిరుగాడుతున్నాయి. హంసలు కొంగలు చక్రవాకాలు సంచరిస్తున్నాయి. అక్కడి చల్లని పిల్లగాలులు పద్మగంధాన్ని దాల్చి వీస్తూ ఆ యేనుగుల శరీరానికి హాయిని కల్గిస్తున్నాయి. అట్లాంటి మడుగులోకి ఏనుగులన్నీ ఒక్కసారిగా దిగాయి.

గజేంద్రుడు తన తొండంతో నీళ్ళు బాగా పీల్చాడు. పైకి ఆకాశంలోకి చిమ్మాడు. ఆడుఏనుగులు గజేంద్రుని శరీరాన్ని పద్మాలతో అలంకరించాయి. పుప్పొడిని పైన చల్లాయి. అలా గజరాజు క్రొత్తశోభను, క్రొత్త కాంతిని సంతరించుకున్నాడు. అలా గజరాజు క్రీడిస్తున్న సమయంలో భుగభుగమనే చప్పుళ్ళతో ఒక పెద్ద ముసలి పైకి లేచింది. ఒక్క ఉదుటున పైకి దూకింది. సూర్యుణ్ణి కబళించే రాహువులాగా గజేంద్రుణ్ణి ఆ మొసలి పట్టుకుంది.

మొసలి వడి తప్పించి గజేంద్రుడు తన తొండంతో మోదాడు. మొసలి పడినట్లే పడి మిగులవడితో గజేంద్రుని ముందఱి రెండు కాళ్ళను గట్టిగా పట్టుకుంది. ఆమకరిచిప్పలు లేచేట్లుగా తన దంతాలతో గజేంద్రుడు పొడిచాడు. తన తొండంతో మొసలి మెడను గుట్టిగా చుట్టాడు. అయితే నీళ్ళు మొసలికి స్థానం కాబట్టి దాని బలం తగ్గలేదు. అంతకంతకు ఎక్కువైంది. కృష్ణపక్షంలోని చంద్రునిలాగా గజేంద్రుని బలం క్రమక్రమంగా క్షీణించడం మొదలుపెట్టింది. బ్రహ్మపదావలంబన రతితో క్రీడించు యోగేంద్రునివలే నక్రం విక్రమించింది. మోహలతా నిబద్ధపదమును విడిపించుకొనలేక సందేహంలోపడ్డ దేహిలాగా గజేంద్రుడున్నాడు.

ఇలా పెక్కేండ్లు పోరాడి పోరాడి తనబలం శిథిలంకాగా, శత్రుబలాన్ని అంచనా వేసుకొని దీనిని గెల్వలేను అని నిశ్చయించుకొని గజేంద్రుడు పూర్వపుణ్యఫల దివ్యజ్ఞాన సంపత్తితో ఇలా అనుకొన్నాడు.

"ఏవిధంగా నేను గెలుస్తాను? ఏ దేవుణ్ణి ప్రార్థించాలి ? ఎవరిని పిలవాలి ? ఈ మొసలిని నివారించే వారే లేరా? వారికి మ్రొక్కుతాను. నా మొఱ ఆలకించేవారులేరా ? ఈశ్వరా ! ఉన్నచోట ఉండకుండా ఈ నీరాశతో నేనిక్కడికే ఎందుకు వచ్చాను. ఈ భయం తీరుతుందా !

ఈ జగత్తంతా ఎవనివల్ల జనించిందో, ఎవనిలో లీనమై ఉంటుందో, ఎవనియందు లయిస్తుందో, పరమేశ్వరుడైనవాడెవడో అన్నిటికి మూలమైనవాడెవడో, అనాది మధ్యలయు డెవ్వడో, సర్వమూ తానే అయిన వాడెవడో వానిని, ఆత్మభవుని, ఈశ్వరుని నేను శరణువేడెదను.

లోకాలు, లోకేశులు లోకస్థులు తెగిన తరువాత కూడా లోకరహితమైన కటిక చీకట్లకు అవతల ఏకాకృతితో ఎవడు ప్రకాశిస్తున్నాడో వానిని నేను సేవిస్తాను.

దీనులను కాపాడటానికి దేవుడున్నాడని అంటారు. యోగుల పాలిట కూడా దేవుడున్నాడంటారు. అన్ని దిక్కులలోనూ దేవుడున్నాడంటారు. ఉన్నాడు ఉన్నాడు అని అనుకునే దేవుడు అసలు ఉన్నాడో లేడో కదా !

ఉన్నవాడు, లేనివాడు అని చూడకుండా కనబడే దేవుడు నా సందేహం తీరేట్లుగా నాకు సాక్షాత్కరింపకుండా ఉంటాడా ! దుష్టుల బారినపడిన సాధువులను రక్షించే దేవుడు నన్ను రక్షించకుండా ఉంటాడా ! చర్మచక్షువులతోగాక మనోనేత్రంతో తనను చూచేవారిని దయతో చూచే దేవుడు నాపాటు చూడకుండా ఉంటాడా ! నా మొర వినకుండా ఉంటాడా ! నన్ను రక్షించడానికి వేగమే రాకుండా ఉంటాడా ! అని ప్రార్థిస్తూ తన మనస్సులో ఈశ్వర సన్నిధానం కల్పించుకొని గజేంద్రుడిలా అన్నాడు. “దేవా ! నా ఒంట్లో ఇంక శక్తిలేదు. ధైర్యం సడలిపోయింది. పంచప్రాణాలు కుదుళ్ళు తప్పాయి. మూర్ఛ వస్తున్నది. శరీరం ఒడలింది. శ్రమావహంగా ఉంది. నీవేతప్ప ఇతఃపరం బెఱుగను. రావే! ఈశ్వరా ! కావనే వరదా ! సంరక్షింపు భద్రాత్మకా ! శరణుజొచ్చిన నన్ను కాపాడరావా ! అని అంటూ ఆ గజేంద్రుడు మొరపెట్టుకున్న సమయంలో ఆ మొరను బ్రహ్మాదులు విని కూడా మిన్నకున్నారు. కానీ విశ్వమయుడైన విష్ణువు గజేంద్రునకు అడ్డుపడదలచాడు.

వైకుంఠపురంలో, నగరులో, ఆ ప్రధాన సౌధం సమీపంలో ఉన్న మందారవనంలోగల సరస్సు చెంగటి అరుగుపైని వెలుగు పాన్పుపై లక్ష్మీదేవితో వినోదంలో మునిగియున్న విష్ణువు విహ్వాలించే నాగేంద్రుడు “పాహి పాహి” అన్న మొరను విన్నాడు.

వినిన వెంటనే లక్ష్మీదేవికి చెప్పకుండానే, శంఖచక్రాలు ధరించకుండానే, గరుత్మంతుని సిద్ధం చేయకుండానే తొందరగా బయల్దేరి గజేంద్రుని రక్షించడానికి కావలసిన పరికరాలను మరల ధరించి గజేంద్రుణ్ణి రక్షించడానికి పయనమయ్యాడు.

అప్పుడు విష్ణువు వెంట లక్ష్మీదేవి, ఆమె వెంట అంతఃపురకాంతలు, ఆ వెనుక గరుత్మంతుడు వాని పొంత ధనుస్సు, గద, శంఖచక్రాలు, నారదుడు, విష్వక్సేనుడు, వైకుంఠములో నున్నవారు విష్ణువును అనుసరించి వచ్చారు. తన నాధుడు ఎక్కడుకు వెళ్తున్నాడో అడగాలని లక్ష్మీదేవి అనుకుంది. అడిగినా బదులివ్వడని తెలిసి ఊరుకున్నది.

విష్ణువు యొక్క రాకను దేవతలు ఆకాశమార్గంలోనే చూచారు. విష్ణువును ప్రశంసించారు. హస్తి దురవస్థావక్రియౌ చక్రికి మ్రొక్కారు. కానీ గజేంద్రుని రక్షించాలనే తొందరలో శ్రీమహావిష్ణువు వారి నమస్కారాలను గ్రహించలేదు. వేగవేగంగా వచ్చాడు. కరిమకరాలున్న సరస్సును చూచాడు.

దయాసముద్రుడైన శౌరి ఆ మొసలిని ఖండించటానికై తన సుదర్శన చక్రాన్ని ప్రయోగించాడు. అది భయంకరంగా మొసలి తలను త్రుంచివేసింది. అది చూచి రాశిచక్రంలోని మొసలి సూర్యుని చాటుకుపోయింది. మరొక మకరం (మకరనిధి) కుబేరుని ఆశ్రయించింది. సముద్రంలోని మొసళ్ళు ఆదికూర్మం మఱుగున నక్కాయి.

అప్పుడు చీకటిని విడిచిన చంద్రునిలాగా, సంసార దుఃఖాన్ని వీడిన విరాగి లాగా మొసలి పట్టువీడి గజేంద్రుడుతన సౌందర్యంతో ప్రకాశించాడు.

**4. పోతనామాత్యుని కవితా రీతులను వివరించునది**

పోతనామాత్యుడు సహజ సాండిత్య బిరుదాంచితుడు. "శ్రీపరమేశ్వర కరుణాకలిత కవితావిచిత్ర కేసనమంత్రి పుత్ర సహజపాండిత్య" అనే భాగవత గద్యంనుబట్టి పరమేశ్వరుని కరుణచే కవిత్వము, సహజంగానే పాండిత్యము పోతనకు అబ్బినవి అని అర్థమౌతున్నది. దేవతావరప్రసాద లబ్ధమైనది సహజము. అట్లని పోతన ఏ గురువు దగ్గర విద్యనభ్యసింపలేదని మాత్రము కాదు. ఇవటూరి సోమనారాధ్యుల వద్ద కావ్యపురాణేతిహాసాలలోని రహస్యాలను తెలిసికొన్నవాడే. ఆ తర్వాత స్వయంకృషితో ఉద్దండ పండితుడైనాడని భావించాలి.

ఏమైనను పోతన మహాకవి. ఆయన కవితలో పటుత్వమున్నది.

**అమ్మల గన్నయమ్మ, ముగురమ్మల మూలపుటమ్మ చాల పె**
**ద్దమ్మ, సురారులమ్మకడు పాఱడి పుచ్చినయమ్మ, తన్ను లో**
**నమ్మినవేల్పుట మ్మల మనమ్ముల నుండెడి యమ్మ, దుర్గ మా**
**యమ్మ కృపాబ్ధి యిచ్చుత మహత్వ కవిత్వ పటుత్వ సంపదల్**

ఈ పద్యాన్నిబట్టి పోతన భాగవతంలో మహత్వ కవిత్వపటుత్వ సంపదలున్నాయని తెల్లం.

పోతన కవితా రీతులను గూర్చి భాగవతంలో ఎక్కడా ప్రస్తావించలేదు. కాని ఒకచోట ఇలా అన్నాడు.

**కొందఱకుఁ దెనుఁగు గుణ మగుఁ**
**గొందఱకును సంస్కృతంబు గుణమగు, రెండుం**
**గొందఱికి గుణము లగు, నే**
**నందఱ మెప్పింతుఁగృతుల నయ్యైయెడలన్.**

ఈ పద్యమునుబట్టి పోతనగారు "ఉభయకావ్యకరణదక్షు"లనీ, సంస్కృతాంధ్రముల రెంటను కవ్వడియైనవాడనియు తెలియుచున్నది. ఈ అంశం గజేంద్ర మోక్షణం ఘట్టంలో సుస్పష్టం.

అంతేకాదు, పోతన కవిత్వంలో కథా కథన కవితాశిల్పం, రసపోషణం, అలంకార వైభవం, విషయచిత్రణం మొదలైన కవితావిశేషాలెన్నో ఉన్నాయి. విశేషించి భక్తితత్త్వం ఆమూలాగ్రం కన్పిస్తుంది.

పోతనగారు సంస్కృతంలో వ్యాసభగవానుడు రచించిన భాగవతాన్ని ఆంధ్రీకరించాడు. ఈ అనువాదంలో సంస్కృతభాగవత వ్యాఖ్యాలలో తలమానికమైన శ్రీధరుని వ్యాఖ్యానాధారంగా జేసుకొని కూడా అనువాదం సాగించారు. అందుచే తొలుత పోతనగారి ఆంధ్రీకర విధానాన్ని చూద్దాం.

**1. అనువాద విశేషాలు :**

వ్యాసభాగవతాన్ని యథాతథంగా మక్కికిమక్కిగాక చాలా వివరణాత్మకంగా పోతన అనువదించాడు. గజేంద్ర మోక్షణం ఘట్టాన్ని వ్యాసులవారు 92 శ్లోకాలలో చెప్పారు. పోతన 134 గద్యపద్యాలలో చెప్పారు.

పోతన అనువాద శిల్పానికి మచ్చుతునకగా ఒకపద్యాన్ని పరిశీలిస్తే చాలు.

**"యస్మిన్నిదం యతశ్చేదం యేనేదం య ఇదం స్వయమ్**
**యోస్మాత్పర స్మాచ్చ పరస్తం ప్రపద్యే స్వయంభువమ్"**

దీనికి పోతన గారి అనువాదం అమోఘం.

ఎవ్వనిచే జనించు జగ, మెవ్వనిలోపల నుండు లీనమై
యెవ్వనియందు డిందుఁ, బరమేశ్వరుఁడెవ్వఁడు, మూలకారణం
బెవ్వఁ, డనాది మధ్యలయుడెవ్వఁడు సర్వముఁ దానయైనవాఁ
డెవ్వఁడు, వాని నాత్మభవు నీశ్వరు నే శరణంబు వేఁడెదన్.

ఇది జగత్ప్రసిద్ధమైన పద్యము. ఈ పద్యమురాని కవిగాని, పండితుడుగాని, భక్తుడుగాని గాయకుడుగాని యుండడు. ఇది విశ్వజనీనమైన దైవ ప్రార్థన. పోతన ఈ పద్యానువాదమును ఔపనిషద పద్ధతిలోగాక అందరకు తాత్పర్యము బోధపడునట్లు పౌరాణిక పద్ధతిలో సాగించెను.

**2. కవితా శిల్పం :**

విష్ణుమూర్తి భక్తవాత్సల్యాన్ని ప్రకటించడానికి పోతన వేసుకున్న ప్రణాళిక భక్తిప్రేరకమేకాదు, కవితాభరితం కూడా.

గజేంద్రుని మొర విని విష్ణువు సంరంభియైనాడు. ఆ పద్యమిది.

అల వైకుంఠపురములో నగరులో నామూల సౌదంబుదా
పల మందారవనాంతరామృత సరః ప్రాంతేందుకాంతోపలో
త్పల పర్యంకరమా వినోదియదియగు నాపన్నప్రసన్నుండు వి
హ్వల నాగేంద్రము పాహిపాహి యనఁగుయ్యాలించి సంరంభియై

ఈ పద్యంలో "అల" అనే ఎత్తుగడ కూడా సార్థకమే. ఇక్కడ గజేంద్రుడున్నాడు. అక్కడెక్కడో ఉన్న వైకుంఠములో విష్ణువున్నాడు. ఆ దూరతారమ్యాన్ని సూచిస్తూ "అల" శబ్దం కూడా సార్థకమైంది. రమా వినోదిత్వంలో నున్నవాణ్ణి రమావల్లభుడు అనడం సముచితం. కాని పోతన "ఆపన్నీప్రసన్నుండు" అని అన్నాడు. అంటే ప్రభువనరక్షకుడైన విష్ణువునకు తన వినోదం కన్నా ఆర్తత్రాణ పరాయణత ముఖ్యం అని వ్యంగ్యంగా సూచించడం, ఈ పద్యంలో ఒక విశేషం ఉంది. వైకుంఠంలో విష్ణువు ఎక్కడ ఎట్లా ఉన్నాడో ఒక క్రమంలో చెప్పబడింది. మొదటి వైకుంఠపురం - అందులో నగరు - దానిలో ప్రధాన సౌధం - దానిదాపల మందారవనం - ఆ వనంలో సరస్సు - దాని ప్రక్కన కలువతిన్నె - దానిపై సిరితో కూడి వినోదిస్తున్న విష్ణువు.

ఇట్టి విష్ణువు "సంరంభి"యైనాడు. సంరంభంలో కలవాడు తొందరలో ఉన్నపళాన బయల్దేరాడు. భార్యకు చెప్పాలనిగాని, కావాల్సినవి వెంట తీసుకొనిపోవాలనిగాని తట్టదు. అందుకే "సిరికిం జెప్పడు ... గజప్రాణావనోత్సాహియై అనే పద్యం.

ఇలా చెప్పాచెందకుండా బయల్దేరాడు గనుకనే ఆందోళనతో "సిరి" కూడా వెంట బయల్దేరింది.

తనవెంటన్‌సిరి, లచ్చివెంట నవరోథవ్రాతమున్, దాని వె
న్కను బక్షీంద్రుడు, వాని పొంతను ధనుః కౌమోదకీశంఖ చ
క్ర నికాయంబును, నారదుండు, ధ్వజినీకాంతుండు రా వచ్చి రొ
య్యన వైకుంఠపురంబునం గలుగు వా రాబాలగోపాలమున్

ముందటి పద్యంలో మొదట వైకుంఠపురం, చివరకు కలువతిన్నెపై రమావినోది విష్ణువు ఉన్నట్లు వ్రాసాడు గదా! కాబట్టి విష్ణువు ప్రయాణం కలువతిన్నె నుండి ప్రారంభమై వైకుంఠం దాటివెళ్ళాలి. అలాగే వ్రాసాడు పోతన. కలువతిన్నె

నుండి బయల్దేరిన విష్ణువు వెంట లక్ష్మి ఒక్కతే వచ్చే అవకాశం ఉంది. అందుకే "తన వెంట సిరి" అని పద్యాన్ని ప్రారంభించడం గొప్ప కవితాశిల్పం. పద్యం చివరలో వైకుంఠం దాటినట్లు చెప్పాడు. అందుకే ఆ బాలగోపాలం వెంట రాగలిగారు. కలువతిన్నె నుండి ప్రధాన సౌధంలోకి, ఆ తరువాత అంతఃపురంలోకి, ఆ తరువాత వైకుంఠంలోనికి వెళ్తూ గజేంద్రుణ్ణి చేరుకుంటాడు. కాబట్టే మొదట సిరి, ఆ తరువాత ప్రధానసౌధంలోని అవరోధివ్రాతము ఆయా ప్రదేశంలోనివారు ఇత్యాదులు అద్భుతమైన కవితాశిల్పం.

**3. కథాకథన శిల్పం :**

కథా పరమార్థాన్ని కథామధ్యమున నిక్షేపించడమే పోతనగారి కథా కథన శిల్పం. ఏమిటో పరమార్థం అంటే అవిద్యాపాశానికి చిక్కుకొన్న జీవుడు సేయు ఆక్రోశం - దీనికి ప్రతీకయే గజేంద్రునిపాటు ఈ పరమార్థాన్ని పోతన గారు కథామధ్యమున నిక్షేపించాడు. అది ఈ క్రింది పద్యంలో దాగియున్నది.

**ఊహకలంగి జీవనపుటోలమునంబడి పోరుచున్ మహా**
**మోహలతానిబద్ధపదమున్ విడిపించుకొనంగలేక సం**
**దేహము పొందు దేహిక్రియన్ దీనదశన్ గజముండె భీషణ**
**గ్రాహ దురంతదంత పరిఘట్టిత పాదఖురాగ్రశల్యమై**

ఈ యుపమాలంకారము కేవలం మీ పద్యమునకే పరిమితంకాదు. ఈ సాదృశ్యము కథయందతర్వాహిని. ఇది ఒక ప్రతిభావంతమైన కథా రచనా శిల్పం.

మకరము గజేంద్రుని పట్టుకొన్నప్పుడు "భాను కబళించి పట్టు స్వర్భానుపగిది" అని ఉపమనే వాడాడు. మకరము అవిద్యకు ప్రతి అనుటకు "ఇట్లు విస్మిత నక్రచక్రంబయి నిర్వక్ర విక్రమంబున నల్పజ్ఞాన హృదయదీపంబు నతిక్రమించు మహామాయాంధకారంబునుంబోలె" అని మరల ఉపమనే వాడాడు.

రెండు ఉపమాలను మరలా ఈ క్రింది పద్యంలో వాడాడు.

**తమముం బాసినరోహిణీవిభుక్రియన్ దర్పించి సంసార దుః**
**ఖము వీడ్కొన్న విరక్తచిత్తుని గతిన్ ....**

గజేంద్రుడు ఒప్పాడు అని వ్రాసాడు. ఈవిధంగా జీవుని ఆర్తి స్వరూపమును, బంధ మోక్షణములను ధ్వనింపజేయుచు గజేంద్రమోక్షణ కథను రమణీయ శిల్పాభిరామముగా గావించినాడు.

**4. రసపోషణము :**

భరతముని ప్రకారము రసములు 8. తొమ్మిదవరసము భక్తియని కొందరనగా, శాంతము అని మరికొందరి అభిప్రాయము. ఏమైననూ ఈ రెండూ భాగవతంలో పుష్కలంగా ఉన్నాయి.

ఈ క్రింది పద్యంలో కరుణరసాన్ని అద్భుతంగా పోషించాడు పోతన.

**కలుగడే నాపాలికలిమి సందేహింపఁ**
**గలిమిలేములు లేక కలుగువాఁడు**
**నా కడ్డపడఁడె నలి న సాధువులచేఁ**
**బడిన సాధుల కడ్డపడెడివాఁడు**

చూడఁడే నాపాటుఁ జూపులఁజూడక
    చూచువారలఁ గృపఁజూచువాఁడు
లీలతో నామెఱాలింపడే మొఱగుల
    మొఱ లెఱుంగుచుఁదన్ను మొఱఁగువాఁడు

అఖిలరూపముల్ దనరూప మైనవాఁడు
నాదిమధ్యాంతములులేక యడరువాఁడు
భక్తజనముల దీనుల పాలివాఁడు
వినఁడె చూడఁడె తలఁపఁడె వేగరాఁడె !

ఇత భక్తిరస విషయానికొస్తే గజేంద్రుని మొర మొత్తము దాని కుదాహరణమే.

**5. రూపచిత్రణ :**

కార్యనిమగ్నమైన చిత్రాలను శబ్దాల ద్వారా చూపించడంలో పోతన దిట్ట. ఈ క్రింది పద్యం అందుకు ఉదాహరణ.

సిరికింజెప్పడు, శంఖచక్రయుగముంజేదోయి సంధింపఁడే
పరివారమ్మును జీర, ధభ్రగపతిన్ బన్నింపఁ డాకర్ణికాం
తరధమ్మిల్లముఁజక్క నొత్తఁడు, వివాదప్రోద్ధతశ్రీకుచో
పరిచేలాంచలమైన వీడడు, గజ ప్రాణావనోత్సాహియై

ఇదియు ఒకరకమైన కవితా శిల్పమే.

**6. అలంకారిక రచన :**

గజేంద్ర మోక్షణ ఘట్టంలో పోతన శబ్దార్థాలంకారాలు రెండూ ప్రయోగించాడు. మచ్చునకొకటి రెండు.
"డస్సెమత్తేభమల్లంబు బహుళపక్ష శీతభానుపగిది" ఇందు ఉపమాలంకారము ఉన్నది.
"మగలు దగులుగారె మగువలకును" అని అనడంలో అర్థాంతరన్యాసాలంకారం ద్యోతమానం.
ఇక శబ్దాలంకారాల విషయానికొస్తే పోతనకు అనుప్రాసలపై మక్కువ ఎక్కువ.

అడిగెద నని కడు వడిఁజను
నడిగినఁదను మగుడ నుడుగ డని నడయుడుగున్
వెడవెడ బిడిముడి తడఁబడ
నడుగిడు నడుగిడదు జడిమ నడుగిడు నెడలన్

ఈ పద్యమునందు వృత్త్యనుప్రాసాలంకారం ఉంది. ఇది ఒట్టి శబ్దాడంబరం కాదు. భావానుగుణంగా సాగి సార్థకమైంది. లక్ష్మీదేవి అడుగుల చప్పుడు వినబడుతున్నది. ఆమె ఊగిసలాట ద్యోతమానమౌతున్నది.

అటఁగాంచెం గరిణీవిభుండు నవపుల్లాంభోజకల్హారమున్
నటదిందీవరవారముం గమఠమీనగ్రాహదుర్వారమున్
వటహింతాలరసాలసాల సుమనోవల్లీకుటీ మీరమున్
జటులోద్ధూత మరాళచక్ర బక సంచారంబుఁగాసారమున్

ఇందు అంత్యానుప్రాసాలంకారం ఉంది. ఈ విధంగా పోతన కవితలో అనుప్రాసలు పుష్కలంగా దొరుకుతాయి.

**7. వృత్తౌచిత్యము :**

గజేంద్రుడు ఒక మదగజం అంటే మత్తేభం. అందుకే కాబోలు పోతనగారు గజేంద్రుడు కాసారం దిగినప్పుడు 'మత్తేభయూథంబు మడుగుసొచ్చె'' అని అన్నాడు. అట్లాగే గజేంద్రుని మొరవిన్న విష్ణువును "మత్తేభ రక్షణాయత్త చిత్తుడై" అని అన్నాడు. గజేంద్రుణ్ణి కాపాడేదాకా భగవంతుని హృదయంలో మత్తేభ వృత్తాంతమే మెదిలింది అని సూచించడానికి కాబోలు బమ్మెరపోతనాచార్యుడు ఎక్కువగా మత్తేభవృత్తాన్నే ఎన్నుకొన్నాడు. "అలవైకుంఠపురములో ...", "సిరికింజెప్పడు..." "తనవెంటన్ సిరి ...", "తనవేం చేయు ...", "విధివీథిన్ ...", "చనుదెంచెన్ ...", "కరుణాసింధుడు ..." "తమముంబాసిన..." ఇత్యాదులన్నీ మత్తేభాలే.

**8. ఉభయ భాషా ప్రౌఢి :**

పోతనగారే చెప్పుకొన్నట్లుగా సంస్కృతాంధ్రాల నిష్టపడే వారంటినీ మెప్పించాడు.

**తాటంకా చలనంబుతో, భుజనటద్ధమ్మిల్ల బంధంబుతో,**
**శాటీముక్తకుచంబుతో, నదృఢచంచత్కాంచితో, శీర్ణలా**
**లాటాలేపముతో, మనోహరకరాలగ్నోత్త రీయంబుతోఁ**
**గోటీందుప్రభతో, నురోజభరసంకోచ ద్విలగ్నంబుతోన్**

ఇందు అన్నీ సంస్కృత సమాసాలే. ఒక్క తెలుగుపదం కూడా లేదు. ఇది సంస్కృతప్రౌఢి.

**తలఁగపు కొండలకైనను**
**మలఁగపు సింగములకైన, మార్కొనుకడిమిం**
**గలఁగపు పిడుగులకైనను**
**నిల బలసంపన్నవృత్తి నేనుఁగుగున్నల్**

ఇందు బలసంపన్నవృత్తి అనే దాన్ని మినహాయిస్తే అంతా తెలుగే. ఇది ఆయన తెలుగుదనం.

**9. భక్తి తత్పరత :**

పోతన భక్తకవి. భక్తిభావం భాగవతంలో ఆమూలాగ్రం ఉంటుంది. ఏ భక్తుని పాత్రలోనూ ఆయన పరకాయ ప్రవేశం చేస్తాడు. పాత్రల ముఖతః వెలువడే భక్తియంతా పోతనదే.

"భుజ సేవాయామ్" అనే ధాతువు నుండి భక్తిశబ్దం నిష్పన్నమైంది. భగవద్గీత ననుసరించి భక్తులు నాల్గురకాలు. 1) ఆర్తుడు, 2) జిజ్ఞాసువు, 3) అర్థార్థి, 4) జ్ఞాని. గజేంద్రుడు ఆర్తుడు. పోతన జ్ఞాని. జ్ఞానికి మోక్షము తప్ప అన్యములేదు. అందుచేతనే పోతన గజేంద్ర మోక్షణంలో భక్తి జ్ఞాన వైరాగ్య ప్రపత్తులను మోక్షసోపానాలుగా నిర్మించాడు.

గజేంద్ర మోక్షణంలో గజేంద్రుడు గావించిన మొరలోని ప్రతిపద్యము పోతన భక్తికి ఉదాహరణలే.

**లోకంబులు లోకేశులు**
**లోకస్థులుఁదెగిన తుది నలోకం బగుపెం**
**జీకటి కవ్వల నెవ్వరి**
**డేకాకృతి వెలుఁగు నతనినే సేవింతున్**

అని పరమాత్మ యునికిని మనకు తెలియజేసి తాను దర్శించగలిగిన పుణ్యాత్ముడు పోతన. భగవత్కరుణకు పాత్రులుగా కావాలంటే శరణాగతి తప్ప వేరే మార్గం లేదు అని చాటాడు. "నీవే తప్ప నితః పరం బెఱుఁగు" అని గజేంద్రునిచే పలికించి శరణాగతి పొందేటట్లు చేస్తాడు.

పోతన మహాకవి మహత్వ కవిత్వపటుత్వ సంపద కావ్యదర్శనీయము.

**5. పోతనాచార్యుని భక్తితత్త్వాన్ని గజేంద్రమోక్షణం ఆధారంగా వెల్లడించుమది.**

పోతన మహాకవి భక్తాగ్రేసరుడు. ఆయన భక్తి భాగవతమంతా నిండారియున్నది. ప్రతి పాత్రలోను ఆమూర్తి కన్పిస్తూనే యుంటుంది. గజేంద్రుని ప్రార్థన ద్వారా పోతన తన భక్తినే ప్రకటించాడు.

భుజ సేవాయామ్ అనే ధాతువు నుండి భక్తి శబ్దం నిష్పన్నమైంది. భక్తిని గూర్చి అనేక నిర్వచనాలున్నాయి.

**"అంకోలం నిజబీజసంతతి రయస్కాంతోపలం సూచికా**
**సాధ్వీనైజవిభుం లతాక్షితిరుహం సింధు స్సరిద్వల్లభమ్**
**ప్రాప్నోతీహయథా తథాపశుపతేః పాదార విందద్వయమ్**
**చేతోవృత్తి రుపేత్య తిష్ఠతి సదా సా భక్తిరిత్యుచ్యతే"**

అని శివానందలహరిలో ఆచార్య శంకరులు ఇచ్చిన నిర్వచనం. వారే వివేక చూడామణిలో "స్వస్వరూపాను సంధానం భక్తి రిత్యభిదీయతే" అని అన్నారు.

ప్రాణుల నిజస్వరూప మైనయాత్మలో తాను ఐక్యము చెందుటే భక్తియని దాని భావం.

"మోక్షసాధన సామాగ్ర్యాం భక్తిరేవ గదీయసి" అనేది శాంకర సూక్తి మోక్షసాధనకు భక్తియే గొప్ప మార్గం.
భక్తులు నాల్గు రకాలుగా ఉంటారని భగవద్గీత.

**"చతుర్విధాభజంతే మాం జనా స్సుకృతినో ర్జున**
**ఆర్తో జిజ్ఞాసు రర్థార్థ జ్ఞానీచ భరతర్షభ"**

ఆర్తుడు, జిజ్ఞాసువు, అర్థార్థీ, జ్ఞాని అనే నాల్గురకాల భక్తులుంటారు.

**తేషాం జ్ఞానీ నిత్యయుక్తః ఏకభక్తి ర్విశిష్యతే**

ఆ నలుగురిలో జ్ఞాని విశిష్టుడు. కారణం అతడు నిత్యయుక్తుడు (నిత్యము ఆత్మయందు ఏకాగ్రచిత్తంతో ఉండేవాడు) ఏకభక్తుడు (ఒక్క పరమాత్మయందే భక్తిగలవాడు) కాబట్టి.

అట్టి జ్ఞాని పోతనామాత్యుడు. ఆర్తుడు గజేంద్రుడు. గజేంద్ర మోక్షణం ఘట్టంలో మోక్ష సోపానాలైన భక్తిజ్ఞాన వైరాగ్య శరణాగతులను ప్రతిపాదించాడు.

మనకు నవవిధ భక్తిమార్గాలున్నాయి.

**"శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాదసేవనమ్**
**అర్చనమ్, వందనం దాస్యం సఖ్య మాత్మ నివేదనమ్"**

ఈ శ్లోక మాధారముగా పోతన వ్రాసిన పద్యమిది.

**"తనుహృద్భాషల సఖ్యమున్ శ్రవణమున్ దాసత్వమున్ వందనా**
**ర్చనముల్ సేవయు నాత్మలోనెఱుకయున్ సంకీర్తనల్ చింతనం**
**బను నీతొమ్మిది భక్తిమార్గముల ....... "**

మూలంలోని "ఆత్మ నివేదనమ్" అను దానిని "ఆత్మలో నెఱుకయున్" అని మూలంలోని "స్మరణం" అనుదానిని "చింతనము" అను పోతన అన్నాడు. మిగిలినవన్నీ యథాతథం.

**"చేతులారంగ శివుని పూజింపడేని**
**నోరు నొవ్వంగ హరికీర్తి నుడవడేని"**

అని అన్న పోతన్నది హరిహరాభేదదృష్టి అనడంలో ఎలాంటి విప్రతిపత్తి లేదు.

**హరిహరాభేదం :**

గజేంద్ర మోక్షణ ఘట్టంలో పోతన హరిహరా భేదదృష్టి ఎక్కువగానే కన్పిస్తుంది. పరమాత్ముని‌కి పర్యాయంగా "ఈశ్వర" శబ్దాన్ని బహుపర్యాయాలు వాడాడు.

"ఏట్లోకదే యీశ్వరా" - (72వ పద్యం)

"ఈశ్వరునే శరణంబు వేడెదన్" - (73వ పద్యం)

"ఆ మహేశు, నాద్యు ... నే భజింతు" (మహేశ శబ్దము శంకరునికే రూఢం) - (83వ పద్యం)

"విభుఁదలంతు" - (బ్రహ్మ అని కూడా అర్థం) - (85వ పద్యం)

"ఈశ్వరునిం బరమపురుషునే భజియింతున్ (పరమపురుషుడు అనగా పురుషోత్తముడు - (88వ పద్యం)

పురుషోత్తముడు అనగా విష్ణువు - అని ధ్వని) (ఈశ్వరునికి విశేషణం - పరమపురుషుడు)

"రావే ఈశ్వర !" - (90వ పద్యం)

"అరక్షిత రక్షకుండైన ఈశ్వరుండు ... నన్నుం గాచు"ఁగాక - (93వ వచనం)

**విష్ణుపారమ్యం :**

పై యుదాహరణములో ఒక చమత్కారము కలదు. త్రిమూర్తులకు సంబంధించిన విశేషాలు భాసమాన మవుతున్నాయి. అంటే "ఈశ్వర" శబ్దం విస్తృతార్థం కలది. త్రిమూర్తుల్లో విష్ణువే ఎందుకు గజేంద్రుని కాపాడటానికి పూనుకున్నాడో పోతన అద్భుతంగా చెప్పాడు.

**"విశ్వమయతలేమి వినియు నూరకయుండి**
**రంబుజాసనాదు లడ్డుపడక**
**విశ్వమయుడు విభుడు విష్ణుండు జిష్ణుండు**
**భక్తియుతున కడ్డుపడఁదలంచె"**

భాగవతం ప్రధానంగా విష్ణుపారమ్యాన్ని బోధించేది. అందుకే అంబుజాజనాదులు కాక విష్ణువే ఈ పనికి పూనుకున్నాడని చెప్పడం.

విష్ణువునకు విశేషణంగా "విభుడు" అని పేర్కొనడం విశేషం. ఇందాక విభుడు అంటే ఈశ్వరుడనీ, బ్రహ్మ అని కూడా అనవచ్చని చెప్పుకున్నాం. కాని ఇక్కడ మాత్రం విభుడు అంటే ఖచ్చితంగా ఒక్క విష్ణువే అని చెప్పాలి.

పిండితార్థ మేమనగా "విభు" శబ్ద ప్రయోగం ద్వారా అభేదాన్ని సూచిస్తూనే విష్ణు పారమ్యాన్ని ప్రకటించాడు.

గజేంద్ర మోక్షణ ఘట్టంలో పోతన నవవిధ భక్తిమార్గాలలో కొన్నింటిని ప్రతిపాదించాడు.

కీర్తనం : భగవంతుని గుణలీలాదులను వర్ణించటం కీర్తనం.

**"ఓ కమలాప్త ! యో వరద ! యో ప్రతిపక్ష విపక్షదూర కు**
**య్యో ! కవియోగివంద్య ! సుగుణోత్తమ ! యో శరణాగతామరా**
**నోకహ ! యోమునీశ్వర మనోహర ! యో విమలప్రభావ ! రా**
**వే ! కరుణింపవే ! తలంపవే శరణార్థిని ననుఁగావవే !**

ఇందులో శరణార్థిని అనే పదం ఉన్నా పద్యమంతా భగవంతుని గుణగణ కీర్తనమే.

**నర్తకుని భంగిఁబెక్కగు**
**మూర్తులతో నెవ్వఁడాడు ? మునులు దివిజులుం**
**గీర్తింప నేర రెవ్వని**
**వర్తన మొరు లెఱుగ రట్టివాని నుతింతున్**

ఇందు భగవానుని లీలావిలాసమును కీర్తించడం జరిగింది.

**స్మరణం :**

భగవంతుని గూర్చి ధ్యానించటమే స్మరణం.

గజేంద్రుడిట్లని 'వితర్కించె' అని పోతన అన్నారు. వితర్కించు అనగా ఊహించు, భావించు అని అర్థం. ఇది మనోకర్మ అనగా ధ్యానించడమే. అందులకే తరువాత పద్యంలో "విభుఁదలంతు" అని వ్రాసారు.

**"పావకుం దర్చుం ... నన్నియుఁదానగు విభుఁదలంతు"**

**సేవనం :**

భగవంతుని పాదములను సేవించడమే సేవనం.

ఈక్రింది యుదాహరణములతో పాదసేవాక్రియ చెప్పబడకపోయినను సేవ చేస్తాననే అనడంలోనే అది పాదసేవగా ఊహించవచ్చు.

**"ఎవ్వం డేకాకృతి వెల్గు నతనినే సేవింతున్" - (75వ పద్యం)**
**"అట్టి పరము భజింతున్" (భజ సేవాయామ్ అని కదా) - (80వ పద్యం)**
**"ఈశు, సూక్ష్మ స్థూలు నే భజింతున్" - (83వ పద్యం)**
**"పరమపురుషునే భజియింతున్" - (88వ పద్యం)**

ఇదంతా గజేంద్రుని యొక్క ఆ మొరలోనే గజేంద్రుడు చెందిన భగవత్పాద సేవానుభూతి పోతనగారి భక్తి పారవశ్యం.

**వందనం :**

భక్తిశ్రద్ధలతో భగవంతునికి నమస్కరించడం వందన భక్తి. గజేంద్రుడు ఈవిధంగా మొరపెట్టుకున్నాడు.

**భవముదోషంబు ... వానికే నొనర్తు వందనములు - 78వ పద్యం**
**నిష్కారణునకు నమస్కరింతు - 79వ పద్యం**
**వానికాచరింతు వందనములు - 81వ పద్యం**

ఈ వందనాలను నిజంగా సమర్పించుకొంటున్నవాడు బమ్మెర పోతనయే.

**ఆత్మ నివేదనం :**

దీనినే బమ్మెరపోతన ఆత్మలో నెఱుకయున్ అని అన్నాడు. ప్రపత్తి, న్యాసం, ఆత్మనిక్షేపం అని కూడా దీనిని అనవచ్చును.

మనోవాక్కాయ కర్మలతో అంటే త్రికరణశుద్ధిగా భగవంతునకు శరణాగతి చేయడమే ఆత్మ నివేదన భక్తి.

**లా వొక్కింతయు లేదు, ధైర్యము విలోలం బయ్యెఁ, బ్రాణంబులున్**
**ఠావుల్ దప్పెను, మూర్ఛవచ్చెఁ, దనువున్ డస్సెన్, శ్రమం బయ్యెడిన్**
**నీవే తప్ప ! నితఃపరం బెఱుఁగ, మన్నింపందగున్ దీనునిన్**
**రావే యీశ్వర ! కావవే వరద ! సంరక్షింపు భద్రాత్మకా !**

ఇందులో శరణాగతి పుష్కలంగా ఉంది.

ఇదంతా గజేంద్రుని ముఖంగా వెలువడిన పోతన భక్తిపారవశ్యమే. నవవిధ భక్తి మార్గాలలో "చింతనం" అనే దాన్ని పోతన ఎక్కువగా ప్రస్తావిస్తాడు. భాగవతారంభ పద్యంలోనే ఇది కనపడుతుంది.

"శ్రీకైవల్యపదంబు చేరుటకునైచింతించెదన్" అని కైవల్యపదప్రాప్తి పోతన లక్ష్యం. భక్తి దానికి మార్గం. పోతన మహాభక్తుడు. భాగవతమంతా పోతనామాత్యుని భక్తిభావనా బంధురమే.

### 11.3 రాదగిన ప్రశ్నావిధానం :

**ఈ క్రింది వానిలో ఒకదానికి సమాధానం రాయండి.**

1) మొసలికి చిక్కిన గజేంద్రుడు తనను కాపాడవలసినదిగా భగవంతునికి మొరపెట్టుకున్న విధమును వ్రాయునది.
2) పోతనామాత్యుని కవితారీతులను వివరించునది.

**- డా॥ శ్రిష్టి చంద్రమౌళిశర్మ**
రిటైర్డ్ ప్రిన్సిపాల్
శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ డిగ్రీ కళాశాల
పొదిలి, ప్రకాశం జిల్లా.

పాఠం - 12

# నత్కీరుడు

**- ధూర్జటి**

**(శ్రీ కాళహస్తి మహాత్మ్యము - తృతీయాశ్వాసం - 148 నుండి 177వ పద్యం వరకు)**

## కవి - కథా పరిచయాలు

**విషయసూచిక :**

- **12.1** ఉద్దేశ్యం
- **12.2** కవి పరిచయం
- **12.3** కావ్య పరిచయం
- **12.4** కథా సందర్భం
- **12.5** కథా సంగ్రహం

### 12.1 ఉద్దేశ్యం :

నత్కీరుడు మహాపండితుడు. పాండిత్య గర్వంతో పరమేశ్వరుని ఎదిరించి శాపపీడితుడయ్యాడు. పరమశివుడు పరమ కరుణతో అతని శాపాంతమును చూచించడంతోపాటు అతనికి మోక్షాన్ని ప్రసాదించాడు. శ్రీకాళహస్తిలో వెలసియున్న పరమేశ్వరుని దయా స్వభావాన్ని వెల్లడి చేయడం ఈ పాఠం యొక్క ఉద్దేశ్యం.

### 12..2 కవి పరిచయం :

ఈ పాఠ్యభాగము శ్రీకాళహస్తి మహాత్మ్యము అను గ్రంథం నుండి స్వీకరింపబడినది. దీనిని రచించిన కవి ధూర్జటి. ధూర్జటి క్రీ.శ. 16వ శతాబ్దమున నివసించినవాడు. కాళహస్తి నివాసి. కాళహస్తీశ్వరుని భక్తుడు.

ధూర్జటి అర్వేలనియోగి బ్రాహ్మణుడు. ఆపస్తంభ సూత్రుడు. భరద్వాజగోత్రుడు. తల్లి సింగమ. తండ్రి జక్కయ తనయుడైన నారాయణుడు. ఇతని గురువు మహాదేశిక సార్వభౌముడు.

క్రీ.శ. 16వ శతాబ్దములో ఆంధ్రదేశమును పాలించిన శ్రీకృష్ణదేవరాయల భువనవిజయమునందున్న అష్టదిగ్గజ కవులలో ఒకడు. రాయలు వైష్ణవ మతాభిమాని అయిన్పటికీ శైవమతానికి చెందిన ధూర్జటిని తన ఆస్థానకవిగా చేసుకొనుటకు కారణము. ధూర్జటి కవిత్వములోని మాధుర్యమే అని చెప్పుకోవచ్చును.

శ్రీకృష్ణరాయ విజయమనే కావ్యంలో కుమారధూర్జటి తన తాత ధూర్జటి కృష్ణదేవరాయల భువనవిజయంలో కవిగా ఉన్నాడని ఈ పద్యంలో చెప్పాడు.

> **"స్తుతమతియైన యాంధ్రకవి ధూర్జటి పలుకులకేలకల్గెనో**
> **యతులిత మాధురీమహిమ నాముసుపెదతాత చాల స**
> **న్నుతి గనె గృష్ణరాయల మనోజ్ఞసభన్వినుమీవునట్ల మ**
> **త్కృత బహుమానవైఖరుల గీర్తి వహింపుము ధాత్రిలోపలన్"**

కృష్ణరాయల ఆస్థానంలో ఉన్న ధూర్జటి గొప్ప శివభక్తుడు. శైవ సాహిత్యంలో సంపూర్ణమైన పాండిత్యం కలిగినవాడు. జీవితాన్ని సంపూర్ణంగా అనుభవించి, ఐహిక సౌఖ్యాలను రోసి, వైరాగ్యాన్ని పొందిన కవి.

ధూర్జటి శ్రీకాళహస్తి మహాత్మ్యము, శ్రీ కాళహస్తీశ్వర శతకము అనే రెండు గ్రంథాలను రచించాడు. ఆయన ఈ రెండు గ్రంథాలను శివునకే అంకితం చేసాడు తప్ప నరులకు అంకితం చేయలేదు. భావనాశక్తి, పాత్రపోషణా నైపుణ్యము, కథా నిర్వహణ, భక్తి తత్పరత ధూర్జటి కవిత్వంలో కనిపిస్తాయి. అచ్చతెనుగు పదాల కూర్పు కొన్నిచోట్ల ముచ్చట కొలుపుతుంది.

## 12.3 కావ్య పరిచయం :

ధూర్జటి రచించిన శ్రీకాళహస్తి మహాత్మ్యము అనే గ్రంథం నుండి ఈ పాఠ్యభాగం స్వీకరింపబడింది. శ్రీ కాళహస్తి మహాత్మ్యము శ్రీకాళహస్తి క్షేత్ర మహాత్మ్యాన్ని తెలియజేసే శైవమత సంబంధమైన గ్రంథము. శ్రీకాళహస్తి మహాత్మ్యము నాలుగా శ్వాసములు కలిగిన గ్రంథము.

శ్రీ అనగా సాలెపురుగు. కాళమనగా పాము. హస్తి అనగా ఏనుగు. ఈ మూడింటి భక్తితాత్పర్యములకు నిదర్శనంగా ఏర్పడిన శ్రీకాళహస్తి మహాత్మ్యాన్ని తెలియజేస్తూ ధూర్జటి ఈ కథతోపాటు వశిష్ఠుని వృత్తాంతం, బ్రహ్మవృత్తాంతం, తిన్నని కథ, నత్కీరుని కథ, వేశ్యాపుత్రికల చరిత్రలు తెలియజేశాడు. శివభక్తిని నిరూపించే ఈ కథలలో శ్రీకాళహస్తుల వృత్తాంతం, తిన్ననికథ, నత్కీరుని కథ బహుళ ప్రాచుర్యాన్ని పొందిన కథలు. ఈ కథా రచన వలననే ధూర్జటి మహాకవిగా కీర్తిగన్నాడు.

## 12.4 కథా సందర్భం :

ఈ నత్కీరుని కథ శ్రీకాళహస్తి మహాత్మ్యములోని తృతీయా శ్వాసంలో ఉంది. ఈ కథకు ముందు తిన్నని కథ ఉంటుంది.

మధురాపురాన్ని పాలించే పాండ్యరాజుల వద్ద ఒక శంఖఫలకం ఉంది. సరస్వతీదేవితో సమానమైన పండితులెందరుంటే వారందరికీ ఆ శంఖఫలకం మీద చోటు లభిస్తుంది. అలాంటి పండితుడు ఒకడే ఉంటే ఒక్కనికి మాత్రమే చోటు ఉంటుంది. ఆ పాండ్యరాజుసభలో ఆ శంఖఫలకం మీద పన్నెండు మంది సభ్యులు ఉండేవారు. అందులో ఒకడు నత్కీరుడు. రాజు ఆ కవులందరికీ విశేషంగా సంపదలు ఇచ్చేవాడు.

ఏ పండితుడైనా, కవి అయినా ఆ రాజసభకు వచ్చి సభమెచ్చే విధంగా కవిత్వం చెప్పినట్లయితే, అలాంటి కవిపండితులకు రాజు వేయిమాడలు బహుమతిగా ఇచ్చేవాడు. ఈ కారణంచేత అతని కీర్తి నలుదిక్కులకు వ్యాపించింది. ఆ రాజు యాచకుల కోర్కెలను తీర్చేవాడు. అప్తులతో ప్రేమగా ఉండేవాడు. బంధువులను ఆదరించేవాడు. అన్ని జాతులను ఆదరించేవాడు. శత్రువులను జయించేవాడు. మంచివారిని అభిమానించి సంతోషం పంచేవాడు.

అటువంటి రాజు పాలించే రాజ్యంలో కరవు వచ్చింది. ఆ కరవు వర్ణనతో పాఠ్యభాగం ప్రారంభమవుతుంది.

## 12.5 కథా సంగ్రహం :

పాండ్యరాజు ఉత్తముడు. అతడు పాలించే కాలంలో గ్రహాలు వక్రంగా చూడడంతో వానలు కురవలేదు. వానలు లేకపోవడంతో కరవు వచ్చింది. ప్రజలు బాధపడసాగారు. శని మీనరాశిలో ప్రవేశించింది. తూర్పుదిక్కున తోకచుక్క గోచరించింది. వర్షాలు కురిపించలేని మేఘాలు తిరగసాగాయి. ప్రభాత సమయంలో మంచు ఎలా కురుస్తుందో, అదేవిధంగా మధ్యాహ్న సమయాల్లో ప్రతిరోజూ మంచు కురువసాగింది. రాత్రులలో ఆకాశం నిర్మలంగా ఉంది. గాలి స్తంభించింది. వానలు కురిపించగల మేఘాలు కనిపించడంలేదు. విదియనాడు కనిపించే చంద్రవంక రెండు కొసలలో ఒకటి తరిగిపోయింది. కన్యారాశి వచ్చినా చినుకులు రాలలేదు. మఖ కార్తె ప్రవేశించినా ఉరుములు ఉరమడంలేదు. ఈ అపశకునాలతో వర్షాలు కురవక జనమంతా బాధపడసాగారు.

పంటలు పండకపోవడంతో ప్రజలకు ఆహారం దొరకడంలేదు. గునుకులు, ఊదర్లు, బరపటలు, గోళ్ళ గొండులు, అల్లిబియ్యం, వెదురుబియ్యం, గొట్టెచెట్లు, వింజెట్లు, తుంగముస్తియలు, ఈతగుంజు మొదలైన తినడానికి యోగ్యం కానివి గూడా ప్రజలు తినడం మొదలుపెట్టారు. అరవడు, గరటి, తవిద మొదలైన పంటలు అరవైరోజుల్లో పండుతాయనే ఆశతో ఆయా పైర్లను వేసి వ్యవసాయం చేశారు కానీ ఆ పైర్లన్నీ మల్లె తెగులు సోకి నాశనమయ్యాయి.

శని మీన రాశిలో ప్రవేశించడం అనే దోషంచేత పంటలు పండలేదు. కరువు ప్రభావంతో కొంతమంది తోలు, ఎముకలు మిగిలి, తోస్తే తొంబదిచోట్ల తూలిపడుతున్నారు. కొంతమంది ఆకలికి తాళలేక భార్యాబిడ్డలను విడిచి వలసపోతున్నారు. రాజు, సేవకుడు అనే భేదం లేకుండా ఆకలికి ప్రజలందరూ క్షీణించసాగారు. ఒక్కోరోజు ఎవరికైనా ఆహారం దొరికినా, తిన్న తరువాత త్రాగడానికి నీరు దొరకక వారు కూడా ప్రాణాలు విడవసాగారు. కరవు క్రమక్రమంగా తీవ్రమయింది. తినకూడని చెట్లకాయలు కూడా తినసాగారు. కొందరు బ్రతుకుమీది ఆశతో ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళారు.

ఆ నగరంలో ఒక శివాలయం ఉండేది. మనుషులే మనుషులను తినే కరవు తాండవించడంతో, ఆ ఆలయంలోని పూజారి ఎక్కడికయినా వలస వెళ్ళాలనుకున్నాడు. అతనికి శివుడు ప్రత్యక్షమయ్యాడు. రాజు మీద తమిళంలో శృంగారభరితమైన ఒక పద్యాన్ని రచించి ఇచ్చి "ఈ పద్యాన్ని రాజాస్థానంలో చదువు. రాజు నిన్ను మెచ్చుకుంటాడు. వేయిమాడల ధనం ఇస్తాడు. ఆ ధనాన్ని నీ ఖర్చులకు వాడుకో ! హాయిగా విచారం లేకుండా బ్రతుకు. త్వరలో వర్షం కురుస్తుంది. కరవు పోతుంది. పంటలు పండుతాయి. అందరూ ఆనందంగా ఉంటారు" అని చెప్పి పంపించాడు.

పూజారి రాజాస్థానానికి వెళ్ళాడు. శివుడు రచించి తనకిచ్చిన పద్యాన్ని సభలో చదివి వినిపించాడు. ఆ పద్యంలో "ఏనుగు నడక వంటి నడకలగల యువతి జుట్టు సహజ పరిమళంతో ఉంటుంది" అనే భావం ఉంది. ఆ పద్యాన్ని సభలోని పండితులు విన్నారు. నత్కీరుడు నవ్వుతూ "జుట్టు సహజంగా సువాసనతో కూడి ఉంటుందంటే లోకులు నవ్వుతారు. ఇది తప్పు ఈ విధంగా చెప్పకూడదు. ఇలా చెప్పడం కవితా విధానంకాదు" అన్నాడు. అప్పుడా పూజారి సిగ్గుపడుతూ "ఈ పద్యాన్ని పరమేశ్వరుడు వ్రాసి ఇచ్చాడు. ఇందులోని తప్పొప్పులు నాకు తెలియవు" అని చెప్పి తిరిగి శివుని వద్దకు వచ్చాడు.

పూజారి శివునికి అతడిచ్చిన పద్యాన్ని తిరిగి యిచ్చి "నిన్ను నమ్మి సభకు వెళ్ళాను. నిండుసభలో అవమానాన్ని పొందాను. నీవు సర్వజ్ఞుడవని నమ్మాను. నమ్మి సభకు వెళ్ళి నా పౌరుషాన్ని, గర్వాన్ని పోగొట్టుకున్నాను. అవమానింపబడ్డాను. ఎవరైనా తనకు తెలిసిన విద్యను రాజస్థానంలో ప్రదర్శించి కీర్తిని పొందవచ్చుగాని, ఇతరుల విద్యపై ఆధారపడితే అవమానం తప్ప కీర్తి లభించదు. అనేకమాటలు వద్దు. నేను పొందిన అవమానం కరవు వలన కలిగే బాధ కంటే అధికమయింది. నేను దురదృష్టవంతుడను. నిన్నుగాని, నత్కీరునిగాని అనవలసిన పనిలేదు. నేను ఎక్కడికయినా వెళతాను. యాచన చేస్తూ బ్రతుకుతాను. ఈ కరవు ముగిసిన తర్వాత వస్తాను, నీవు క్షేమంగా వుండు. నన్ను పంపు" అని అన్నాడు.

శివుడు పూజారితో "నత్కీరుడు నా కవితలో తప్పు పట్టాడా? సభకు వెళదాం ! పద. తప్పు ఏమిటో తెలుసుకుందాం" అని అతనిని తీసుకుని సభకు వెళ్ళాడు. "నేను ఈ రాజు మీద మధురమైన పద్యాన్ని చెప్పి పంపాను. అది విన్న నత్కీరుడు ఈర్ష్యతో ఆ పద్యంలో తప్పు ఉందని అన్నాడు. ఆ తప్పు వ్యాకరణంలోదా ? అలంకారంలోదా ? పదాల కూర్పులోదా ? రసంలోదా? ఎక్కడ తప్పుందో చెప్పవలసింది" అని శివుడు సభను ప్రశ్నించాడు. నత్కీరుడు పూజారితో చెప్పినట్లుగానే ఇప్పుడు కూడా అదే తప్పును చెప్పాడు. అప్పుడు శివుడు "పార్వతీదేవి జుట్టు సహజంగా పరిమళం కలిగి ఉంటుంది" అన్నాడు. "పార్వతి జుట్టు పరిమిళం కలిగి ఉండవచ్చు. అది భూలోకంలోని స్త్రీలకు చెల్లదు" అని నత్కీరుడు వాదించాడు. మోసపుమాటలు చాలించు అని ఎదిరించాడు.

దీనితో శివునికి కోపం వచ్చింది. వెంటనే నుదుటున ఉండే మూడవకన్ను చూపించాడు. "నుదుటనే కాదు, తల చుట్టూ కనులున్నా పద్యం తప్పే, ఈ మాయలు ఇక్కడ వద్దు వెళ్ళిపో!" అన్నాడు నత్కీరుడు. శివుడు ఆగ్రహంతో "కుష్ఠువ్యాధితో బాధపడు" అని నత్కీరుని శపించాడు. దానితో నత్కీరుడు భయపడిపోయాడు. స్వామీ ! ద్రోహం చేశాను. శాపం తొలగిపోయే మార్గాన్ని తెలియజేయు'' అని ప్రార్థిస్తూ శివుని పాదాలపై పడి వేడుకున్నాడు. భక్తసులభుడైన శివుడు శాంతించి "నువ్వు కైలాసపర్వతాన్ని ఎప్పుడు చూస్తావో అప్పుడు నీ శాపం తొలగిపోతుంది'' అని చెప్పాడు.

నత్కీరుడు పశ్చాత్తాపంతో "నేను కవిత్వ విషయంలో గర్వాన్ని ప్రదర్శించాను. శంఖపీఠిపై మిగిలిన కవులు ఉన్నట్లు మౌనంగా ఉండక దేవునితో చార్వాకం చేశాను. ఇప్పుడు శాపాన్ని పొందాను. కుష్ఠువ్యాధి వలన కలిగే దుఃఖాన్ని ఎలా భరించాలి? నేను కైలాసపర్వతాన్ని ఎప్పుడు చూడాలి ? కైలాసపర్వతం చూడాలంటే నదులు, అడవులు, కొండలు, బోయపల్లెలు, క్రూరజంతువులు ఉండేచోట్లు, జనసంచారంలేని దార్లు ఎన్నో దాటి వెళ్ళాలి. ఆ పర్వతం గురించి విన్నాను తప్ప ఎన్నడూ చూడలేదు. ఇప్పుడు ఏం చేయాలి ? ఓ పరమేశ్వరా ! నేను వెళ్ళవలసిన ప్రాంతాలు సింహాలతో, పులులతో, ఏనుగులతో, ఖడ్గమృగాలతో, శరభాలతో కూడి ఉంటాయి. రాక్షస సమూహాలు తిరుగుతుంటాయి. "మంచు, నీరు ధారాళంగా కురుస్తూ ఉంటాయి. భయంకరమైన రాళ్ళతో నిండి ఉంటాయి. అటువంటి ప్రదేశాలను దాటి నేను వెళ్ళగలనా ? ఎలా వెళ్ళగలను ?'' అని మనస్సులో అనుకుంటూ బాధపడ్డాడు.

"ఏది ఏమయినా కుష్ఠురోగం వస్తే శరీరం తిమ్మిరెక్కుతుంది. శరీరమంతా మచ్చలు వస్తాయి. చర్మం మందంగా మారుతుంది. అందం చెడిపోతుంది. శరీరం మీదు బుడుపులు వస్తాయి. అలసత్వం వస్తుంది. శరీరం అసహ్యంగా తయారవుతుంది. శరీరం నుంచి చీము, నెత్తురు కారుతాయి. ఈగలు ముసురుతాయి. ప్రజలు అసహ్యించుకుంటారు. అందుచేత ఇవేమీ జరుగకముందే కైలాసపర్వతాన్ని చూడడానికి బయలుదేరాలి. శివుని శాపాన్ని తప్పించుకోలేరు గదా !" అని తలచి నత్కీరుడు బయలుదేరాడు.

**- డా॥ నాగభైరవ ఆదినారాయణ**
రీడర్ & ప్రిన్సిపాల్ (రిటైర్డ్)
బి.ఎస్.ఎస్.బి. డిగ్రీ కళాశాల
తాడికొండ, గుంటూరు జిల్లా

పాఠం - 13

# నత్కీరుడు

**- ధూర్జటి**

## (శ్రీ కాళహస్తి మహాత్మ్యము - తృతీయాశ్వాసం - 148 నుండి 177వ పద్యం వరకు)
## అర్థతాత్పర్యాలు

**విషయసూచిక :**

13.1 ఉద్దేశ్యం
13.2 అర్థతాత్పర్యాలు

### 13.1 ఉద్దేశ్యం :

నత్కీరుడు అనే పాఠ్యభాగంలోని కఠిన పదాలకు అర్థాలను తెలియజేయడం, పద్యాలను తాత్పర్యాలను తెలియజేయడం ఈ పాఠం యొక్క ఉద్దేశ్యం.

### 13.2 అర్థతాత్పర్యాలు :

**148వ పద్యం :**

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| భువిభుడు | = | రాజు |
| క్షామము | = | కరవు |
| క్షోభ | = | కలత |

**తాత్పర్యం :**

పాండ్యరాజు పాలించే కాలంలో గ్రహాలు వక్రంగా చూడడంతో వర్షాలు కురవలేదు. దానితో గొప్ప కరవు వచ్చింది. ప్రజలు కలత పొందారు.

**149వ పద్యం :**

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| ధూమకేతువు | = | తోకచుక్క |
| జీమూతడంబరము | = | సాధారణ మేఘాల విజృంభణ |
| పేపాడి | = | ప్రాతఃకాలం |
| తుషారము | = | మంచు |
| మిన్ను | = | ఆకాశం |
| వెలియెండ | = | తెల్లని ఎండ |
| కర్వలి | = | గాలి |
| వర్షగర్భములు | = | వర్షాన్ని ఇచ్చే మేఘాలు |
| కుముదాప్తుడు | = | చంద్రుడు |
| కొమ్ము | = | బాలచంద్రుని రెండు కొనలలో ఒకటి |

| | | |
|---|---|---|
| బిందించు | = | వర్షబిందువులు జాలువారు |
| జముడు | = | యముడు |
| యముదిశ | = | దక్షిణం |

**తాత్పర్యం:**

శని మీనరాశిలో ప్రవేశించింది. తూర్పుదిక్కున తోకచుక్క కనిపించింది. సాధారణ మేఘాలు విజృంభించాయి. కానీ వానలు కురువలేదు. ఆ ప్రభాతసమయంలో మంచు కురిసినట్లు మధ్యాహ్నవేళ ప్రతిరోజూ మంచు కురవసాగింది. రాత్రులలో ఆకాశం నిర్మలంగా ఉంది. తెల్లని ఎండకాయసాగింది. గాలి వీయడంలేదు, వానలు కురిపించగల మేఘాలు రావడంలేదు. విదియ తిథి నాడు చంద్రవంక రెండు కొనలలో ఒకటి తరిగిపోయింది. కన్యారాశి వచ్చినా వర్షబిందువులు రాలలేదు. మఖకార్తె వచ్చినా ఉరుములు రావడంలేదు. దక్షిణదిక్కులో పెద్దశబ్దాలు వినిపించాయి. జనులందరూ బాధపడ్డారు.

**విశేషాలు :**

శని మీనరాశిలో ప్రవేశించడం, తోకచుక్క కనిపించడం, మంచు పడడం మొదలయినవన్నీ కరవు రావడానికి ముందు కనిపించే గుర్తులు. ఇవి కనిపిస్తే వానలు కురవవని అర్థం.

**150వ పద్యం :**

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| మఱియును | = | ఇంకా |

**151వ పద్యం :**

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| దొరకొను | = | మొదలుపెట్టు |

**తాత్పర్యం:**

గునుకులు, ఊదర్లు, బరపటలు, గోళ్ళ గొండులు, అల్లిబియ్యం, వెదురుబియ్యం, గొట్టెచెట్లు, నింజెట్లు, తుంగ ముస్తియలు, ఈతగుంజు మొదలైనవి ఎప్పుడూ తినే పదార్థాలు కాదు. కాని కరవు కారణంగా ఆహారం దొరకకపోవడంతో ప్రజలు వీనిని కూడా తినడం మొదలుపెట్టారు.

**152వ పద్యం :**

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| అఱువడు | = | ఒక రకమైన ధాన్యం |
| గంటె | = | సజ్జలు |
| పఱిపఱి | = | నాశనమయి |

**తాత్పర్యం:**

అఱువడు, గంటె, తవిద మొదలయినవి అరవై రోజుల్లో పండుతాయనే ఆశతో, ఆయా పైర్లను వేసి ఏతాములలో నీళ్ళు పెట్టారు. బ్రతుకుమీద ఆశతో ఈవిధంగా వ్యవసాయం చేసినా, ఆ పైర్లన్నీ మల్లె అనే తెగులు సోకి నాశనమయ్యాయి.

**153వ పద్యం :**

దీని తాత్పర్యాలను సమగ్రవ్యాఖ్యలలో చూడండి.

**154వ పద్యం :**

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| నవయు | = | చిక్కిపోవు |
| దివసము | = | రోజు |
| దగ | = | దప్పిక |
| అశనము | = | ఆహారం |
| జీవ + అనిలముల్ | = | ప్రాణవాయువులు |

**తాత్పర్యం:**

చిక్కిపోతూ, ఒక్కొక్కరోజు ఆహారం దొరకగా తిని, త్రాగడానికి నీరులేక దప్పికతో నేల మీద పడి లేవలేక ప్రజలు ప్రాణవాయువులు విడుస్తున్నారు.

**155వ పద్యం :**

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| ఒత్తు | = | అధికము అగు |
| గరవు | = | ఎప్పుడూ తినని చెట్లకాయలు |

**తాత్పర్యం:**

కరవు క్రమంగా తీవ్రమయింది. తినగూడని చెట్లకాయలు తినలేక మనుషులు అల్లాడారు. కొందరు బతకడానికి ఇతర దేశాలకు వలసపోయారు.

**156వ పద్యం :**

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| తరియించలేక | = | దాటలేక |
| హరిద్విజుడు | = | శివాలయ పూజారి అయిన బ్రాహ్మణుడు |
| మహా + ఈశుడు | = | శివుడు |

**తాత్పర్యం:**

మనుషులే మనుషులను పీక్కుతినే కరువు రావడంతో, దాన్ని భరించలేని ఒక శివాలయ పూజారి ఎక్కడికయినా వలసపోవాలి అనుకున్నాడు. అప్పుడతనికి శివుడు కరుణతో ప్రత్యక్షమయ్యాడు.

**157వ పద్యం :**

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| ప్రసన్నుడు | = | దయగలవాడు |
| అనవద్యము | = | ప్రశస్తమైనది |
| ముడుపు | = | ధనం |
| వెచ్చము | = | ఖర్చు |

| | | |
|---|---|---|
| ఒదవు | = | ఉపయుక్తమగు |
| నెఱ+వగ | = | మిక్కిలివి చారం |
| నొవ్వు | = | బాధపడు |
| కృతహర్షము | = | సంతోషం కలిగించునది |
| అనుపు | = | పంపు |
| ప్రణీతము | = | రచింపబడినది |
| సింధురరాజగమన | = | శ్రేష్ఠమైన ఏనుగు నడక వంటి నడకగలది |
| ధమ్మిల్లబంధము | = | జట్టుముడి |
| సహజగంధము | = | సహజముగానే పరిమళము కలది |

**తాత్పర్యం:**

శివుడు పూజారికి ప్రత్యక్షమయ్యాడు. ఆ నగరాన్ని పాలించే రాజుమీద తమిళంలో ఒక పద్యాన్ని శృంగారరస బంధురంగా రచించి యిచ్చాడు. "దీనిని రాజాస్థానంలో చదువు. రాజు మెచ్చుకొని నీకు వేయి మాడల ధనం ఇస్తాడు. దాన్ని నీ ఖర్చులకు వాడుకో ! విచారం లేకుండా బ్రతకవచ్చు. త్వరలోనే కరువుపోతుంది. అందరికీ సంతోషం కలిగేటట్లు వర్షం కురుస్తుంది. పంటలు పండుతాయి. ప్రజలకు పండుగ అవుతుంది'' అని చెప్పి శివుడు పంపించగా, ఆ పూజారి రాజాస్థానానికి వెళ్లాడు. పరమశివుడు రచించిన చమత్కారంతో కూడిన పద్యాన్ని చదివాడు. ఆ పద్యంతో "ఏనుగు నడక వంటి నడకగల యువతి జుట్టు ముడి సహజంగా పరిమళంతో కూడి ఉంటుంది'' అనే భావం వుంది. దానిని సభలోని పండితులు గమనించారు.

**158వ పద్యం :**

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| నృపుడు | = | రాజు |
| నగ్గరే | = | నవ్వరే |
| వేనవి | = | జుట్టు |

**తాత్పర్యం:**

పూజారి చెప్పిన పద్యంలోని భావాన్ని గమనించిన నత్కీరుడనే సభలోని పండితుడు నవ్వుతూ "జుట్టు సహజంగానే సువాసనతో గూడి ఉంటుంది అంటే లోకులు నవ్వరా?'' అన్నాడు.

**159వ పద్యం :**

దీని అర్థతాత్పర్యాలను సమగ్రవ్యాఖ్యలో చూడండి.

**160వ పద్యం :**

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| పార్వతీశుడు | = | శివుడు |
| సిగ్గుచెడు | = | అవమానం పొందు |

**తాత్పర్యం:**

పూజారి తిరిగి శివుని వద్దకు తిరిగివచ్చి అతడు వ్రాసి ఇచ్చిన పద్నాన్ని శివునికి తిరిగి ఇచ్చాడు. "నిన్ను నమ్మి సభకు వెళ్ళాను. నిండు సభలో అవమానాన్ని పొందాను. జరిగిన విషయాన్ని ఏమని చెప్పేది?'' అని శివునితో అన్నాడు.

**161వ పద్యం :**

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| సర్వాజ్ఞత్వము | = | అన్ని తెలిసి ఉన్న గుణము |
| బహుముఖ | = | అనేకవిధాలుగా |
| నిర్వాహకశక్తి | = | పనిచేయగల నేర్పు |
| శర్వుడు | = | శివుడు |
| పోనాడుకొంటిన్ | = | పోగొట్టుకొంటిని. |

**తాత్పర్యం:**

శివా ! నీవు సర్వజ్ఞుడవని, ఏ పనినైనా సమర్థవంతంగా చేయగల నేర్పుగల వాడివని నిన్ను నమ్మాను. నమ్మి సభకు వెళ్ళి నా పౌరుషాన్ని, గర్వాన్ని సభలో పోగొట్టుకొని అవమానింపబడ్డాను'' అన్నాడు పూజారి.

**162వ పద్యం :**

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| నృప + ఆస్థానము | = | రాజాస్థానం |
| భూపాలుడు | = | రాజు |

**తాత్పర్యం:**

"ఎవరైనా తనకు తెలిసిన విద్యను రాజాస్థానంలో ప్రదర్శిస్తే కీర్తి వస్తుంది గాని, ఇతరుల విద్యలపై ఆధారపడి రాజా స్థానాలకు వెళితే అవమానం తప్ప కీర్తి లభించదు'' అన్నాడు పూజారి.

**163వ పద్యం :**

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| క్షామవ్యధ కొలదికాదు | = | కరువు బాధతో సమానం కాదు |
| భక్తనిధీ | = | భక్తులకు నిధివంటివాడు |

**తాత్పర్యం:**

నిన్ను నమ్మి నేను మోసపోయిన విషయాన్ని గురించి చెప్పడం ఎందుకు? నత్కీరుని చేత నేను అవమానం పొందాను. ఆ దుఃఖం కరువువలన కలిగే బాధతో సమానమయింది కాదు. అంతకంటే అధికమయింది'' అన్నాడు పూజారి.

**164వ పద్యం : అని మళ్ళీ ఇలా అన్నాడు.**

**165వ పద్యం : ఈ పద్యానికి అర్థ తాత్పర్యాలు సమగ్ర వ్యాఖ్యలలో చూడండి.**

**166వ పద్యం :**

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| నిటల + అక్షుడు | = | నుదుట కన్నుగల శివుడు |
| కుంభినీపతి | = | రాజు |

**తాత్పర్యం:**

"నత్కీరుడు నా కవితలో తప్పుపట్టాడా ? ఆ సభకు వెళదాం పద. తప్పు ఎక్కడో తెలుసుకుందాం" అని పరమేశ్వరుడు పూజారితో చెప్పి అతనితో రాజసభకు వెళ్ళాడు.

167. ఈ పద్యానికి అర్థతాత్పర్యాలు సమగ్రవ్యాఖ్యలలో చూడండి.

**168వ పద్యం :**

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| అనవుడు | = | అని పలుకగా |
| ముక్కంటి | = | మూడుకన్నులు కలవాడు, శివుడు |
| గిరితనయ | = | హిమాలయ పర్వత పుత్రి, పార్వతి |
| కచము | = | తలవెంట్రుక |

**తాత్పర్యం:**

శివుడు పద్యంలోని తప్పును చెప్పమని అడిగాడు నత్కీరుడు. అంతకుముందుగానే తప్పు అని అన్నాడు. అప్పుడు శివుడు అతనితో పార్వతీదేవి జుట్టు సహజంగానే సువాసనతో కూడి ఉంటుంది అని అన్నాడు.

**169వ పద్యం :**

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| అగజ | = | పర్వతపుత్రి, పార్వతి |
| ఇల | = | భూమి |
| గగన ప్రసూనము | = | శూన్యము (ఇది సంస్కృత జాతీయం) గగనమంటే ఆకాశం, ప్రసూనం అంటే పూవు అని అర్థాలు. కానీ ఈ జాతీయానికి శూన్యమని అర్థం. |

**తాత్పర్యం:**

పార్వతీదేవి జుట్టుముడి సహజంగానే పరిమళవంతంగా ఉండవచ్చు, కాని అది భూమి మీద ఉండే స్త్రీలకు తగదు. ఇది తప్పు. ఆకాశం శూన్యంగా ఉంటుంది కనుక భూమి కూడా చూడడానికి శూన్యం అనడం తప్పుకదా ! ఆకాశం శూన్యంగా ఉంటుంది కాబట్టి భూమి కూడా శూన్యమనడం ఏవిధంగా తప్పో అలాగే కైలాసంలో ఉండే పార్వతి కురులు సుగంధం కలిగి ఉంటాయి కాబట్టి భూలోకంలోని స్త్రీల కురులు కూడా సుగంధం కలిగి ఉంటాయని చెప్పడం తప్పు అని నత్కీరుని అభిప్రాయం.

**170వ పద్యం :**

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| లూలామాలపు మాటలు | = | మోసమైన మాటలు |
| అలిగి | = | కోపించి |
| నీలగ్రీవుడు | = | నల్లని కంఠం కలిగిన శివుడు |
| నిటల నేత్రము | = | లలాటంలో వున్న నేత్రం |

**తాత్పర్యం:**

నక్కీరుడు "మోసంతో కూడిన ఈ మాటలు చాలించు" అని పలకడంతో శివుడు కోపించి తన సహజరూపం చూపించాలి అనుకున్నాడు. వెంటనే నుదుట నున్న మూడవకన్ను చూపించాడు.

**171వ పద్యం :**

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| మాయా విలసనములు | = | మాయతో కూడిన ఆటలు |

**తాత్పర్యం:**

"నుదుటనే కాదు తలచుట్టూ కన్నులున్నా ఈ పద్యం తప్పు కాదు అని చెప్పను. మాయతో కూడిన నీ ఆటలు ఇక్కడ పనికిరావు. విడిచివెళ్ళు" అని నక్కీరుడు శివునితో అన్నాడు.

**172వ పద్యం :**

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| ప్రతిభాషలు | = | సమాధానపు మాటలు |
| కుపితుడు | = | కోపించినవాడు |
| రుద్రుడు | = | శివుడు |
| తపియించు | = | తాపాన్ని పొందు (బాధపడు) |

**తాత్పర్యం:**

నక్కీరుని మాటలతో శివునికి కోపం వచ్చింది. అతడు "కుష్ఠువ్యాధితో బాధపడుము" అని నక్కీరుని శపించాడు. ఆ శాపానికి నక్కీరుడు భయపడుతూ శివునితో ఇలా అన్నాడు.

**173. ఈ పద్యానికి అర్థతాత్పర్యాలు సమగ్ర వ్యాఖ్యలలో చూడండి.**

**174. ఈ పద్యానికి అర్థతాత్పర్యాలు సమగ్ర వ్యాఖ్యలలో చూడండి.**

**175. ఈ పద్యానికి అర్థతాత్పర్యాలు సమగ్ర వ్యాఖ్యలలో చూడండి.**

**176. ఈ పద్యానికి అర్థతాత్పర్యాలు సమగ్ర వ్యాఖ్యలలో చూడండి.**

**177వ పద్యం :**

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| తివిరి | = | ప్రయత్నించి |
| అంగము | = | శరీరభాగం |
| తిమ్మిరి | = | ఒక రోగం |
| ఒడలు | = | శరీరం |
| దళము + ఎక్కి | = | మందముగా మారి |
| గాత్రము | = | శరీరము |

| | | |
|---|---|---|
| చెలువు | = | అందము |
| అలత | = | అలసట |
| విగ్రహం | = | ఆకారం |
| అంకురించు | = | మొలకెత్తు |
| కాయము | = | శరీరం |
| రోయు | = | రోతపడు |
| నగము | = | కొండ |
| హరుడు | = | శివుడు |

**తాత్పర్యం:**

కుష్ఠురోగం వచ్చినంతనే శరీరం తిమ్మిరెక్కుతుంది. శరీరమంతా మచ్చలు వస్తాయి. చర్మం మందంగా మారి అందం చెడిపోతుంది. శరీరం మీద బుడుపులు ఏర్పడతాయి. ఆకారమంతా అలసట పొందుతుంది. శరీరం అసహ్యంగా తయారవుతుంది. శరీరం నుంచి చీము, నెత్తురు కారుతాయి. శరీరం మీద ఈగలు మూగుతాయి. యాచించడానికి వెళ్ళిన ప్రదేశాల్లో ప్రజలు అసహ్యించుకుంటారు. అందుచేత ఇవేమీ జరుగకముందే నడవగలిగినప్పుడే నడిచి కైలాసపర్వతాన్ని చూడడానికి వెళ్ళాలి. శివుని శాపాన్ని తప్పించుకోవడం సాధ్యంకాదు కదా !

**- డా॥ నాగభైరవ ఆదినారాయణ**
రీడర్ & ప్రిన్సిపాల్ (రిటైర్డ్)
బి.ఎస్.ఎస్.బి. డిగ్రీ కళాశాల
తాడికొండ, గుంటూరు జిల్లా

పాఠం - 14

# నత్కీరుడు

## - ధూర్జటి

**(శ్రీ కాళహస్తి మహాత్మ్యము - తృతీయాశ్వాసం - 148 నుండి 177వ పద్యం వరకు)**

**సమగ్ర వ్యాఖ్యలు**

**విషయసూచిక :**

**14.1** ఉద్దేశ్యం
**14.2** సమగ్ర వ్యాఖ్యలు
**14.3** రాదగిన ప్రశ్నావిధానం

### 14.1 ఉద్దేశ్యం :

నత్కీరుని కథలో ధూర్జటి రచించిన పద్యాలలో కొన్ని ముఖ్యమయిన పద్యాలలోని విశేషాలను సమగ్రంగా సమీక్షించుట ఈ పాఠం యొక్క ఉద్దేశ్యం. ఈ పాఠంలో పద్యం యొక్క ప్రతిపదార్థ తాత్పర్యాలను, వ్యాకరణ విశేషాలను, ఛందోలంకారాలను తెలియజేయడం వల్ల విద్యార్థి పద్యాలను సంపూర్ణంగా అర్థం చేసుకోగలడు.

### 14.2 సమగ్ర వ్యాఖ్యలు :

**తోలును నెమ్ములున్మిగిలి, ఁ్రోసినఁదొంబది చోట్లఁగూలువా**
**రాలిని బిడ్డల న్విడిచి యాకటి చిచ్చున వెచ్చబోవువా**
**రేలిక బంటువాసి యొకయించుకలేక కృశించువారునై**
**తూలె జనంబు మీనశని దోషము దాఁకి నిరస్తసస్యయై (153వ పద్యం)**

**కవి పరిచయం - సందర్భం :**

ఈ పద్యం మహాకవి ధూర్జటి రచించిన శ్రీకాళహస్తి మహాత్మ్యము తృతీయాశ్వాసము నుండి గ్రహింపబడిన నత్కీరుడు అనే పాఠ్యభాగములోనిది. పాండ్యదేశంలో వర్షాలు లేకపోవడంతో భయంకరమైన కరువు తాండవించింది. కరువు సమయంలో ప్రజలు పడే బాధలను వర్ణిస్తూ కవి ధూర్జటి చెప్పిన పద్యమిది.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| మీన శని దోషము | = | మీనరాశిలో శని ప్రవేశించడం వలన కలిగే దోషం |
| తగిలి | = | రావడంచేత |
| నిరస్తసస్యయై | = | పంటలు లేనిదై |
| తోలును | = | చర్మమును |
| ఎమ్ములున్ | = | ఎముకలును |
| మిగిలి | = | మిగలగా |
| ్రోసినన్ | = | నెట్టినచో |
| తొంబది చోట్లన్ | = | తొంబది ప్రదేశాలలో |
| కూలువారు | = | పడిపోయేవారుగా |
| ఆలిని | = | భార్యను |

| | | |
|---|---|---|
| బిడ్డలన్ | = | సంతానాన్ని |
| విడిచి | = | విడిచిపెట్టి |
| ఆకటి చిచ్చునన్ | = | ఆకలి అనే అగ్నిచేత |
| వెచ్చబోవువారు | = | చనిపోయేవారును |
| ఏలిక | = | ప్రభువు |
| బంటు | = | సేవకుడు అనే |
| వాసి | = | భేదము |
| ఒక + బంచుకలేక | = | కొంచెం కూడా లేకుండా |
| కృశించువారునై | = | క్షీణించేవారై |
| జనంబు | = | ప్రజలందరూ |
| తూలెన్ | = | నశించారు |

**తాత్పర్యం :**

శని మీనరాశిలో ప్రవేశించడం అనే దోషంచేత కరవు వచ్చి పంటలు లేకుండా పోయాయి. కొంతమంది తోలు, ఎముకలు మాత్రమే మిగిలి త్రోస్తే తొంబది చోట్ల తూలిపడసాగారు. కొంతమంది భార్యాబిడ్డలను విడిచి ఆకలి అనే అగ్నిచేత చనిపోసాగారు. రాజు, సేవకుడు అనే తేడా లేకుండా ప్రజలందరూ కరవు వలన క్షీణించిపోయారు.

**వ్యాకరణ విశేషాలు :**

**సంధులు :**

| | | |
|---|---|---|
| తొమ్మిది + పది | = | తొంబది (ప్రాతాదుల సంధి) |
| ఒక + ఇంచుక | = | ఒకయించుక (యడాగమ సంధి) |
| త్రోసినన్ + తొంబది | = | త్రోసినఁదొంబది (సరళాదేశ సంధి) |
| చోట్లన్ + కూలువారు | = | చోట్లఁగూలువారు (సరళాదేశ సంధి) |

**సమాసాలు :**

| | | |
|---|---|---|
| తొంబదిచోట్లు | = | తొంబది అను సంఖ్య గల బోట్లు (ద్విగుసమాసము) |
| ఆకటిచిచ్చు | = | ఆకలి అనెడి చిచ్చు (రూపక సమాసము) |
| మీనశనిదోషము | = | మీన శనుల వలన దోషము (పంచమీ తత్పురుష సమాసము) |
| నిరస్తసస్య | = | నిరస్తమైన సస్యము కలది (బహువ్రీహి సమాసము) |

**ఛందస్సు :**

| భ | ర | న | భ | భ | ర | వ |
|---|---|---|---|---|---|---|
| U I I | U I U | I II | U I I | U I I | UI U | I U |
| తూలెజ | నంబు మీ | న శని | దోషము | దాకి ని | రస్త స | స్యయై |

ఈ పద్యపాదంలో భ, ర, న, భ, భ, ర, వ - అనే గణాలున్నాయి. కనుక ఇది ఉత్పలమాల పద్యం. దీనిలో 10వ అక్షరం యతి స్థానం (తూ - దో) ప్రాసనియమం ఉంది. ప్రాసయతి ఉండదు.

**అలంకారం :**

కరువు పరిస్థితుల్లో ప్రజలు ఎలా ఇబ్బంది పడుతుంటారో కళ్ళకు కట్టినట్లు సహజంగా వర్ణింపబడింది కాబట్టి ఈ పద్యంలో స్వభావోక్తి అలంకారముంది.

**విశేషము :**

శనిగ్రహం మీనరాశిలో ఉంటే వానలు కురవవని, కరువు వస్తుందని పంచాంగం తెలియజేస్తుంది. ఈ విషయాన్నే కవి ఈ పద్యంలో తెలియజేశాడు.

**159వ పద్యం :**

**తప్పిది చెప్పరాదు కవితాసమయంబున కొప్పుకాదు, నీ**
**విప్పగిదిన్ రచింపదగునే? యన విప్రుడు చిన్న బోయి, "నా**
**కప్పరమేశ్వరుండు వసురాధిపుపై రచియించి యిచ్చినా**
**డొప్పును తప్పునేనెఱుగ నుత్తములార" యటంచు గ్రమ్మఱన్**

**సందర్భం :**

ఈ పద్యం మహాకవి ధూర్జటి రచించిన శ్రీకాళహస్తి మహాత్మ్యము తృతీయాశ్వాసము నుండి గ్రహింపబడిన "నత్కీరుడు" అనే పాఠ్యభాగంలోనిది. కరవు కారణంగా నగరాన్ని విడిచి వెళ్ళడానికి సిద్ధపడిన పూజారిని వారించి శివుడు అతనికి ఒక పద్యం రచించి ఇచ్చి రాజసభలో చదివి, రాజిచ్చే వేయిమాడలతో జీవించమని అన్నాడు. పూజారి ఆ పద్యాన్ని సభలో చదివాడు. నత్కీరుడు ఆ పద్యంలో "జుట్టు సహజంగా పరిమళం కలిగి ఉంటుంది" అనే భావం లోక విరుద్ధం అని విమర్శించిన సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| తప్పు + ఇది | = | ఈ భావం తప్పు |
| చెప్పరాదు | = | ఈవిధంగా చెప్పకూడదు |
| కవితా సమయంబునకున్ | = | కవిత్వపు పద్ధతికి |
| ఒప్పు + కాదు | = | ఇది తగినది కాదు |
| నీవు | = | నీవు |
| ఈ + పగిదిన్ | = | ఈ పద్ధతిగా |
| రచింపన్ + తగునే | = | రచించడం తగదు |
| అనన్ | = | అని నత్కీరుడు పలుకగా |
| విప్రుడు | = | బ్రాహ్మణ పూజారి |
| చిన్నబోయి | = | అవమానంగా భావించి |
| ఉత్తములార | = | శ్రేష్ఠులారా ! |
| నాకున్ | = | నాకు |
| ఆ + పరమ + ఈశ్వరుడు | = | ఆ పరమశివుడు |
| వసుధ + అధిపుపై | = | రాజుపై |
| రచియించి | = | వ్రాసి |

| | | |
|---|---|---|
| ఇచ్చినాడు | = | ఇచ్చాడు |
| ఒప్పును | = | అని ఒప్పో |
| తప్పు | = | తప్పో |
| నేను + ఎఱుగన్ | = | నాకు తెలియదు |
| అటంచున్ | = | అని పలుకుచు |
| క్రమ్మరన్ | = | మరల |

**తాత్పర్యము :**

నత్కీరుడు సభలో బ్రాహ్మణునితో "ఇది తప్పు. ఈ విధంగా చెప్పకూడదు. కవితా విధానానికి ఇది సరికాదు. నీ వీ విధంగా వ్రాయకూడదు" అన్నాడు. ఆ బ్రాహ్మణుడు సిగ్గుపడుతూ "ఈ పద్యాన్ని పరమేశ్వరుడే స్వయంగా రాజుపై వ్రాసి ఇచ్చాడు. ఇందులోని తప్పొప్పులు నాకు తెలియవు" అని చెప్పాడు.

**వ్యాకరణ కార్యములు :**

**సంధులు :**

| | | |
|---|---|---|
| తప్పు + ఇది | = | తప్పిది (ఉత్వసంధి) |
| ఒప్పు + కాదు | = | ఒప్పుగాదు (గసడదవాదేశ సంధి) |
| ఈ + పగిది | = | ఇప్పగిది (త్రికసంధి) |
| రచింపన్ + తగునే | = | రచింపఁదగునే (సరళాదేశ సంధి) |
| చిన్న + పోయి | = | చిన్నఁబోయి (నుగాగమ సరళాదేశ సంధి) |
| ఆ + పరమేశ్వరుడు | = | అప్పరమేశ్వరుడు (త్రికసంధి) |
| పరమ + ఈశ్వరుడు | = | పరమేశ్వరుడు (గుణసంధి) |
| వసుధ + అధిప | = | వసుధాధిప (సవర్ణదీర్ఘ సంధి) |

**సమాసాలు :**

| | | |
|---|---|---|
| కవితాసమయము | = | కవిత యందలి సమయము (సప్తమీ తత్పురుష సమాసము) |
| పరమేశ్వరుడు | = | పరముడైన ఈశ్వరుడు (విశేషణ పూర్వపద కర్మధారయ సమాసము) |
| వసుధాధిపుడు | = | వసుధకు అధిపుడు (షష్ఠీ తత్పురుష సమాసము) |

**ఛందస్సు :**

| భ | ర | న | భ | భ | ర | వ |
|---|---|---|---|---|---|---|
| U I I | U I U | I I I | U I I | U I I | U I U | I U |
| ఒప్పును | దప్పసే | నెఱుగ | నుత్తము | లార య | టంచు గ్ర | మ్మఱన్ |

ఈ పద్యపాదంలో భ,ర,న,భ,భ,ర,వ అనే గణాలున్నాయి. 1 అక్షరానికి 10వ అక్షరానికి యతిమైత్రి (ఒ-ఉ) కుదిరింది. కనుక ఇది ఉత్పలమాల. దీనిలో ప్రాసనియమం ఉంటుంది. ప్రాసయతి ఉండదు.

**165వ పద్యం :**

**నా భాగ్యం బిటులుండగాఁదుది నినున్నత్కీరునిందూ ఱగా**
**నే భావ్యం? బికచాలు, నిక్కఱవుచే నిట్లైతి, నెందైనగా**
**నీ భైక్షంబున గుక్షిఁబ్రోచుకొని, దీనిందీర్చి, నేవత్తు, దే**
**వా ! భద్రంబగు నీకు, నన్ననుపవే ? యన్నం గృపామూర్తియై**

**సందర్భం :**

ఈ పద్యం మహాకవి ధూర్జటి రచించిన శ్రీకాళహస్తి మహాత్మ్యము తృతీయాశ్వాసము నుండి గ్రహింపబడిన "నత్కీరుడు" అనే పాఠ్యభాగంలోనిది. కరవు కారణంగా నగరాన్ని విడిచివెళ్ళడానికి సిద్ధపడిన పూజారిని వారించి శివుడు అతినికి ఒక పద్యం రచించి ఇచ్చాడు. దానిని రాజసభలో చదివి రాజిచ్చే వేయిమాడలతో జీవించమని చెప్పాడు. పూజారి ఆ పద్యాన్ని సభలో చదివితే, ఆ పద్యం తప్పని నత్కీరుడు అన్నాడు. అవమానం పొందిన పూజారి శివుని వద్దకు వచ్చి అతనితో మాట్లాడిన సందర్భములోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| దేవా | = | ఓ శివా ! |
| నా భాగ్యంబు | = | నా అదృష్టం |
| ఇటులు + ఉండగాన్ | = | ఈ విధంగా ఉన్నప్పుడు |
| నినున్ | = | నిన్ను |
| నత్కీరునిన్ | = | నత్కీరుని |
| దూరగాన్ | = | నిందించుటకు |
| ఏ భావ్యంబు | = | ఏవిధంగా తగి ఉంటుంది ? |
| ఇకచాలు | = | ఇంక చాలును |
| ఈ + కఱువుచేన్ | = | ఈ క్షామంచేత |
| ఇట్లు + అయితిన్ | = | ఈవిధంగా అవపమానింపబడ్డాను |
| ఎందు + అయినన్ + కానీ | = | ఎక్కడయినా |
| భైక్షంబునన్ | = | యాచన వృత్తిచే |
| కుక్షిన్ | = | కడుపును |
| ప్రోచుకొని | = | పోషించుకొని |
| దీనిన్ | = | ఈ కరవును |
| తీర్చి | = | దాటుకొని |
| నే వత్తున్ | = | నేను వస్తాను |
| నీకున్ | = | నీకు |
| భద్రంబు + అగున్ | = | క్షేమము కలుగుగాక |
| నన్నున్ + అనుపవే | = | నన్ను పంపించు |
| అన్నన్ | = | అని పూజారి పలుకగా |
| కృపామూర్తియై | = | దయా స్వరూపుడై |

**తాత్పర్యం :**

"దేవా ! నా అదృష్టం ఇలా ఉంటే నిన్నుగాని, నత్కీరునిగాని నిందించడం ఎందుకు? ఇంక చాలు. ఈ కరువుచేత ఈవిధంగా అవమానింపబడ్డాను. ఎక్కడికయినా వెళ్తాను. యాచించుకొని బ్రతుకుతాను. ఈ కరవు పోయిన తరువాత వస్తాను. నీవు క్షేమంగా ఉండు. నన్ను పంపించు" అని పూజారి పలుకగా శివుడు దయాస్వరూపుడయ్యాడు.

**వ్యాకరణ విశేషాలు :**

**సంధులు :**

| | | |
|---|---|---|
| ఈ + కఱవు | = | ఇక్కఱవు (త్రిక సంధి) |
| భాగ్యంబు + ఇటులు | = | భాగ్యంబిటులు (ఉత్వ సంధి) |
| భావ్యంబు + ఇక | = | భావ్యంబిక (ఉత్వ సంధి) |
| ఇట్లు + ఐతి | = | ఇట్లైతి (ఉత్వ సంధి) |
| ఎందు + ఐన | = | ఎందైన (ఉత్వ సంధి) |
| భాద్రంబు + అగు | = | భద్రంబగు (ఉత్వసంధి) |
| నన్నున్ + అనుపవే | = | నన్నునుపవే (ఉత్వసంధి) |
| భైక్షంబుకన్ + కుక్షి | = | భైక్షంబునఁగుక్షి (సరళాదేశ సంధి) |
| దీనిన్ + తీర్చి | = | దీనిందీర్చి (సరళాదేశ సంధి) |
| అన్నన్ + కృపామూర్తి | = | అన్నంగృపామూర్తి (సరళాదేశ సంధి) |

**సమాసాలు :**

| | | |
|---|---|---|
| కృపామూర్తి | = | కృప మూర్తిగా గలవాడు (బహుద్రీహి సమాసము) |

**ఛందస్సు :**

| మ | స | జ | స | త | త | గ |
|---|---|---|---|---|---|---|
| U U U | I I U | IUI | I IU | U UI | U UI | U |
| నా భాగ్యం | బిటులుం | డగాదు | ది నిను | న్న త్కీరు | నిందూఱ | గా |

ఈ పద్యపాదంలో మ,స,జ,స,త,త,గ అనే గణాలున్నాయి. కనుక ఇది శార్దూల పద్యం. 13వ అక్షరానికి యతి చెల్లింది (నా - న) ప్రాసస్థానంలో భకారం ఉంది. ప్రాసయతి ఉండదు.

**167వ పద్యం :**

**ఈ రాజన్యుని మీదనేఁగవిత సాహిత్య స్ఫురన్మాధురీ**
**చారు ప్రౌఢమఁజెప్పి పంప, వని మాత్సర్యంబు వాటించి, న**
**త్కీరుండూరకె తప్పువట్టెనట ! యేదీ లక్షణంబో, యలం**
**కారంబో, పదబంధమో, రసమొ? చక్కంజెప్పుఁడా తప్పునన్**

**సందర్భం :**

ఈ పద్యం మహాకవి ధూర్జటి రచించిన శ్రీకాళహస్తి మహాత్మ్యము తృతీయాశ్వాసము నుండి గ్రహింపబడిన "నత్కీరుడు" అనే పాఠ్యభాగంలోనిది. శివుడు తనకిచ్చిన పద్యంలో తప్పున్నదని నత్కీరుడు పలుకగా, అవమానంతో పూజారి శివుని వద్దకు వచ్చి, తన అవమానం గురించి చెప్పి ఎక్కడికైనా వెళతానని చెప్పాడు. శివుడు అతనిని తీసుకొని రాజసభకు వెళ్ళి పలికిన పలుకులీ మాటలు.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| ఈ రాజన్యుని మీదన్ | = | ఈ ప్రభువు మీద |
| నేన్ | = | నేను |
| కవితన్ | = | కవిత్వాన్ని |
| సాహిత్య | = | సాహిత్యము |
| స్ఫురత్ | = | ప్రకాశించునట్టి |
| మాధురీ | = | మాధుర్యముతో |
| చారు | = | మనోహరమైన |
| ప్రౌఢిమన్ | = | నేర్పరితనముతో |
| చెప్పిపంపన్ | = | చెప్పి పంపగా |
| విని | = | విని |
| నత్కీరుండు | = | నత్కీరుడు |
| మాత్సర్యంబు | = | ఈర్ష్యను |
| పాటించి | = | పొంది |
| తప్పు + పట్టెనట | = | తప్పు అని చెప్పాడట |
| ఆ తప్పునన్ | = | ఈ తప్పు నందు |
| లక్షణంతో | = | వ్యాకరణ శాస్త్రమా |
| అలంకారంబో | = | అలంకారమా |
| పదబంధమో | = | పదాలకూర్పా |
| రసమో | = | రసమా |
| చక్కన్ + చెప్పుడు | = | ఏది ఉందో స్పష్టంగా చెప్పండి. |

**తాత్పర్యం :**

నేను ఈ రాజుమీద సాహిత్యంతో ప్రకాశించే మధురమైన, ప్రౌఢమైన పద్యాన్ని చెప్పి పంపాను. అది విని నత్కీరుడు అందులో తప్పు ఉందని ఈర్ష్యతో అన్నాడు. ఆ పద్యంలోని తప్పు వ్యాకరణంలోనా ? అలంకారంలోనా ? పదాల కూర్పులోనా? రసంలోనా ? ఎక్కడ ఉందో స్పష్టంగా చెప్పవలసింది'' అని శివుడు అడిగాడు.

**వ్యాకరణ విశేషాలు :**

**సంధులు :**

| | | |
|---|---|---|
| నేన్ + కవిత | = | నేఁగవిత (సరళాదేశ సంధి) |
| ప్రౌఢిమన్ + చెప్పి | = | ప్రౌఢిమఁజెప్పి (సరళాదేశ సంధి) |
| చక్కన్ + చెప్పుడు | = | చక్కఁజెప్పుడు (సరళాదేశ సంధి) |
| మాత్సర్యంబు + పాటించి | = | మాత్సర్యంబువాటించి (గసడవాదేశ సంధి) |
| తెప్పు + పట్టె | = | తప్పువట్టె (గసడవాదేశ సంధి) |
| నత్కీరుడు + ఊరికి | = | నత్కీరుండూరికె (ఉత్వ సంధి) |
| లక్షణంబొ + అలంకారమొ | = | లక్షణాంబొయలంకారమొ (యడాగమ సంధి) |

**సమాసాలు :**

| | | |
|---|---|---|
| చారుప్రౌఢిమ | = | మనోహరమైన ప్రౌఢిమ (విశేషణ పూర్వపద కర్మధారయం) |
| పదబంధము | = | పదముల యొక్క బంధము (షష్ఠీ తత్పురుష) |

**ఛందస్సు :**

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| మ | స | జ | స | త | త | గ |
| U U U | I I U | IU I | I IU | U U I | U UI | U |
| ఈ రాజ | న్యుని మీ | ద నే గ | విత సా | హిత్య స్ఫు | రన్మాధు | రీ |

ఈ పద్యపాదంలో మ, స, జ, స, త, త, గ అనే గణాలు ఉన్నాయి. కనుక ఇది శార్దూల పద్యము. 1-13 అక్షరాలకు యతి మైతి కుదిరింది. (ఈ-హి) ప్రాసస్థానంలో రకారం వుంది. ప్రాసయతి చెల్లదు.

**173వ పద్యం :**

**"స్వామీ ! ద్రోహముఁజేసితిం, దెలుపవే శాపాంత ముద్యత్కృపా**
**ధామా ! నా కనుచుం బదాబ్జముల మీదం బడ్డ నాభక్తర**
**క్షామందారుడు శాంతిఁబొంది, యనియెం "గైలాస శైలంబుఁగం**
**టే మానుం బద" మన్న నందులకు దాడెందంబునం గుందుచున్.**

**సందర్భం :**

ఈ పద్యం మహాకవి ధూర్జటి రచించిన "శ్రీకాళహస్తి మహాత్మ్యము" తృతీయాశ్వాసము నుండి గ్రహింపబడిన "నత్కీరుడు" అనే పాఠ్యభాగంలోనిది. నత్కీరుని కుష్ఠువ్యాధితో బాధపడమని శివుడు శపించిన సందర్భంలో నత్కీరుడు భయపడి శివునితో పలికిన మాటలివి.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| స్వామీ | = | ఓ దేవా |
| ఉద్యత్కృపా | = | గొప్పదయకు |
| ధామా | = | నిలయమైన ఓ శివా ! |
| ద్రోణమున్ | = | తప్పును |
| చేడితిన్ | = | చేశాను |
| నాకున్ | = | నాకు |
| శాప + అంతమున్ | = | శాపం తొలగు మార్గమును |
| తెలుపవే | = | తెలుపుము |
| అనుచున్ | = | అని పలుకుచూ |
| పద + అబ్దముల మీదన్ | = | పాదపద్మముల మీద |
| పడ్డన్ | = | పడిపోగా |
| ఆ భక్తరక్షా | = | భక్తులను రక్షించుటయందు |
| మందారుడు | = | మందారము వంటివాడైన ఆ శివుడు |

| | | |
|---|---|---|
| శాంతిన్ + పొంది | = | కోపాన్ని విడిచి శాంతిని పొంది |
| కైలాస శైలంబున్ | = | కైలాస పర్వతమును |
| కంటేన్ | = | చూచినచో |
| మానున్ | = | శాపము తొలగును |
| పద | = | బయలుదేరుము |
| అనియొక | = | అనెను |
| అన్నన్ | = | అని పలుకగా |
| అందులకు | = | ఆ మాటలకు |
| తాన్ | = | ఆ నత్కీరుడు |
| డెందంబునన్ | = | హృదయంలో |
| కుందుచున్ | = | బాధపడుచూ (పై పద్యంతో అన్వయం) |

**తాత్పర్యం :**

నత్కీరుడు "ఓ దేవా ! దయామూర్తీ ! నేను పెద్ద తప్పు చేశాను. నాకు శాపం తొలగిపోయే దారి తెలుపు" అని ప్రార్థిస్తూ శివుని పాదపద్మాల మీద పడిపోయాడు. భక్తులను రక్షించేవాడైన శివుడు శాంతిని పొంది "కైలాస పర్వత శిఖరాన్ని చూస్తే శాపం తొలగిపోతుంది. వెళ్ళు" అని చెప్పాడు. ఆ మాటలకు నత్కీరుడు హృదయంలో బాధపడ్డాడు.

**వ్యాకరణ విశేషాలు :**

**సంధులు :**

| | | |
|---|---|---|
| శాప + అంతము | = | శాపాంతము (సవర్ణదీర్ఘ సంధి) |
| పద + అబ్జము | = | పదాబ్జము (సవర్ణదీర్ఘ సంధి) |
| ద్రోహమున్ + చేసితి | = | ద్రోహముఁజేసితి (సరళాదేశ సంధి) |
| చేసితిన్ + తెలుపవే | = | చేసితిందెలుపవే (సరళాదేశ సంధి) |
| అనుచున్ + పదము | = | అనుచుంబదము (సరళాదేశ సంధి) |
| మీదన్ + పడ్డ | = | మీదంబడ్డ (సరళాదేశ సంధి) |
| శాంతిన్ + పొంది | = | శాంతిఁబొంది (సరళాదేశ సంధి) |
| అనియెన్ + కైలాసము | = | అనియెంగైలాసము (సరళాదేశ సంధి) |
| శైలంబు + కంటే | = | శైలంబుగంటే (సరళాదేశ సంధి) |
| మానున్ + పద | = | మానుంబద (సరళాదేశ సంధి) |
| డెందంబువన్ + కుందుచున్ | = | డెందంబునం గుందుచున్ (సరళాదేశ సంధి) |

**సమాసాలు :**

| | | |
|---|---|---|
| శాపాంతము | = | శాపము యొక్క అంతము (షష్ఠీ తత్పురుష) |
| కృపాధాముడు | = | కృపకు ధామము వంటివాడు (షష్ఠీ తత్పురుష) |
| పదాబ్జములు | = | అబ్జముల వంటి పదములు (ఉపమాన ఉత్తరపద కర్మధారయము) |
| భక్తరక్షామందారుడు | = | భక్తులను రక్షించుట యందు మందారుడు (సప్తమీ తత్పురుష) |
| కైలాసశైలము | = | కైలాసము యొక్క శైలము (షష్ఠీ తత్పురుష) |

**ఛందస్సు :**

మ స జ స త త గ

U U U  I I U  I U I  I I U  U U I  U U I  U

స్వామీ ద్రో హము జే సి తి ం దె లుపవే శాపాంత ముద్యత్క్రృ పా

పై పద్యపాదంలో మ, స, జ, స, త, త, గ అనే గణాలున్నాయి. కనుక ఇది శార్దూల పద్యము. 1-13 అక్షరాలకు యతిమైత్రి కుదిరింది. (స్వా - శా) ప్రాసస్థానంలో మ కారం వుంది. ప్రాసయతి చెల్లదు.

**174వ పద్యం :**

**ఈకవి తాభిమానము వహించితి నేటికి ? శంఖపీఠిపై**
**నీ కవులున్నయట్లు వసియింకన్ దేవుని తోడ నేలచా**
**ర్వాక మొనర్చితిం ? గడు భరంబగు కుష్ఠరుజావిషాదమే**
**వే కరణింధరింతు ? నిక నెన్నడు చూచెద వెండిగుబ్బలిన్.**

**సందర్భం :**

ఈ పద్యం మహాకవి ధూర్జటి రచించిన శ్రీ కాళహస్తి మాహాత్మ్యము తృతీయాశ్వాసము నుండి గ్రహింపబడిన "నత్కీరుడు" అనే పాఠ్యభాగములోనిది. పరమశివుడు చెప్పిన పద్యంలో తప్పున్నదని చెప్పడంతోపాటు ఆ దేవుని ఎదిరించి శాపానికి నత్కీరుడు గురైనాడు. శాపం పొందిన తరువాత శివుని దయతో కైలాసపర్వతాన్ని చూసినప్పుడు శాపం తొలగిపోతుందని శాపావధి తెలుసుకొని పశ్చాత్తాపంతో బాధపడే సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| ఈ కవిత అభిమానము | = | కవిత్వం మీద ఇంతటి గర్వం |
| ఏటికి | = | ఎందుకు |
| వహించితిని | = | పొందాను ? |
| శంఖపీఠిపైన్ | = | శంఖపీఠం మీద |
| ఈ కవులు ఉన్నట్లు | = | ఈ కవులు ఉన్నవిధంగా |
| వసింపక | = | ఉండకుండా |
| దేవుని తోడన్ | = | భగవంతుడైన శివునితో |
| ఏలన్ | = | ఎందుకు |
| చార్వాకము | = | నాస్తిక వాదాల్ని |
| ఒనర్చితిన్ | = | ప్రదర్శించాను |
| కడు | = | మిక్కిలి |
| భరంబు + అగు | = | భారమైనట్టి |
| కుష్ఠరుజా | = | కుష్ఠరోగము వలన కలిగే |
| విషాదమున్ | = | దుఃఖాన్ని |
| ఏను | = | నేను |
| ఏకరణిన్ | = | ఏవిధంగా |

| | | |
|---|---|---|
| ధరింతున్ | = | భరించాలి |
| వెండి గుబ్బలిన్ | = | వెండికొండ అయిన కైలాస పర్వతాన్ని |
| ఇక | = | ఇక |
| ఎన్నడు | = | ఎప్పుడు |
| చూచెదన్ | = | చూస్తానో గదా ! |

**తాత్పర్యము :**

కవిత్వానికి సంబంధించిన ఇంత గర్వం నాకెందుకు ? శంఖ పీఠిపై ఇతర కవులున్నట్లు ఉండక దేవునితో నేను నాస్తికునిలా మాట్లాడడం ఎందుకు ? మిక్కిలి భారమైన కుష్ఠురోగం వలన కలిగే దుఃఖాన్ని ఎలా భరించాలి ? కైలాస పర్వతాన్ని ఇంకెప్పుడు చూడాలి ?" అని నత్కీరుడు పశ్చాత్తాపంతో బాధపడ్డాడు.

**వ్యాకరణ విశేషాలు :**

**సంధులు :**

| | | |
|---|---|---|
| కవితా + అభిమానము | = | కవితాభిమానము (సవర్ణదీర్ఘ సంధి) |
| వహించితిని + ఏటికి | = | వహించితి నేటికి (ఇత్వ సంధి) |
| కవులు + ఉన్న | = | కవులున్న (ఉత్వ సంధి) |
| చార్వాకము + ఒనర్చితి | = | చార్వాక మొనర్చితి (ఉత్వ సంధి) |
| భరంబు + అగు | = | భరంబగు (ఉత్వ సంధి) |
| విషాదము + ఏను | = | విషాదమేను (ఉత్వ సంధి) |
| ఒనర్చితిన్ + కడు | = | ఒనర్చితింగడు (సరళాదేశ సంధి) |

**సమాసాలు :**

| | | |
|---|---|---|
| కవితాభిమానము | = | కవిత్వ మందలి అభిమానము (సప్తమీ తత్పురుష) |
| కుష్ఠరుజ | = | కుష్ఠ అను పేరుగల రుజ (సంభావనా పూర్వపద కర్మధారయము) |
| వెండి గుబ్బలి | = | వెండి రంగు కలదైన గుబ్బలి (విశేషణ పూర్వపద కర్మధారయము) |

**ఛందస్సు :**

భ ర న భ భ ర వ

U I I  U I U  I I I  U I I  U I I  U I U  I U

ఈ కవి తాభిమా నము వ హించితి నేటికి శంఖ పీ ఠిపై

ఈ పద్యపాఠంలో భ, ర, న, భ, భ, ర, వ - అనే గణాలున్నాయి. కనుక ఇది ఉత్పలమాల పద్యము. 1-10 అక్షరాలకు యతిమైత్రి కుదిరింది. (ఈ-హిలోని ఇ) ప్రాసస్థానంలో కకారం వుంది. ప్రాసయతి ఉండదు.

**175వ పద్యం :**

ఎన్ని మహానదుల్వనములెన్ని, గిరీంద్రము లెన్ని, బోయ వీ
ళ్లెన్ని, మృగంబు లెన్ని, జనహీనములైన పథంబులెన్ని, నే

నిన్నియుదాటి, యే కరణి నీశ్వరుశైలము చూడఁబోయెదన్
గన్నది కాదు, విన్నయదిగాని, సదాశివ ! యేమి చేయుదున్.

**సందర్భం :**

ఈ పద్యం మహాకవి ధూర్జటి రచించిన శ్రీకాళహస్తి మాహాత్మ్యము తృతీయాశ్వాసము నుండి గ్రహింపబడిన "నత్కీరుడు" అనే పాఠ్యభాగంలోనిది. శివుని చేత కుష్ఠవ్యాధి పొందుమని శాపాన్ని పొందిన నత్కీరుడు, దేవుని కృపచే కైలాసపర్వత దర్శనంచే తన శాపం ముగిసిపోతుందని వరాన్ని పొంది శిఖర దర్శనం కోసం బయలుదేరుతూ తనలో అనుకున్న మాటలివి.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| ఎన్ని | = | ఎన్నో |
| మహానదుల్ | = | గొప్పనదులు |
| ఎన్ని | = | ఎన్నో |
| వనములు | = | అడవులు |
| ఎన్ని | = | ఎన్నో |
| గిరి + ఇంద్రములు | = | ఎన్నో పెద్ద కొండలు |
| ఎన్ని | = | ఎన్నో |
| బోయవీళ్ళు | = | బోయల నివసించే చోట్లు |
| ఎన్ని | = | ఎన్నో |
| మృగంబులు | = | క్రూరజంతువులు |
| ఎన్ని | = | ఎన్నో |
| జనహీనములైన | = | ప్రజలు వుండని |
| పథంబులు | = | దార్లు |
| నేను | = | నేను |
| ఇన్నియున్ + దాటి | = | వీటినన్నింటిని దాటుకొని |
| ఏ కరణిన్ | = | ఏవిధముగా |
| ఈశ్వరుశైలము | = | ఈశ్వరుడుండే కైలాసగిరి |
| చూడన్ + పోయెదన్ | = | చూడడానికి వెళ్లగలను |
| విన్న + ఆది + కాని | = | ఆ పర్వతం గురించి విన్నాను తప్ప |
| కన్న + అది + కాదు | = | అది చూచింది కాదు |
| సదాశివా | = | ఓ పరమేశ్వరా ! |
| ఏమి చేయుదున్ | = | ఏమి చేయగలను ? |

**తాత్పర్యం :**

"ఎన్నో గొప్పనదులు, ఎన్నో అడవులు, ఎన్నో కొండలు, ఎన్నో బోయలు నివసించే ఊళ్ళు, ఎన్నో క్రూర జంతువులు, జనసంచారం లేని ఎన్నోదార్లు దాటుకొని నేను ఎలా కైలాసపర్వతాన్ని చూడడానికి వెళ్ళగలను ? ఆ పర్వతం గురించి విన్నాను తప్ప చూచి ఎరుగను. ఓ పరమేశ్వరా ! నేను ఏం చేసేది ? అని నత్కీరుడు బాధపడ్డాడు.

**వ్యాకరణ విశేషాలు :**

**సంధులు :**

| | | |
|---|---|---|
| వనములు + ఎన్ని | = | వనములెన్ని (ఉత్వ సంధి) |
| వీళ్లు + ఎన్ని | = | వీళ్లెన్ని (ఉత్వ సంధి) |
| మృగంబులు + ఎన్ని | = | మృగంబులెన్ని (ఉత్వ సంధి) |
| పథంబులు + ఎన్ని | = | పథంబులెన్ని (ఉత్వ సంధి) |
| గిరి + ఇంద్రము | = | గిరీంద్రము (సవర్ణదీర్ఘ సంధి) |
| విన్న + అనిది | = | విన్నయది (యడాగమ సంధి) |
| దాటి + ఏకరణి | = | దాటియేకరణి (యడాగమ సంధి) |
| చూడన్ + పోయెదన్ | = | చూడఁబోయెదన్ (సరళాదేశ సంధి) |
| కన్న + అది | = | కన్నది (అత్వ సంధి) |

**సమాసాలు :**

| | | |
|---|---|---|
| మహానదులు | = | గొప్పవైన నదులు (విశేషణ పూర్వపద కర్మధారయ సమాసము) |
| గిరీంద్రము | = | గిరుల యందు ఇంద్రము (సప్తమీ తత్పురుష సమాసము) |
| జనహీనము | = | జనము చేత హీనము (తృతీయా తత్పురుష సమాసము) |
| ఈశ్వరుశైలము | = | ఈశ్వరుని యొక్క శైలము (షష్ఠీ తత్పురుష సమాసము) |

**ఛందస్సు :**

| భ | ర | న | భ | భ | ర | వ |
|---|---|---|---|---|---|---|
| U I I | UI U | I II | U I I | U I I | UI U | I U |
| గన్నది | కామ వి | న్నయది | గాని స | దా శివ | యేమి చే | యుదున్ |

ఈ పద్యంలో భ, ర, న, భ, భ, ర, వ అనే గణాలున్నాయి. కనుక ఇది ఉత్పలమాల పద్యము. 1-10 అక్షరాలకు యతిమైత్రి కుదిరింది. (సంధి గతమైన క - కాలకు యతి). ప్రాసస్థానంలో ద్విత్వనకారం వుంది. ప్రాసయతి ఉండదు.

**176వ పద్యం :**

> **హరి శార్దూల మదేభ ఖడ్గశరభ వ్యాకీర్ణముల్, రాక్షసో**
> **త్కర సంచారనివాసముల్, హిమపయోధారళ వర్షంబు, లు**
> **దురసం ఘర్షణ బాధకోపలము, లాత్రోవ, ల్పనన్యక్యమే**
> **కరుణాసాగర ! భక్తవత్సల ! శివా ! గౌరీశ ! యెట్లోనదే ?**

**సందర్భం :**

ఈ పద్యం మహాకవి ధూర్జటి రచించిన శ్రీ కాళహస్తి మాహాత్మ్యము తృతీయాశ్వాసము నుండి గ్రహింపబడిన "నత్కీరుడు" అనే పాఠ్యభాగములోనిది. శివుడు నత్కీరునికి కైలాసపర్వతము చూచినప్పుడు శాపం తొలగిపోతుందని చెప్పినప్పుడు, నత్కీరుడు కైలాసపర్వత యాత్రను తలచుకొని బాధపడుతూ తన మనస్సులో అనుకున్న మాటలివి.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| కరుణాసాగర | = | దయా సముద్రుడా ! |
| భక్తవత్సల | = | భక్తులపై వాత్సల్యం కలవాడా ! |
| శివా | = | ఓ శివా ! |
| గౌరి + ఈశ | = | పార్వతీదేవికి పతివైనవాడా ! |
| హరి | = | సింహములు |
| శార్దూల | = | పులులు |
| మద + ఇభ | = | మదించిన ఏనుగులు |
| ఖడ్గ | = | ఖడ్గమృగములు |
| శరభ | = | శరభ అనే ఎనిమిది కాళ్ళ జంతువులతో |
| వ్యాకీర్ణముల్ | = | చుట్టుముట్టబడినదియును |
| రాక్షస + ఉత్కర | = | రాక్షస సమూహముల యొక్క |
| సంచార | = | సంచారాలతో కూడిన |
| నివాసముల్ | = | నివాస ప్రాంతమైనదియును |
| హిమ | = | మంచును |
| పయో | = | నీరును |
| ధారాళ | = | ఎడతెగకుండా |
| వర్షంబులు | = | వానగా కురిసే చోటులచేత |
| ఉద్ధుర | = | దట్టమైన |
| సంఘర్షక | = | ఒరపిడిచేత |
| బాధక | = | బాధ కలిగించునట్టి |
| ఉపలముల్ | = | రాళ్ళతో కూడినవి అయిన |
| ఆ త్రోవల్ | = | ఆ మార్గాలు |
| చనన్ | = | దాటుటకు |
| శక్యమే | = | నాకు సాధ్యమా ? |
| ఎట్లోగదే | = | ఎలా దాటి వెళ్ళగలనో గదా ! |

**తాత్పర్యం :**

"ఓ దయాసముద్రుడా ! భక్తవత్సలుడా ! గౌరీపతీ ! శవా ! నేను వెళ్ళవలసిన ప్రాంతాలు సింహములు, పులులు, మదించిన ఏనుగులు, ఖడ్గమృగాలు, శరభాలతో చుట్టుముట్టబడినవి. రాక్షస సమూహములు తిరిగే ప్రాంతాలు. మంచు, నీరు ఎడతెగకుండా వానలుగా కురిసే చోట్లు, దట్టమైన ఒరిపిడితో బాధ కలిగించే రాళ్ళు ఉన్నచోట త్రోవలు, ఆ దారులను దాటివెళ్ళడం నాకు సాధ్యమవుతుందా ? ఎలా వెళ్ళగలను ?" అని నత్కీరుడు అనుకున్నాడు.

**వ్యాకరణ విశేషాలు :**

**సంధులు :**

| | | |
|---|---|---|
| మద + ఇభము | = | మదేభము (గుణ సంధి) |
| రాక్షస + ఉత్కర | = | రాక్షసోత్కర (గుణ సంధి) |

| | | |
|---|---|---|
| త్రోవల్ + చనన్ | = | త్రోవల్సనన్ (గసడదవాదేశ సంధి) |
| గౌరి + ఈశ | = | గౌరీశ (సవర్ణదీర్ఘ సంధి) |
| ఎట్లో + కదే | = | ఎట్లొగదే (గసడదవాదేశ సంధి) |
| గౌరీశ + ఎట్లో | = | గౌరీశయెట్లో (యడాగమ సంధి) |
| వర్షంబులు + ఉద్ధర | = | వర్షంబులుద్ధర (ఉత్వసంధి) |

**సమాసాలు :**

| | | |
|---|---|---|
| ఖడ్గశరభా వ్యాకీర్ణములు | = | ఖడ్గశరభములతో వ్యాకీర్ణములు (తృతీయా తత్పురుష సమాసము) |
| హరిశార్దూల మదేభములు | = | హరి, శార్దూలము మరియు మదేభము (బాహుపద ద్వంద్వ సమాసము) |
| సంచార నివాసములు | = | సంచారముల తోడి నివాసములు (తృతీయా తత్పురుష సమాసము) |
| ధారళవర్షము | = | ధారళమైన వర్షము (విశేషణ పూర్వపద కర్మధార సమాసము) |

**ఛందస్సు :**

| | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| స | | భ | | ర | | న | | మ | | య | | వ |
| I I U | | U I | I | U I U | | I I I | | U U U | | I U U | | I U |
| హరి శా | | ర్దూల | మ | దేభాఖ | | డ్గశర | | భా వాకీ | | ర్ణముల్ రా | | క్షసో |

ఈ పద్యపాదంలో స, భ, ర, న, మ, య, వ అనే గణాలు ఉన్నాయి. కనుక ఇది మత్తేభ పద్యము. 1-14 అక్షరాల యతి కుదిరింది. (హ-వ్యాలోని యకారం). ప్రాసస్థానంలో రకారమున్నది. ప్రాసయతి ఉండదు.

### 14.3 రాదగిన ప్రశ్నా విధానం :

**1) క్రింది పద్యములలో ఒకదానికి సమగ్ర వ్యాఖ్య వ్రాయండి.**

1. "తప్పిది చెప్పరాదు కవితా సమయంబున కొప్పుగాదు నీ
విప్పగిదిన్ రచింపదగునే" యన విప్రుడు చిన్నఁబోయి "నా
కప్పరమేశ్వరుడు వసుధాధిపుపై రచియించి యిచ్చినాఁ
డొప్పును దప్పు నే నెఱుగ నుత్తములార !" యటంచుఁగ్రమ్మరన్

(లేదా)

2. హరిశార్దూల మదేభ ఖడ్గ శరభవ్యాకర్ణముల్, రాక్షసో
త్కర సంచార నివాసముల్, హిమపయోధారాళ వర్షంబు, లు
ద్దుర సంఘర్షణ బాధకోపలము, లా త్రోవ, ల్సనన్శక్యమే
కరుణాసాగర ! భక్తవత్సల ! శివా ! గౌరీశ ! యెట్లొగదే !

**- డా॥ నాగభైరవ ఆదినారాయణ**
రీడర్ & ప్రిన్సిపాల్ (రిటైర్డ్)
బి.ఎస్.ఎస్.బి. డిగ్రీ కళాశాల
తాడికొండ, గుంటూరు జిల్లా

**పాఠం - 15**

# నత్కీరుడు

## - ధూర్జటి

**(శ్రీ కాళహస్తి మహాత్మ్యము - తృతీయాశ్వాసం - 148 నుండి 177వ పద్యం వరకు)**

## సందర్భసహిత వ్యాఖ్యలు

**విషయసూచిక :**


15.1 ఉద్దేశ్యం

15.2 సందర్భ సహిత వ్యాఖ్యలు

15.3 రాదగిన ప్రశ్నావిధానం


### 15.1 ఉద్దేశ్యం :

నత్కీరుడు పాఠ్యభాగంలోని ముఖ్యవాక్యముల యొక్క సందర్భాదులను తెలపడంతోపాటు, అందలి విశేషాదులను వివరించడం ఈ పాఠంయొక్క ఉద్దేశ్యం.

### 15.2 సందర్భసహిత వ్యాఖ్యలు :

**1. జగంబు వర్షశూన్యము గాగన్ :**

**పరిచయం :**

ఈ వాక్యం మహాకవి ధూర్జటిచే రచింపబడిన శ్రీకాళహస్తి మాహాత్మ్యము నుండి గ్రహింపబడిన నత్కీరుడు అనే పాఠ్యభాగములోనిది.

**సందర్భం :**

పాండ్యదేశాన్ని కవితాప్రియుడైన ఒకరాజు పాలించే సమయంలో వచ్చిన కరువును గురించి చెప్పిన వాక్యమిది.

**అర్థం :**

లోకమంతా వర్షం లేకుండా పోయింది.

**వ్యాఖ్య :**

ఆరాజు పరిపాలన చేసేరోజుల్లో పాండ్యదేశంలో గ్రహాలు వక్రంగా ఉండడంచేత వర్షాలు కురవలేదు. భయంకరమైన కరువు రావడంతో జనులు బాధపడసాగారు.

**2. ఎల్ల జనముల మనములు తల్లడిల్ల :**

**పరిచయం :**

ఈ వాక్యం మహాకవి ధూర్జటిచే రచింపబడిన శ్రీకాళహస్తి మాహాత్మ్యము నుండి గ్రహింపబడిన నత్కీరుడు అనే పాఠ్యభాగములోనిది.

**సందర్భం :**

పాండ్యదేశంలో వర్షములు లేకపోవుటను వర్ణిస్తూ కవి చెప్పిన వాక్యమిది

**అర్థం :**

ప్రజలందరి మనసులు తల్లడిల్లాయి. అని దీనికి అర్థం.

**వ్యాఖ్య :**

శని మీనంలో ప్రవేశించింది. తూర్పున తోకచుక్క కనిపించింది. వట్టి మేఘాలు కనిపించాయి. మధ్యాహ్నంలో ప్రభాత సమయంలోలాగా మంచు కురవసాగింది. రాత్రివేళ ఆకాశం నిర్మలంగా ఉంది. గాలి వీయడం లేదు. వర్షించే మేఘాలు లేవు. విదియ నాటి చంద్రుని కొమ్ము తరిగిపోయింది. కన్యారాశిలో వర్షాలు లేవు. మఖ వచ్చినా ఉరుములు లేవు. దక్షిణంలో పెద్దశబ్దాలు వినిపించాయి. వర్షాభావాన్ని తెలియజేసే ఇటువంటి విపరీతులను చూచి ప్రజలందరూ మనసుల్లో బాధపడ్డారు.

**3. మల్లెపడి చెడిపోయెన్**

**పరిచయం :**

ఈ వాక్యం మహాకవి ధూర్జటిచే రచింపబడిన శ్రీకాళహస్తి మాహాత్మ్యము నుండి గ్రహింపబడిన నత్కీరుడు అనే పాఠ్యభాగములోనిది.

**సందర్భం :**

వర్షాభావం చేత కరువురాగా, ఆ సమయంలో ప్రజలుపడిన బాధలను వర్ణిస్తూ కవి చెప్పిన పద్యమిది.

**అర్థం :**

మల్లె అనే తెగులుపడి చెడిపోయినవి.

**వ్యాఖ్య :**

అరవడులు, గంటెలు, తవిదలు, అరవైరోజుల్లోనే పండుతాయని ఆశపడి ప్రజలు ఆ పంటలు వేశారు. కానీ అవన్నీ మల్లె అనే తెగులు రావడంచేత పండక నాశనమయ్యాయి. బ్రతుకుమీద ఆశతో ఉన్న ధాన్యాన్ని విత్తితే అవి కూడా నష్టపోయారని, వారి ఆశ తీరలేదని భావం.

**4. మీన శని దోషము దాకి నిరస్త సస్యయై :**

**పరిచయం :**

ఈ వాక్యం మహాకవి ధూర్జటిచే రచింపబడిన శ్రీకాళహస్తి మాహాత్మ్యము నుండి గ్రహింపబడిన నత్కీరుడు అనే పాఠ్యభాగములోనిది.

**సందర్భం :**

కరువు కారణంచే ప్రజలు ఎలా బాధలు పడుతున్నారో వర్ణిస్తూ కవి చెప్పిన వాక్యమిది

**అర్థం :**

శని మీనరాశిలో ప్రవేశించడం అనే దోషం చేత పంటలు పండలేదు.

**వ్యాఖ్య :**

శని మీనంలో ప్రవేశించాడు. అందువలన పంటలు పండలేదు. ప్రజలు తోలు, ఎముకలు మాత్రమే మిగిలిన వారయ్యారు. తోస్తే తొంబరి చోట్ల పడిపోతున్నారు. కొందరు భార్యాబిడ్డలను విడిచి ఆకలిచే వలసపోయారు. ప్రభువు, బంటు అనే తేడా కొంచెం కూడా లేకుండా అందరూ కృశించిపోయారు. కరువు తీవ్రత కారణంగా ప్రజలు అనేక విధాలుగా కష్టాల పాలయ్యారు.

**5. జనకోటి విడుచు జీవానిలముల్ :**

**పరిచయం :**

ఈ వాక్యం మహాకవి ధూర్జటిచే రచింపబడిన శ్రీకాళహస్తి మాహాత్మ్యము నుండి గ్రహింపబడిన నత్కీరుడు అనే పాఠ్యభాగములోనిది.

**సందర్భం :**

తీవ్రమైన కరువు కారణంగా ప్రజలుపడే బాధలను వర్ణిస్తూ కవి ధూర్జటి చెప్పిన వాక్యమిది.

**అర్థం :**

ప్రజలు ప్రాణవాయువులు విడుస్తున్నారు.

**వ్యాఖ్య :**

కరువు వలన ప్రజలు బక్కచిక్కిపోయారు. తోస్తే తొంబది చోట్ల పడుతున్నారు. కొందరయితే ఆకలికి తాళలేక భార్యాబిడ్డలను విడిచి వలసపోతున్నారు. ఈవిధంగా బాధపడే ప్రజలు ఏదయినా ఒకరోజు ఆహారం లభిస్తే తిని, దప్పిక తీరక నేలమీద వాలిపోతున్నారు. అలాగే తమ ప్రాణవాయువులు విడుస్తున్నారు.

**6. పరదేశంబులకు జనిరి బ్రతుకులకొఱుకున్ :**

**పరిచయం :**

ఈ వాక్యం మహాకవి ధూర్జటిచే రచింపబడిన శ్రీకాళహస్తి మాహాత్మ్యము నుండి గ్రహింపబడిన నత్కీరుడు అనే పాఠ్యభాగములోనిది.

**సందర్భం :**

కరువు తీవ్రరూపం దాల్చగా, ఆ దేశంలోని ప్రజల పరిస్థితిని తెలియజేస్తూ ధూర్జటి చెప్పిన వాక్యమిది.

**అర్థం :**

బ్రతకడం కోసం ఇతర దేశాలకు వెళ్లారు.

వ్యాఖ్య :

కరువు వలన ఆకలిదప్పులు భరించలేక ఎందరో చనిపోయారు. కరువు ఇంకా విజృంభించింది. తినడానికి ఏమీ దొరకక పోవడంతో ప్రజలు బాధపడసాగారు. కొందరు బ్రతుకు మీద ఆశతో ఆ దేశం విడిచి పరదేశాలకు వలసపోయారు.

**7. వేయిమాడల ముడుపిచ్చు :**

**పరిచయం :**

ఈ వాక్యం మహాకవి ధూర్జటిచే రచింపబడిన శ్రీకాళహస్తి మాహాత్మ్యము నుండి గ్రహింపబడిన నత్కీరుడు అనే పాఠ్యభాగములోనిది.

**సందర్భం :**

కరువు కారణంగా ఆ నగరంలో జీవించలేక శివపూజారి మరొకచోటుకి వలసపోవాలని అనుకున్నాడు. శివుడతనిని వారించి అతనితో చెప్పిన మాటలలోదీ వాక్యం.

**అర్థం :**

వేయిమాడల ధనం ఇస్తాడు.

**వ్యాఖ్య :**

శివుడు అరవ భాషలో ఒక శృంగారపద్యాన్ని వ్రాసి పూజారికి ఇచ్చి "ఇది రాజాస్థానంలో చదువు. రాజు మెచ్చుకొని వేయిమాడల ధనం ఇస్తాడు. అది నీ ఖర్చులకు సరిపోతుంది. బాధలు తొలగుతాయి. త్వరలో వానలు కురుస్తాయి. అందరూ సుఖంగా ఉంటారు" అని చెప్పాడు.

**8. లోకమునగరే :**

**పరిచయం :**

ఈ వాక్యం మహాకవి ధూర్జటిచే రచింపబడిన శ్రీకాళహస్తి మాహాత్మ్యము నుండి గ్రహింపబడిన నత్కీరుడు అనే పాఠ్యభాగములోనిది.

**సందర్భం :**

శివుడు వ్రాసి యిచ్చిన పద్యాన్ని పూజారి సభలో చదివాడు. ఆ పద్యంలో "పార్వతీదేవి జట్టుముడి సహజంగా పరిమళం కలిగి ఉంటుంది" అనే భావం ఉంది. అది విని దానిని ఎగతాళి చేస్తూ నత్కీరుడు పలికిన మాటలలోనిదీ వాక్యము.

**అర్థం :**

లోకమంతా నవ్వుతుంది గదా !

**వ్యాఖ్య :**

పూజారి సభలో చెప్పిన పద్యంలో ఉన్న "జుట్టుముడి సహజంగా పరిమళం కలిగి ఉంటుంది" అనే భావాన్ని నత్కీరుడు అంగీకరించలేదు. ఆ విషయాన్ని లోకం అంగీకరించదని, పైపెచ్చు నవ్వుతుందని చెప్పి పూజారిని ఎగతాళి చేశాడు.

**9. ఒప్పును తప్పునేనెఱుగ :**

**పరిచయం :**

ఈ వాక్యం మహాకవి ధూర్జటిచే రచింపబడిన శ్రీకాళహస్తి మాహాత్మ్యము నుండి గ్రహింపబడిన నత్కీరుడు అనే పాఠ్యభాగములోనిది.

**సందర్భం :**

పూజారి తనకు శివుడు వ్రాసి ఇచ్చిన పద్యాన్ని సభలో చదివాడు. అందులో "జుట్టుముడి సహజంగా పరిమళం కలిగి ఉంటుంది" అనే భావం తప్పని నత్కీరుడు చెప్పిన సందర్భంలో పూజారి అన్న మాటలివి.

**అర్థం :**

ఇది తప్పో, ఒప్పో నాకు తెలియదు.

వ్యాఖ్య :

నత్కీరుడు పూజారితో "నీ పద్యభావం తప్పు. ఇలా చెప్పకూడదు. ఇది కవితా సమయానికి తగినదికాదు. నీవీ విధంగా వ్రాయకూడదు" అన్నాడు. అప్పుడు ఆ పూజారి చిన్నబోయి "ఈ పద్యాన్ని ఆ పరమశివుడు రాజుపై రచించి నాకు ఇచ్చాడు. ఇది నేను రచించినది కాదు, ఇది తప్పో, ఒప్పో నాకు తెలియదు" అని పూజారి సభలో చెప్పాడు.

**10. నిన్ను నమ్మిపోయి నిండిన సభ సిగ్గుచెడితి :**

**11. ఉన్న కథలు చెప్పనేల :**

**పరిచయం :**

ఈ వాక్యం మహాకవి ధూర్జటిచే రచింపబడిన శ్రీకాళహస్తి మాహాత్మ్యము నుండి గ్రహింపబడిన నత్కీరుడు అనే పాఠ్యభాగములోనిది.

**సందర్భం :**

శివుడు వ్రాసి ఇచ్చిన పద్యాన్ని సభలో పూజారి చదివాడు. నత్కీరుడు ఆ పద్యంలో తప్పున్నదని అన్నాడు. తప్పొప్పులు తనకు తెలియవని, తనకాపద్యం పరమశివుడు వ్రాసి యిచ్చాడని చెప్పి పూజారి తిరిగివచ్చి శివునితో అన్న మాటలు ఇవి.

**అర్థం :**

1. నిన్ను నమ్మి వెళ్ళాను. నిండు సభలో అవమానం పొందాను.
2. ఇంకా జరిగిన విషయాలు చెప్పడం ఎందుకు ?

**వ్యాఖ్య :**

సభ నుండి తిరిగివచ్చిన పూజారి శివుని చూచాడు. శివుడు వ్రాసి ఇచ్చిన పద్యాన్ని అతనికి అప్పగించాడు. అతనితో "నిన్ను నమ్మి సభకు వెళ్ళాను. నిండు సభలో నీ కారణంగా అవమానం పొందాను. ఇంకా సభలో జరిగిన విషయాలన్నీ చెప్పడం ఎందుకు ? అని అన్నాడు.

**12. పౌరుష గర్వము బోనాడుకొంటి :**

**పరిచయం :**

ఈ వాక్యం మహాకవి ధూర్జటిచే రచింపబడిన శ్రీకాళహస్తి మాహాత్మ్యము నుండి గ్రహింపబడిన నత్కీరుడు అనే పాఠ్యభాగములోనిది.

**సందర్భం :**

శివుడు వ్రాసి ఇచ్చిన పద్యాన్ని సభలో చదివి, నత్కీరునిచే అవమానింపబడిన పూజారి తిరిగివచ్చి, తనకు శివుడిచ్చిన పద్యాన్ని అతనికి తిరిగిఇచ్చి చెప్పిన మాటలలోనిదీ వాక్యం.

**అర్థం :**

"నిన్ను నమ్మి సభలోకి వెళ్ళాను. నిండు సభలో అవమానానికి గురిఅయ్యాను. నీవు సర్వజ్ఞుడవి, ఏ పనినయినా సమర్థవంతంగా నిర్వహించగలవని నిన్ను నమ్మి సభకు వెళ్ళి అక్కడ నీ పౌరుషాన్ని, గర్వాన్ని పోగొట్టుకొని అవమానింపబడ్డాను" అని పూజారి శివునితో అన్నాడు.

## 13. పరవిద్యాధీనత భూపాలసభల దేజముగలదే :

## 14. క్షామవ్యధ కొలది కాదు :

**పరిచయం :**

ఈ వాక్యం మహాకవి ధూర్జటిచే రచింపబడిన శ్రీకాళహస్తి మాహాత్మ్యము నుండి గ్రహింపబడిన నత్కీరుడు అనే పాఠ్యభాగములోనిది.

**సందర్భం :**

శివుడిచ్చిన పద్యాన్ని సభలో అవమానింపబడిన పూజారి తిరిగివచ్చి, శివుడిచ్చిన పద్యాన్ని తిరిగి ఇచ్చి శివునితో తన అవమానాన్ని గురించి చెప్పిన సందర్భములోనివీ వాక్యాలు.

**అర్థం :**

1) ఇతరుల విద్య మీద ఆధారపడితే రాజసభలో గౌరవం ఉంటుందా ?

2) కరవు వలన కలిగే బాధతో ఇది సమానం కాదు. అంతకంటే అధికమయింది.

**వ్యాఖ్య :**

పూజారి శివునితో "నిన్ను నమ్మి పోయి సభలో అవమానం చెందాను. నీవు సర్వజ్ఞుడవని నమ్మి నా పౌరుషాన్ని గర్వాన్ని పోగొట్టుకున్నాను. ఎవరికయినా తనకు తెలిసిన విద్యను రాజాస్థానంలో ప్రదర్శిస్తే కీర్తి వస్తుంది కాని, ఇతరుల విద్య మీద ఆధారపడితే గౌరవం ఎలా వస్తుంది ? నీ మాటను నమ్మిపోయి మోసపోయాను. నత్కీరునిచే నేను పొందిన అవమానపు బాధ క్షామవ్యధ కంటే ఎంతో పెద్దది సుమా !" అని చెప్పి బాధపడ్డాడు.

## 15. భద్రం బగునీకు :

**పరిచయం :**

ఈ వాక్యం మహాకవి ధూర్జటిచే రచింపబడిన శ్రీకాళహస్తి మాహాత్మ్యము నుండి గ్రహింపబడిన నత్కీరుడు అనే పాఠ్యభాగములోనిది.

**సందర్భం :**

సభలో అవమానింపబడి తిరిగివచ్చిన పూజారి శివునితో తన అవమానాన్ని గురించి చెప్పి, నగరం నుండి వెళ్ళిపోతూ చెప్పిన మాటలలోనిదీ వాక్యం.

**అర్థం :**

నీకు క్షేమమగుగాక !

**వ్యాఖ్య :**

పూజారి బయలుదేరబోతూ "నా అదృష్టం ఇట్లా ఉంటే నిన్ను, నత్కీరుని నిందించడం ఎందుకు ? ఇంక చాలు. ఈ కరవు వల్ల ఇట్లా అయ్యాను. ఎక్కడికయినా వెళ్ళి యాచనతో కడుపు నింపుకుంటాను. కరవు తీరిన తరువాత తిరిగివస్తాను. దేవా ! నీకు మేలు కలుగుగాక ! నన్ను పంపించు'' అని శివునితో అన్నాడు.

**16. ఊరికె తప్పుపట్టెనట :**

**17. చక్కం జెప్పుడా తప్పునన్ :**

**పరిచయం :**

ఈ వాక్యాలు మహాకవి ధూర్జటిచే రచింపబడిన శ్రీకాళహస్తి మాహాత్మ్యము నుండి గ్రహింపబడిన నత్కీరుడు అనే పాఠ్యభాగములోనిది.

**సందర్భం :**

శివుడు చెప్పి ఇచ్చి పంపిన పద్యంలో తప్పు ఉన్నదని నత్కీరుడు చెప్పినందుకు బాధపడి పూజారి తిరిగివచ్చి ఆ విషయాన్ని శివునికి తెలియజేశాడు. అందుకు కోపించిన శివుడు పూజారిని తీసుకొని రాజసభకు వెళ్ళి పలికిన మాటలలోనివీ వాక్యాలు.

**అర్థం :**

1) తప్పులేకపోయినా కారణం లేకుండా తప్పుపట్టాడు.
2) తప్పుంటే ఆ తప్పు ఏమిటో చెప్పవలసినది.

**వ్యాఖ్య :**

శివుడు పూజారితో రాజసభకు వచ్చి "నేనీ రాజుమీద మాధుర్యంతో కూడిన పద్యం చెప్పి పంపాను. ఆ పద్యం విని ఈర్ష్యతో నత్కీరుడు తప్పు లేకపోయినా కారణం లేకుండా తప్పు అన్నాడు. ఒకవేళ తప్పుంటే ఆ తప్పు వ్యాకరణం ప్రకారమా ? అలంకారం ప్రకారమా ? పదబంధంలో తప్పా ? రసదోషమా ? చెప్పవలసినది'' అని అడిగాడు.

**18. గగన ప్రసూనవాదము :**

**జగతిం బ్రత్యక్షమునకు సరియన దగునే ?**

**పరిచయం :**

ఈ వాక్యం మహాకవి ధూర్జటిచే రచింపబడిన శ్రీకాళహస్తి మాహాత్మ్యము నుండి గ్రహింపబడిన నత్కీరుడు అనే పాఠ్యభాగములోనిది.

**సందర్భం :**

శివుడు తాను చెప్పిన పద్యంలో తప్పేమిటో చెప్పవలసిందని రాజసభలో ప్రశ్నించాడు. ఆ సందర్భంగా శివనత్కీరులకు జరిగిన సంభాషణలో నత్కీరుడు అన్న మాట ఇది.

**అర్థం :**

గగన ప్రసూనము (శూన్యము) అనే వాదం భూమిపై ప్రత్యక్షంగా చెల్లదు.

**వ్యాఖ్య :**

నత్కీరుడు తప్పు అనగా "పార్వతీదేవి కురులు సహజంగానే పరిమళంతో కూడి ఉంటాయని శివుడు అన్నాడు. పార్వతి కురులు పరిమళం కలిగి ఉన్నా, అది భూమిపై మగువలకు తగదు. ఆకాశం శూన్యంగా ఉంటుంది కాబట్టి భూమి కూడా శూన్యంగా ఉంటుంది అనడం ఎంత తప్పో అలాగే కైలాసంలో ఉండే పార్వతి కురులు సుగంధం కలిగి ఉంటాయి కాబట్టి భూమిపై గల స్త్రీలు కురులు కూడా సుగంధం కలిగి ఉంటాయని చెప్పడం అంతే తప్పు" అని నత్కీరుడు వాదించాడు.

### 19. మాయావిలాసములు పనికిరావు, విడువుము

**పరిచయం :**

ఈ వాక్యం మహాకవి ధూర్జటిచే రచింపబడిన శ్రీకాళహస్తి మాహాత్మ్యము నుండి గ్రహింపబడిన నత్కీరుడు అనే పాఠ్యభాగములోనిది.

**సందర్భం :**

నత్కీరుడు శివునితో వాదించగా శివునికి కోపం వచ్చింది. శివుడు కోపంతో తన సహజరూపం చూపించాలి అనుకున్నాడు. తన లలాటంలో ఉన్న మూడవకన్ను చూపించాడు. అప్పుడు నత్కీరుడు అన్న మాటలలోనిదీ వాక్యం.

**అర్థం :**

మాయతో కూడిన ఆటలు ఇక్కడ పనికిరావు. విడిచిపెట్టు.

**వ్యాఖ్య :**

శివుడు మూడవకన్ను చూపగా "మూడు కళ్ళేకాదు, తల చుట్టూ కన్నులున్నా పద్యంలో తప్పులేదని చెప్పను. నీ మాయతో కూడిన ఆటలు ఇక్కడ పనికిరావు. విడిచిపెట్టు" అని నత్కీరుడు అన్నాడు.

### 20. కుష్ఠవ్యాధిం దపియింపుము :

**పరిచయం :**

ఈ వాక్యం మహాకవి ధూర్జటిచే రచింపబడిన శ్రీకాళహస్తి మాహాత్మ్యము నుండి గ్రహింపబడిన నత్కీరుడు అనే పాఠ్యభాగములోనిది.

**సందర్భం :**

తాను చెప్పిన పద్యం తప్పు అనడమే కాక స్వయంగా తాను వెళ్ళి చెప్పినా లెక్కచేయక ఎదిరించిన నత్కీరుని శపిస్తూ శివుడు అన్నమాటలివి.

**అర్థం :**

కుష్ఠవ్యాధితో బాధపడుము.

**వ్యాఖ్య :**

నత్కీరుడు తను చెప్పిన పద్యంలో తప్పు ఉందని అనడంతో శివుడు స్వయంగా రాజసభకు వెళ్ళి పార్వతి జుట్టు సహజగంధమని అన్నాడు. అది భూలోక వనితలకు చెల్లదని నత్కీరుడు వాదించాడు. శివుడు మూడవకన్ను చూపించాడు. తలచుట్టూ కన్నులు చూపినా పద్యం తప్పే అన్నాడు నత్కీరుడు. శివునికి కోపం వచ్చింది. "కుష్ఠవ్యాధితో బాధపడుము" అని శివుడు నత్కీరుని శపించాడు.

**21. ద్రోహము చేసితిన్,**

**22. తెలుపవే శాపాంతము**

**పరిచయం :**

ఈ వాక్యం మహాకవి ధూర్జటిచే రచింపబడిన శ్రీకాళహస్తి మాహాత్మ్యము నుండి గ్రహింపబడిన నత్కీరుడు అనే పాఠ్యభాగములోనిది.

**సందర్భం :**

శివుడు శపించినందుకు భయపడిన నత్కీరుడు భయంతో శివుని శరణు వేడుచూ పలికిన మాటలివి.

**అర్థం :**

1) నేను తప్పు చేశాను.

2) శాపం తొలగే మార్గం చెప్పండి.

**వ్యాఖ్య :**

నత్కీరుడు తనను ఎదిరించి మాట్లాడటంతో శివునికి కోపం వచ్చింది. కుష్ఠవ్యాధి పీడితుడవు కమ్మని శపించాడు. నత్కీరుడు భయపడ్డాడు. "స్వామీ ! నేను తప్పు చేశాను. శాపావధి తెలపండి" అంటూ శివుని పాదాల మీద పడ్డాడు.

**22. కైలాసశైలంబు గంటే మాను :**

**పరిచయం :**

ఈ వాక్యం మహాకవి ధూర్జటిచే రచింపబడిన శ్రీకాళహస్తి మాహాత్మ్యము నుండి గ్రహింపబడిన నత్కీరుడు అనే పాఠ్యభాగములోనిది.

**సందర్భం :**

తాను తప్పు చేశానని పాదాలమీద పడిన నత్కీరుని క్షమించి శివుడతనితో అన్న మాటలివి.

**అర్థం :**

నువ్వు కైలాసపర్వతాన్ని చూచినప్పుడు శాపం తొలగిపోతుంది.

**వ్యాఖ్య :**

కుష్ఠవ్యాధిని పొందుదువని శివుడు శపించినప్పుడు నత్కీరుడు భయపడ్డాడు. తప్పు చేశానని, శాపాంతం తెలుపమని శివుని పాదాల మీద పడి ప్రార్థించాడు. కరుణా సముద్రుడైన శివుడు నత్కీరుని క్షమించి "నీవు కైలాసపర్వతాన్ని చూచినప్పుడు నీ రూపం తొలగిపోతుంది" అని శాపాంతాన్ని తెలియజేశాడు.

**23 కన్నది గాని, విన్నయది కాదు :**

**పరిచయం :**

ఈ వాక్యం మహాకవి ధూర్జటిచే రచింపబడిన శ్రీకాళహస్తి మాహాత్మ్యము నుండి గ్రహింపబడిన నత్కీరుడు అనే పాఠ్యభాగములోనిది.

**సందర్భం :**

శివునిచే శపింపబడిన నత్కీరుడు, శివుని ప్రార్థించి శాపాంతం తెలుసుకున్నాడు. ఆ తరువాత తన మనస్సులో బాధపడుతూ అనుకున్న మాటలివి.

**అర్థం :**

దాని గురించి విన్నాను తప్ప చూడలేదు.

**వ్యాఖ్య :**

కుష్ఠవ్యాధితో బాధపడుమని చెప్పిన శివుడు, నత్కీరుడు ప్రార్థించడంతో కరుణించి, కైలాసపర్వతాన్ని చూచినప్పుడు శాపం తొలగిపోతుందని చెప్పాడు. నదులు, అడువులు, కొండలు, బోయవాళ్ళు, క్రూరమృగాలు ఇలా ఎన్నింటినో దాటి వెళితేనే కైలాసపర్వతం కనిపిస్తుందని, తాను దాని గురించి వినడం తప్ప గతంలో చూడలేదని నత్కీరుడు వాపోయాడు. దానిని ఎలా దర్శించాలో అని బాధపడ్డాడు.

**24. హరుని వాక్యంబు శక్యమే పరిహరింప :**

**పరిచయం :**

ఈ వాక్యం మహాకవి ధూర్జటిచే రచింపబడిన శ్రీకాళహస్తి మాహాత్మ్యము నుండి గ్రహింపబడిన నత్కీరుడు అనే పాఠ్యభాగములోనిది.

**సందర్భం :**

తాను కుష్ఠవ్యాధితో బాధపడక ముందే వెళ్ళి కైలాస పర్వతాన్ని చూడాలని అనుకుంటూ నత్కీరుడు అన్న మాటలివి.

**అర్థం :**

శివుని మాటను దాటటం సాధ్యంకాదు.

**వ్యాఖ్య :**

"కుష్ఠవ్యాధి సోకితే శరీరం తిమ్మిరెక్కుతుంది. శరీరం మీద మచ్చలు వస్తాయి. శరీరం మందంగా మారుతుంది. బుడుపులు ఏర్పడతాయి. శరీరానికి అలసట వస్తుంది. అది అసహ్యంగా తయారవుతుంది. చీము నెత్తురు కారుతుంటాయి. ఈగలు వాలుతాయి. యాచించటానికి వెళితే జనులు అసహ్యించుకుంటారు. ఇవేమీ జరుగకముందే నడువగలిగినపుడే వెళ్ళి కైలాస పర్వతాన్ని చూడాలి" అనుకున్న నత్కీరుడు "శివుని శాపాన్ని దాట లేము కదా ! వెళ్ళక తప్పదు" అనుకున్నాడు.

**15.3 రాదగిన ప్రశ్నా విధానం :**

**ఈ క్రింది వానిలో రెండింటికి సందర్భసహిత వ్యాఖ్యలు వ్రాయండి.**

1. ఎల్లజనములు మనములు తల్లడిల్ల
2. వేయిమాడల ముడుపిచ్చు
3. మాయా విలాసనములు పనికిరావు, విడువుము.
4. హరుని వాక్యంబు శక్యమే పరిహరింప.

**- డా॥ నాగభైరవ ఆదినారాయణ**
రీడర్ & ప్రిన్సిపాల్ (రిటైర్డ్)
బి.ఎస్.ఎస్.బి. డిగ్రీ కళాశాల
తాడికొండ, గుంటూరు జిల్లా

పాఠం - 16

# నత్కీరుడు

## - ధూర్జటి

### (శ్రీ కాళహస్తి మహాత్మ్యము - తృతీయాశ్వాసం - 148 నుండి 177వ పద్యం వరకు)

### ప్రశ్నలు - జవాబులు

**విషయసూచిక :**

16.1 ఉద్దేశ్యం
16.2 ప్రశ్నలు - జవాబులు
16.3 రాదగిన ప్రశ్నలు

**16.1 ఉద్దేశ్యం :**

నత్కీరుడు అనే పాఠ్యభాగంలోని అర్థ తాత్పర్యాలను, సమగ్ర వ్యాఖ్యలను, సందర్భసహిత వ్యాఖ్యలను, తెలుసుకోవడంతోపాటు ఆయా పాత్రల మనస్తత్వాలను, ధూర్జటి కవిత్వంలోని విశేషాలను తెలుసుకున్నప్పుడే పాఠ్యభాగాన్ని సమగ్రంగా అర్థం చేసుకోవడం సాధ్యమవుతుంది. అందుచే ఈ పాఠంలో వ్యాసరూప ప్రశ్నల ద్వారా విద్యార్థికి ఆయా విషయాలు అర్థమయ్యేటట్లు చేయడమే ఈ పాఠం యొక్క ఉద్దేశ్యం.

**16.2 ప్రశ్నలు - జవాబులు :**

**1. "నత్కీరుడు" పాఠ్యభాగ కథను తెలపండి**
**(లేదా)**
**"నత్కీరుడు" పాఠంలోని వృత్తాంతాన్ని తెలియజేయండి**
**(లేదా)**
**"నత్కీరుడు" ఇతివృత్తాన్ని వివరించండి.**

నత్కీరుడు మధురాపురాన్ని పాలించే పాండ్యరాజు ఆస్థానంలో కవి. ఆ రాజాస్థానంలో ఒక శంఖపీఠి ఉండేది. అది తరతరాలుగా వున్న శంఖం. సరస్వతీదేవితో సమానులైన కవులెందరికైనా ఆ శంఖపీఠిపై కూర్చుండడానికి అవకాశం వుండేది. ఆ పాండ్యరాజు పాలించే కాలంలో ఆ శంఖపీఠిపై పన్నెండుమంది కవులుండేవారు. వారిలో నత్కీరుడు ముఖ్యుడు.

గ్రహాలు వక్రంగా చూడడంతో ఆ రాజ్యంలో వర్షాలుపడక కరవు వచ్చింది. కరవు కారణంగా ప్రజలు ఆకలితో అల్లాడసాగారు. కరవు తీవ్రరూపం ధరించడంతో కొంతమంది రాజ్యాన్ని విడిచి పరదేశాలకు వలసపోయారు. ఆ నగరంలో ఉన్న శివబ్రాహ్మణుడు ఒకడు క్షుద్బాధ భరించలేక ఎక్కడికయినా వలస పోవాలనుకున్నాడు. శివుడు అతనికి ప్రత్యక్షమై శృంగార భరితమైన ఒక పద్యాన్ని రాజుమీద చెప్పి యిచ్చి "నీవీ పద్యాన్ని తీసుకొని వెళ్ళి రాజాస్థానంలో చదువు. రాజు నిన్ను మెచ్చుకుంటాడు. వేయిమాడల ధనం బహుమతిగా ఇస్తాడు. ఆ సొమ్ముతో జీవించు. త్వరలో వానలు కురుస్తాయి. పంటలు పండుతాయి. ప్రజలు ఆనందిస్తారు'' అన్నాడు.

పూజారి శివుడు చెప్పినట్లే పద్యాన్ని తీసుకొని రాజుగారి సభకు వెళ్ళాడు. శివుడిచ్చిన పద్యాన్ని చదివి వినిపించాడు. ఆ పద్యంలో "ఏనుగు నడక వంటి నడకగల యువతి జుట్టు సహజంగా సువాసనతో కూడి ఉంటుంది'' అనే భావం ఉంది. ఆ పద్యాన్ని సభలో ఉన్న పండితులు అందరూ విన్నారు. కానీ నత్కీరుడు ఎగతాళి చేస్తూ "జుట్టు సహజంగా సువాసనతో

కూడి ఉంటుంది అంటే లోకులు నవ్వుతారు ఇది తప్పు. ఈ విధంగా చెప్పకూడదు. ఈవిధంగా చెప్పడం కవితా సమయం కాదు" అని పలికాడు. పూజారి సిగ్గుపడుతూ "ఈ పద్యాన్ని నేను వ్రాయలేదు. పరమశివుడు రచించి ఈ పద్యం నాకు ఇచ్చాడు. ఇది తప్పో, ఒప్పో నాకు తెలియదు" అని చెప్పి రాజసభ నుండి వెళ్ళిపోయాడు.

శివాలయానికి తిరిగి వచ్చిన పూజారి శివుడు తనకిచ్చిన పద్యాన్ని తిరిగి ఇచ్చి "ఓ ఈశ్వరా ! నిన్ను నమ్మి సభకు వెళ్ళాను. సభలో అవమానాన్ని పొందాను. నువ్వు సర్వజ్ఞుడవని, ఏ పనినయినా సమర్థవంతంగా చేయగలవాడని నమ్మి, సభకు వెళ్ళి, నా పౌరుషాన్ని గర్వాన్ని పోగొట్టుకున్నాను. భయంకరమైన అవమానానికి గురి అయ్యాను. ఎవరైనా తనకు తెలిసిన విద్యను రాజాస్థానంలో ప్రదర్శిస్తే కీర్తి వస్తుంది గాని ఇతరుల విద్యపై ఆధారపడితే నాలాగా అవమానాలపాలు కావలసిందే గదా ! నేను రాజసభలో పొందిన అవమానపు దుఃఖం క్షామం వలన పొందిన దుఃఖం కంటే పెద్దది. నేను దురదృష్టవంతుడను. నా దురదృష్టానికి నిన్నుగాని, నత్కీరునిగాని నిందించవలసిన పనిలేదు. నేను ఎక్కడికయినా వెళ్ళి యాచనజేస్తూ జీవిస్తాను. ఈ కరవు వెళ్ళిన తరువాత తిరిగివస్తాను. స్వామీ ! నీవు క్షేమంగా ఉండు. నన్ను పంపించు" అని అన్నాడు.

శివుడు "నత్కీరుడు నా కవితలో తప్పుపట్టాడా ? సభకు పోదాంపద! పద్యంలోని తప్పేమిటో తేల్చుకుందాం" అని పూజారిని తీసుకొని రాజసభకు వెళ్ళాడు. రాజాస్థానంలో శివుడు "నేను ఈ రాజు మీద మధురమైన పద్యాన్ని, ఎంతో ప్రౌఢమైన భావంతో చెప్పి పంపాను. అది విని నత్కీరుడు ఈర్ష్యతో ఆ పద్యంలో తప్పు ఉందని అన్నాడట. ఆ తప్పు వ్యాకరణంలోనా? అలంకారములోనా? పదాల కూర్పులోనా ? రసంలోనా ? తప్పు ఎక్కడో నిరూపించండి" అని అడిగాడు. నత్కీరుడు అంతకుపూర్వం పూజారితో చెప్పినట్లుగానే మరలా అదే తప్పును శివునికి తెలియజేశాడు. అందుకు సమాధానంగా శివుడు "పార్వతీదేవి జుట్టు సహజంగానే సువాసనతోకూడి ఉంటుంది. అందుకే ఆవిధంగా చెప్పాను" అని అన్నాడు. "పార్వతి జుట్టు సుగంధంతో ఉంటే ఉండవచ్చు, అది భూలోకంలోని స్త్రీలకు వర్తించదు. ఈ లోకంలోని స్త్రీల జుట్టు సహజ పరిమళం కలిగి ఉండదు" అని నత్కీరుడు చెప్పాడు. ఇంకా మోసపు మాటలు కట్టిపెట్టు" అని శివునితో అన్నాడు.

ఆ మాటలతో శివుడు కోపించి తన మూడవకన్ను చూపించాడు. అందుకు నత్కీరుడు "నుదుటనే కాదు, తల చుట్టూ కన్నులున్నా పద్యం తప్పే. నీ మాయలు కట్టిపెట్టి వెళ్ళిపో !" అని శివుని నిందించాడు. శివుడు వెంటనే "నీవు కుష్ఠవ్యాధితో బాధపడు" అని నత్కీరుని శపించాడు. ఆ శాపంతో నత్కీరుడు భయంతో వణికిపోతూ "స్వామీ ! ద్రోహం చేశాను. నన్ను మన్నించు. శాపం తొలగిపోయే మార్గాన్ని ఉపదేశించు" అంటూ శివుని పాదాల మీద పడి వేడుకున్నాడు. శివుడు కరుణించి "నువ్వు ఎప్పుడు కైలాసపర్వతాన్ని చూస్తావో, అప్పుడు నీ శాపం తొలగిపోతుంది" అని శాపవిముక్తి గురించి చెప్పాడు.

నత్కీరుడు పశ్చాత్తాపంతో "నేను కవిత్వ విషయంలో గర్వాన్ని ప్రదర్శించాను. శంఖపీఠిపై మిగిలిన కవుల వలే ఉండక దేవునితో చార్వాకం చేశాను. దాని ఫలితంగా శాపాన్ని పొందాను కుష్ఠవ్యాధి వలన కలిగే దుఃఖాన్ని ఎలా భరించగలను? కైలాసాన్ని ఎప్పుడు చూడాలి ? దానిని చూడాలంటే ఎన్నో నదులు, కొండలు, బోయపల్లెలు, క్రూరజంతువులు, జనసంచరంలేని దారులు దాటి వెళ్ళాలి. ఆ పర్వతం గురించి వినడం తప్ప చూచి ఎరుగను ? ఇప్పుడు ఏమి చేయాలి ? ఓ పరమేశ్వరా! నేను వెళ్ళే మార్గాలు సింహాలు, పులులు, మదించిన ఏనుగులు, ఖడ్గమృగాలు, శరభాల వంటి క్రూరజంతువులతో కూడి ఉంటాయి. రాక్షస మూకలు తిరుగుతుంటాయి. మంచు, నీరు ధారాళంగా కురుస్తుంటాయి. భయంకరమైన రాళ్ళతో నిండి ఉంటాయి. వీటినన్నింటిని దాటి నేను వెళ్ళగలనా ?" అని బాధపడ్డాడు.

"కుష్ఠరోగం వస్తే శరీరం తిమ్మిరెక్కుతుంది. శరీరం నిండా మచ్చలు ఏర్పడతాయి. చర్మం మందంగా తయారవుతుంది. బుడుపులు ఏర్పడి అందవికారంగా అవుతుంది. అలసత్వం ఏర్పడుతుంది. శరీరం నుంచి చీము,

నెత్తురు కారుతాయి. ఈగలు ముసురుతాయి. అందరూ అసహ్యించుకుంటారు. ఇవేవీ జరక్కముందే కైలాసపర్వతాన్ని చూడటానికి బయలుదేరాలి. శివుని శాపాన్ని తప్పించుకోలేముగదా ?" అనుకొని బయలుదేరాడు. కైలాస పర్వతాన్ని దర్శించి, శివుని మెప్పించి మోక్షాన్ని సంపాదించాడు.

**2. మధురానగరంలో వచ్చిన కరువును వర్ణించండి.**

**(లేదా)**

**ధూర్జటి కరువును వర్ణించిన విధానాన్ని వ్రాయండి.**

**(లేదా)**

**నత్కీరుని కథలో కరువు వలన ఏర్పడిన పరిస్థితులను వివరించండి.**

గ్రహాలు వక్రంగా చూడడంతో మధురాపురంలో వర్షాలు కురవలేదు. కరవు వచ్చింది. ప్రజలు కరవుతో బాధపడసాగారు. శని మీనరాశిలో ప్రవేశించింది. తూర్పుదిక్కున తోకచుక్క కనిపించింది. వర్షాలు కురిపించలేని వట్టి మేఘాలు తిరుగసాగాయి. ప్రభాత సమయంలో ఎలా మంచు కురుస్తుందో, అదేవిధంగా మధ్యాహ్నసమయాల్లో ప్రతిరోజూ మంచుపడడం మొదలయింది. రాత్రులలో ఆకాశం నిర్మలమయింది. గాలి వీయడంలేదు. విదియ నాటి చంద్రవంక రెండు కొసలలో ఒకటి తరిగిపోయింది. కన్యారాశి వచ్చినా చినుకులు రాలలేదు. మఖకార్తె ప్రవేశించినా ఉరుములు వినిపించడంలేదు. ఈ అపశకునాలతో వానలు కురవక ప్రజలందరూ విలవిలలాడారు.

వానలు లేకపోవడంతో పంటలు పండడంలేదు. పంటలు లేకపోవడంతో ప్రజలకు ఆహారం దొరకడంలేదు. ఊదర్లు, బరపటలు, గోళ్ళగొండులు, అల్లిబియ్యం, వెదురుబియ్యం, గొట్టెచెట్లు, వింజెట్లు, తుంగముస్తియలు, ఈతగుంజు మొదలైన తినడానికి యోగ్యంకానివి కూడా ప్రజలు తినసాగారు. అరవడు, గంటె తవిద మొదలైన పంటలయితే ఆరునెలలలో పండుతాయనే ఆశతో ఆయా పైర్లను వేశారు గాని, అవన్నీ మల్లె అనే తెగులుపడి చెడిపోయాయి.

శని మీనరాశిలో ప్రవేశించడం అనే దోషంచేత వానలులేక పంటలు పండలేదు. కరవు ప్రభావంతో కొందరు ప్రజలు తోలు, ఎముకలు మిగిలి తోస్తే తొంబదిచోట్ల తూలిపడుతున్నారు. కొంతమంది ఆ ఆకలిని తాళలేక ఆలు బిడ్డలను విడిచి నగరాన్ని విడిచి మరొక చోటుకు వలస పోతున్నారు. రాజు సేవకుడు అనే భేదం లేకుండా ఆకలిని ప్రజలంతా క్షీణించసాగారు. ఒక్కోరోజు ఎవరికైనా తినడానికి, కొంచెం ఆహారం దొరికినా, త్రాగడానికి నీరు దొరకక దప్పికతో ప్రాణాలు విడువసాగారు. కరువు క్రమంగా తీవ్రమయింది. తినకూడని చెట్లకాయలు కొంతమంది తింటుంటే మరికొంతమంది బ్రతుకుమీది ఆశతో పరదేశాలకు వలసపోతున్నారు.

ఇది మధారానగరంలోని కరవును ధూర్జటి వర్ణించిన విధం. కరవు కారణంచే ప్రజలు ఎన్ని బాధలుపడ్డారో, ఎలా ప్రాణాలు విడిచారో ధూర్జటి హృదయవిదారకంగా వర్ణించాడు.

కరువు కారణంగా కథలో ప్రధానమైన ఒక మలుపు ఉంది. ఈ కరవు కారణంచేతనే పూజారి గ్రామాంతరానికి వలస వెళ్ళాలనుకున్నాడు. అతనిని ఆపడం కోసమే శివుడు అతనికి పద్యాన్ని వ్రాసియిచ్చి రాజసభకు పంపించాడు. అక్కడే నత్కీరుడు ఆ పద్యాన్ని విమర్శించి, పూజారిని అవమానించాడు. అందుకు కోపించిన శివుడు సభకు వెళ్ళి నత్కీరునితో వాదించాడు. నత్కీరుని మాటలతో కోపించి నత్కీరుని "కుష్ఠవ్యాధి పీడితుడవు కమ్ము" అని శపించాడు. నత్కీరుడు పశ్చాత్తాపంతో ప్రార్థించడంతో కైలాస పర్వత దర్శనంతో శాపవిముక్తి కలుగుతుందని శివుడు అతనికి వరమిచ్చాడు. నత్కీరుడు వెంటనే వెళ్ళి కైలాస శిఖరాన్ని దర్శించి శాపం నుండి విముక్తి పొందడంతోపాటు శివుని కృపకుపాత్రుడై మోక్షాన్ని పొందాడు. అందుచేత నత్కీరుని మోక్షానికి మూలం ఈ కరువే అని భావించవచ్చు.

ఈ విధంగా కరవు ఈ కథలో ప్రధానమైన పాత్రను పోషించింది.

**3. "నత్కీరుడు" అనే పాఠ్యభాగం ఆధారంగా నత్కీరుని గుణశీలాలను వివరించునది**

**(లేదా)**

**ధూర్జటి నత్కీరుని పాత్ర పోషణలో చూపిన నేర్పును తెలపండి**

**(లేదా)**

**నత్కీరుని ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని వివరించండి.**

"నత్కీరుడు'' అనే ఈ పాఠ్యభాగం ధూర్జటి రచించిన శ్రీకాళహస్తి మాహాత్మ్యము, తృతీయాశ్వాసం నుండి గ్రహింపబడినది. శ్రీకాళహస్తి మాహాత్మ్యము శ్రీకాళహస్తిలో వెలసియున్న శ్రీకాళహస్తీశ్వరుని మహిమలను వెల్లడించే ఒక క్షేత్ర మాహాత్మ్యము. శ్రీ కాళహస్తీశ్వరుని మహిమను తెలియజేసే ఒక కథ నత్కీరుడు.

నత్కీరుడు మధురాపురాన్ని పాలించే పాండ్యరాజు ఆస్థానంలో ఉండే గొప్ప కవి. ఆ రాజు ఆస్థానంలో ఒక శంఖపీఠి ఉండేది. సరస్వతీదేవితో సమానమైన పాండిత్యం కలిగిన పండితులకు మాత్రమే ఆ శంఖపీఠిపై కూర్చునే అర్హత ఉండేది. నత్కీరుడు జీవించిన కాలంలో ఆ శంఖపీఠిపై పన్నెండుమంది కవి పండితులు ఉండేవారు. వారిలో నత్కీరుడు ఒకడు. దీనినిబట్టి నత్కీరుడు ఎంత గొప్ప పండితుడో తెలుసుకోవచ్చు. అమృతమయమయిన కావ్యాలు వ్రాయడంలో దిట్ట. నత్కీరుడు తదితర కవులు తన ఆస్థానంలో ఉండడం వల్లనే ఆరాజు తన ఆస్థానంలో కవిత్వం చదివి మెప్పించిన వారికి వేయి మాడలు బహుమానంగా ఇచ్చేవాడు.

నత్కీరుడు గొప్ప కవేకాదు, గొప్ప విమర్శకుడు కూడా. కరవు కారణంగా వలసపోవడానికి సిద్ధపడిన పూజారిని ఆపడం కోసం శివుడు ఒక పద్యాన్ని రాజు మీద వ్రాసి ఇచ్చాడు. దానిని రాజసభలో చదివి, రాజిచ్చే వేయిమాడలు బహుమానంతో జీవించమన్నాడు. ఆ పూజారి రాజసభలో ఆ పద్యాన్ని వినిపించాడు. అందులో "ఏనుగు నడక వంటి నడకలు గల యువతి జుట్టునుండి సహజంగానే పరిమళవంతంగా ఉంటుంది'' అనే భావం ఉంది. లోకంలో ఎవరి జుట్టు అయినా పరిమళవంతం కాదు అనే విషయం తెలిసినవాడు కాబట్టే నత్కీరుడు దానిని ఖండించాడు. ఆ భావం తప్పని, అది లోక విరుద్ధమని, కవితా సమయం కాదని చెప్పాడు. ఇది నత్కీరుని లోక పరిశీలనాశక్తిని వెల్లడిస్తుంది.

నత్కీరుడు క్షణక్షణానికి అభిప్రాయాలు మార్చుకునేవాడు కాదు. నిశ్చితమైన అభిప్రాయాలు కలవాడు. తన అభిప్రాయాలను నిర్భయంగా, తార్కికంగా, ఎవరితోనైనా, చివరకు భగవంతునితోనైనా చెప్పగలిగిన ధైర్యశాలి. పూజారి రాజసభలో చదివిన పద్యం తప్పని నత్కీరుడు అన్నాడు. పూజారి ఆ విషయాన్ని శివునితో చెప్పి తనకు అవమానం జరిగిందని తాను ఊరు విడిచిపోతానని చెప్పినప్పుడు, శివుడు అతనిని తీసుకొని రాజాస్థానానికి వచ్చాడు. తాను రాజు మీద మాధుర్యం, ప్రేమతో కూడిన పద్యం వ్రాసి పంపామని, నత్కీరుడు ఈర్ష్యతో ఆ పద్యం తప్పని చెప్పాడని, ఆ పద్యంలోని లోపమేమిటో చెప్పాలనీ ప్రశ్నించాడు. నత్కీరుడు అంతకు ముందు పూజారితో చెప్పిన తప్పునే మరల ఎత్తి చూపాడు. పార్వతీదేవి జుట్టుముడి సహజగంధమని, అందుచేతనే తాను ఆ పద్యంలో ఆ విషయం చెప్పానని శివుడు చెప్పాడు. కైలాసంలో ఉండే పార్వతీదేవికి సహజపరిమళభరితమైన జుట్టు ఉంటే ఉండవచ్చు గానీ అది భూలోకానికి వర్తించదని నత్కీరుడు బదులుచెప్పాడు. ఆ మాటతో శివునికి కోపం వచ్చింది. తన నుదుట వున్న మూడవకన్ను చూపించాడు. కానీ నత్కీరుడు భయపడలేదు. "నుదుటనే కాదు, తల చుట్టూ కన్నులున్నా పద్యం తప్పేకాని ఒప్పుకానేరదు'' అని చెప్పాడు. ఈ విషయాలు నత్కీరుని స్థిర నిశ్చితాభిప్రాయాలను వెల్లడిచేస్తాయి.

ఎంత పండితుడైనా, ఎంత గొప్ప విమర్శకుడైనా నత్కీరుడు కూడా మనిషే. మానవ సహజమైన భయాందోళనలు అతనిలో కూడా కనిపిస్తాయి. తన మాటకు ఎదురుచెప్పి, తనను ధిక్కరించిన నత్కీరునిపై శివునికి కోపం వచ్చింది. "కుష్ఠవ్యాధితో బాధపడుము'' అని శపించాడు. ఆ శాపానికి నత్కీరుడు భయపడ్డాడు. శివుని పాదాలపై పడి తాను ద్రోహం

చేశానని, తన తప్పు క్షమించి శాపవిముక్తిని చెప్పమని ప్రార్థించాడు. శివుడు కరుణాంతరంగుడై శాంతించి కైలాస పర్వతాన్ని చూచినప్పుడు శాపం తొలగిపోతుందని చెప్పాడు.

శాపాన్ని పొందిన తరువాత నత్కీరుడు పశ్చాత్తాపంతో కుమిలిపోయాడు. తనను తాను సమీక్షించుకున్నాడు. తాను చేసిన తప్పును, తాను ప్రదర్శించిన గర్వాన్ని, దేవునితో తాను చేసిన వాదాన్ని తలచుకొని, బాధపడ్డాడు. చేసిన తప్పును గుర్తించి పశ్చాత్తాపం పొందడం అనేది ఉత్తమ సంస్కారం కలిగిన వారి లక్షణం. ఆ లక్షణమే నత్కీరునిలో కనిపిస్తుంది.

శాపాన్ని పొందిన నత్కీరుడు వెంటనే కైలాస పర్వత దర్శనం చేసుకొని శాపవిముక్తి పొందాలని తపించాడు. కాని తాను కైలాసపర్వతం చేరుకోవడం ఎంత కష్టమైనదో తనకు తెలుసు. నదులు, అడవులు, కొండలు, బోయపల్లెలు, క్రూరజంతువులు, జనసంచారంలేని మార్గాలు దాటి కైలాసాన్ని చేరుకోగలనో లేదో అని భయపడ్డాడు. తన ప్రయాణం సింహాలు, పులులు, ఏనుగులు, ఖడ్గమృగాలు, శరభాలు మొదలైన భయంకరమైన జంతువులతో కూడి ఉన్న ప్రదేశాల గుండా సాగింది. తాను వాటినుండి తప్పించుకోగలనా ? అని సంశయించాడు. ధారాళమైన మంచు వర్షాలతో, కఠినమైన రాళ్ళతో నిండి ఉండే ప్రాంతాలలో కూడిన ప్రదేశాలను ఎలా దాటాలో తెలియక భగవంతుని ప్రార్థించి తనను ఆ ప్రాంతానికి చేర్చవలసిందిగా దేవుని మనసులోనే కోరుకున్నాడు.

నత్కీరుడు ధృఢనిశ్చయం కలవాడు. శివునిమాట తప్పదు కనుక శరీరం కుష్ఠువ్యాధితో పీడింపబడక ముందే కైలాసపర్వతాన్ని చూడాలనుకున్నాడు. అందుకే వెంటనే బయలుదేరాడు. శరీరం కుష్ఠువ్యాధి బారినపడి మచ్చలతో, బుడిపెలతో, చీము, నెత్తురు కారుతూ, ఈగలు ముసురుతూ, అందరిచేత అసహ్యంపబడుతూ ఉంటే జీవించటం అతనికి ఇష్టంలేదు. అందుచేత కైలాసపర్వత దర్శనానికి మరుక్షణమే బయలుదేరాడు. కష్టనష్టాలకు ఓర్చి పర్వతాన్ని దర్శించి, శివుని కృపకుపాత్రుడై మోక్షాన్ని పొందాడు.

నత్కీరుడు గొప్ప పండితుడు. గొప్ప విమర్శకుడు. తన అభిప్రాయాన్ని ఎక్కడయినా ధైర్యంగా చెప్పగలిగలిగినవాడు. తన వాదాన్ని స్పష్టంగా వినిపించగలవాడు. తన నిర్ణయం సరైనదని భావించినప్పుడు ఎవరినైనా ఎదిరించగల ధైర్యమున్నవాడు. ధూర్జటి నత్కీరుని పాత్రను ఉత్తమ లక్షణ సమన్వితునిగా, గొప్ప వ్యక్తిత్వం కలవానిగా, గొప్ప శివభక్తునిగా వర్ణించాడు.

**4. "నత్కీరుడు" పాఠ్యభాగమాధారంగా ధూర్జటి కవితా లక్షణాలను తెలపండి**

**(లేదా)**

**"నత్కీరుడు" పాఠ్యభాగం ఆధారంగా ధూర్జటి పల్కులలోని అతులిత మాధురీమహిమను నిరూపించండి.**

ధూర్జటి పదహారవ శతాబ్దానికి చెందిన శ్రీకృష్ణదేవరాయల భువనవిజయంలో గల అష్టదిగ్గజకవులలో ఒకడు. రాయలచేత "స్తుతమతి అయిన ఆంధ్రకవి ధూర్జటి పల్కుల కేలగల్గెనీ యతులిత మాధురీ మహిమ'' అని ప్రశంపబడినవాడు. ధూర్జటి శివభక్తుడు. శివుని మహిమలను వర్ణిస్తూ శ్రీకాళహస్తి మహాత్మ్యమును, శివుని స్తుతిస్తూ శ్రీకాళహస్తీశ్వర శతకాన్ని రచించాడు. శ్రీకాళహస్తి మహాత్యంలో ధూర్జటి వర్ణించిన శివభక్తుల కథల్లో నత్కీరుని కథ ఒకటి. ధూర్జటి ఈ నత్కీరుని కథ ఆసక్తి కలిగించే విధంగా రసరమ్యంగా రచించాడు.

**కథాకథనం :**

ధూర్జటి కథను ఆసక్తికరంగా చెప్పడంలో సర్వసమర్థుడు. పూర్వోత్తర సంఘటనలను ఒకదానితో మరొకదానికి సంబంధం కలిగేవిధంగా కూర్చటం అనేది మహాకవుల లక్షణం. ఈ కథాకథనా నైపుణ్యం ధూర్జటిలో పుష్కలంగా ఉంది. కరవు రావడం, కరవు కారణంగా పూజారి వలస వెళ్ళాలనుకోవడం, అతనికి ఆపడానికి శివుడు పద్యం వ్రాసి ఇచ్చి రాజసభకు

పంపడం, రాజసభలో నత్కీరుడు పూజారి చెప్పిన పద్యంలో తప్పున్నదని చెప్పడం, ఆ విషయం పూజారి వలన తెలుసుకొని తప్పు తెలుసుకోవడానికి శివుడే స్వయంగా రాజసభకు రావడం, నత్కీరునికి, శివునికి వాగ్వాదం జరగడం, తననెదిరించిన నత్కీరుని శివుడు శపించడం, నత్కీరుడు ప్రార్థించడంతో శివుడు శాపవిముక్తిని చెప్పడం, శాపం నుండి తప్పించుకోవడానికి నత్కీరుడు వెంటనే కైలాసపర్వతానికి బయలుదేరడం - ఈ సన్నివేశాలన్నింటినీ పూలమాలగా కూర్చి ఆసక్తి కలిగించే విధంగా ధూర్జటి ఈ కథను కూర్చాడు. ఇది ధూర్జటి కథా కథనకౌశలానికి ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

**పాత్ర చిత్రణ :**

కథలో వున్న ప్రతిపాత్రను సజీవంగా చిత్రించడం మహాకవులలో కనిపించే గొప్ప లక్షణం. నత్కీరుడు కథలో ప్రధానమైన పాత్రలు మూడు. అవి నత్కీరుడు, శివుడు, పూజారి. నత్కీరుడు గొప్పకవి. గొప్ప విమర్శకుడు. తన అభిప్రాయాన్ని స్పష్టంగా చెప్పగలిగిన ధైర్యశాలి. శివుడే స్వయంగా వచ్చినా తన అభిప్రాయాన్ని మార్చుకోని స్థిరచిత్తుడు. సాక్షాత్తు పరమేశ్వరుడు ఆగ్రహంతో శపించినప్పుడు మాత్రమే పశ్చాత్తాపాన్ని ప్రకటించాడు. పూజారి పండితుడు కాదు. శివుని మాట మీద రాజసభకు వెళ్ళి అవమానం పొందాడు. ఆత్మాభిమానాన్ని ప్రదర్శిస్తూ శివునితో మాట్లాడి వలసపోవాలనుకున్నాడు. శివుడు రమ్మనడంతో అతనితో రాజసభకు వెళ్ళాడు. శివుడు తన పద్యాన్ని నత్కీరుడు విమర్శించినందుకు ఆగ్రహించాడు. సభకు వెళ్ళి నత్కీరునితో వాదించాడు. అయినా నత్కీరుడు తన పద్యాన్ని తప్పు అనడంతో కోపించిన శివుడు అతనిని శపించాడు. నత్కీరుడు పశ్చాత్తాపం చెందడంతో అతనికి శాపాంతాన్ని తెలియజేశాడు. ఈవిధంగా మనుషులు ఏయే పరిస్థితుల్లో ఎలా ప్రవర్తిస్తారో ఆయా పాత్రలు అదేవిధంగా ప్రవర్తించినట్లు ధూర్జటి వర్ణించడం ఆయా పాత్రచిత్రణా నైపుణ్యానికి నిదర్శనంగా చెప్పవచ్చు.

**భాష :**

ధూర్జటి సందర్భానికి తగిన విధంగా తన భాషను, శైలిని మార్చుకుంటాడు. నత్కీరుడు పశ్చాత్తాపంతో కైలాస శిఖరాన్ని ఎలా చేరుకోగలనంటూ బాధపడిన సందర్భంలో సంస్కృత భూయిష్టమైన సమాసాలను ధూర్జటి ఉపయోగించాడు.

**"హరిశార్దూలమదేభఖడ్గ శరభావ్యాకీర్ణముల్, రాక్షసో**
**త్కర సంచారనివాసముల్, హిమాపయోధారాళవర్షంబులు"**

నత్కీరుడు పూజారి చెప్పిన పద్యంలో తప్పున్నదని చెప్పినప్పుడు చిన్నచిన్న వాక్యాలను ధూర్జటి ఉపయోగించాడు.

"తప్పిది, చెప్పరాదు, కవితా సమయంబున కొప్పుగాదు, నీ విప్పగిదిన్ రచింపదగునే ?"

ఈ విధంగా ధూర్జటి సందర్భోచితమైన భాషను, శైలిని మార్చుకుంటాడు.

**తెనుగుదనం :**

ధూర్జటి కరవును వర్ణించే సందర్భంలో తెలుగు దేశంలో పండే పంటల పేర్లను ఎన్నింటినో తెలిపాడు.

**"గునుకు లూదర్లు బరపటల్ గోళ్ళగొండు**
**లల్లిబియ్యంబు వెదురు బియ్యంబు"**

అలాగే తెలుగు జాతీయాలను, పలుకుబడులను సందర్భానుసారంగా ధూర్జటి ప్రయోగిస్తాడు.

**"వేయి తెఱగులన్"**
**"ఉన్న కథలు చెప్పనేల"**
**"కాలాడు"**

"కన్నదిగాని, విన్నయదికాదు"
"ఏమి చేయుదున్"

**వర్ణనలు :**

ధూర్జటి కరువును వర్ణించిన తీరు సహజంగా కరువు తీవ్రత పాఠకుల కళ్ళముందు కనిపించేటట్లు ఉంది. అదేవిధంగా కుష్ఠవ్యాధి సోకినప్పుడు శరీరం ఎలా ఉంటుందో ధూర్జటి వర్ణించిన తీరు అనితరసాధ్యం.

"తివిరి యంగమ్ము్న దిమ్మిరెత్తక మున్న
యొడలెల్ల మచ్చల జెడకమున్న
దళమెక్కి గాత్రంబు చెలువు దప్పక మున్న
బుడుపుల మేన నేర్పడకమున్న
తనువున జీమురక్తములు గాఱకమున్న
దేహమీగలు మూగి తినకమున్న"

**శాస్త్ర పరిజ్ఞానం :**

ధూర్జటి శాస్త్రములు పఠించినవాడు. కరువు వచ్చే ముందు ఎలాంటి సూచనలు కనిపిస్తాయో ధూర్జటి ఇలా తెలియజేసి తన పాండిత్యాన్ని వెల్లడిచేశాడు.

"కరువు వచ్చే ముందు మీనంలో శని ప్రవేశిస్తాడు. తూర్పున తోకచుక్క కనిపిస్తుంది. మధ్యాహ్నం కూడా మంచు కురుస్తుంది. తెల్లని ఎండకాస్తుంది" ఇలాంటి పలు సూచనలను ధూర్జటి వర్ణించాడు.

కవిత్వం ఎలా ఉండాలో ధూర్జటి శివుని పద్యం ద్వారా తెలియజేశాడు. వ్యాకరణం, అలంకారం, పదబంధం, రసం అనే విషయాల్లో ఎటువంటి దోషం ఉండకూడదని అటువంటి కవిత్వమే ఉత్తమ కవిత్వమని ధూర్జటి అభిప్రాయం. నత్కీరుని కథను చదివితే ఎటువంటి దోషంలేని ఉత్తమ కవిత్వం ధూర్జటిదని తెలుస్తుంది.

**16.3 రాదగిన ప్రశ్నావిధానం :**

**క్రింది ప్రశ్నలలో ఒక దానికి సమాధానం వ్రాయండి.**

1. "నత్కీరుడు" వృత్తాంతాన్ని వివరించండి.
2. నత్కీరుడు పాఠ్యభాగమాధారంగా ధూర్జటి కవితా లక్షణాలను తెలపండి.

**- డా॥ నాగభైరవ ఆదినారాయణ**
రీడర్ & ప్రిన్సిపాల్ (రిటైర్డ్)
బి.ఎస్.ఎస్.బి. డిగ్రీ కళాశాల
తాడికొండ, గుంటూరు జిల్లా

పాఠం - 17

# అశోకవనంలో జానకి

- మొల్ల

## రామాయణం - సుందరకాండ
## (90వ పద్యం నుండి 123వ పద్యం వరకు)

**విషయసూచిక :**

17.1 ఉద్దేశ్యం
17.2 కవయిత్రి పరిచయం
17.3 పాఠ్యభాగ సందర్భం
17.4 పాఠ్యభాగ సారాంశం
17.5 కఠిన పదాలకు అర్థాలు - తాత్పర్యాలు

### 17.1 ఉద్దేశ్యం :

ఏపని సానుకూలంగా జరగాలన్నా సంకల్పం, పట్టుదల, ప్రయత్నంతోపాటు సందర్భానుసారంగా పనిని సానుకూలపరిచే వాక్చాతుర్యం కూడా ఉండాలని విద్యార్థులకు తెలియజేయడం, పాతివ్రత్య మహాత్మ్యాన్ని వివరించడం, ఎంత క్లిష్ట సమయాలు ఎదురైనా ధైర్యంగా, సహనంగా ఉంటే సమస్యలు తొలగిపోతాయని తెలియజేయటం ఈ పాఠ్యభాగ ఉద్దేశ్యం.

### 17.2 కవయిత్రి పరిచయం :

భారతీయ సాహిత్యంలోనే ఆదికావ్యమైన రామాయణాన్ని సంస్కృతంలో వాల్మీకి మహర్షి రచించి ఆదికవి అయ్యారు. ఆ రామాయణాన్ని ఎందరో కవులు వారి వారి భాషలలో రచించారు. భారతీయ భాషలలోనే కాకుండా శ్రీలంక, మలేషియా వంటి విదేశాలలో సైతం ప్రాచుర్యం పొంది, ఆ దేశభాషలలోనూ రచించబడటం రామాయణ ఔన్నత్యాన్ని నిరూపిస్తుంది. అంతటి గొప్పదైన రామాయణాన్ని తెలుగులో ఎందరో కవులు రచించారు. భాస్కర రామాయణం, రంగనాథ రామాయణం, నిర్వచనోత్తర రామాయణం, మొల్ల రామాయణం వంటి రామాయణాలు ప్రాచీన కవుల రచనలైతే రామాయణ కల్పవృక్షం, మల్లెమాల రామాయణం వంటివి ఆధునిక కవుల కలాల నుండి జాలువారాయి. నాటి నుండి నేటివరకు రామాయణ రచన జరుగుతూ ఉండటంతో తెలుగుసాహిత్యం వందలకొలదీ రామాయణాలతో సుసంపన్నమైంది.

తెలుగు సాహిత్యంలో రామాయణాన్ని రాసిన ప్రథమ కవయిత్రిగా మొల్ల ప్రఖ్యాతి పొందింది. ఈమె రాసిన రామాయణం మొల్లరామాయణంగా ప్రసిద్ధి. మొల్ల తండ్రిపేరు ఆతుకూరు కేసనసెట్టి. తన తండ్రి శివభక్తిరతుడని, గురు లింగ జంగమార్చనపరుడని మొల్ల పేర్కొంది. గోపవరపు శ్రీకంఠ మల్లేసుడి వరం చేత తాను కవిత్వం చెప్పనేర్చానని చెప్పుకుంది. మొల్ల తన రామాయణాన్ని శ్రీరామచంద్రుడికి అంకితమిచ్చింది. ఈమె 15వ శతాబ్ది చివరిభాగంలోగానీ, 16వ శతాబ్ది ప్రథమార్థంలోగానీ వుండవచ్చని, కడప జిల్లాగానీ, నెల్లూరు జిల్లాగానీ అయివుండవచ్చని సాహిత్య చరిత్రకారుల అభిప్రాయం. సిద్దేశ్వరకర్త అయిన ఏకామ్రనాథుడు మొల్లను గురించి "తిక్కన సోమయాజి వరప్రసాదమ్ము చేత కుమ్మరిమొల్ల రామాయణం బహువచన కావ్యం రచియించి ... " అని రాశాడు.

తెలుగు కవిత్వం ధ్వని ప్రధానమై తేటతెలుగు మాటలతో ఉండాలని, కఠిన సంస్కృత పదాలు కూడదని మొల్ల చాటిచెప్పింది. వ్యంగ్యార్థ ప్రాతిపదకమైన శబ్దాలను, సామెతలను కూర్చి వీనులవిందుగా రామకథను కావ్యంగా గానం చేసిన

తపస్విని మొల్ల. మొల్ల వాల్మీకి రామాయణంతోపాటు ఇతర రామాయణాలలోని తనకు నచ్చిన ఘటనలను, రసవత్తర సన్నివేశాలను అనుకరించి తన రామాయణాన్ని రచించినట్లు తెలుస్తుంది. మొల్ల కవిత్వంలోని మృదువైన భావాలు, లలితమైన భాష, చక్కని పదప్రయోగం ఆమె కవితా ప్రతిభకు విశేషాలుగా కనిపిస్తాయి. మొల్ల అంటే మల్లెపువ్వు అని, బొడ్డుమల్లె అని కూడా అర్థాలున్నాయి. మల్లెపువ్వు వంటి సున్నిత మనస్కురాలు మొల్ల అని ఆమె కవిత్వం తెలియజేస్తుంది. ఆమె అద్భుత కల్పనకు ఈ క్రింది పద్యం తార్కాణం. ఈ కల్పనకు ఆధారం ఆధ్యాత్మ రామాయణం.

> **"సుడికొని రాముపాదములు సోఁకిన ధూళివహించి రాయి యే**
> **ఏర్పడనొక కాంత యయ్యెనఁట పన్నుగనీతని పాదరేణు వి**
> **య్యెడ వడి నోడసోఁక నిది యేమగునో యని సంశయాత్ముఁడై**
> **కడిగె గుహుండు రామపదకంజయుగంబు భయమ్ము పెంపునన్"**

మొల్ల సీతపాత్రను అమోఘంగా చిత్రించింది. స్వయంవర సమయాన సీత ముగ్ధసుందరమూర్తిగా, అరణ్యావాసాన అష్టకష్టాలను అనుభవించిన పతివ్రతా శిరోమణిగా, అశోకవనంలో రాక్షసస్త్రీల మధ్య ఒంటరితనంతో దైన్యమూర్తిగా, తనను బెదిరించవచ్చిన రావణాసురుని ఎదరించిన ధీరోదాత్త స్త్రీగా మొల్ల చిత్రించింది.

**పాఠ్యభాగ సందర్భం :**

లంకలో అశోకవనంలో రాక్షసకాంతలు తనకు కాపలా ఉండగా ఉన్నటువంటి సీతాదేవికి రాక్షసకాంత అయిన త్రిజట తనకు వచ్చిన స్వప్నాన్ని వివరించి త్వరలో ఆమెకు మంచి జరుగుతుందని చెబుతుంది. అప్పటికే సీతాదేవిని వెదుకుతూ లంక చేరిన ఆంజనేయుడు సీతాదేవి ఏ చెట్టు క్రిందైతే కూర్చుని ఉందో ఆ చెట్టుపైనే ఉండి ఇదంతా వింటాడు. అది విన్న హనుమంతుడు చెట్టు నుండి క్రిందకు వచ్చి శ్రీరాముడి క్షేమ సమాచారాన్ని, రాముడు పంపిన సందేశాన్ని సీతకు తెలిపే సందర్భంలోనిదీ పాఠ్యభాగం.

**పాఠ్యభాగ సారాంశం :**

అంటూ రాక్షసస్త్రీలు సీతను వదలివెళ్ళి నిద్రపోయారు. సీతాదేవి భయపడుతూ తనకు దిక్కెవరు లేరన్న విషయం తలపోస్తూ దుఃఖిస్తుండగా ఆ వాయుదేవుడి కుమారుడైన హనుమంతుడు మానవభాషలో మాట్లాడాడు. 'ఆ రాముడున్నాడు, వానరులతో కలసి రానున్నాడు, నిన్ను తీసుకుపోనున్నాడు, ఓ 'సీతాదేవి ఇది నిజం నమ్ము' అన్నాడు. ఈ మాటలు విన్న సీతాదేవి తనలో తానే భయపడి ఆ అశోకవృక్షాన్ని పరిశీలనగా చూడగా అప్పుడు ఆ చెట్టుకొమ్మల మధ్య సూక్ష్మరూపంలోనున్న హనుమంతుడిని అపురూపంగా చూసింది. మనసులో సంతోషం కలిగినా రాక్షస మాయల వలన బాధపడినది కనుక మారుమాట మాట్లాడకుండా ఊరుకుంది. ఆ సీతాదేవి మనోభావాన్ని ఊహించి తనను నమ్మలేదని గ్రహించి కొమ్మ మీద నుంచి దూకి ఎంతో భక్తితో నమస్కరించి చేతులు జోడించి ఈవిధంగా అన్నాడు.

తన తమ్ముడైన లక్ష్మణుడితో కలిసి పుణ్యగుణధాముడైన శ్రీరాముడు మాల్యవంత పర్వతంపై సైన్యసంఘాలు ఎంతో సంతోషంగా సేవిస్తుండగా ఉన్నాడు. భూమి మీద మిమ్ములను వెదకి రమ్మని వానరవీరులను పంపాడు. మమ్ములను కొందరిని దక్షిణదిక్కున చూడమని పంపుతూ, రాముడు సీతాదేవి జాడ తెలుసుకోవటానికి నువ్వే తగినవాడివని' నాతో ఈ ఉంగరం పంపాడు, తీసుకో అని సీతాదేవికి ఇచ్చాడు. ఆ ఉంగరాన్ని చూచి సీత అది రామముద్రికగా గుర్తించి, నీవు వచ్చిన విధానమంతా స్పష్టంగా నాకు నమ్మకం కలిగేవిధంగా చెప్పు' అని అంది. ఇంకా ఆలోచిస్తూ ఆమె నేను నిన్ను నమ్మలేను. నీ విధానం, నా రాముని విధానం నాకు చెప్పు' అనగా హనుమంతుడు ఎంతో వినయంగా తెలియజేశాడు. 'రావణుడు నిన్ను ఎత్తుకుపోయేటప్పుడు ఋష్యశృంగ పర్వతంపై పడవేసిన బంగారు ఆభరణాలను మేము తీసి దాచాము. నీ భర్త అక్కడకు

రాగా సుగ్రీవుడు వాటిని రాముడికి చూపగా రాముడు అది చూసి మెచ్చుకొని సుగ్రీవుడికి అభయమిచ్చాడు. రాముడు దుందుభి అనే రాక్షసుడిని సంహరించి, ఏడు తాటిచెట్లను ఒకేసారి త్రుంచి వాలిని అద్భుతశక్తితో వధించి, సుగ్రీవుడి భార్యను అతడికి ఇప్పించి, అంగదుడిని యువరాజుగా నిలిపి, ఆ వానరసైన్యమంతా తనను కొలుస్తుండగా వచ్చి మాల్యవంత పర్వతంపై ఉండి నిన్ను వెదుకుటకు అన్ని దిక్కులకు అందరనూ పంపుతూ అంగదుడితో పాటు మమ్మలిని కొందరిని దక్షిణ దిక్కుకు పంపాడు. ఆ శ్రీరాముడి ఆజ్ఞతో అవలీలగా సముద్రాన్ని దాటి వచ్చి మొత్తం చూశాను. ఇక్కడ నిన్ను చూశాను, రావణుడు నీతో కోపంగా మాట్లాడేటప్పుడు ఈ చెట్టుపైనే ఉన్నాను అని చెప్పినా సీతాదేవి హనుమంతుడిని నమ్మక రాముడు ఎలా ఉంటాడో చెప్పమనగా హనుమంతుడు సీతాదేవికి నమస్కరించి ఈవిధంగా చెప్పాడు.

"నీలమేఘము వంటి రంగు గల శరీరంగలవాడు, తెల్లటి తామర రేకులవంటి కన్నులు కలవాడు, శంఖం వంటి కంఠం కలవాడు, బలమైన వక్షస్థలం కలవాడు, ఆజాను బాహువులతో భేరినాదం వంటి కంఠస్వరం కలవాడు, పద్మరేఖలు కలిగిన పాదాలతో అన్ని శుభలక్షణాలు కలవాడు, మోసం తెలియని సత్యవాక్యాలు, సకల శుభలక్షణాలు కలవాడు రాముడు. ఈ లక్షణాలన్నీ కలిగి బంగారువర్ణంతో ఉండేవాడు లక్ష్మణుడు. భయంకరమైన అడవిలో గొప్ప తపస్సుచేసి వాయుదేవుడి అనుగ్రహంతో నన్ను అంజనాదేవి కనింది. సుగ్రీవుడి మంత్రిని, హనుమంతుడు అంటారు అందరూ నన్ను' అని సవివరంగా చెప్పి 'నీ భర్త రాముడు నాకిచ్చి పంపిన కొత్తదైన రత్నాంగుళీకాన్ని నీకిచ్చాను. ఒట్టి చేతులతో వెళ్ళటం దూతల పనికాదు, కాబట్టి నిన్ను దర్శించినట్లుగా రాముడికి నమ్మకం కలిగే విధంగా నీ శిరోరత్నాన్ని దయచేయి' అనగా సీతాదేవి ఈ విధంగా అంది "నా భర్త క్షేమమంతా నీవలన విన్నాను. అయినా నీ నిజస్వరూపాన్ని నేను చూడకుండా నీకు ఆ రత్నాన్ని నేనివ్వలేను సుమా అనగా చుక్కలే తలపూవులా అనేవిధంగా హనుమంతుడు తన శరీరాన్ని పెంచి ఆకాశవీధిలో తన విశ్వరూపాన్ని చూపగా ఆ సీతాదేవి సంతోషించింది. తన విశ్వరూపాన్ని చూసి మళ్ళీ తిరిగి ఎప్పటిలాగా తన సూక్ష్మరూపాన్ని పొంది హనుమంతుడు నమస్కరించగా ఆ సీతాదేవి తన శిరోరత్నాన్ని ఇచ్చి ఈవిధంగా అంది.

"రవికుల సముద్రానికి చంద్రుడి వంటి వాడైన శ్రీరాముడు క్షేమాన్ని చాలా విన్నాను. నేను పడుతున్న అనేక కష్టాలు ఆ రాజుకి తగినవిధంగా చెప్పు. నీ ఉపకారానికి నేనేమి ప్రత్యుపకారం చేయలేను. ఈ భూమి ఉన్నంతవరకు బ్రహ్మకల్పం వరకు నువ్వు వర్థిల్లు" అని దీవించింది. "శ్రీరాముడి పాదపద్మాలని నా మనస్సులో ఎల్లప్పుడూ స్మరించటం విడవనని విన్నవించు, ఇప్పుడు ఆ రావణుడు వచ్చి కపటబుద్ధితో, గర్వంతో నన్నెన్ని మాటలన్నాడో నీ చెవులతో విన్న విధానమంతా రాముడికి తెలియజేయి. సీతాదేవి లంకలో పొడవైన తలవెంట్రుకలను జడలుగా సవరించుకొని మాసిపోయిన చినిగిన చీరను ధరించింది. భూమిపై దుమ్మునే విభూతిగా పూసుకొని భర్త దివ్యరూపాన్ని మనసులో నింపుకొని ఆరాధిస్తుంది. నిరాహారదీక్షతో భూమిపై పడుకొని నిద్రను వదిలివేసింది.. తారక మంత్రాన్ని జపిస్తూ భయంకరులైన రాక్షసమృగాల మధ్యలో జీవిస్తుంది. శత్రుసీమ అయిన లంకలో శ్రీరాముడి గురించే తపస్సు చేస్తుంది" తన భర్త తనకు త్వరగా ప్రత్యక్షమయ్యేటట్లు తన దీనస్థితినంతా విన్నవించమని ఆంజనేయుడితో ఆర్తితో సీతాదేవి చెప్పింది. ఇంకా 'శ్రీరామచంద్రుడిని కన్నతండ్రిలా, తనను తల్లిలా సేవించే నీతిమంతుడు, సుగుణశీలుడు అయిన లక్ష్మణుడిని తాను అనరాని, వినరాని కఠిన మాటలతో నిందించానని ఆ మహాపాపఫలాన్నే తాననుభవిస్తున్నానని లక్ష్మణుడికి తెలియజేయమని సీత హనుమంతుడితో అంది. నేను అవివేకంతో అన్న మాటలు మనసులో ఉంచుకోకుండా తన గౌరవాన్ని కాపాడమని లక్ష్మణుడికి చెప్పమని కోరింది సీత.

సీత మాటలు విన్న హనుమంతుడు ఆమెతో "తల్లీ ! సుర్యోదయానికి ముందే నిన్ను సముద్రాన్ని దాటించి శ్రీరాముడి సమక్షానికి చేరుస్తాను, నీవు నా వీపుపై సంతోషంగా కూర్చో" అనగా సీతాదేవి "ఆంజనేయా ! నీవు అంత సామర్థ్యం కలవాడివే. కానీ నేను నీవెంట వస్తే శ్రీరాముడికి కీర్తిప్రతిష్ఠలు కలుగవు. రావణుడి కన్నా శ్రీరాముడే పెద్దదొంగ అని అందరూ నిందిస్తారు. అంతేకాక శ్రీరాముడిని తప్ప నేను ఇతరులను తాకను. కనుక నీతో రావటం తగదు" అని

చెప్పింది. 'తనను దొంగతనంగా అపహరించి తెచ్చిన రావణుడిని, అతడి మిత్రులను యుద్ధంలో చంపకుండా నన్ను దొంగిలించుకుపోవటం రాజైన శ్రీరాముడికి తగినపనికాదని చెప్పింది. శ్రీరామచంద్రుడు వీరుడు, ధనుర్విద్యా దీక్షాపరుడు. రాక్షస కులాంతకుడు, అటువంటి గొప్పవాడైన శ్రీరాముడు అంతఃపుర స్త్రీలను అపహరించిన ద్రోహి అయిన రావణుడిని యుద్ధంలో సంహరించి నన్ను తీసుకువెళ్ళటమే ధర్మం. నీవు రాముడి సేవకుడివి, పుత్ర సమానుడివి. నీవెంట నేను రావటం తప్పుకాకపోయినా రావణుడిపై పగ తీర్చుకోకుండా నేను రావటం న్యాయం కాదు. కాబట్టి ఈ సంగతులన్నీ శ్రీరాముడికి వివరంగా చెప్పి వెంటనే నన్ను తీసుకువెళ్ళమని చెప్పు' అని చెప్పిన సీతాదేవికి నమస్కరించి హనుమంతుడిలా అన్నాడు. 'నీ భర్త శ్రీరాముడు సుగ్రీవ సుషేణాది ప్రముఖ సేనానాయకులతో కలసి సముద్రాన్ని దాటివచ్చి యుద్ధంలో రావణుడిని సంహరిస్తాడు. రాజులందరూ మెచ్చే విధంగా నిన్ను తీసుకొని వెళతాడు. నా మాట సత్యం, నమ్ము తల్లీ' అని హనుమంతుడు సీతాదేవికి చెప్పాడు.

**కఠిన పదాలకు అర్థాలు :**

90.

| | | |
|---|---|---|
| దనుజకాంతలు | = | రాక్షసస్త్రీలు |
| ఎడబాసి | = | దూరమై |
| దిక్కులేక | = | రక్షణలేక |
| పవనసుతుడు | = | హనుమంతుడు |
| మనుజ భాషన్ | = | మానవుల భాషలో |
| పలికె | = | మాట్లాడాడు |

**తాత్పర్యం :**

లంకానగరంలో సీతకు కాపలాగా ఉన్న రాక్షసస్త్రీలు ఆమె నుండి దూరమై నిద్రపోయారు. సీత తనకు దిక్కులేదని అభద్రతా భావంతో దుఃఖిస్తున్న స్థితిలో ఆమెను వెదికేందుకు లంకానగరంలో ప్రవేశించిన హనుమంతుడు అశోకవృక్షం పై నుండి ఆమెతో మనుష్యభాషలో మాట్లాడాడు.

91.

| | | |
|---|---|---|
| లెస్స | = | బాగుగా |
| కపులు | = | వానరులు |
| ఉరుగతిన్ | = | వేగంగా |
| ఉర్వీతనయా | = | భూదేవి కూతురివైన ఓ సీతా |

**తాత్పర్యం :**

ఓ సీతాదేవి రాముడు క్షేమంగా ఉన్నాడు. వానరులతో కలసి త్వరలోనే వచ్చి నిన్ను తీసుకొని పోనున్నాడు. ఇది నిజం నమ్మమని హనుమంతుడు చెప్పాడు.

92.

| | | |
|---|---|---|
| భూమిజ | = | భూమినుండి పుట్టింది (సీత) |
| వెఱగు + అంది | = | భయపడి |

| | | |
|---|---|---|
| శింశుపా వృక్షము + అరసి | = | అశోకవృక్షాన్ని చూసి |
| కపికుమారుని రూపము | = | హనుమంతుని రూపాన్ని |
| అపురూపముగా | = | ఆనందంగా |
| స్వాంతంబులోన | = | మనసులో |
| హర్షంబు | = | సంతోషం |
| దనుజ మాయలచేత | = | రాక్షసుల మాయచేత |
| వేగుట | = | బాధపడుట |
| లంఘించి | = | దూకి |
| ఆత్మ నమ్మకుండుట | = | మనసులో నమ్మకుండుట |
| కరములమోడ్చి | = | చేతులు జోడించి |

**తాత్పర్యం :**

ఆంజనేయుడి మాటలను విన్న సీత భయపడి తాను కూర్చున్న అశోకవృక్షాన్ని పరిశీలించి చూసింది. కొమ్మలమధ్య సూక్ష్మరూపంలో ఉన్న కపికుమారుడిని చూసి సంతోషించింది. అది కూడా రాక్షసుల మాయేమోనని అనుమానంతో బదులివ్వక ఊరుకుంది. ఆమె మనస్సులో నమ్మలేదన్న భావాన్ని గ్రహించిన హనుమంతుడు చెట్టు కొమ్మపై నుండి కిందికి దూకి భక్తితో చేతులు జోడించి నమస్కరించి ఇలా అన్నాడు.

93.

| | | |
|---|---|---|
| పుణ్యగుణధాముడు | = | పుణ్యగుణాలకు నిలయుడైన శ్రీ రాముడు |
| తమ్మునిగూడి | = | తమ్ముడైన లక్ష్మణునితో వచ్చి |
| మాల్యవంతమ్మున | = | మాల్యవంత పర్వతంపై |
| సైన్యసంఘము | = | సైన్య సమూహం |
| ముదంబున | = | సంతోషంతో |
| కొల్వగన్ + ఉండి | = | సేవించగా ఉండి |
| భూమిపై | = | భూమిపై |
| మిమ్ములన్ | = | మిమ్మలిని |
| చూచిరండు + అనుచు | = | వెదికి చూచిరమ్మని |
| మేటికపి + ఇంద్రులన్ + పుచ్చి | = | శ్రేష్ఠులైన వానరవీరులను పంపించి |
| వారిలో మొత్తముగా | = | మొత్తం సైనికులను |
| మమ్ము కొందఱను | = | మమ్మల్ని కొంతమందిని |
| దక్షిణ భాగము | = | దక్షిణ దిక్కును |
| చూడన్ + పంపుచున్ | = | వెదుకుటకు పంపించే సందర్భంలో |

**తాత్పర్యం :**

పుణ్యగుణాల రాశియైన రాముడు లక్ష్మణునితో కలసి మాల్యవంత పర్వతంపై సుగ్రీవుని వానరసైన్యం సేవిస్తుండగా ఉన్నాడు. భూమిపై మిమ్ము వెదికేందుకు శ్రేష్ఠులైన వానరులను అన్ని దిక్కులకు పంపించాడు. అందులో మావంటి కొందరిని దక్షిణదిక్కుకు పంపించాడు.

94.

| | | |
|---|---|---|
| అంగన | = | స్త్రీ / సీతాదేవి |
| పొడ | = | జాడ |
| రఘు పుంగవుడు | = | శ్రీరామచంద్రుడు |
| భూమిజ | = | సీత |

**తాత్పర్యం :**

సీతను వెదకి చూచేందుకు నీవే సమర్థుడవని శ్రీరాముడు ఉంగరాన్ని నాచేత పంపించాడు. సీతను తీసుకొమ్మనమని హనుమంతుడామెకు ఇచ్చాడు.

95.

| | | |
|---|---|---|
| ఆ కువలయేక్షణ | = | కలువల వంటి కనులు గల సీత |
| ఇచ్చిన | = | హనుమంతుడిచ్చిన |
| ఉంగరమును చూచి | = | ఉంగరాన్ని పరిశీలించి |
| రామధరణీశు | = | శ్రీరామచంద్రుని |
| ముద్రికగా | = | ఉంగరంగా |
| ఎఱిగి | = | గుర్తించి |
| తాన్ | = | తాను |
| ఇచ్చను | = | ఇష్టంతో |
| ఆత్మగతంబునందు | = | మనసులో |
| మెచ్చి | = | సంతోషించి, మెచ్చుకొని |
| నీ | = | నీవు |
| వచ్చినదాని భావమును | = | వచ్చిన రాక అర్థాన్ని |
| వల్లభు చందమున్ | = | భర్తయైన రాముని విషయాన్ని |
| ఏర్పడగ | = | స్పష్టంగా |
| నమ్మిక పుట్టునట్లుగన్ | = | నమ్మకం కలుగునట్లుగా |
| చెచ్చెరన్ | = | శీఘ్రంగా |
| అంతయున్ | = | అంతటినీ |
| తెలియజెప్పుము | = | తెలియజేయుము |

**తాత్పర్యం :**

ఆంజనేయుడిచ్చిన ఉంగరాన్ని తీసుకొని శ్రీరాముడి ఉంగరంగా గుర్తించిన సీత మనసులో ఎంతో సంతోషించింది. హనుమంతునితో నీవు వచ్చిన విషయాన్ని శ్రీరాముని సంగతిని నాకు నమ్మకం కలిగే విధంగా వివరింపుమని సీత కోరింది.

96.

సీత ఆలోచించి ఆంజనేయుడితో ఇలా పలికింది.

97.

| | | |
|---|---|---|
| విశ్వసింపజాలను | = | నమ్మలేను |
| విభుని విధము | = | శ్రీరాముని పద్ధతిని |
| నీ తెఱఁగు | = | నీ విధానం |
| అనవుడు | = | అనినంతనే |
| విస్ఫుట ఫణితిన్ | = | స్పష్టమైన రీతిలో |
| పావని | = | హనుమంతుడు |

**తాత్పర్యం :**

సీత ఆంజనేయుడితో నిన్ను నమ్మజాలను. నీ విధానాన్ని శ్రీరామచంద్రుని పద్ధతిని చెప్పమని అడిగింది. అప్పుడు ఆంజనేయుడు వినయంతో స్పష్టమైన రీతిలో ఆమెకు సమాధానం చెప్పాడు.

98.

| | | |
|---|---|---|
| రామునిడాగురించి | = | రాముని మోసగించి |
| నిను | = | నిన్ను |
| రావణుడు + ఎత్తుకవచ్చువేళ | = | రావణుడు అపహరించుకొనివచ్చే సమయంలో |
| నీ హేమవిభూషణావళులన్ | = | నీ బంగారు ఆభరణాలను |
| ఏర్పడు | = | పడునట్లు |
| ఋశ్యామహాద్రి వైచినన్ | = | ఋశ్య శృంగపర్వతంపై పారవేయగా |
| మేము + అవితీసి | = | వానరులమైన మేము వాటిని తీసి |
| దాచితిమి | = | భద్రపరిచితిమి |
| మీపతి | = | మీ భర్త శ్రీరామచంద్రుడు |
| అచ్చటికి + ఏగుదేరఁగా | = | అక్కడకు రాగా |
| తాన్ + అవి చూపిన | = | సుగ్రీవుడు ఆయనకు ఆభరణాలు చూపించగా |
| తామరస + ఆప్తనందనుడు | = | కమలాలకు ఆప్తుడైన సూర్యుడి కుమారుడు |
| మెచ్చుచున్ | = | మెచ్చుకొనెను. |

**తాత్పర్యం :**

శ్రీరాముని మోసగించి రావణుడు నిన్ను అపహరించుకొని వెళ్ళే సమయంలో నీ బంగారు ఆభరణాలు ఋశ్యశృంగ పర్వతంపై పారవేశావు. వాటిని మేము తీసి భద్రపరిచాము. మీ భర్త శ్రీరామచంద్రుడు అక్కడకు వచ్చినప్పుడు సుగ్రీవుడు వాటిని చూపించగా ఆయన ఎంతో సంతోషించి మెచ్చుకున్నాడని చెప్పాడు.

99.

| | | |
|---|---|---|
| అర్కసంభవునకు | = | సుగ్రీవుడికి |
| దుందుభికాయమ్ము | = | దుందుభి అనే రాక్షసుని శరీరాన్ని |
| తూలన్ + తన్ని | = | పడిపోవునట్లు తన్ని |

| | | |
|---|---|---|
| ఏడుతాడుల | = | ఏడుతాటిచెట్లను |
| ఏకమ్ముగాన్ + త్రుంచి | = | ఒకేసారి కూల్చి |
| వాలిన్ | = | వాలిని |
| అద్భుతశక్తిన్ | = | అద్భుతమైన గొప్పశక్తితో |
| కూలన్ + ఏసి | = | వధించి |
| కొలువంగ | = | సేవించగా |
| మనుజవిభుఁడు | = | శ్రీరాముడు |
| నిన్ను వెదకంగ | = | నిన్ను వెదకుటకై |
| అరుగుదేర | = | వచ్చితిమి |

**తాత్పర్యం :**

శ్రీరామచంద్రుడు సుగ్రీవునకు అభయమిచ్చి దుందుభి అనే రాక్షసుని వధించాడు. ఏడుతాటి చెట్లను ఒకేసారి కూల్చి వాలిని సంహరించాడు. వాలి భార్య తారను సుగ్రీవునికి భార్యగాచేసి, అంగదుని యువరాజుగా చేశాడు. మాల్య పర్వతంపై వానర సేనలను నిన్ను వెదికేందుకు అన్ని దిక్కులకు పంపించే సమయంలో నన్ను అంగదునితో పాటు మరికొంతమంది వానరసైన్యంతో దక్షిణ దిక్కుకు పంపించాడని సీతతో చెప్పాడు.

100.

| | | |
|---|---|---|
| అవలీల | = | సులువుగా |
| వార్ధి దాటి | = | సముద్రాన్ని దాటి |
| ఈ వంకన్ + కంటి | = | ఈ విధంగా చూసితిని |
| ఉగ్రంబుగాగ | = | తీక్షణంగా |
| పాదపమున | = | చెట్టుపై |

**తాత్పర్యం :**

శ్రీరాముని ఆదేశాన్ని అనుసరించి అవలీలగా సముద్రాన్ని దాటి ఇక్కడకు వచ్చి ఈ స్థితిలో నిన్ను చూసితిని. రావణుడు తీక్షణంగా మాట్లాడే సమయములో చెట్టుపై నుండి వింటిని అన్నాడు.

101.

హనుమంతుడు సీతతో ఈ విశేషాలు చెప్పినా ఆమె అతనిని నమ్మక, రాముడు ఏ రీతివాడో ఆయనను గూర్చి వివరించమని అడిగింది. ఆ మాటలు విన్న ఆంజనేయుడు శ్రీరాముడికి నమస్కరించి సీతతో రాముని రూపురేఖా విలాసాలను వర్ణించి చెప్పాడు.

102.

| | | |
|---|---|---|
| నీలిమేఘచ్ఛాయ | = | నల్లని మేఘమువంటి శరీరఛాయ |
| ధవళ + అబ్జ పత్రనేత్రములు | = | తెల్లని తామరరేకుల వంటి కన్నులు కలవాడు |
| కంబు సన్నిభమైన | = | శంఖమువంటి |
| గుల్ఫము | = | చీలమండ |

| | | |
|---|---|---|
| దుందుభి | = | భేరి |
| పీనవక్షంబు | = | బలమైన వక్షస్థలము |
| నెసగువాడు | = | సరిపోయేవాడు |
| సౌమిత్రి | = | లక్ష్మణుడు |

**తాత్పర్యం :**

శ్రీరాముడు నల్లని నీలిమేఘం వంటి శరీరకాంతి కలవాడు. తెల్లతామర రేకులవంటి కన్నులుకలవాడు. శంఖం వంటి కంఠంతో బలమైన వక్షస్థలం ఉన్నవాడు. ఆజానుబాహువులతో భేరీనాదం వంటి కంఠస్వరం కలవాడు, పద్మరేఖలతో కూడిన పాదాలతో సకల శుభలక్షణాలు కలవాడు, కపటమెరుగని సత్యవాక్యాలు, సకలశుభ లక్షణాలున్నవాడు అన్నీ శుభలక్షణాలతో బంగారురంగు శరీరఛాయ కలవాడు లక్ష్మణుడని సీతకు రామలక్ష్మణులను గూర్చి వివరించి చెప్పాడు.

103.

| | | |
|---|---|---|
| ఉరుతర + అటవిలోన | = | భయంకరమైన అడవిలో |
| మహా + ఉగ్రతపము | = | కఠోరమైన తపస్సు |
| అర్కజుని మంత్రి | = | సుగ్రీవుని మంత్రిని |
| అర్థితోడ | = | సంతోషంగా |

**తాత్పర్యం :**

నాతల్లి అంజనాదేవి భయంకరమైన అడవిలో వాయుదేవుని గూర్చి కఠోర తపస్సు చేసి నన్ను సంతోషంగా కన్నది. నేను సుగ్రీవుడి మంత్రిని. హనుమంతుడు అంటారు నన్ను అని తనను గూర్చిన విశేషాలు సీతాదేవికి వివరించాడు.

104.

| | | |
|---|---|---|
| నూత్నరత్నాంగుళీయకంబు | = | కొత్తరత్నాలు పొదిగిన ఉంగరం |
| రిక్త హస్తంబుల | = | వట్టిచేతులతో |
| దర్శించినందులకు | = | చూచినందుకు |
| శిరోరత్నము | = | తలపై ధరించు విలువైన ఆభరణం. |

**తాత్పర్యం :**

సీతకు శ్రీరాముని విశేషాలను, తన వివరాలను విన్నవించిన పిదప ఆమెతో హనుమంతుడు శ్రీరాముని నూత్నరత్నాంగుళీయకాన్ని నీకు కానుకగా సమర్పించితిని. దూతగా వచ్చిన నేను వట్టి చేతులతో తిరిగి వెళ్లుట న్యాయంకాదు. నిన్ను కలిసినట్లుగా శ్రీరామునికి నమ్మకం కలిగేవిధంగా నీ శిరోరత్నాన్ని ఇవ్వమని అడిగాడు.

105

ధీ నిధి = మేథా సంపన్న

నాథుడు = భర్త

**తాత్పర్యం :**

ఆంజనేయా ! నీవల్ల నాభర్త క్షేమ సమాచారమంతా విన్నాను. అయినా నీ నిజస్వరూపం చూడనిదే నిన్ను నమ్మి

నేనా శిరోరత్నాన్ని నికివ్వనని చెప్పింది.

106

ఆ మాటలు విని హనుమంతుడు

107.

| | | |
|---|---|---|
| అక్కజముగ | = | ఆశ్చర్యకరంగా |
| అంబరవీధిన్ | = | ఆకాశమార్గం |
| ఆ + కోమలి | = | ఆ సీత |
| ఆత్మస్థితిన్ | = | మనసులో |
| ముదము | = | సంతోషం |

**తాత్పర్యం :**

హనుమంతుడు సీతాదేవికి నమ్మకం కలిగించేందుకు ఆకాశమార్గంలో అపారంగా తన శరీరాన్ని పెంచి విశ్వరూపాన్ని ప్రదర్శించాడు. ఆకాశంలో చుక్కలు తలపులుగా భాసించేటట్లు పెంచిన విశ్వరూపాన్ని చూచి సీత మనసులో ఎంతో సంతోషించింది.

108.

మహోన్నత రూపం = గొప్పదైన రూపం

తాత్పర్యం :

ఈవిధంగా గొప్పదైన తన విశ్వరూపాన్ని చూపించి తిరిగి ఎప్పటిలాగా సూక్ష్మరూపాన్ని పొంది, నమస్కరించిన హనుమంతుడికి ఆ సీతాదేవి తన శిరోరత్నాన్ని ఇచ్చి ఇలా అంది.

109.

| | | |
|---|---|---|
| రవికుల వార్థి చంద్రుడగు | = | సూర్యవంశం అనే సముద్రమందు చంద్రుని వంటివాడైన |
| రాముని | = | శ్రీరాముని |
| సేమము | = | క్షేమం |
| చాలవింటి | = | చాలా విశేషాలను తెలుసుకొంటిని |
| నా నావిధములైన పాట్లు | = | నేను పడుతున్న అనేకమైన బాధలను |
| పృథివీపతికిన్ | = | రాజైన శ్రీరామునికి |
| తగన్ చెప్పన్ + కల్గె | = | తగువిధంగా చెప్పగలుగుదువు |
| నేడు ÷ ఆవిరళ భంగి | = | నేడు వివరంగా |
| నీవలనన్ + అచ్చుగ | = | నీవలన స్పష్టంగా |
| నేను | = | నేను |
| తవిలి | = | ప్రత్యేకించి |
| ఉపకారమేమియున్ | = | ఎటువంటి ఉపకారాన్ని |

| | | |
|---|---|---|
| ఒనర్పలేను | = | నీకు చేయలేను |
| వసుధాస్థలి | = | భూమండలము నందు |
| బ్రహ్మకల్పముల్ | = | సృష్టి ఉన్నంతవరకు |
| వర్థిల్లు | = | వర్థిల్లుము. |

**తాత్పర్యం :**

సూర్యవంశ శ్రేష్ఠుడైన శ్రీరాముని క్షేమసమాచారాలు నీవల్ల చాలా తెలుసుకొన్నాను. నేనిక్కడ అనుభవించే బాధలు తగిన విధంగా రామునికి స్పష్టంగా వివరించగలవు. నీకు నేను ఉపకారం ఏమీ చేయలేను. కాని సృష్టి ఉన్నంతవరకు భూమండంలోన నీవు వర్థిల్లమని ఆంజనేయుని ఆశీర్వదించింది.

110.

ఈవిధంగా దీవించిన పిదప

111.

| | | |
|---|---|---|
| వాయుతనూజుండ | = | ఆంజనేయా ! |
| ఏ మెడన్ + చూచిన | = | ఏవిధంగా చూచినా |
| ధరణీనాయకు | = | రాజైన రామచంద్రుడి |
| శ్రీపాదయుగము | = | దివ్యమైన పాదాల జంట |
| విన్నవింపుము | = | తెలియజేయుము |

**తాత్పర్యం :**

పుణ్యాత్ముడైన ఆంజనేయా ! ఏవిధంగా చూసినా శ్రీరామచంద్రుడి పాదపద్మాల జంట నా మనస్సులో నుండి తొలగిపోవని నీవు తెలియజేయమని సీత చెప్పింది.

112.

| | | |
|---|---|---|
| కపటబుద్ధి | = | దుర్బుద్ధి |
| కాఱులు | = | దుర్భాషలు |

**తాత్పర్యం :**

దుష్టుడైన రావణుడు దుర్బుద్ధితో దుర్భాషలాడిన స్థితి నీవు చెవులారా వింటివి గదా ! ఈ విషయాలన్నీ రామునికి నాపై దయకలిగి విధంగా విన్నవించమని సీత చెప్పింది.

113.

| | | |
|---|---|---|
| పెన + నెఱవేణి | = | పెద్ద వెంట్రుకల సముదాయ |
| జీర్ణాంబరము | = | చినిగిన వస్త్రం |
| భూమీరజంబు | = | భూమిపై ఉన్న ధూళి |
| దివ్యమూర్తి | = | దివ్యమైన రూపము |
| నిరశన స్థితి | = | నిరాహార దీక్ష |
| అహిత | = | శత్రువుల |

| | | |
|---|---|---|
| సత్త్వసంపన్న | = | సాత్వికగుణ విలసితుడా ! |

**తాత్పర్యం :**

సీత లంకా నగరంలో పొడవైన పెద్ద వెంట్రుకలను జడలుగా సవరించుకొని మాసిపోయి చినిగిన చీరెను ధరించింది. భూమిపై ఉన్న ధూళిని విభూతిపూతగా పూసుకొని, భర్త దివ్యరూపాన్ని మనసులో నిల్పుకొని ఆరాధిస్తున్నది. నిరాహార దీక్షతో భూమిపై పవళించి నిద్రను త్యజించింది. తారకబ్రహ్మ మంత్రాన్ని పఠిస్తూ కఠినులైె రాక్షస సమిష్ట మృగాల మధ్య జీవిస్తుంది. శత్రు లంకాద్వీపమనే దుర్గమ సీమలో భర్త శ్రీరాముని గూర్చి తపస్సు చేస్తున్నది. తన భర్త తనకు తొందరగా ప్రత్యక్షమయ్యే విధంగా తన దుస్థితిని విన్నవించమని సత్వసంపన్నుడైన ఆంజనేయునికి ఆర్తితో చెప్పింది.

115.

| | | |
|---|---|---|
| జనకుని భంగి | = | తండ్రివలె |
| రామనృపచంద్రుని | = | శ్రీరామచంద్రుని |
| తల్లిమాఱుగా | = | తల్లివలె |
| నన్నును | = | నన్ను |
| కని | = | చూచి |
| కొలువంగ నేర్చు | = | సేవించునట్టి |
| గుణగణ్యుని | = | సుగుణశీలి |
| నీతిపారగున్ | = | నీతి కోవిదుడైన |
| లక్ష్మణు | = | లక్ష్మణుని |
| అవివేకము చేతను | = | అజ్ఞానంతో |
| వినన్ + కనరాని పల్కులు | = | వినరాని చూడరాని కఠోరమైన మాటలు |
| పల్కినట్టి | = | పలికినట్టి |
| అవినుత మహాఫలంబు | = | గొప్పపాప ఫలం |
| చాటిచెప్పుమా | = | స్పష్టముగా చెప్పుము. |

**తాత్పర్యం :**

శ్రీరామచంద్రుని కన్నతండ్రిలా, నన్ను తల్లిలా సేవించే నీతిపారగుడు, సుగుణశీలియైన లక్ష్మణుని అనరాని, వినరాని కటువైన మాటలతో అవివేకంతో నిందించాను ఆ మహాపాప ఫలాన్ని అనుభవిస్తున్నానని లక్ష్మణుడికి చెప్పమని సీత ఆంజనేయుడికి చెప్పింది.

116.

| | | |
|---|---|---|
| మానము | = | శీలం |
| కావుము | = | రక్షించుము |
| వినయగుణ + ఉద్దాముడు | = | వినయంతో కూడిన గొప్ప సుగుణాలు కలవాడు |
| సౌమిత్రి | = | లక్ష్మణుడు |

**తాత్పర్యం:**

నేను అవివేకంతో మాట్లాడిన మాటలు మనసులో ఉంచుకోకుండా నా గౌరవాన్ని కాపాడమని రాముని తమ్ముడు సుగుణశీలి లక్ష్మణునికి చెప్పమని హనుమంతుని సీత కోరింది.

117.

సీత మాటలు విన్న హనుమంతుడు ఆమెతో ఇలా పలికాడు.

118.

| | | |
|---|---|---|
| ఇనుడు | = | సూర్యుడు |
| జననీ | = | తల్లి (సీతాదేవి) |
| వననిధి | = | సముద్రం |
| లంఘించి | = | దాటి |

**తాత్పర్యం :**

తల్లీ ! సూర్యోదయానికి ముందే సముద్రాన్ని దాటించి శ్రీరాముడు దగ్గరకు చేర్చెదను. నీవు సంతోషంగా నా వీపుపై కూర్చుండమని కోరాడు.

119.

| | | |
|---|---|---|
| నెగడవు | = | రావు |
| భూనరుడు | = | రాజైన రాముడు |
| బుధనుత చరితా | = | పండితుల చేత కీర్తించబడువాడా (ఆంజనేయా) |

**తాత్పర్యం :**

ఆంజనేయా ! నీవంతటి సమర్థుడవే. నేను నీవెంట వచ్చిన శ్రీరామునికి కీర్తిప్రతిష్ఠలు రావు. రావణుని కన్నా శ్రీరాముడే గొప్ప దొంగయని నిందింతురని చెప్పింది.

120.

అదిగాక శ్రీరాముని తప్ప ఇతరుల స్పృశించుదానను కాదు. కనుక నీతో వచ్చుట తగదని చెప్పింది.

121.

| | | |
|---|---|---|
| సంగర ముఖమున | = | యుద్ధంలో |
| దైత్యుని సంగడులు | = | రావణుని స్నేహితులు |
| చంపక | = | సంహరించకుండా |
| దొంగిలి | = | దొంగతనంగా |

**తాత్పర్యం :**

నన్ను దొంగతనంగా హరించి తెచ్చిన రావణుని, అతని స్నేహితులను సాహసంతో యుద్ధంలో వధించకుండా నన్ను దొంగిలించుకొని పోవుట దొరయైన శ్రీరామునికి తగదని పలికింది.

122.

| | | |
|---|---|---|
| శ్రీరామచంద్రుడు త్రి జగత్ + ఏకవీరుడు | = | మూడులోకాలలో సాటిలేని వీరుడు |
| రాక్షసకుల + అంతకుండు | = | రాక్షసకులాన్ని అంతమొందించువాడు |
| భృత్యుండవు | = | సేవకుడవు |
| తడయక | = | ఆలస్యం చేయక |

**తాత్పర్యం :**

శ్రీరామచంద్రుడు సాటిలేని వీరుడు. ధనుర్విద్యా దీక్షాపరుడు. రాక్షస కులాంతకుడు. అట్టి మహనీయుడైన శ్రీరామచంద్రుడు రాణివాసపు స్త్రీలను అపహరించిన ద్రోహియైన రావణుడిని యుద్ధంలో వధించి నన్ను తీసుకొనిపోవుట ధర్మం. నీవు శ్రీరామ చంద్రుడికి గొప్ప సేవకుడవు. పుత్రసమానుడవైన నీవెంట నేను వచ్చుట తప్పు. కాకున్నా రావణునిపై పగ తీర్చకుండా నేను వచ్చుట న్యాయంకాదు. కనుక శ్రీరామచంద్రుడినికి ఈ విషయాలన్నీ సవివరంగా తెలిపి వెంటనే నన్ను తీసుకొని వెళ్ళమని చెప్పిన సీతకు నమస్కరించి హనుమంతుడీ విధంగా పలికాడు.

123.

| | | |
|---|---|---|
| నీవిభుడు + అబ్దిదాటి | = | నీ భర్త శ్రీరాముడు సముద్రాన్ని దాటి |
| ధరణీతల నాథులు | = | రాజులు |
| సన్నుతింప | = | మెచ్చుకోగా |
| సుగ్రీవసుషేణ ముఖ్యబల | = | సుగ్రీవుడు సుషేణుడు వంటి ముఖ్యులైన సేనానాయకుల |
| బృందంతో | = | సమూహంతో |
| అరుదెంచి | = | వచ్చి |
| నీచునిన్ | = | దుర్మార్గుడైన |
| రావణున్ + అజిలో | = | రావణుని యుద్ధంలో |
| తునిమి | = | వధించి |
| నిను | = | నిన్ను |
| రాజసము + ఒప్పగ | = | రాజసంతో |
| సేవావళితోడ | = | సైన్య సమూహంతో |
| నీపురికి | = | నీ పట్టణానికి |
| అరయున్ | = | ఆలోచించగా |
| ఏగుఁనిజంబు | = | వెళ్లుట సత్యం |
| నమ్మమా | = | నామాట నమ్మము. |

**తాత్పర్యం :**

నీభర్త శ్రీరాముడు సుగ్రీవ సుషేణాది ముఖ్య సేనానాయకులతో కలిసి సముద్రాన్ని దాటివచ్చి నీచుడైన రావణుడిని యుద్ధంలో సంహరిస్తాడు. రాజులందరూ మెచ్చుకునే విధంగా రాజసంగా నిన్ను తీసుకొని వెళ్ళగలడు. నామాట సత్యం. నమ్ముతల్లీ అని సీతాదేవికి హనుమంతుడు చెప్పాడు.

**డా॥ నూకతోటి రవికుమార్**
తెలుగు లెక్చరర్
ఎస్.ఆర్.కె.డిగ్రీ కళాశాల
ఒంగోలు, ప్రకాశం జిల్లా

పాఠం - 18

# అశోకవనంలో జానకి

**- మొల్ల**

**రామాయణం - సుందరకాండ**
**(90వ పద్యం నుండి 123వ పద్యం వరకు)**

**విషయసూచిక :**

**18.1** ఉద్దేశ్యం
**18.2** సమగ్ర వ్యాఖ్యలు
**18.3** సందర్భసహిత వ్యాఖ్యలు
**18.4** ప్రశ్నలు - సమాధానాలు

## 18.1 ఉద్దేశ్యం :

అశోకవనంలో జానకి పాఠ్యభాగంలోని వాక్యాల సందర్భాలను తెలియజేయటం, ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వటం ఈ పాఠ్యభాగం యొక్క ఉద్దేశ్యం.

## 18.2 సమగ్ర వ్యాఖ్యలు :

93.

తమ్మునిఁగూడి పుణ్యగుణధాముఁడు రాముఁడువచ్చి మాల్యవం
తమ్మున సైన్యసంఘము ముదంబునఁగొల్వఁగ నుండి భూమిపై
మిమ్ములఁ జూచిరండనుచు మేటికపీంద్రులఁబుచ్చి యందు మొ
త్తమ్ముగ మమ్ముఁగొందఱను దక్షిణ భాగముచూడఁ బంపుచున్.

**కవి పరిచయం :**

మొల్ల రచించిన రామాయణము, సుందరకాండలోని "అశోకవనంలో జానకి" అనే పాఠ్యభాగములోనిదీ పద్యం.

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| పుణ్యగుణధాముఁడు | = | పుణ్యగుణాలకు నిలయుడు |
| రాముడు | = | శ్రీరాముడు |
| తమ్ముడిగూడి | = | తమ్ముడైన లక్ష్మణుడితో కలసి |
| వచ్చి | = | వచ్చి |
| మాల్యవంతమ్మున | = | మాల్యవంత పర్వతంపై |
| సైన్య సంఘము | = | సైన్య సమూహం |
| ముదంబున | = | సంతోషంతో |
| కొల్వగన్ + ఉండి | = | సేవిస్తుండగా ఉండి |
| భూమిపై | = | ఈ భూమిపై |

| | | |
|---|---|---|
| మిమ్ములన్ | = | మిమ్మలిని |
| చూచి రండనుచు | = | వెదకి రమ్మని |
| మేటి కపీంద్రులన్ | = | శ్రేష్ఠులైన వానర వీరులను |
| పుచ్చి | = | పంపించి |
| అందు | = | వారితో |
| మెత్తమ్ముగ | = | అందరిలో |
| దుమ్ము కొందఱను | = | మమ్మలిని కొంతమందిని |
| దక్షిణభాగము | = | దక్షిణదిక్కును |
| చూడన్ + పంపుచున్ | = | వెదుకుటకు పంపిస్తూ |

**తాత్పర్యం :**

పుణ్యగుణాలకు నిలయుడైన శ్రీరాముడు లక్ష్మణుడితో కలిసివచ్చి మాల్యవంత పర్వతంపై వానరసైన్యం సేవిస్తుండగా ఉన్నాడు. భూమిపై మిమ్మలిని వెదికేందుకు శ్రేష్ఠులైన వానరవీరులను పంపించి వారిలో మిమ్మలిని కొందరిని దక్షిణదిక్కుకు వెదుకుటకు పంపిస్తూ.

95.

**ఉ ॥ ఇచ్చినఁజూచి రామధరణీశ్వరుముద్రికగా నెఱింగి తా**
**నిచ్చను మెచ్చి యాకువలయేక్షణ యాత్మగతంబునందు నీ**
**వచ్చినదాని భావమును వల్లభుచందము నేర్పడంగ నేఁ**
**జెచ్చెర నంతయుం డెలియఁజెప్పుము నమ్మికపుట్టునట్లుగన్.**

**కవి పరిచయం :**

మొల్ల రచించిన రామాయణము, సుందరకాండలోని "అశోకవనంలో జానకి" అనే పాఠ్యభాగములోనిదీ పద్యం.

ప్రతిపదార్థాలు :

| | | |
|---|---|---|
| ఆ కువలయేక్షణ | = | కలువల వంటి కనులు గల సీత |
| ఇచ్చిన | = | హనుమంతుడిచ్చిన |
| ఉంగరమును చూచి | = | ఉంగరాన్ని పరిశీలించి |
| రామధరణీశు | = | శ్రీరామచంద్రుని |
| ముద్రికగా | = | ఉంగరంగా |
| ఎఱిగి | = | గుర్తించి |
| తాన్ | = | తాను |
| ఇచ్చను | = | ఇష్టంతో |
| ఆత్మగతంబునందు | = | మనసులో |
| మెచ్చి | = | సంతోషించి, మెచ్చుకొని |
| నీ | = | నీవు |
| వచ్చినదాని భావమును | = | వచ్చిన రాక అర్థాన్ని |

| | | |
|---|---|---|
| వల్లభు చందమున్ | = | భర్తయైన రాముని విషయాన్ని |
| ఏర్పడగ | = | స్పష్టంగా |
| నమ్మిక పుట్టునట్లుగన్ | = | నమ్మకం కలుగునట్లుగా |
| చెచ్చెరన్ | = | శీఘ్రంగా |
| అంతయున్ | = | అంతటినీ |
| తెలియజెప్పుము | = | తెలియజేయుము |

**తాత్పర్యం :**

ఆంజనేయుడిచ్చిన ఉంగరాన్ని తీసుకొని శ్రీరాముడి ఉంగరంగా గుర్తించిన సీత మనసులో ఎంతో సంతోషించింది. హనుమంతునితో నీవు వచ్చిన విషయాన్ని శ్రీరాముని సంగతిని నాకు నమ్మకం కలిగే విధంగా వివరింపుమని సీత కోరింది.

98.

ఉ ॥ రాముని డాఁ గురించి నిను రావణుఁడెత్తుక వచ్చువేళ నీ
హేమవిభూషణావళుల నేర్పడ బుశ్యమహాద్రినైచినన్
మే మవి తీసి డాచితిని మీపతి యచ్చటి కేఁగుదేరఁగా
దామరసాప్తనందనుఁడు తానవిసూపినఁజూచి మెచ్చుచున్.

**కవి పరిచయం :**

మొల్ల రచించిన రామాయణము, సుందరకాండలోని "అశోకవనంలో జానకి" అనే పాఠ్యభాగములోనిదీ పద్యం.

| | | |
|---|---|---|
| రామునిడాగురించి | = | రాముని మోసగించి |
| నిను | = | నిన్ను |
| రావణుడు + ఎత్తుకవచ్చువేళ | = | రావణుడు అపహరించుకొనివచ్చే సమయంలో |
| నీ హేమవిభూషణావళులన్ | = | నీ బంగారు ఆభరణాలను |
| ఏర్పడు | = | పడునట్లు |
| ఋశ్యామహాద్రి వైచినన్ | = | ఋశ్య శృంగపర్వతంపై పారవేయగా |
| మేము + అవితీసి | = | వానరులమైన మేము వాటిని తీసి |
| దాచితిమి | = | భద్రపరిచితిమి |
| మీపతి | = | మీ భర్త శ్రీరామచంద్రుడు |
| అచ్చటికి + ఏగుదేరఁగా | = | అక్కడకు రాగా |
| తాన్ + అవి చూపిన | = | సుగ్రీవుడు ఆయనకు ఆభరణాలు చూపించగా |
| తామరస + ఆప్తనందనుడు | = | కమలాలకు ఆప్తుడైన సూర్యుడి కుమారుడు |
| మెచ్చుచున్ | = | మెచ్చుకొనెను. |

**తాత్పర్యం :**

శ్రీరాముని మోసగించి రావణుడు నిన్ను అపహరించుకొని వెళ్ళే సమయంలో నీ బంగారు ఆభరణాలు ఋశ్యశృంగ పర్వతంపై పారవేశావు. వాటిని మేము తీసి భద్రపరిచాము. మీ భర్త శ్రీరామచంద్రుడు అక్కడకు వచ్చినప్పుడు సుగ్రీవుడు వాటిని చూపించగా ఆయన ఎంతో సంతోషించి మెచ్చుకున్నాడని చెప్పాడు.

109.

చ. రవికుల వార్ధిచంద్రుఁడగు రామునిసేమము చాలవింటినా
వివిధము లైనపాట్లు పృథివీపతికిన్ దగఁజెప్పగల్గె నే !
డవిరళభంగి నీవలన నచ్చుట నేనుపకార మేమియున్
దవిలి యొనర్ప లేను వసుధాస్థలివర్ధిలు బ్రహ్మకల్పముల్ !

**కవి పరిచయం :**

మొల్ల రచించిన రామాయణము, సుందరకాండలోని "అశోకవనంలో జానకి" అనే పాఠ్యభాగములోనిదీ పద్యం.

| | | |
|---|---|---|
| రవికుల వార్ధి చంద్రుడగు | = | సూర్యవంశం అనే సముద్రమందు చంద్రుని వంటివాడైన |
| రాముని | = | శ్రీరాముని |
| సేమము | = | క్షేమం |
| చాలవింటి | = | చాలా విశేషాలను తెలుసుకొంటిని |
| నా నావిధములైన పాట్లు | = | నేను పడుతున్న అనేకమైన బాధలను |
| పృథివీపతికిన్ | = | రాజైన శ్రీరామునికి |
| తగన్ చెప్పన్ + కల్గె | = | తగువిధంగా చెప్పగలుగుదువు |
| నేడు ÷ ఆవిరళ భంగి | = | నేడు వివరంగా |
| నీవలనన్ + అచ్చుగ | = | నీవలన స్పష్టంగా |
| నేను | = | నేను |
| తవిలి | = | ప్రత్యేకించి |
| ఉపకారమేమియున్ | = | ఎటువంటి ఉపకారాన్ని |
| ఒనర్పలేను | = | నీకు చేయలేను |
| వసుధాస్థలి | = | భూమండలము నందు |
| బ్రహ్మకల్పముల్ | = | సృష్టి ఉన్నంతవరకు |
| వర్థిల్లు | = | వర్థిల్లుము. |

**తాత్పర్యం :**

సూర్యవంశ శ్రేష్టుడైన శ్రీరాముని క్షేమసమాచారాలు నీవల్ల చాలా తెలుసుకొన్నాను. నేనిక్కడ అనుభవించే బాధలు తగిన విధంగా రామునికి స్పష్టంగా వివరించగలవు. నీకు నేను ఉపకారం ఏమీ చేయలేను. కాని సృష్టి ఉన్నంతవరకు భూమండంలోన నీవు వర్థిల్లమని ఆంజనేయుని ఆశీర్వదించింది.

115.

చ. జనకునిభంగి రామనృపచంద్రుని నన్నను దల్లిమాఱుగాఁ
గని కొలువంగ నేర్చుగుణగణ్యుని లక్ష్మణునీతిపారగున్
నినఁగనరానిపల్కులవివేకముచేతను బల్కినట్టి యా
వినుతమమహాఫలం బనుభవించితి నందును జాటి చెప్పమా.

**కవి పరిచయం :**

మొల్ల రచించిన రామాయణము, సుందరకాండలోని "అశోకవనంలో జానకి" అనే పాఠ్యభాగములోనిదీ పద్యం.

| | | |
|---|---|---|
| జనకుని భంగి | = | తండ్రివలె |
| రామనృపచంద్రుని | = | శ్రీరామచంద్రుని |
| తల్లిమాఱుగా | = | తల్లివలె |
| నన్నును | = | నన్ను |
| కని | = | చూచి |
| కొలువంగ నేర్పు | = | సేవించునట్టి |
| గుణగణ్యుని | = | సుగుణశీలి |
| నీతిపారగున్ | = | నీతి కోవిదుడైన |
| లక్ష్మణు | = | లక్ష్మణుని |
| అవివేకము చేతను | = | అజ్ఞానంతో |
| వినన్ + కనరాని పల్కులు | = | వినరాని చూడరాని కఠోరమైన మాటలు |
| పల్కినట్టి | = | పలికినట్టి |
| అవినుత మహాఫలంబు | = | గొప్పపాప ఫలం |
| చాటిచెప్పుమా | = | స్పష్టముగా చెప్పుము. |

**తాత్పర్యం :**

శ్రీరామచంద్రుని కన్నతండ్రిలా, నన్ను తల్లిలా సేవించే నీతిపారగుడు, సుగుణశీలియైన లక్ష్మణుని అనరాని, వినరాని కటువైన మాటలతో అవివేకంతో నిందించాను ఆ మహాపాప ఫలాన్ని అనుభవిస్తున్నానని లక్ష్మణుడికి చెప్పమని సీత ఆంజనేయుడికి చెప్పింది.

123.

ఉ. **నీవిభుఁడబ్ధి దాఁటి ధరణీతలనాథులు సన్నుతింప సు**
**గ్రీవసుషేణముఖ్య బలబృందముతో నరుదెంచి నీచునిన్**
**రావణు నాజిలోఁదునిమి రాజసమొప్పఁగ నిన్నుఁగొంచు సే**
**నావళితోడ నీపురికి నారయ నేఁగునిజంబు నమ్ముమా.**

**కవి పరిచయం :**

మొల్ల రచించిన రామాయణము, సుందరకాండలోని "అశోకవనంలో జానకి" అనే పాఠ్యభాగములోనిదీ పద్యం.

| | | |
|---|---|---|
| నీవిభుడు + అబ్దిదాటి | = | నీ భర్త శ్రీరాముడు సముద్రాన్ని దాటి |
| ధరణీతల నాథులు | = | రాజులు |
| సన్నుతింప | = | మెచ్చుకోగా |
| సుగ్రీవసుషేణ ముఖ్యబల | = | సుగ్రీవుడు సుషేణుడు వంటి ముఖ్యులైన సేనానాయకుల |
| బృందంతో | = | సమూహంతో |
| అరుదెంచి | = | వచ్చి |
| నీచునిన్ | = | దుర్మార్గుడైన |

| | | |
|---|---|---|
| రావణున్ + అజిలో | = | రావణుని యుద్ధంలో |
| తునిమి | = | వధించి |
| నిను | = | నిన్ను |
| రాజసము + ఒప్పగ | = | రాజసంతో |
| సేవావళితోడ | = | సైన్య సమూహంతో |
| నీపురికి | = | నీ పట్టణానికి |
| అరయున్ | = | ఆలోచించగా |
| ఏగుఁనిజంబు | = | వెళ్లుట సత్యం |
| నమ్ముమా | = | నామాట నమ్ముము. |

**18.3 సందర్భసహిత వ్యాఖ్యలు :**

**1. నిన్నుఁగొని పోనున్నాడిది నిజము నమ్ము ఉర్వీ తనయా !**

**కవి పరిచయం :**

ఈ వాక్యం మొల్ల రామాయణం సుందరకాండలోని అశోకవనంలో జానకి అనే పాఠ్యభాగం నుండి గ్రహించబడింది.

**సందర్భం :**

సీతను వెదికేందుకు దక్షిణ దిక్కుకు వచ్చిన హనుమంతుడు లంకలో ఆమెను చూసి శ్రీరాముని క్షేమాన్ని తెలియజేసే సందర్భంలోనిది.

**అర్థ వివరణ :**

సీతాదేవీ ! శ్రీరాముడు వానరులతో కలసి ఉన్నాడు. నిన్ను త్వరలో తీసుకొని పోగలడు. ఇది నిజం నమ్ముమని అర్థం.

**2. ఉంగరమంపెను శ్రీరఘుపుంగవుఁడిదె కొమ్మటంచు భూమిజకిచ్చెన్.**

**కవి పరిచయం :**

ఈ వాక్యం మొల్ల రామాయణం సుందరకాండలోని "అశోకవనంలో జానకి" అనే పాఠ్యభాగం నుండి గ్రహించబడింది.

**సందర్భం :**

సీతను వెదికేందుకు శ్రీరాముడు అన్ని దిక్కులకు వానర సేనానాయకులను పంపించారు. దక్షిణ దిక్కుకు హనుమంతుని పంపే సందర్భంలో "సీతను వెదికినా ఉంగరాన్ని కానుకగా ఇచ్చేందుకు నీవే సమర్థుడవని ఉంగరాన్ని పంపించాడు" అని చెప్పే సందర్భంలోనిది.

**అర్థ వివరణ :**

సీతాదేవి జాడ తెలుసుకోగల సామర్థ్యం కలవాడివి నువ్వే అంటూ రాముడు ఉంగరం పంపాడు. తీసుకో అని హనుమంతుడు సీతాకా ఉంగరం ఇచ్చాడు.

**3. తెలియఁజెప్పుము నమ్మిక పుట్టునట్లుగన్.**

**కవి పరిచయం :**

ఈ వాక్యం మొల్ల రామాయణం "సుందరకాండ"లోని అశోకవనంలో జానకి అనే పాఠ్యభాగం నుండి గ్రహించబడింది.

**సందర్భం :**

సీత రాముని ఉంగరాన్ని స్వీకరించి హనుమంతునితో శ్రీరాముని విశేషాలను నాకు నమ్మకం కలిగే విధంగా చెప్పమని అడిగే సందర్భంలోనిది.

**అర్థ వివరణ :**

హనుమంతుడికిచ్చిన ఉంగరం చూసి అది రాముడిదిగా గుర్తించి నువ్వు వచ్చిన విధానాన్ని నమ్మకం కలిగేవిధంగా రాముని విశేషాలను తెలియజెప్పమని సీత హనుమంతుడిని అడిగింది.

**4. నిను విశ్వసింపఁజాలను**

**కవి పరిచయం :**

ఈ వాక్యం మొల్ల రామాయణం సుందరకాండలోని "అశోకవనంలో జానకి" అనే పాఠ్యభాగం నుండి గ్రహించబడింది.

**సందర్భం :**

సీత శ్రీరాముని అంగుళీయకాన్ని తీసుకొని సంతోషించిన తర్వాత నిన్ను నమ్మలేను. నాకు నమ్మకం కలిగే విధంగా శ్రీరాముని విశేషాలను చెప్పమని అడుగు సందర్భంలోనిది.

**అర్థ వివరణ :**

నిన్ను నమ్మలేనని అర్థం.

**5. తానవి సూపినఁ జూచి మెచ్చుచున్**

**కవి పరిచయం :**

ఈ వాక్యం మొల్ల రామాయణం సుందరకాండలోని "అశోకవనంలో జానకి" అనే పాఠ్యభాగం నుండి గ్రహించబడింది.

**సందర్భం :**

సీతను రావణుడు అపహరించుకొని వెళ్ళే సందర్భంలో ఋశ్యశృంగ పర్వతంపై ఆమె విసిరివేసిన ఆభరణాలన్నింటినీ తాము దాచి ఉంచామని, శ్రీరాముడు అక్కడకు వచ్చినపుడవి చూసి సంతోషించాడని చెప్పు సందర్భంలోనిది.

**అర్థ వివరణ :**

శ్రీరాముడు అక్కడకు రాగా సుగ్రీవుడు దాచిన నగలను చూపించగా, శ్రీరాముడు ఆభరణాలను చూసి మెచ్చుకున్నాడని అర్థం.

**6. వరుస సౌమిత్రి బంగారు వన్నెవాఁడు**

**కవి పరిచయం :**

ఈ వాక్యం మొల్ల రామాయణం సుందరకాండలోని "అశోకవనంలో జానకి" అనే పాఠ్యభాగం నుండి గ్రహించబడింది.

**సందర్భం :**

సీతకు నమ్మకం కలిగేవిధంగా శ్రీరాముని విశేషాలను హనుమంతుడు తెలిపే సమయంలో లక్ష్మణుని గూర్చి చెప్పే సందర్భంలోనిది.

**అర్థ వివరణ :**

కపటం లేక సత్యవాక్యాలే పలికేవాడు, శుభలక్షణాలన్నీ కలవాడు రాముడు. ఆ లక్షణాలతోపాటు లక్ష్మణుడు బంగారురంగు శరీర ఛాయకలవాడని అర్థం.

**7. అర్కజుని మంత్రి హనుమంతుఁడంద్రునన్ను**

**కవి పరిచయం :**

ఈ వాక్యం మొల్ల రామాయణం సుందరకాండలోని "అశోకవనంలో జానకి" అనే పాఠ్యభాగం నుండి గ్రహించబడింది.

**సందర్భం :**

హనుమంతుడు సీతకు నమ్మకం కలిగే విధంగా శ్రీరాముని విశేషాలు తెలిపిన తర్వాత తన వివరాలను తెలిపే సందర్భంలో పలికిన వాక్యం.

**అర్థ వివరణ :**

భయంకరమైన అడవిలో ఉగ్రతపస్సు చేసి వాయుదేవుడి అనుగ్రహంతో అంజనాదేవి నాకు జన్మనిచ్చింది. నేను సుగ్రీవుని మంత్రిని. నా పేరు హనుమంతుడని అర్థం.

**8. నేనా రత్నంబు నమ్మి నీకీయఁజుమీ**

**కవి పరిచయం :**

ఈ వాక్యం మొల్ల రామాయణం సుందరకాండలోని "అశోకవనంలో జానకి" అనే పాఠ్యభాగం నుండి గ్రహించబడింది.

**సందర్భం :**

సీత ఆంజనేయునితో నీవల్ల నా భర్త క్షేమం వింటిని. నీ నిజరూపం చూడక నా శిరోరత్నాన్ని నమ్మి ఇవ్వనన్న సందర్భంలోనిది.

**అర్థ వివరణ :**

నీ నిజరూపాన్ని చూడకుండా నా శిరోరత్నాన్ని నమ్మి నీకు ఇవ్వను సుమా ! అని అర్థం.

**9. అక్కోమలి ముదమునొందె ఆత్మస్థితికిన్.**

**కవి పరిచయం :**

ఈ వాక్యం మొల్ల రామాయణం సుందరకాండలోని "అశోకవనంలో జానకి" అనే పాఠ్యభాగం నుండి గ్రహించబడింది.

**సందర్భం :**

హనుమంతుని నిజస్వరూపం చూచి సీత మనసులో సంతోషించిన సందర్భంలోనిది.

**అర్థ వివరణ :**

హనుమంతుడు ఆకాశంలోని చుక్కలే తలపూవులా అనే విధంగా శరీరాన్ని పెంచి చూపించగా సీత మనస్సులో సంతోషించిందని అర్థం.

**10. వసుధా స్థలి వర్థిల్లు బ్రహ్మకల్పముల్**

**కవి పరిచయం :**

ఈ వాక్యం మొల్ల రామాయణం సుందరకాండలోని "అశోకవనంలో జానకి" అనే పాఠ్యభాగం నుండి గ్రహించబడింది.

**సందర్భం :**

హనుమంతుని ద్వారా శ్రీరాముని యోగక్షేమాలు తెలిసికొన్నది. అందుకు నీకు ప్రత్యుపకారం చేయలేనని పలుకు సందర్భంలోనిది.

**అర్థ వివరణ :**

నీవలన శ్రీరాముడి క్షేమాలన్నీ విన్నాను. నేను పడుతున్న కష్టాలు రాముడికి తెలియజేయు. దానికి నేను నీకు ప్రత్యుపకారమేమీ చేయలేను. భూమండలమందు సృష్టి ఉన్నంతవరకు వర్థిల్లమని అర్థం.

**11. వీఁపున జననీ కూర్చుండుమనిన సంతోషమునన్.**

**కవి పరిచయం :**

ఈ వాక్యం మొల్ల రామాయణం సుందరకాండలోని "అశోకవనంలో జానకి" అనే పాఠ్యభాగం నుండి గ్రహించబడింది.

**సందర్భం :**

లంకలో సీత పడే బాధలను చూసి హనుమంతుడామెతో తన వీపుపై కూర్చుంటే సంతోషంగా తెల్లవారే లోపల శ్రీరాముని దగ్గరకు చేర్చెదనని పలుకు సందర్భంలోనిది.

**అర్థ వివరణ :**

సూర్యుడు ఉదయించక ముందే సముద్రాన్ని దాటి నిన్ను రాముడి దగ్గరకు తీసుకువెళతాను. తల్లీ ! నా వీపుపై సంతోషంగా కూర్చుండమని అర్థం.

**12. భూవరుఁడే దొంగయండ్రు బుధనుత చరితా !**

**కవి పరిచయం :**

ఈ వాక్యం మొల్ల రామాయణం సుందరకాండలోని "అశోకవనంలో జానకి" అనే పాఠ్యభాగం నుండి గ్రహించబడింది.

**సందర్భం :**

సీత హనుమంతునితో లంకా నగరం నుండి వెళ్ళినచో శ్రీరామునికి కీర్తిప్రతిష్ఠలు దక్కవని పలుకు సందర్భంలోనిది.

**అర్థ వివరణ :**

నీతో నేను వస్తే రాముడికి కీర్తి కలుగదు, అంతేకాక రావణాసురుడి కన్నా రాజైన శ్రీరాముని దొంగగా నిందింతురని అర్థం.

**13. దొంగిలి కొనిపోవఁదగునె దొరలకునెందున్**

**కవి పరిచయం :**

ఈ వాక్యం మొల్ల రామాయణం సుందరకాండలోని "అశోకవనంలో జానకి" అనే పాఠ్యభాగం నుండి గ్రహించబడింది.

**సందర్భం :**

వీపుపై కూర్చుంటే తీసుకువెళతానన్న హనుమంతుడిని వారిస్తూ రాముడినీ దొంగ అంటారని సీత చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**అర్థ వివరణ :**

నన్ను అపహరించి తెచ్చిన రావణాసురుడిని, అతడి బంధువులను యుద్ధంలో చంపకుండా ప్రభువులకు ఎక్కడైనా దొంగిలించుకొని పోవుట తగదని అర్థం.

**18.4 ప్రశ్నలు - సమాధానాలు :**

**"అశోకవనంలో జానకి" పాఠ్యభాగ సారాంశాన్ని రాయండి.**

**లేదా**

**"అశోకవనంలో జానకి" పాఠ్యభాగంలోని సీతాహనుమంతుల సంవాదాన్ని వివరించండి.**

జ రాక్షసస్త్రీలు సీతను వదలివెళ్ళి నిద్రపోయారు. సీతాదేవి భయపడుతూ తనకు దిక్కెవరు లేరన్న విషయం తలపోస్తూ దుఃఖిస్తుండగా ఆ వాయుదేవుడి కుమారుడైన హనుమంతుడు మానవభాషలో మాట్లాడాడు. 'ఆ రాముడున్నాడు, వానరులతో కలసి రానున్నాడు, నిన్ను తీసుకుపోనున్నాడు, ఓ సీతాదేవి ఇది నిజం నమ్ము' అన్నాడు. ఈ మాటలు విన్న సీతాదేవి తనలో తానే భయపడి ఆ అశోకవృక్షాన్ని పరిశీలనగా చూడగా అప్పుడు ఆ చెట్టుకొమ్మల మధ్య సూక్ష్మరూపంలోనున్న హనుమంతుడిని అపురూపంగా చూసింది. మనసులో సంతోషం కలిగినా రాక్షస మాయల వలన బాధపడినది కనుక మారుమాట మాట్లాడకుండా ఊరుకుంది. ఆ సీతాదేవి మనోభావాన్ని ఊహించి తనను నమ్మలేదని గ్రహించి కొమ్మ మీద నుంచి దూకి ఎంతో భక్తితో నమస్కరించి చేతులు జోడించి ఈవిధంగా అన్నాడు.

తన తమ్ముడైన లక్ష్మణుడితో కలిసి పుణ్యగుణధాముడైన శ్రీరాముడు మాల్యవంత పర్వతంపై సైన్యసంఘాలు ఎంతో సంతోషంగా సేవిస్తుండగా ఉన్నాడు. భూమి మీద మిమ్ములను వెదకి రమ్మని వానరవీరులను పంపాడు. మమ్ములను కొందరిని దక్షిణదిక్కున చూడమని పంపుతూ, రాముడు సీతాదేవి జాడ తెలుసుకోవటానికి నువ్వే తగినవాడివని' నాతో ఈ ఉంగరం పంపాడు. తీసుకో అని సీతాదేవికి ఇచ్చాడు. ఆ ఉంగరాన్ని చూచి సీత అది రామముద్రికగా గుర్తించి, నీవు వచ్చిన విధానమంతా స్పష్టంగా నాకు నమ్మకం కలిగేవిధంగా చెప్పు' అని అంది. ఇంకా ఆలోచిస్తూ ఆమె నేను నిన్ను నమ్మలేను. నీ విధానం, నా రాముని విధానం నాకు చెప్పు' అనగా హనుమంతుడు ఎంతో వినయంగా తెలియజేశాడు. 'రావణుడు నిన్ను ఎత్తుకుపోయేటప్పుడు ఋష్యశృంగ పర్వతంపై పడవేసిన బంగారు ఆభరణాలను మేము తీసి దాచాము. నీ భర్త అక్కడకు రాగా సుగ్రీవుడు వాటిని రాముడికి చూపగా రాముడు అది చూసి మెచ్చుకొని సుగ్రీవుడికి అభయమిచ్చాడు. రాముడు దుంధుభి అనే రాక్షసుడిని సంహరించి, ఏడు తాటిచెట్లలను ఒకేసారి త్రుంచి వాలిని అద్భుతశక్తితో వధించి, సుగ్రీవుడి భార్యను అతడికి ఇప్పించి, అంగదుడిని యువరాజుగా నిలిపి, ఆ వానరసైన్యమంతా తనను కొలుస్తుండగా వచ్చి మాల్యవంత పర్వతంపై ఉండి నిన్ను వెదుకుటకు అన్ని దిక్కులకు అందరనూ పంపుతూ అంగదుడితో పాటు మమ్మలిని కొందరిని దక్షిణ దిక్కుకు పంపాడు. ఆ శ్రీరాముడి ఆజ్ఞతో అవలీలగా సముద్రాన్ని దాటి వచ్చి మొత్తం చూశాను. ఇక్కడ నిన్ను చూశాను, రావణుడు నీతో కోపంగా మాట్లాడేటప్పుడు ఈ చెట్టుపైనే ఉన్నాను అని చెప్పినా సీతాదేవి హనుమంతుడిని నమ్మక రాముడు ఎలా ఉంటాడో చెప్పమనగా హనుమంతుడు సీతాదేవికి నమస్కరించి ఈవిధంగా చెప్పాడు.

"నీలమేఘము వంటి రంగు గల శరీరంగలవాడు, తెల్లటి తామర రేకులవంటి కన్నులు కలవాడు, శంఖం వంటి కంఠం కలవాడు, బలమైన వక్షస్థలం కలవాడు, ఆజాను బాహువులతో భేరినాదం వంటి కంఠస్వరం కలవాడు, పద్మరేఖలు కలిగిన పాదాలతో అన్ని శుభలక్షణాలు కలవాడు, మోసం తెలియని సత్యవాక్యాలు, సకల శుభలక్షణాలు కలవాడు రాముడు. ఈ లక్షణాలన్నీ కలిగి బంగారువర్ణంతో ఉండేవాడు లక్ష్మణుడు. భయంకరమైన అడవిలో గొప్ప తపస్సుచేసి వాయుదేవుడి అనుగ్రహంతో నన్ను అంజనాదేవి కనింది. సుగ్రీవుడి మంత్రిని, హనుమంతుడు అంటారు అందరూ నన్ను' అని సవివరంగా చెప్పి 'నీ భర్త రాముడు నాకిచ్చి పంపిన కొత్తదైన రత్నాంగుళీకాన్ని నీకిచ్చాను. ఒట్టి చేతులతో వెళ్ళటం దూతల పనికాదు, కాబట్టి నిన్ను దర్శించినట్లుగా రాముడికి నమ్మకం కలిగే విధంగా నీ శిరోరత్నాన్ని దయచేయి' అనగా సీతాదేవి ఈ విధంగా అంది "నా భర్త క్షేమమంతా నీవలన విన్నాను. అయినా నీ నిజస్వరూపాన్ని నేను చూడకుండా నీకు ఆ రత్నాన్ని నేనివ్వలేను సుమా అనగా చుక్కలే తలపూవులా అనేవిధంగా హనుమంతుడు తన శరీరాన్ని పెంచి ఆకాశవీధిలో తన విశ్వరూపాన్ని చూపగా ఆ సీతాదేవి సంతోషించింది. తన విశ్వరూపాన్ని చూసి మళ్ళీ తిరిగి ఎప్పటిలాగా తన సూక్ష్మరూపాన్ని పొంది హనుమంతుడు నమస్కరించగా ఆ సీతాదేవి తన శిరోరత్నాన్ని ఇచ్చి ఈవిధంగా అంది.

"రవికుల సముద్రానికి చంద్రుడి వంటి వాడైన శ్రీరాముడు క్షేమాన్ని చాలా విన్నాను. నేను పడుతున్న అనేక కష్టాలు ఆ రాజుకి తగినవిధంగా చెప్పు. నీ ఉపకారానికి నేనేమి ప్రత్యుపకారం చేయలేను. ఈ భూమి ఉన్నంతవరకు బ్రహ్మకల్పం వరకు నువ్వు వర్థిల్లు" అని దీవించింది. "శ్రీరాముడి పాదపద్మాలని నా మనస్సులో ఎల్లప్పుడూ స్మరించటం విడవనని విన్నవించు, ఇప్పుడు ఆ రావణుడు వచ్చి కపటబుద్ధితో, గర్వంతో నన్నెన్ని మాటలన్నాడో నీ చెవులతో విన్న విధానమంతా రాముడికి తెలియజేయి. సీతాదేవి లంకలో పొడవైన తలవెంట్రుకలను జడలుగా సవరించుకొని మాసిపోయిన చినిగిన చీరను ధరించింది. భూమిపై దుమ్మునే విభూతిగా పూసుకొని భర్త దివ్యరూపాన్ని మనసులో నింపుకొని ఆరాధిస్తుంది. నిరాహారదీక్షతో భూమిపై పడుకొని నిద్రను వదిలివేసింది.. తారక మంత్రాన్ని జపిస్తూ భయంకరులైన రాక్షసమృగాల మధ్యలో జీవిస్తుంది. శత్రుసీమ అయిన లంకలో శ్రీరాముడి గురించే తపస్సు చేస్తుంది" తన భర్త తనకు త్వరగా ప్రత్యక్షమయ్యేటట్లు తన దీనస్థితినంతా విన్నవించమని ఆంజనేయుడితో ఆర్తితో సీతాదేవి చెప్పింది. ఇంకా 'శ్రీరామచంద్రుడిని కన్నతండ్రిలా, తనను తల్లిలా సేవించే నీతిమంతుడు, సుగుణశీలుడు అయిన లక్ష్మణుడిని తాను అనరాని, వినరాని కఠిన మాటలతో నిందించానని ఆ మహాపాపఫలాన్నే తాననుభవిస్తున్నానని లక్ష్మణుడికి తెలియజేయమని సీత హనుమంతుడితో అంది. నేను అవివేకంతో అన్న మాటలు మనసులో ఉంచుకోకుండా తన గౌరవాన్ని కాపాడమని లక్ష్మణుడికి చెప్పమని కోరింది సీత.

సీత మాటలు విన్న హనుమంతుడు ఆమెతో "తల్లీ ! సుర్యోదయానికి ముందే నిన్ను సముద్రాన్ని దాటించి శ్రీరాముడి సమక్షానికి చేరుస్తాను, నీవు నా వీపుపై సంతోషంగా కూర్చో" అనగా సీతాదేవి "ఆంజనేయా ! నీవు అంత సామర్థ్యం కలవాడివే. కానీ నేను నీవెంట వస్తే శ్రీరాముడికి కీర్తిప్రతిష్ఠలు కలుగవు. రావణుడి కన్నా శ్రీరాముడే పెద్దదొంగ అని అందరూ నిందిస్తారు. అంతేకాక శ్రీరాముడిని తప్ప నేను ఇతరులను తాకను. కనుక నీతో రావటం తగదు" అని చెప్పింది. 'తనను దొంగతనంగా అపహరించి తెచ్చిన రావణుడిని, అతడి మిత్రులను యుద్ధంలో చంపకుండా నన్ను దొంగిలించుకుపోవటం రాజైన శ్రీరాముడికి తగినపనికాదని చెప్పింది. శ్రీరామచంద్రుడు వీరుడు, ధనుర్విద్యా దీక్షాపరుడు. రాక్షస కులాంతకుడు, అటువంటి గొప్పవాడైన శ్రీరాముడు అంతఃపుర స్త్రీలను అపహరించిన ద్రోహి అయిన రావణుడిని యుద్ధంలో సంహరించి నన్ను తీసుకువెళ్ళటమే ధర్మం. నీవు రాముడి సేవకుడివి, పుత్ర సమానుడివి. నీవెంట నేను రావటం తప్పుకాకపోయినా రావణుడిపై పగ తీర్చుకోకుండా నేను రావటం న్యాయం కాదు. కాబట్టి ఈ సంగతులన్నీ శ్రీరాముడికి వివరంగా చెప్పి వెంటనే నన్ను తీసుకువెళ్ళమని చెప్పు' అని చెప్పిన సీతాదేవికి నమస్కరించి హనుమంతుడిలా అన్నాడు. 'నీ భర్త శ్రీరాముడు సుగ్రీవ సుషేణాది ప్రముఖ సేనానాయకులతో కలసి సముద్రాన్ని దాటివచ్చి యుద్ధంలో రావణుడిని సంహరిస్తాడు. రాజులందరూ మెచ్చే విధంగా నిన్ను తీసుకొని వెళతాడు. నా మాట సత్యం, నమ్ము తల్లీ' అని హనుమంతుడు సీతాదేవికి చెప్పాడు.

**డా॥ నూకతోటి రవికుమార్**
తెలుగు లెక్చరర్
ఎస్.ఆర్.కె.డిగ్రీ కళాశాల
ఒంగోలు, ప్రకాశం జిల్లా